
నెస్టమ్® బేబీ సిరియల్ – రైస్

మీ పాపాయి యొక్క ఆదర్శప్రాయమైన తొలి ఘన ఆహారం

వాడి చూడండి!

నెస్టమ్ బేబీ సిరియల్‌ని పాలలో కలిపినప్పుడు అది అన్నానికి గల తేలిగ్గా జీర్ణమయ్యే గుణం, పరిపూర్ణ పోషకాహారపు మంచితనం అందజేస్తుంది 4 నెలలు వయసు వచ్చాక పాపాయి ఆహారంలో మీరు ఘన పదార్థాలు ప్రవేశ పెట్టేటప్పుడు, నెస్టమ్‌తో ప్రారంభించండి బియ్యంతో తయారు చేయబడిన నెస్టమ్, తేలిగ్గా జీర్ణయం అయ్యేందుకు ప్రత్యేకంగా రూపొందించబడింది అంతేకాదు, నెస్టమ్ ఇనుము విటమిన్‌లతో ,రింత బల వర్ధకం చేయబడింది



నెస్టమ్‌ని తయారు చేయడం ఎంతో సులువు దీనిని ముందుగా కాచిన వెచ్చటి పాలల్లో కలపండి అంతే, పాపాయికి తినిపించేందుకు ఆహారం తయారు!

నెస్టమ్ పాలు లేకుండా అందుబాటులో ఉన్న ఒకే ఒక సిరియల్ మీరు మీ పాపాయి ఆహారంలో వివిధ రుచులు తెచ్చేందుకు ముందుగా ఉడికించి యింట్లోనే తయారు చేసిన మెత్తటి గుజ్జుగా చేసిన కూర ముక్కలు పప్పు పండ్లు నెస్టమ్‌లో కలపండి

కేవలం
రూ 9/-* కే
డబ్బాలో
200 గ్రా.
సంచీ



* స్థానిక పన్నులతో సహా

ఉచితం!

నెస్టమ్ రెసిపి బుక్ లెట్
ఈ చిరునామాకు వ్రాయండి
నెస్టమ్
పోస్ట్ బాక్స్ నెం. 6016
న్యూ ఢిల్లీ 110 008

Nestlé

ప్రస్తుతం ఒక్క ఆంధ్ర ప్రదేశ్ లోనే దొరుకుతోంది

విషయానుక్రమణిక

విడి ప్రతి వెలరు. 3.50



ముఖచిత్రం:
''జీన్స్ వేసుకోడం మాకూ వచ్చును :'' సీత

ఆస్ట్రేలియాఓపెన్ టెన్నిస్ ఛాంపియన్ అయిన టెన్నిస్ క్వీన్ స్టెఫీగ్రాఫ్

ఆంధ్రసచిత్రవారపత్రిక

ఒరులేయవి యొనరించిన నరవర యప్రియము తన మనంబున కగు దా
నొరులకు నవి సేయకునికి పరాయణము పరమ ధర్మపథములకెల్లన్

సంపుటము 81 | స్థాపితం 1908 బొంబాయి : 1914 మద్రాసు | సంచిక 23

27-1-1989

వ్యవస్థాపకులు : దేశోద్ధారక కాశీనాధుని నాగేశ్వరరావుపంతులుగారు

సంపాదకులు : శివలెంక శంభుప్రసాద్ (1938 - 1972)

శ్రీ విభవ నామ సం

పుష్య బ పంచమి

మనలో మాట

తమిళనాడు ఓటరుల తీర్పు

భూనభోంతరాళాలను దద్దరిల్లేట్టు జేసే ప్రచార సంబరాలకు తట్టుకొని- స్వర్గాన్ని భూమ్మీదకి దింపుతామన్న వాగ్దానాల, ప్రలోభాల వెల్లువకు తట్టుకొని, తమిళనాడు వోటర్లు సుస్థిరమైన ఒక ప్రభుత్వానికి అనువుగా డి. ఎం. కె. పార్టీకి ఘనవిజయం చేకూర్చారు. వారి స్థిత ప్రజ్ఞకి అభినందనలు చెప్పాలి! ముక్క చెక్కలైపోయిన అన్నా డి. ఎం. కె. పార్టీని తిరస్కరించి, అనుభవజ్ఞుడైన నల్ల కళ్ళద్దాల కరుణానిధినే వారు తమ ముఖ్యమంత్రిగా పట్టం పట్టినా, పట్న వాసానా ఒక్కలాగే వోట్లు వేసి ఎంచుకున్నారు. పన్నెండు సంవత్సరాల సుదీర్ఘ కాలానంతరం- యింత కాలం ఎంజీయార్ ప్రాబల్యాన్ని త్రోసిరాజన లేకపోయినా, చిత్త స్థైర్యాన్ని కాపాడుకుంటూ, ముందు చూపుతో పార్టీ పటిష్టతను కూడగట్టుకుంటూ వస్తున్న కరుణానిధి పరిస్థితులను చాలా గొప్పగా బేరీజు వేసుకుని- నేషనల్ ఫ్రంట్‌ను కూడా తనకు బాసటగా చేర్చుకున్నందు వల్ల అతనికి విజయం రెండు చేతులా లభించింది. ఫ్రంట్‌తో కలుపుకుంటే మూడింట రెండు వంతుల మెజారిటీ, విడిగా వున్నా ఢోకా లేని సంపూర్ణ ఆధిక్యత చూరగొన్న కరుణానిధి ద్రవిడ ఉద్యమానికి ఆద్యులలో ఒకరు. హిందీ వ్యతిరేకత తమిళ జాతి ప్రతిపత్తి వీటికి గట్టి పునాదులు వేసిన నాయకుడు శ్రీ కరుణానిధి ఎన్నికను ఎన్నికైన తీరును గమనిస్తే యివాళ తమిళ ప్రజల అభిరుచి కేవలం రూపాయికి పడి బియ్యం లేదా రూపాయి ముప్పావలాకి పడి బియ్యం లాంటి ఆకర్షణలకు అతీతంగా వున్నదన్న సత్యం విస్పష్టంగా కనపడుతుంది. ఈ ఎన్నికలు తమిళ ప్రజల ప్రాంతీయాభిమానానికి ఒక గీటు రాయి- వారికి తమ సంస్కృతి, స్వయం ప్రతిపత్తి పట్ల గల భీషణ కాంక్షకిది ప్రతిబింబం! అంతమాత్రాన వారి దేశీయతని గాని, దేశ ప్రధాన స్రవంతిలో పాల్గొనగల వారి ప్రజ్ఞాపాటవాలను కాని మనం విస్మరించలేం! అదీగాక యీసారి తమిళ ప్రజల ముందున్న స్థితి కూడా విచిత్రమైంది!

లజ్జా రహితంగా, బహిరంగంగా కొట్టుకుని, పార్టీ ప్రతిష్టని మంటగలిపి, దాయాదులు ఆస్తి కోసం కీచులాడుకున్నట్లు- ఎమ్జీయార్ కీర్తి ప్రతిష్టలను పంచుకోవాలన్న ప్రయత్నంలో అఖండ పార్టీని ముక్కలు చింపిన విస్తరి చేసిన జయలలిత, జానకీ వర్గాలు ఒక ప్రక్క, తమిళ ప్రజలకు మొదటి నుంచి నమ్మకం లేని కాంగ్రెసు పార్టీ రెండవ ప్రక్కా వున్నాయి! కాంగ్రెసు పార్టీ అధ్యక్షుడు రాజీవ్ గాంధీ- భాషా విషయంలో రాజీకి దిగినా, వేషం విషయంలో రకరకాల చిట్కాలు ప్రదర్శించినా వారు అటు ఆకర్షితులు కాలేదు! ఆ ఫ్రంటులో చేరినా యీ ఫ్రంటులో చేరినా కూడా ఉభయ కమ్యూనిస్టు పార్టీలే నయం బాగా లాభాలు పొందాయి కాని "మూపనార్" నాయకత్వం మాత్రం పూర్తిగా విఫలమైంది! ఇక వారికి "నల్ల కళ్ళద్దాల' కరుణానిధి పట్ల విపరీతమైన విశ్వాసం కలిగింది. ఎం. జి. యార్, కరుణానిధి కూడా ఒకే సిద్ధాంతం నుంచి వచ్చిన వారు! ద్రావిడ కళగంలోని రెండు పాయలే అవి. ఆ యిద్దరు తమిళనాడును చూసే రంగటద్దాలు ఒక్కలాంటివే! అందుకనే యివాళ తమిళనాడు ప్రజలు దక్షిణాదిన కాంగ్రెసు జెండాకి తావు లేనంతగా తిరస్కరించారు! నేషనల్ ఫ్రంట్‌కి ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో మరొక ప్రాంతీయ పార్టీకి దాని ప్రభుత్వానికి నాయకుడైన ఎన్. టి. ఆర్. కిది మరింత ఆనందదాయకంగా వుండొచ్చును. ఎందుకంటే "నేషనల్ ఫ్రంట్" కిది టెక్నికల్‌గా తొలి బోణీ! కాకపోతే కాంగ్రెసు (ఐ) కిది పెద్ద గుణపాఠం! అది వింధ్య పర్వతాల కిటు తట్టు తిరిగి ఎట్లా రాగలదు అన్న "తలనొప్పి"ని ఆ నాయకత్వమే చూసుకోవాలి!

ముఖ్య సంపాదకుడు శివలెంక రాధాకృష్ణ

అడ్వయిజరీ సంపాదకుడు : వీరాజీ

ముద్రాపకుడు ప్రచురణకర్త శివలెంక నాగేశ్వరరావు

ఆంధ్రపత్రిక ప్రెస్; గాంధీనగరం, విజయవాడ 3. ఫోన్‌లు: 75667, 61247, 61248, 75569

తెలుగువారి నిరంతర సేవలో మాకిది 81వ సంవత్సరం




డెమొక్రసీ జిందాబాద్!

రాష్ట్రపతి ఆర్ వెంకట్రామన్ గారు రిపబ్లిక్ డే సందేశంలో అన్నట్టు – వోటర్ గ్రేట్ – దేశంలో డెమొక్రసీ జిందాబాద్– విజయవాడలో నెల రోజులైంది కర్ఫ్యూ జిందాబాద్! అవును వోటరు గొప్పవాడే కాదు– తమాషాలు చేస్తాడు అలాగే భారత దేశం కూడా గొప్పది ఇంగ్లీషు రాష్ట్ర భాషగా గల నాగాలాండ్‌లోను లాల్‌డెంగా రాజ్యం మిజోరం లో లాల్‌డెంగాని వోడించి మరీ కాంగ్రెస్(ఐ) పార్టీని గెలిపించిన వోటర్ – హిందీ వూసెత్తితే తంతామనే తమిళనాడులో ఎమ్ జీయార్ సతీమణి జానకీరామచంద్రన్‌కి పూర్తి విశ్రాంతి ప్రసాదించాడు!– ఇవాళ జనవరి 27న వళ్ళువార్ కోట్టం అనే బ్రహ్మాండమైన నాలుగు వేల మంది పట్టే – మందిరంలో ఘనంగా (12 సంవత్సరాల తర్వాత) ముఖ్యమంత్రి పదవి స్వీకరించిన నల్ల కళ్ళద్దాల కరుణానిధి జాగ్రత్తగా వుండాలి ఎందుకంటే వారి కుమారుడు స్టాలిన్ కూడా మద్రాసు నగరం నుంచే ఎమ్ యల్ ఏగా ఎన్నికైన సంగతి జ్ఞాపకం వుండటం మంచిది అదీ ఎందుకంటే మధ్యప్రదేశ్‌లో ఏనుగంత అర్జున్‌సింగ్ – కుమారరత్నం పెట్టిన చుర్హాత్ లాటరీ దెబ్బకి – మళ్ళీ పంజాబ్ దాకా ఎందుకు? – మిజోరం వెళ్ళడానికి కూడా అర్హత లేకుండా అయిపోయాడు! (పాపం! షాడో ప్రధానమంత్రి)

మద్రాసు రాష్ట్రంలో యీ పన్నెండు సంవత్సరాల కాలంలో వోటర్ చాలా ఎదిగిపోయాడు– ఎమ్ జి యార్ నక్షత్రం రాలిపోయిన వెంటనే– అసెంబ్లీలోను బయటా కూడా అతని అనుయాయులు చేసిన అగడాలు – చూసిన వోటర్ పది బియ్యం రూపాయికిస్తామన్నా ఆకర్షితుడు కాలేదు – వీరప్పన్ లాంటి 140 మంది మాజీ ఎమ్

రెండాకులును రెండు పావురాలు తినేశాయి నేనేం చెయను? కోడిపుంజ నవగండి!



ఎల ఏ లను పేరుపెట్టి వోడించిన మద్రాసు రాష్ట్ర వోటర్ మహాశయునికి రాష్ట్రపతి నుంచి సామాన్యుడి దాకా అంతా జేజేలు చెప్పాల్సిందే! సినిమా తారలకి తప్ప మరొకరికి జెండా ఎత్తని తమిళతంబి– యివాళ ఒక సంప్రదాయానికి స్వస్తి చెప్పాడు! జయలలితమ్మ ఎమ్ జి యార్‌తో నటించిన సినిమాలన్నీ చూపించినాక – ఆమె నటన కి తగిన బహుమతిగా పదిబియ్యం రూపాయి ముప్పావలాకి అమ్మలేవు పోవమ్మా అన్నాడు

అయితే అసెంబ్లీలో పోలీసుల్ని ప్రవేశపెట్టిన ఘనుడు మాజీ స్పీకర్ పాండ్యన్ ఒక్కడొక్కడే జానకీ అన్నా డి ఎమ్ కే పార్టీని చావకుండా చేసి వెక్కిరిస్తున్నట్టు గెలిపించాడు!!– యిది విడ్డూరమే! అక్కడ మిజోరం లో లాల్ డెంగాని చిత్తు చేసినట్లే యిదో విరోధాభాసం! – కోడి పుంజు కొక్కొరొక్కొ అనకపోయినా – డి ఎమ్ కె సూర్యోదయమైనట్లు – భాషవిషయంలో రాజీ పడ్డా – సంచులతో కాసులు వెచ్చించినా తమిళనాడులో కాంగ్రెసు పార్టీకి కుమారి జయలలితకన్నా తక్కువ సీట్లు వచ్చాయి!! నడిగర్ తిలకమ్ శివాజీ గణేశన్ కూడా జానకమ్మ శిబిరంలోకి వెళ్ళడంతో అంతే సంగతులు అయిపోయాడు! మహా నటుడు మహా రాజకీయ నాయకుడు అయిన



నా కోడిపుంజు కుయ్యక పోయినా
సూర్యోదయమైందే?

రాజేంద్రన్‌ని అతని కుమారుణ్ని కూడా "వోటరు' మట్టి కరిపించాడు! అఖిల భారత నెం 1 స్టార్ శ్రీదేవిని నేరుగా చూసి మురిసి పోయిన వోటరు – ఆమె తండ్రిని అంతే నేరుగా తిరస్కరించాడు! ఈవిధంగా తమిళనాడులో "సినిమాగ్లామర్ నిషా" ప్రజలలో పూర్తిగా దిగిపోయింది. దీన్నే మనం 'నూతన శకం" అనాలి– అంతేనా, మొగుడు పోతే భార్యకీ, తండ్రి పోతే కొడుకికి లభించేదికాదు రాజకీయ పీఠం లేదా పదవీ అన్న విషయాన్ని కూడా తమిళనాడు వోటర్‌లు నిరూపించారు! ఇదంతా "తమిళనాడు' లాంటి ప్రత్యేక రాష్ట్రంలో జరిగింది అంటే అదో 'విప్లవం' గానే మనం అంగీకరించాలి! (శ్రీలంక ప్రభావం యిందులో ఎంత?)

ఇక్కడ కాంగ్రెసు అధినాయకుడు రాజీవ్‌గాంధీ జయలలిత కూటమిలో చేరకపోవటం ఎంత తప్పో శివాజీ కాంగ్రెసు శిబిరంలోకి తిరిగి పోకపోవడం అంతే పొరపాటు కాని చివరి క్షణం దాకా గీసి, గీసి బేరమాడి, 'ఫ్రంట్'కి ద్రవిడ మున్నేట్ర కళగంతో పొత్తు కుదిర్చి– పది దగ్గర యిరవై సీట్లు సంపాదించిన "నేషనల్ ఫ్రంట్"– ముఖ్యంగా దాని నాయకుడు "లక్కీలాట్" అయ్యారు ఎన్ టి ఆర్ ప్రతిసారి మనుమరాల్ని చూడ్డానికి మద్రాసు వెళ్ళినప్పుడు "వోహో" మంటూ వెళ్ళగల అవకాశం దొరికింది!

"కోల్పోయుంచితి కోక సుట్టితి– వెల్లుల్లిన్ తిలపిష్టంబు మెసవితిన్" అంటూ వెనకటికి శ్రీనాథుడు వాపోయినట్లుంది, రాజీవ్‌గాంధీగారి సి సి! పాపం– సోనియాగాంధీ నిక్షేపంలాంటి జావేద్ హెయిర్‌సె యిడిచుట్టి గంపెతు పూలు ధరించింది! లాంగ్ కోటు ఫ్యాంటూ తీసేసి లుంగి, కండువా ధరించి దేవాలయాలన్నీ తిరిగిన ప్రధాన మంత్రికి వ్రతం చెడింది ఫలమూ దక్కింది కాదు!

"పాపం!" మూపనార్ వోడిపోయినా వెక్కి వెక్కి ఏడ్వకుండా టిలివిజన్ తెరమీద నిబ్బరంగానే కనపడ్డాడు- రాజకీయనాయకులకి వోటమి గెలుపూ ఒకటే సుమా!" అంటే నాలాంటి అమాయకుడు ఒకడు – భలేవాడివయ్యా! అసలు కాంగ్రెసు (ఐ) గెలుస్తుందని మూపనార్ అనుకున్నప్పుడుకదా డిసెప్పాయింట్‌మెంట్? పరీక్ష పాడు చేసిన స్టూడెంట్ పేపర్లో రిజల్ట్సు చూసి ఏడుస్తాడా? అన్నాడో రేపటి పౌరుడు!

"గ్లామర్" శకం అయిపోయిందా?

1989లో సినిమా స్టార్‌లు రాజకీయ రంగ ప్రవేశానికి స్వస్తి చెపుతారేమో ననిపిస్తోంది మద్రాసు ఫలితాలు చూశాక యింకా వాళ్ళకి ఆంధ్రాలో ఆ ధైర్యం వుంటుందా? అని

కాని ఆంధ్రా వేపు చూస్తే – బీహార్ కాంగ్రెసు– మధ్యప్రదేశ్ కాంగ్రెసుల సంక్షోభమే "బెటర్"గా వున్నది అనిపిస్తుంది? బాగారెడ్డిగారికి రాజీనామా పత్రాలందజేసిన కాంగ్రెసు ఎం ఎల్ ఏలు– గవర్నర్‌ని కలుసుకున్నారు రాష్ట్రపతిని కలుసుకుంటామన్నారు! కాని ఇప్పట్లో "ఎన్నికల పూసెత్తితే వొట్టు" అన్నట్లుంది అధ్యక్షుడు రాజీవ్‌గాంధీగారి స్థితి అంచేత ఆంధ్రాలో ఎన్ టి ఆర్ కాంగ్రెస్(ఐ)ల మధ్య సాగుతున్న ఎత్తుకు పైఎత్తుల్ని ఆయన చిత్తగించటం లేదు పోయిన దక్షిణాపథం ఎటూ పోయింది యిక ఉత్తరాదినైనా దక్కించుకోవాలిగా అంటూ మధ్యప్రదేశ్, బీహార్‌ల వైపు తంటాలు పడుతున్నాడాయన!




"రాజీవ్‌గాంధీని గద్దె దిగమని మేం అనటంలేదు- మరి మమ్మల్ని పొమ్మని వారెందుకనాలి?"

హైకోర్టులుండాలి.

"హెల్మెట్‌లు" విషయంలో మేధావులందరికీ వ్యతిరేక తీర్పు లిచ్చినా సరేహైకోర్టు లుండాల్సిందేననిపిస్తోంది!! బహుశా మధ్యప్రదేశ్‌లో మళ్ళీ ముఖ్యమంత్రి అయిన మోతీలాల్ వోరాగారు కూడా యిలాగే అనుకుంటాడేమో? అందరికి రిపబ్లిక్‌డే శుభాకాంక్షలు! వోటరూ జిందాబాద్! డెమోక్రసీ జిందాబాద్.

(26-1-1989)





జపాన్ చిత్రం హవుస్ అన్ ఫైర్‌లో ఒక సన్నివేశం

12వ అంతర్జాతీయ చలన చిత్రోత్సవం

ప్రశంసలు పెదవి విరుపులు ఒక పక్క నిరసనలు, నినాదాలు మరొక పక్క సందడి చేస్తుండగా ప్రారంభమైన భారత 12వ అంతర్జాతీయ చలన చిత్రోత్సవం మొదటి వారాన్ని విజయవంతంగా పూర్తి చేసుకుంది గడచిన ఈ వారం రోజుల్లో ఫిల్మ్ ఫెస్టివల్ సందర్భంగా రూపొందించిన ప్రధాన కార్యక్రమాలు దాదాపు అన్నీ ప్రారంభించడం జరిగింది

సినిమా ఆఫ్‌ది వరల్డ్ అన్న ప్రధాన భాగంలో ప్రదర్శనకు 44 దేశాల నుంచి 95 చిత్రాలు రాగా వాటిలో 35 చిత్రాలు ఫిలిం ప్రెస్ డెలిగేట్లకు సిరిఫోర్ట్ ఆడిటోరియంలో ప్రదర్శించారు రెండో వారంలో మరొక 40 చిత్రాలు ప్రదర్శించబోతున్నారు ఇవికాక 'ఇండియన్ సినిమా' పేరున నాలుగు విభాగాల్లో మొత్తం 54 చిత్రాలు ఎంపిక చేయగా వాటి నుంచి 28 చిత్రాలు మొదటి వారంలో ప్రదర్శించారు ఫారిన్ రెట్రాస్పెక్టివ్ పేరుతో మొత్తం ఐదు విడివిడి అంశాలుగా చూపేందుకు 77 చిత్రాలు ఎంపిక కాగా వాటి 38 చిత్రాలు చూపడం జరిగింది

2 వేల మంది

సినిమా రంగం నుంచి పత్రికా రంగం నుంచి తదనుబంధ శాఖల నుంచి హాజరైన ఫెస్టివల్ డెలిగేట్ల సంఖ్య దాదాపు 2000 లకు పైబడింది ఇందులో 28 విదేశాల నుంచి వచ్చిన 103 మంది విదేశీ ప్రతినిధులు కూడా వున్నారు వీరిలో 25 మంది చిత్ర నిర్మాతలు దర్శకులు వున్నారని మొదటి వారం విశేషాలను పత్రికల వారికి సమీక్షిస్తూ ఫెస్టివల్ డైరెక్టర్ శ్రీమతి ఊర్మిళాగుప్త తెలియ జేసారు

సాధారణ ప్రేక్షకుల విషయానికొస్తే ఢిల్లీ ప్రేక్షకుల సౌకర్యార్థం అర్చన, రచన ప్లాజా ఓడియన్ రివోలి థియేటర్లలో ఫెస్టివల్ సినిమాలు ప్రదర్శిస్తున్నారు క్రిందటి 11వ అంతర్జాతీయ చలన చిత్రోత్సవానికి హాజరైన ప్రేక్షకులకన్నా ఈ సారి ఎక్కువ మంది హాజరవుతున్నారని తెలుస్తోంది

అప్పట్లో థియేటర్లు 49 శాతం టిక్కెట్లు అమ్మగలిగితే ఈ సారి మొత్తం మీద 75 శాతానికి మించి అమ్మగలుగుతున్నాయి అన్నిటికన్నా ఎక్కువగా 85 శాతం రెట్రాస్పెక్టివ్ విభాగాలు ప్రదర్శిస్తున్న రివోలి థియేటర్‌లో అమ్ముడు కావడం విశేషం కనీ వినీ ఎరగనంత తీవ్రంగా చలిగాలులు రాజధాని నగరాన్ని గజగజ లాడిస్తున్న ఫిలిం ఫెస్టివల్ అభిమానుల సంఖ్య మునుపటికన్నా పెరగడం ఆశాజనకమైన విషయంగా గమనించవచ్చు

బాంబు భయం!

ఇదిలా వుండగా ఫెస్టివల్ ప్రారంభోత్సవం జరిగిన తీరు మీద ఆ మర్నాటి నుంచి ఫెస్టివల్ నిర్వహింపబడుతున్న పద్ధతి మీద వారం పొడుగునా విమర్శలు సన్నాయి నొక్కులు వినపడ్డాయి ఫెస్టివల్ ప్రారంభానికి ముందు నుంచే పూనా ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌కి చెందిన విద్యార్థినీ విద్యార్థులు 60 మంది సిరిఫోర్ట్ హాల్సులో చేస్తున్న నిరసన ప్రదర్శన అలా కొనసాగుతూనే వుంది తమ సంస్థకి చలన చిత్ర నిర్మాణంలో అనుభవం వున్న దర్శక నిర్మాతనే ప్రిన్సిపాల్‌గా నియమించాలన్నది వాళ్ళ డిమాండ్ ఇంతలో 15వ తేదీ మధ్యాహ్నం ఎవరో గుర్తు తెలియని వ్యక్తి ఫెస్టివల్ డైరెక్టర్‌కి ఫోన్ చేసి సిరిఫోర్ట్ ఆడిటోరియంని బాంబులతో పేల్చివేయగలమని బెదిరించారు దాంతో ఆనాటి మధ్యాహ్నం నుంచి సిరిఫోర్ట్ సెక్యూరిటీ బలగాన్ని రెండింతలు పెంచి లోపలికి బయటికి వెళ్ళే వాళ్ళని

ప్రారంభ చిత్రం యు. కె. కి చెందిన మదామె సౌజాట్స్కా



గట్టిగా చెక్ చెయ్యడం ప్రారంభించారు కెమెరాల విషయంలో కూడా ఆంక్షలు పెట్టడంతో ప్రెస్‌ఫోటోగ్రాఫర్లకి కాస్త ఇబ్బంది ఎదురుకాక తప్పలేదు

మరొక పక్క ప్రతిరోజూ మధ్యాహ్నం 12 30కి సినీరంగ ప్రముఖులతో ప్రేక్షకులకి ముఖాముఖి చర్చలకు వీలు కల్పించే విధంగా సమ్మేళన్ అనే ఓపెన్ ఫోరమ్ ఏర్పాటు చేయడంతో బాటు ప్రత్యేకించి ప్రెస్ డెలిగేట్లకి ప్రదర్శనకు ఎంపికైన చిత్రాల దర్శకులతో నటులతో ప్రెస్ కాన్ఫరెన్సులు ఏర్పాటు చేయడం కూడా జరిగింది పోతే ఫెస్టి నిర్వహిస్తున్న తీరు ఈ సారి కూడా సంతృప్తికరంగా లేదు ఫెస్టివల్ నిర్వాహకులకి ఈ విషయాన్ని గుర్తు చేస్తున్నా ఫలితం వుండటం లేదు

చిన్న చూపు

తొలినాటి ప్రారంభోత్సవంలో దక్షిణాది సినీ రంగానికి ప్రత్యేకించి తెలుగు చలన చిత్ర రంగానికి జరిగిన చిన్న చూపు వల్లనో అసలీసారి ఫెస్టివల్‌కి ఎన్నికయిన తెలుగు చిత్రాలు పెద్దగా లేక పోవడం వల్లనో తెలుగు చలన చిత్ర రంగం నుంచి వచ్చిన సినీరంగ ప్రముఖులు బహు కొద్దిగా మాత్రమే కనిపించారు మొదటి రోజు వచ్చిన హీరో చిరంజీవి హీరోయిన్ భానుప్రియ ఆ మర్నాడే వెళ్ళి పోయారు కాగా ఫెస్టివల్ చిత్రాలు చూస్తున్న వారిలో గుమ్మడి వెంకటేశ్వరరావు, పరుచూరి గోపాలకృష్ణ పుండరీకాక్షయ్య గీతాకృష్ణ యం వి రఘు మొదలైన కొద్దిమంది మాత్రమే కనిపించారు ఈ సారి ఇండియన్ పనోరమ విభాగంలో ప్రదర్శనకు స్వర్ణ కమలం' ఎంపిక కాగా మెయిన్‌స్ట్రీమ్ చిత్రాల కింద ప్రదర్శనకు ఆఖరి పోరాటం, రుద్రవీణ చిత్రాలు ఎంపిక అయినాయి కళ్ళు చిత్ర నిర్మాత ఆనందరావు తమ చిత్రాన్ని పనోరమలో ఎంపిక చేయనందుకు నిరసన తెలియ జేస్తూ, ఫిలిం మార్కెట్ విభాగంలో ప్రదర్శించారు మొదటి వారం ఇంకో రోజులో పూర్తి కాబోతోందనగా ప్రముఖ మలయాళ నటుడు ప్రేమ్‌నజీర్ అస్తమించడంతో కొంత నైరాశ్యం చోటు చేసుకుంది మహోన్నత కళాకారులకి మరణం వుండదని చలన చిత్ర కళా జగత్తులో వారు అమరులుగానే వెలుగొందుతుంటారన్న సత్యాన్ని నెమరు వేసుకుంటూ, మరిన్ని కొత్త చిత్రాల ద్వారా మరెన్నో కొత్త అనుభవాలను ఆకాంక్షిస్తూ ఫిలిం ఫెస్టివల్ రెండో వారంలో అడుగు పెట్టింది


అందానికి అద్దంపట్టే చీరలు
బొమ్మన వారి చీరలు!
బొమ్మన
శారీ మందిర్
రాజధాని సూటింగ్ హౌస్
ఎ.సి. షోరూం

షవ్‌దార్ హష్మీ మృతికి దిలీప్‌కుమార్ మొ గు వారి నిరసన ప్రదర్శన



ఫిలిం ఫెస్టివల్లో అన్నవీ – విన్నవీ

★ కొంత మంది తమ చిత్రాలను పేదవాళ్ల మీద తీస్తే రాజ్‌కపూర్ మాత్రం పేదవాళ్ల కోసం తీసాడు ''
–రాజ్‌కపూర్ రెట్రాస్పెక్టివ్ సందర్భంగా బ్రిటిష్ క్రిటిక్ డెరిక్ మాల్కొమ్

★ "రొమాన్స్‌లేని వాడు చచ్చినట్టే లెక్క – నేనింకా బతికే వున్నాను మరి!
–ఫిలిం ఫెస్టివల్ ప్రారంభోత్సవ సభలో కబీర్‌బేడీతో రాజేష్ ఖన్నా

★ మనుషుల్ని ఊపేస్తున్న సంగీతం ఈ నాటిది– ఐతే మనసుల్ని ఊపిన సంగీతం ఆ నాటిదే!
–ఫిలిం ఫెస్టివల్ ప్రారంభోత్సవ సభలో నౌషాద్

★ పాత్రలో లీనమై నటించడం ఆ నాటి ఆచారం– పాత్రను మింగేసి నటించడం ఈనాటి ఆచారం
–ఫిలిం ఫెస్టివల్ ప్రెస్‌మీట్‌లో ఆ నాటి నటుడు జైరాజ్

★ పూర్తిగా తయారైన స్క్రిప్టు, కెమెరా ఏంగిల్సు ఆర్టిస్టులకి సూచనలు అన్నీ రెడీ చేసుకుని సర్వసన్నద్ధంగా షూటింగ్‌కి వస్తారు సత్యజిత్‌రే దానికి భిన్నంగా ఖాళీ కాయితాలతో, లూజా లాల్చీతో చేతులూపుకుంటూ సెట్స్ మీదికి వచ్చి అక్కడ తన ఆర్టిస్టులతో రక రకాల ప్రయోగాలు చేయిస్తూ షూటింగ్ కొనసాగిస్తాడు రిత్విక్ ఘటక్ ఇద్దరూ హేమా హేమీలే ఐతే, ఏ అసిస్టెంట్ డైరెక్టర్‌ని.అడిగినా రిత్విక్‌తో పని చేయడమే తేలిక అనే చెప్తాడు '

–ప్రముఖ బెంగాలీ దర్శకుడు అనిల్ చటర్జీ

★ నా పిక్చరు ప్రతిచోటా బాగా ఆడుతోంది– ఇప్పుడు ఎవరైనా నా పిక్చర్నిగానీ నన్నుగానీ ఏ విధంగా విమర్శించినా నాకంత పట్టింపు లేదు "–
– సలామ్ బాంబే ' దర్శక నిర్మాత మీరా నాయర్ వ్యాఖ్య

★ ఫిలిం క్రిటిక్స్ రాసేది నేను చదవను వాళ్ల దగ్గర్నుంచి నేను నేర్చుకోదగ్గదేదీ లేదు నేను నిజంగా నేర్చుకున్నది చక్కదిద్దుకో గలిగింది నా మిత్రులు ఇచ్చిన సూచనల మీదనే– నా సినిమాల గురించి నాతో మాట్లాడే నా మిత్రుల ద్వారానే"
–జాన్ ష్లెసింగర్– ఫిలిం ఫెస్టివల్ ప్రారంభ చిత్రాన్ని నిర్మించిన హాలీవుడ్ దర్శకుడు


★ నేటి చలన చిత్రాల్లో మగవారిని నిరసించే మహిళలు నేటి స్త్రీ సమాజానికి సంకేతాలు!"
–ప్రారంభోత్సవ సభలో రేఖ

(సేకరణ– శంకు)



షబ్నా ఆజ్మీ ప్రకటన

ఫిలిం ఫెస్టివల్ ప్రారంభించిన రోజు ప్రారంభోత్సవానికి కొద్ది క్షణాల ముందు సిరిఫోర్ట్ ఆడిటోరియంలో షబనా అజ్మి స్వయంగా పంచి పెట్టి ఆ తర్వాత స్టేజి మీద నిరసన తెలుపుతూ చదివిన ప్రొటెస్ట్ నోట్ లో షఫ్‌దార్ హష్మి హత్యకి గవర్నమెంటు తోడ్పాటు వున్నదని ప్రకటించటంతో సంచలనం చెలరేగింది



ఏనండి నొవీనోది [illegible] దొంగెవరో
వెలుగు చెప్పిన [illegible]వరిదో
కాళరా[illegible] [illegible]
పల్లెటూరి[illegible] [illegible]ంతం
దాని[illegible] దొంగ[illegible]
అదిరిన [illegible] సం[illegible]

టార్చి తీసుకుని వెళ్ళద్దు
దొంగకు అంతా అయోమయం
వెలుగు మెలుపులా [illegible]
దొంగ నెత్తిపై ఉరిమింది

[illegible] [illegible]సందం
[illegible] అందుకు [illegible]
ఈ మాయకు కారణమేదో
అదే నొవీనో పేరు కదా
దాని పేరే నొవీనో

అంతర్జాతీయ టెక్నిక్ తో
తయారైన నొవీనో బ్యాటరీ.



National

నొవీనో

మరింత కాంతి ఇస్తుంది, మరింత
కాలం మన్నుతుంది

లఖన్‌పాల్ నేషనల్ లిమిటెడ్
బరోడా గుజరాత్

జపాన్ దేశపు మట్సుషిట ఎలెక్ట్రిక్ వారితోటి
(నేషనల్ మరియు పానాసోనిక్
ఉపకరణాల తయారీదార్లయిన) ఎమిష్టి సంస్థ

*ista's LNL-565/88 TEL A



సీరియల్

సూపర్ గర్ల్

వింజమూరి విజయ శాంభవి

(గత సంచిక తరువాయి)

చైతన్య అప్పుడే వూరినుండి వచ్చాడు!

ఆ ఇంట్లో అతనితో పాటు వంట నాయర్ మాత్రం వుంటాడు! అదీ అతను వూళ్ళో వుంటేనే! అతను ఏదైనా వూరు వెళితే అదే వూళ్ళో వున్న తన కూతురి దగ్గరికి వెళ్ళిపోతాడు నాయర్! మళ్ళీ చైతన్య కబురుపంపితేనే అతను వచ్చేది! క్రితం రోజు సాయంత్రం ఏదో పనిమీద ఎక్కడికో వెళ్ళి అప్పుడే తిరిగివచ్చిన చైతన్య కిచెన్‌లో గ్యాస్‌స్టవ్ అంటించి ఫ్రిజ్‌లో నుండి పాలుతీసి కాఫీ చేసుకుని తాగాడు!

అర్ధరాత్రి అయినా అతను నిద్రపోయే ప్రయత్నం చెయ్యలేదు! తన లైబ్రరీ రూములోకి వెళ్ళి ఒక బుక్ తెచ్చుకుని హాల్లో కూర్చుని దీక్షగా చదవసాగాడు!

ఇంతలో కాలింగ్‌బెల్ మ్రోగింది! అప్పుడు సమయం పన్నెండున్నర! అతను ఆశ్చర్యంగా చూస్తూ లేచాడు! ఈ సమయంలో ఎవరొచ్చారు? అతను వెళ్ళి తలుపు తీశాడు!

చేతిలో సూట్‌కేస్ పట్టుకుని నిలబడివుంది అందమైన ఓ యువతి! అతను ఆశ్చర్యంగా ప్రశ్నార్ధకంగా చూశాడు!

నా పేరు బిందు!" మాది విజయవాడ! ఇంటర్వ్యూకని ఈ వూరొచ్చాను! పదిగంటలప్పుడు ట్రైన్ దిగింది మొదలు నా ఫ్రెండ్ ఇంటికోసం ఒకటే వెతుకుతున్నాను! దురదృష్టవశాత్తూ ఆమె అడ్రస్ పోగొట్టుకున్నాను! నా అవస్థ నిస్సహాయస్థితి గమనించి ఇద్దరు రౌడీలు నన్ను వెంబడిస్తున్నారు! భయంతో మీ ఇంట్లోకి వచ్చేశాను! దయచేసి ఈ రాత్రి నాకు మీ ఇంట్లో ఆశ్రయం ఇచ్చారంటే తెల్లవారగానే వెళ్ళిపోతాను! కాదనకండి ప్లీజ్ ప్రాధేయపడుతున్నట్టుగా అడుగుతున్న ఆ అమ్మాయి చాలా గౌరవనీయమైన కుంటుంబంలో నుండి వచ్చిన వ్యక్తిలా ఎంతో భయపడుతున్నట్టుగా కనిపించింది అతనికి!

ఏమంటారు? ప్లీజ్ అందామె మళ్ళీ!

ఆలోచనగా చూస్తున్న చైతన్య చప్పున సర్దుకున్నాడు "ష్యూర్. మీరు ఇంతగా అడగాలా? లోపలికి రండి! మీ కేం భయం వుండదు యిక్కడ! నిశ్చింతగా వుండవచ్చు అన్నాడు!

'థ్యాంక్యూ ఒన్స్ ఎగైన్' నిశ్చింతగా వూపిరి పీల్చుకుంటూ ఎంతో ధైర్యం వచ్చినదానిలా లోపలికి వచ్చిందామె!

అతను తలుపులువేసి బోల్టు పెట్టాడు!

ఒంటరి ఆడది కనిపిస్తే మగవాడికి లోకువ! ఆమెకి సోఫా చూపించి తనూ కూర్చుంటూ, అడిగాడతను

'మీ ఫ్రెండ్ పేరేమిటి?'

'ఫ్రెండ్ అంటే టీనేజ్ అమ్మాయి! చిత్రంగా కలిసింది ఆమెతో నాకు స్నేహం! పేరు కార్తి! తండ్రిపేరు ఆనంద్ ఇండస్ట్రియలిస్టట! తల్లిపేరు సుమిత్ర! ఓసారి తను ఫ్రెండ్ దగ్గరికి విజయవాడ వచ్చినప్పుడు పరిచయం అయింది నాకు కార్తి! ఎప్పుడైనా నేను హైదరాబాదు రావడం సంభవిస్తే తన ఇంటికి రమ్మని మరీమరీ చెప్పిందామె అంది బిందు భయంవలన కాబోలు నుదుట పట్టిన చెమటని కర్చీఫ్‌తో అద్దుకుంటూ!

ఓహ్ అన్నాడు చైతన్య మా కార్తి ఫ్రెండా మీరు?" చిరునవ్వుతో అన్నాడతను!

కార్తి మీకు తెలుసా? ఆశ్చర్యంగా చూస్తూ అడిగింది బిందు!

"నాకు మేనకోడలవుతుంది! మా కార్తి ఫ్రెండ్ అయిన మీరు ఇప్పుడు నా గెస్ట్ అన్నమాట" అదే చిరునవ్వుతో అన్నాడతను!

ఈసారి బిందు కూడా నవ్వింది ఆమె నవ్వు కూడా చాలా అందంగా వుంటుందని తెలిసింది చైతన్యకి!

ప్లీజ్ మీరు ఏమీ అనుకోకండి! నాకు బాగా ఆకలవుతోంది! ఉదయం ఎప్పుడో తీసుకున్న టిఫిన్ మొహమాటంగా అందామె!

చైతన్య ఉలిక్కిపడ్డాడు!

సారీ! నాది ఒట్టి ఆబ్సెంట్ మైండ్! ఏమీ అనుకోకండి .! అయిదు నిముషాల్లో మీ కేదయినా తెస్తాను!" అతను చప్పున లేస్తూ అన్నాడు!

"ఫరవాలేదు లెండి! ఇంత రాత్రివేళ మీరు, బయటికి వెళ్ళి ఏం శ్రమ పడతారు? ఇంట్లో ఎవరూ లేనట్టుంది కిచెన్ చూపిస్తే నేనే ఏదయినా చేసుకుంటాను' మొహమాటంగానే అంది ఆమె!

'ష్యూర్' రండి ఆమెకి వంట గది చూపించాడతను!

అంతే! అతను ఓ ప్రేక్షకుడిలా చూస్తుండగానే పది నిముషాల్లో వేడివేడి జీడిపప్పు ఉప్మా పొగలు గ్రక్కుతున్న కమ్మని కాఫీ తయారు చేసిందామె!

మీరూ కొంచెం తీసుకోవాలి' అంది బిందు నవ్వుతూ!

ఓ కె! అభ్యంతరంలేదు! అతను సింక్ దగ్గరికి వెళ్ళాడు చెయ్యికడుక్కోవటానికి!

అప్పుడు కదిలింది బిందు చురుగ్గా! ఆమె తన జాకెట్లో నుండి ఓ చిన్న పొట్లం తీసి విప్పి దాంట్లో ఉన్న పౌడర్‌ని కాఫీ కెటిల్లో కలిపేసింది! కాగితాన్ని ఉండగాచేసి ఓ మూలకి విసిరేసింది!

అదేమీ తెలీని చైతన్య మామూలుగా ఉప్మా తీసుకుంటూ ఆమెని మెచ్చుకున్నాడు

వండర్‌ఫుల్! నా జీవితంలో ఇంత మంచి ఉప్మా ఎప్పుడూ తిని ఎరగనంటే నమ్ముతారా?" అంటూ!

సిగ్గుగా నవ్వింది బిందు! ఆమె నవ్వు అతన్ని మరోసారి ముగ్ధుణ్ణి చేసింది! మరో రెండు నిముషాల తరువాత కాఫీ తాగిన అతను ఖాళీ కప్పు టేబుల్ మీద పెడుతూ తనూ అలాగే టేబుల్‌మీదకి ఒరిగిపోయ్యాడు!

చురుగ్గా కదిలింది బిందు!

అరగంటసేపు అతని ఇల్లంతా గాలించి వదిలిన ఆమె చివరిగా అతని లైబ్రరీ రూమ్‌లోకి ప్రవేశించి వేనికోసమో వెదకసాగింది! మరో అయిదు నిముషాల తరువాత తన అన్వేషణ ఫలించినట్టు మెరిసిందామె మొహంలో ఓ మెరుపు!

ఎర్రని కవర్‌తో వున్న ఆ జాండ్‌బుక్‌ని చూడగానే! వెంటనే అది అందుకుని ఆ గది వదలబోతూ ఆగిందామె! అక్కడ టేబుల్‌మీద చైతన్య లెటర్‌హెడ్, ప్యాడ్ పెన్ కనిపించాయి!

అందమైన ముత్యాల్లాంటి అక్షరాలతో సారీ ఫర్ ది ట్రబుల్ మిస్టర్ చైతన్య . " అని వ్రాసింది!

తరువాత తన సూట్‌కేస్ తీసుకుని ఆ ఇల్లు వదిలిందామె! ఆ సందు చివర్న కలుసుకున్న రెండు ఆకారాలు ఆమెని ఆత్రంగా అడిగాయి సక్సెసేనా?

నేను వెళితే సక్సెస్ కాకపోవడమా?' విజయగర్వంగా అంటున్న ఆమె తను చైతన్య ఇంట్లో తన హేండ్‌బేగ్ మర్చిపోయి వచ్చిన విషయం గ్రహించిందో లేదో! హడావుడికదా!


★ ★ ★


జరిగిన కథ –3 :కార్తికి వెళ్ళేసరికి కొన ప్రాణంతో ఉన్న రాణి తర్వాత చెయ్యవలసిన పని చెప్పి చనిపోతుంది వెంటపడిన దుండగుల్ని తప్పించుకుంటూ రమేష్ ఇల్లు చేరి అక్కడ నుంచి కూడా బైట పడుతుంది. ఇంటికి క్షేమంగా చేరి విజయవాడ వెళ్ళే ఆలోచన ప్రారంభిస్తుంది. కార్తిని పట్టుకోలేక పోయినందుకు అనుచరులను తిడుతుంది సోఫియా

కార్తి బాగా ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చింది! ఈ విషయంలో తను ఆలోచించో ఆలోచించకుండానో తల దూర్చింది కాబట్టి దీన్ని తనే ముగించాలి! పూర్తిచేసి గెలవాలి! అవును! తను గెలిచి తీరుతుంది! ఈలోపల అంకుల్‌కి కూడా చెప్పకూడదు! ఇది పూర్తిచేసి అప్పుడు చెప్పి అంకుల్ మెప్పు పొందాలి!

మరొకరి సాయం తీసుకుంటే ఇందులో తన గొప్పదనం ఏముంటుందసలు?

తరువాత కార్తి యింకా బాగా ఆలోచించింది!. తను ఇప్పుడు సూట్‌కేస్ కోసం రమేష్ ఇంటికి వెళ్ళడం కూడా అంత మంచిదికాదు! హత్య జరిగిన ఇల్లు! పోలీసులు వుంటారు! నేర్పుగా, తెలివిగా ఆ సూట్‌కేస్‌ని తన దగ్గరికి తెప్పించుకోవాలి! అదెలా? హఠాత్తుగా ఆమెకి ఓ అయిడియా తట్టింది! హుషారుగా టెలిఫోన్ దగ్గరికి నడిచిందామె! ఓ నంబర్ డయల్ చేసింది! నిముషం తరువాత ఎత్తారు అవతల. .





"హలో ." విసుగ్గా వినిపించిందా కంఠం!

హలో ఎవరది? రజియాయేనా మాట్లాడేది .?" కంఠం మార్చి రావు గొంతులా చేసి అడిగింది!

ఎస్! హు ఆర్ యూ? రజియా అడిగింది!

'నే నెవరైతే నీ కెందుకులే! నువ్వు చాలా ధైర్యవంతురాలివటగా" నిజమేనా" అడిగింది కార్తి!

"అవును! మీ రెవరు? ఎవరు చెప్పారా విషయం? నిజం చెప్పారు! సగర్వంగా అంది రజియా!

"ఏమోనబ్బా నమ్మలేను !

"ఏమిటీ?" రోషంగా వుంది రజియా కంఠం!

అదే నీలో ధైర్యం సాహసం జాస్తి అనే విషయం! నీ క్లాస్‌మేట్ కార్తికంటే ధైర్యం జాస్తి నీకు" రెచ్చగొట్టింది!

'వాట్ నాన్సెన్స్ యు ఆర్ టాకింగ్? కార్తి నా కంటే ధైర్యవంతురాలా?"

అవునట!"

కాదు కాదు" "గట్టిగా అరిచింది రజియా!

కాదనడానికి ఋజువు ఏమిటి?

ఏం చెయ్యాలో చెప్పండి! ఎంత సాహస పూరితమైన పనైనా చెయ్యడానికి నేను రెడీ! ఏం చెయ్యాలి? రాత్రి స్మశానం దగ్గరికి ఒంటరిగా నడచి వెళ్ళాలా? మా కాలేజీ రౌడీ అరవింద్‌ని టీజ్ చెయ్యాలా? మా హిస్టరీ లెక్చరర్ లెసన్ చెబుతున్నప్పుడు లేచి ఎదురు ప్రశ్నలు వెయ్యాలా? ఇంకేం చెయ్యాలి కమాన్. స్పీక్ ఆవేశంగా అంది!

'అవేమీ వద్దు!

'మరి?"

మీ ప్రక్క వీధిలో రమేష్ అనే అతను హత్యచెయ్యబడ్డాడన్న విషయం తెలుసా నీకు?"

వైనాట్? అందరూ భయపడుతున్నా నేనుమాత్రం ఉదయాన్నే వెళ్ళి అతడి డెడ్‌బాడీని చూసివచ్చాను! ఒక్క కత్తిపోటుకి చచ్చాడు! మా క్లాస్‌మేట్ రేఖకి అన్న అవుతాడ్లే! దుర్మార్గపు వెధవ! పీడ వదిలిపోయింది!"

ఏం! నిన్నేమైనా అన్నాడా?'

ఛీ 'అంత ధైర్యమే వాడికి?

అంత గొప్పదానివా ఏమిటి నువ్వు?"

"నువ్వు ఎవరోగానీ నన్ను, నా మాటల్ని నమ్మటంలేదు.. అవునా?"

"అఫ్‌కోర్స్!"

"కావాలంటే బెట్ పెడతాను" రెచ్చిపోయింది!

"సరే అయితే! నువ్వు చెయ్యాల్సిందేమిటో చెబుతాను విను! నువ్వు హత్య చేసిన రమేష్ ఇంటికి వెళ్ళాలి! వెళ్ళగలవా?

"ష్యూర్! వెళ్ళి చెప్పు ఏం చెయ్యాలి?" అడిగింది రజియా!

సూపర్ గర్ల్

'వెళ్ళి అతని ఇంట్లో ముందుహాలుకి కుడివైపు రెండో గది అతని మేకప్ రూమ్‌వుంది' ఆ గదిలో నుండి దాన్ని అనుకునివున్న మరో గదిలోకి ఒకే ఒక ద్వారం వుంది' అది పాత సామాన్లగది' ఆ గదిలో ఒకదాని మీద ఒకటిగా పర్చి రెండు ట్రంకుపెట్టెలు వుంటాయి' క్రిందపెట్టెలో రెడ్ సూట్‌కేస్ ఒకటి వుంది' అది మూడో కంట పడకుండా తీసుకొచ్చి నీ రూమ్‌లో పెట్టుకోవాలి' తరువాత నేను వచ్చి తీసుకుంటాను' ఏమంటావు?? చెయ్యగలవా ఆ పని?" నమ్మకం లేనట్టు అడిగింది కార్తి

"ఓస్ .. అంతేనా? ఇంత మాత్రానికేనా?అదెంతపని? చూస్తూండు!గంటలో ఆ పని ముగించి తీరుతాను పట్టుదలగా అంది'

'ఈ విషయం రెండో కంటికి తెలీకూడదు' ఆ తరువాత నీ యిష్టం' మళ్ళీ చిక్కుల్లో పడతావు'"

'అదంతా నీ కెందుకు? ఆ రెస్పాన్సిబిలిటీ నాది' అయినా అదెంత ప్రమాదకరమైన పనో నాకు బాగా తెలుసు' ఎందుకంటే అది హత్యజరిగిన ఇల్లు కాబట్టి! సో.. పందెం ఏమిటి?'

"నువ్వు గెలిస్తే నీ ఫ్రెండ్స్ అందరినీ పిలిచి వారి సమక్షంలో నీ గొప్పదనాన్ని గురించిఒప్పుకుంటూ హోటల్ అశోకాలో పార్టీ యిస్తాను ' ఓ కే

"ఓ కే ' కార్తిని కూడా పిలవాలి?"

"ష్యూర్ " అంగీకరించింది కార్తి'

ఈ క్షణమే బయలుదేరుతున్నాను!"

బికేర్‌ఫుల్' గంట ఆగి మళ్ళీ ఫోన్‌చేస్తాను ఏ విషయం చెప్పు అంటూ ఫోన్ పెట్టేసి నవ్వుకుంది కార్తి'

రజియా , కార్తికి ఫ్రెండ్ అయినా కార్తిపట్ల కాస్తంత జలసీవుంది ఆమె మనసులో' కార్తిని ఎవరైనా పొగిడితే సహించలేదు' తనే గొప్ప అనుకుంటుంది' ధైర్యం తెగువ జాస్తి' అడ్వంచర్ అంటే ప్రాణం' తెలివితేటలు కూడా పుష్కలంగానే వున్నాయి'

మరో అయిదు నిముషాల తరువాత

అక్కా.. అక్కా ఇది చూశావా?' అంటూ పరుగెత్తుకు వచ్చాడు సతీష్'

సతీష్ ఆమెకి పిన్నతల్లికొడుకు అవుతాడు' కార్తి తల్లిదండ్రుల దగ్గర వుండి చదువుతున్నాడు' పద్నాలుగేళ్ళ వయస్సు'

'ఏమిట్రా?' అంది ఆలోచనల్లో నుండి తేరుకుంటూ'

"మన గారేజీలో ఎక్కడిదో సూట్‌కేస్ కనిపించింది' దాంట్లో కొద్దిగా డబ్బు, పాతబట్టలూ పాత వాచీ అవీ వున్నాయి' అది ఎక్కడినుండి వచ్చిందా అని ఆంటీ అంకుల్ ఆశ్చర్య పోతున్నారు' ఆశ్చర్యంగా చెప్పాడు సతీష్'

కార్తి ఉలిక్కిపడింది' చప్పున లేచి బయటికి వచ్చిందామె' తల్లి, తండ్రి, తోటమాలి, డ్రైవర్ రామూ అందరూ వింతగా చూస్తూ నిలబడివున్నారు' వంటావిడ ఒక్కోవస్తువే తీసి చూపెడుతోంది' కార్తిని చూడగానే అన్నాడు ఆనంద్

"చూశావా బేబీ! ఈ సూట్‌కేస్ ఎవరిదో యిక్కడికి ఎలా వచ్చిందో మాకు అర్థంకావడంలేదు' రామూ కూడా తనకి తెలీదంటున్నాడు''

"చిత్రంగావుంది" అంది సుమిత్ర'

నాలుగు పాత పాంట్లూ చొక్కాలు . ఒక పాత వాచీ పాత పర్స్‌లో 200 రూ డబ్బు వున్నాయి ఆ సూట్‌కేస్‌లో' కార్తి దాన్నిగురించి ఏమి మాట్లాడలేదు' మౌనంగా చూస్తూ నిలబడి పోయింది

రాత్రి దీన్ని ఎవరికంటా పడకుండా దాచింది తను?

"ఎవరు చూశారు దీన్ని?" అడిగింది తండ్రిని'

'రాము. ' చెప్పాడు ఆనంద్'

అవును అమ్మాయిగారూ' రంగమ్మ బజారెళ్ళి కూరగాయలు తెమ్మంది' సైకిలుమీద వెళదామంటే టైర్లలో గాలిలేదు' గాలి పంపుకోసం వెదుకుతోంటే యిది కనిపించింది' ఏదో బ్రహ్మరహస్యాన్ని కనిపెట్టినట్టు చెప్పాడు వాడు'

'ఈ వెధవపని అన్నమాట యిది? కోపంగా అనుకుంది కార్తి'

"ఇది యిక్కడికి ఎలావచ్చిందబ్బా?" ఆలోచనగా అన్నాడు ఆనంద్'

"నేను చెబుతాను బాబుగారూ' ఎవడో దొంగ వెధవ రాత్రి మన ఇంటికి దొంగతనం కోసం వచ్చివుంటాడు' అంతకు ముందు ఎక్కడో దొంగిలించివుంటాడు' మన ఇంటిదగ్గర వాడికి వీలు దొరక్క వెళ్ళిపొయ్యివుంటాడు' ఈ సూట్‌కేసని యిక్కడ మర్చిపొయ్యివుంటాడు రహస్యాన్ని శోధించినట్టు గర్వంగా చూసింది రంగమ్మ'

అంతా తను చూసినట్టే చెబుతుంటే ఒళ్ళు మండింది కార్తికి'

ఆనంద్ ఆలోచనగా చూశాడు!

'అయివుంటుంది .. అయివుంటుంది' రామూ తోటమాలీ వంత పాడారు'

సుచిత్ర రంగమ్మని బలపరిచింది అవునండీ' రంగమ్మ మాట నిజమే అయివుండవచ్చు రాత్రి బేబీ నిద్ర పట్టలేదని పన్నెండు గంటలప్పుడు లేచి వచ్చి బయట నిలబడిందట' బహుశ దాన్ని చూసి పారిపోయి వుంటాడు ఆ దొంగ వెధవ' అందుకే నేను చెబుతూ వుంటాను దీనికి ఎంత రాత్రి వేళ బడితే అంత రాత్రివేళ ఒంటరిగా బయటకు రాకే తల్లీ అని' దీనికి లెక్కా పత్రమా?" కూతురివైపు కోపంగా చూసింది

సరే దీన్ని పోలీస్ స్టేషన్‌లో అప్పగించి రిపోర్టు చేద్దాం, ఎందుకైనా మంచిది.. అక్కడినుండి కదులుతూ అన్నాడు ఆనంద్

అంతే .. అంతే' అన్నారంతా'

కార్తి గుండె ఝల్లుమంది ఈ విషయం పోలీసుల దాకా వెళితే ఇంకేమైనా వుందా?

"ఫ్యాక్టరీకి వెళ్ళేటప్పుడు రిపోర్టు చేద్దాం' గుర్తు చెయ్యి బాబూ .' అంటూ లోపలికి వెళ్ళిపోయాడు ఆనంద్'

అమ్మో ఎంత ప్రమాదం తప్పింది?' అంటున్నారు పనివాళ్ళంతా'

ఎవరిదై వుంటుంది ఆ సూట్‌కేస్? రమేష్ శాకరదయి వుంటుందా? అక్కడే నిలబడి ఆలోచిస్తున్న కార్తిని పిలిచాడు సతీష్ "

మీ జి.కె. ఎంత? (4)

1. శ్రీలంకలో సైనిక వందనం స్వీకరిస్తున్నప్పుడు రాజీవ్‌గాంధీపై హత్యా ప్రయత్నం చేసిన శ్రీలంక సైనికుడి పేరేమిటి?
2. లతామంగేష్కర్, మురార్జీదేశాయి, సునీల్ గవాస్కర్, రామ్‌విలాస్ పాశ్వన్. ఈ నలుగురు భారతీయులకు గల 'ప్రత్యేకత' ఏమిటి?
3. భారతదేశంలోనే కాకుండా ప్రపంచంలో వేరొక దేశంలో కూడా 'కొచ్చిన్' అనే ప్రదేశం ఉంది. ఏ దేశంలో?
4. ఎవరెస్ట్ పర్వతాన్ని టిబెట్‌లో ఏ పేరుతో పిలుస్తారు?
5. "జాతీయ పతాక దినోత్సవం" ఎప్పుడు జరుపుకొంటాము?
6. టి. వి. సీరియల్ 'మహాభారత్' సంగీత దర్శకుడు ఎవరు?
7. రోదసీలో ప్రవేశించిన మొట్టమొదటి అమెరికన్ మహిళ ఎవరు?
8. చండీఘడ్‌లోని 'రాక్ గార్డెన్స్' (ఆర్కిటెక్ట్) రూపకల్పన చేసినదెవరు?
9. 'బాబర్' చక్రవర్తి అసలు పేరేమిటి?
10. అంతరిక్షంలో నడిచిన మొట్టమొదటి వ్యక్తి ఎవరు?

జె. కె.

(జవాబులు ఈ సంచికలోనే....)

ఈత కొడ్తూ రేడియో వినండి!



మనుషులు నిరంతరం ఆహ్లాదకరమైన వాటిని అనుభవిస్తూ ఉండాలని అనుకుంటారు 1979 లో సోని కంపెనీ నడుస్తూ వినగలిగిన వాక్‌మన్ ఆడియో ప్లేయర్‌ను తయారు చేసినప్పుడు ప్రజలు ట్రాఫిక్ శబ్దాల కన్న ఎక్కువగా సంగీతాన్నే వినదలచుకుంటారని తేలింది ఇప్పుడు ఇంకా ఎక్కువగా పనిలో ఉంటూ కూడ సంగీతాన్ని వినదలచుకున్న వారి కోసం ఒక సాధనం తయారయింది అది నీటిలో ఈదుతూ వినగలిగిన రేడియో

ఈ రేడియోను డి బ్యాండ్ అని పిలుస్తున్నారు ఇది నీటిలో తడిసినా చెడిపోని ఎఫ్ ఎమ్ రేడియో దాన్ని ఒక సాగగల తలపట్టీకి అతికించి ఉంచుతారు కనెక్టికట్‌లోని స్టామ్‌ఫర్డ్‌కు చెందిన మార్క్ ఓబ్రైన్ అనే ఒక చిన్న ప్రైవేట్ సంస్థ ఈ రేడియోను తయారు చేసింది ఈ సాధనాన్ని కనిపెట్టిన ఆండ్రూ మార్క్స్ మాటల్లో నీటి లోపల సంగీతం వినడం బలే చిత్రంగా, సుఖంగా ఉంటుంది

మూడు వోల్టుల బాటరీతో నడిచే ఈ సాధనాన్ని పూర్తిగా ప్లాస్టిక్ తొడుగులో నిర్మించారు అందువల్ల దానిలోకి నీరు వెళ్లే అవకాశం లేదు దానికి రెండు స్పీకర్లు ఉంటాయి ఆ స్పీకర్లను చెవులకు తగిలించుకున్నప్పుడు అక్కడ కూడ నీరు చొరబడే అవకాశం ఉండదు అయితే ఒక్క అసౌకర్యమేమంటే రేడియో సరిగ్గా మెడ మీదికి వస్తుంది, గనుక కావలసిన స్టేషన్‌కు తిప్పుకోవాలంటే చెయ్యి వెనక్కి తిప్పి తిప్పుకోవాలి ఈ రేడియో మామూలు నీటిలోనైతే పది అడుగుల వరకు బాగానే పని చేస్తుంది ఉప్పునీళ్ళ లోపల మాత్రం పని చేయదు ●

కారణ్నా ' అంకుల్ ఫోన్ చేశారు

' ఈమాట వినగానే చెంగున లేడిలా లోపలికి పరుగెత్తింది కార్తి ఆనంద్ మాట్లాడుతున్నాడు' తండ్రి చేతిలోని రిసీవర్ అందుకుంటూ 'హలో అంకుల్' గుడ్ మార్నింగ్ అందిఉత్సాహంగా,

హాయ్ బేబీ వెరీ హేపీ మార్నింగ్ హౌఆర్‌యూ?

డామ్ ఫైన్ అంకుల్ ' అంది హుషారుగా' హటాత్తుగా చెప్పకుండా వెళ్లిపోయారేమిటి? ఎప్పుడొచ్చారు అడిగింది

అర్జంటు పనిబడి వెళ్లాల్సి వచ్చిందిలే' రాత్రే తిరిగి వచ్చేశాను అవునూ డాడీమీద అలిగావుట ప్రొద్దున్నే ఏమిటి విషయం అడిగాడు చైతన్య'

తండ్రి వైపు కోపంగా చూసింది కార్తి

చూడంకుల్' నేను ఆడపిల్లని అందులో పెద్దదాన్ని అయ్యానని నువ్వేగా చెప్పావ్? దానికి తోడు బయట తిరిగేదాన్నయ్యే ' రివాల్వర్ దగ్గరుంటే ఎందుకైనా మంచిదని ఆయన రివాల్వర్ తీసి పెట్టుకున్నాను' అది చూసి మమ్మీ రాద్ధాంతం చేసి డాడీచేత తిట్టించింది కోపంగా చెప్పింది

"బేబీ నీకు రివాల్వర్ కావాలంటే నీకు లైసెన్స్‌తో సహా నేను తెచ్చిస్తాను అయితే ఇప్పుడే కాదు' ముందు నువ్వు షూటింగ్ ప్రాక్టీస్ చెయ్యాలిమరి

ష్యూర్ అంకుల్' థాంక్యూ, డాడీ మీద మీరు నయం ' అంటూన్న కూతురిని చూసి నవ్వాడు ఆనంద్

' బేబీ ఇంటికి వస్తావా ?

'ఓ' ఇప్పుడేనా అంకుల్ ?

' ఏం? ఏదయినా పనుందా ఇప్పుడు ?

లేదనుకో నసిగింది కార్తి' మరో అరగంటలో రజియాకి ఫోన్‌చేసి రెడ్ సూట్‌కేసు విషయం తెలుసుకోవాలి మళ్లీ రంగంలోకి దిగాలి'

"అయితే లంచ్‌కి వచ్చెయ్ '

'ఒకె' థాంక్స్ అంకుల్ రిసీవర్ క్రెడిల్ చేసి వెను తిరిగింది

ఆనంద్ అడిగాడు బేబీ ఏవో కొత్త బుక్స్ వచ్చాయన్నావుగా" తెచ్చుకుంటావా? డబ్బు ఇవ్వనా?

నో థాంక్స్ కోపంగా వెళ్లిపోయింది అక్కడి నుండి కార్తి'

ఆనంద్ నవ్వుకున్నాడు అతడికి కూతురిపట్ల పంచప్రాణాలు ' చాలా చిన్న వయసులోనే తల్లి దండ్రుల నెదిరించి సుమిత్రని వివాహం చేసుకున్నాడు తను అప్పటికి సుమిత్రకి పదహారు పదిహేడేళ్లు వుంటాయేమో? పెళ్ళయిన ఏడాదికే కార్తి పుట్టింది ఇప్పుడు సుమిత్రకి ముప్పది నాలుగేళ్ళ వయసు అయితే ఆనంద్‌కి ముప్పది తొమ్మిది మాత్రమే కార్తి తర్వాత వారికి సంతానం లేదు ఒక్క మగసంతానం కోసం సుమిత్ర మొక్కని మొక్కూ లేదు, చెయ్యని పూజా లేదు చివరికి విసుగెత్తి వూరుకుంది

మన కార్తి లక్షమంది మగ పిల్లలకి సమానం సుమిత్రా ' అని బార్యని ఓదారుస్తుంటాడతను

' అందుకేనండీ నాకు భయం ' అంటుంది సుమిత్ర

ఆ విధంగా తమ ప్రాణాలన్నీ కార్తిమీద పెట్టుకుని బ్రతుకుతున్న వారికి ఆమె ఏ దుడుకు పని చేసినా ప్రాణాలు బయంతో విలవిల్లాడిపోతాయి సుమిత్ర కయితే మరీను' అందుకే పొద్దున భర్త రివాల్వర్ కూతురి గదిలో చూసి అంత గొడవ చేసిందామె

రజియాకి చెప్పిన గంట టైమ్ పూర్తయిన ఒక్క నిముషానికి ఆమెకి ఫోన్ చేసింది కార్తి' అవతల రెడీగా వున్నట్లు పలికింది రజియా

సారీ ఫ్రెండ్' అక్కడున్న పోలీసుల్ని బురిడీ కొట్టించి రమేష్ ఇంట్లోకి వెళ్లాను అతని తండ్రి వాళ్లు వచ్చివున్నారక్కడ అతని వంటవాడు ఈ ఉదయమే బయపడి పారిపోయాడటలే' వాడి మనవరాలు పేరు పెట్టుకునైతే ఆ ఇంట్లో ప్రవేశించగలిగాను గాని బాడ్‌లక్ నువ్వు చెప్పిన ఆ సూట్‌కేస్ పట్టుకురాలేకపోయాను ఎందుకనో తెలుసా' పారిపోయిన వంటవాడిపట ఆ ట్రంకుపెట్టెలు' పోలీసుల కళ్లుగప్పి ఈ ఉదయాన్నే పారిపోయాడట నిరాశగా చెప్పింది రజియా

గుండె ఆగినంత పనయింది కార్తికి ఆ మాట వింటూ వుంటే'

"ఎక్కడికి వెళ్లి వుంటాడట వాడు? ఏ వూరట వాడిది? ఆ వివరాలన్నీ కనుక్కున్నావా?

'ఊహూ ఎవరికీ తెలీదు ఈ హత్యకీ వాడికీ ఏదయినా సంబంధం వుందా అని ఆలోచిస్తున్నారట పోలీసులు' అని చెప్పింది రజియా

సరే' పెట్టేస్తున్నాను

పోనీ మరి నాకు పార్టీ ఇవ్వనక్కరలేదు కార్తికంటే నేను గొప్ప ధైర్యవంతురాల్ని అని ఒప్పుకుంటావా " అడిగింది రజియా'

'ష్యూర్' అందుకు ఎలాంటి సందేహమూ లేదు నిస్సందేహంగా కార్తి కంటే నువ్వే గొప్ప యు ఆర్ ఏ గ్రేట్ గర్ల్' నీ సాహసానికి మెచ్చి నేను పోస్టులో నీకు పంపుతున్న గిఫ్ట్ రేపు అందుతుంది నీకు సరేనా !

' రియల్లీ ? నమ్మలేనట్లు అడిగింది రజియా.

'యస్ . రియల్లీ '

ఇంతకీ నువ్వెవరు?

అది రహస్యం ' ఉంటాను '

ఎప్పుడేదైనా అవసరం వస్తే ఫోన్ చెయ్యి' గొప్పగా అంది రజియా'

ష్యూర్ తప్పకుండా చేస్తాను బై. " అంటూ ఫోన్‌పెట్టేసింది

ఓ గాడ్' ఇప్పుడేం చెయ్యాలి తను? పారిపోయిన ఆ వంటవాడి కోసం ఎక్కడని వెతకాలి? బహుశ వాడు భయపడి పారిపోయి వుంటాడు ఎలా వాణ్ని వెతకటం? ఆలోచనల్లో పడిపోయిన కార్తికి వీదిలోనుండి పెద్దగా ఏదో మోటారు వాహనాల చప్పుడు వినిపించింది

(ఇంకా వుంది)

ప్రజా జీవన వాహినిలో ప్రభంజనమై వారి హృదయాలను రమ్య రస లోకాలకు తీసుకు వెళ్ళి ఉలిచప్పుళ్ళే ఉచ్ఛ్వాస నిశ్వాసలుగా చేసికొని భారతీయుడి భావ పటిమను ఖండాంతరాలలోని ప్రజల హృదయాంతరాలలో చిలకరించి వారి ఎదల్లో రసా విర్భావానికి పాటుపడిన శిల్పకళా వైభవం మళ్ళీ కనిపించదా? రాజదర్బారుల్లో రాణివాసాల్లో రంగస్థల పునాదుల్లో కరిగించిన ఉలి ఊసులు ఇక వినలేమా? ఉలులనే తమ చెలులుగా చేసికొని కళాతపోవనంలో ప్రతీకృత యజ్ఞాన్ని నిర్వహించిన శిల్పాచార్యులు ఇక ఉద్భవించరా? రసజ్ఞుల ఎదల్లో ఝుంఝూ మారుతంలా నవరసాల ప్రభంజనాన్ని సృష్టించిన కమనీయ శిల్ప కళలు నేడు కలలుగానే మిగిలిపోవాలా? అందమైన శిల్పాలనూ అక్కడక్కడ చూస్తుంటే మనకు కలిగే సందేహాలివే నిజానికి



శాస్త్రీయంగా, సంప్రదాయబద్ధంగా చెక్కడం గమనార్హం ముఖ్యంగా తరతరాల నుండి వస్తున్న సంప్రదాయం వల్ల వీరు శిల్పాలు చెక్కుతున్నారు మరియు వీరు 'కాశ్యప శిల్పశాస్త్ర పద్ధతులలో బండరాళ్ళలో ప్రాణప్రతిష్ఠ చేస్తున్నారు ఈ శాస్త్రములోని శ్లోకాల ఆధారంగా, ఆ సంస్కృత శ్లోకాలలో వర్ణించిన క్రమాన్ననుసరించి శిల్పాలను చెక్కుతున్నారు శ్రీ గణపత స్థపతి విరచించిన 'రూపధ్యాన రత్నావళి కూడా వీరికి శిల్పాలను చెక్కడంలో ఉపయోగపడుతూ వస్తున్నది

శ్రీరూపధ్యాన రత్నావళి గ్రంథంలో దేవాదాయ ధర్మాదాయశాఖ అధ్వర్యంలో గల 30,000ల దేవాలయాలలో గల శిల్పాల ననుసరించి మరియు ఇతర సంస్కృత శ్లోకాల నాధారంగా చేసికొని దాదాపు 450 రేఖాచిత్రాలు పొందుపరచ బడ్డాయి

'రాముడు మోపిన పాదంలో రసమయ శిల్పకళావేదం'

కొన్ని శతాబ్దాల పూర్వము మన ఆంధ్రదేశము శిల్పకళావైభవాన్ని సంతరించుకొని దేదీప్యమానంగా వెలిగిందే! కాని పోనుపోనూ ఆధునిక జ్ఞానసంపదల మబ్బు తెరల మాటున ప్రాచీన కళల ప్రాచుర్యము అంతరించి పోతుంది ఒకప్పుడు మనప్రాంతంలో ఉన్న శిల్పకళా నిర్మాణ కేంద్రాలు ఇప్పుడు లేవు ఏవో కొన్ని కుటుంబాలు వంశపారంపర్యంగా వస్తున్న వృత్తిని కాదనలేక ఆ కళను ఇంకా సజీవంగా ఉంచుతున్నారు అలాంటి ప్రదేశాలలో తెలంగాణా ప్రాంతంలోని రామడుగు ముఖ్యమైనది కరీంనగర్‌కు దాదాపు 21 కి మి ల దూరంలో ఈ గ్రామం నెలకొని ఉంది. కొన్ని



తరాలనుండి వస్తున్న శిల్పుల కుటుంబాల సంఖ్య తగ్గి చివరికి నేడు 60 కుటుంబాలు ఈ శిల్పకళకే అంకితమై దానికి జీవం పోస్తున్నారు

రామడుగు చరిత్ర

రామడుగు గ్రామానికి ఈ పేరు రావడానికి గల కారణాన్ని శ్రీరాముడు దండకారణ్యంలో సంచరించినపుడు తన ఎడమ పాదాన్ని (అడుగు) ఈ ప్రదేశంలో మోపాడు కాబట్టి దీనికి 'రామడుగు అనే పేరొచ్చిందని స్థానికులు చెబుతుంటారు ఇప్పటికీ స్థానిక గుట్టవద్ద గల ఒక రాయిపై ఆ నాటి శిల్పులు కడురమణీయంగా చెక్కిన శ్రీరామ పట్టాభిషేకం పట్టం పలువుర్ని ఆకట్టుకుంటుంది ఇలాంటి ఘనమైన చరిత్రను కలిగి రామపాద ధూళిచే పావనమైన ఈ ప్రదేశం కొన్ని వేల బండరాళ్ళకు ప్రాణాన్ని పోసింది ఈ ప్రదేశంలోని శిల్పులకు ఇప్పుడున్న ఆధారాలనుబట్టి 700 సం ల చరిత్ర ఉన్నట్టు స్పష్టమౌతుంది ఇంతటి పురాతన కళ నేడుకూడా అంతరించి పోకుండా ఉండడం మన అదృష్టమే ఈ నాటి ఈ నవనాగరిక యుగంలో చిన్న చిన్న కొలతలకి ఇతర చిన్న విషయాలకి కూడా యంత్రాల సహాయాన్ని అర్థించే మనం ఏ పరికరాన్ని కూడా ఉపయోగించకుండా ఓ నిర్దుష్ట క్రమాల్లో తమ ఉలులను ఉరికించే విధము ఆధునిక మానవుడ్ని ఆశ్చర్య చకితుల్ని చేయక మానదు

బండరాళ్ళకు చిరాయువు :


రామడుగులోని శిల్పులు తమ శిల్పాలను ఈ పుస్తకం కొత్తగా నేర్చుకోవాలని ఉబలాటపడే యువ శిల్పులకో వరంలాంటిది శిల్పాన్ని చెక్కే శిల్పులందరూ శుచిగా శుభ్రంగా ఎంతో నియమ నిష్ఠలతో తమ దీక్షను కొనసాగిస్తుంటారు శిల్పాన్ని చెక్కేముందు స్కెచ్ కూడా వేసికోకుండా చెక్కడం వీరిలో విశేషం శిల్పానికి కావలసిన రాయిని ఇక్కడి సమీపంలోని పెగడపల్లి గ్రామానికి అనుకొని ఉన్న వెంగళాయపేట నుండి సేకరించుకుంటారు శిల్పం చెక్కడానికి బాలశిల లేదా అమృతశిల అనే ప్రత్యేక రాయిని మాత్రమే వీరు ఎంచుకుంటారు ఒక్కొక్క శిల్ప నిర్మాణానికి రెండు వారాల నుండి 8 వారాల వరకు దాని పరిమాణాన్ననుసరించి కాలం పడుతుంది

శిల్పాన్ని వివిధ పద్ధతుల ద్వారా పూర్తి చేసి అవసరమైన వాటికి ఎనామిల్ పెయింట్‌ను కూడా వాడుతారు అహోరాత్రులు ఇలా శ్రమించి సృష్టించిన ఆ కళాఖండాలలో ప్రమాదవశాత్తు ఏదైనా భాగం విరిగిపోతే అంతవరకూ చేసిన కృషి మట్టిలో కలిసిపోవలసిందే ఇంత ప్రసిద్ధి చెందిన ఈ కేంద్రం నుండి శిల్పాలను ఆంధ్రప్రదేశ్ లోని పలు ప్రాంతాలకు సరఫరా చేస్తారు కొన్ని సందర్భాల్లో శిల్పులే స్వయంగా కావలసిన ప్రాంతాలకు వెళ్ళి అక్కడ శిల్పనిర్మాణం కొనసాగిస్తారు మరియు కొన్ని అంతర్రాష్ట్ర దేవాలయాలకు కూడా వీరు శిల్పాలను వారి వారి కోరికమేరకు పంపుతుంటారు మరియు గతంలో చాలాసార్లు హైదరాబాద్‌లోని పారిశ్రామిక ప్రదర్శనలో వీరి శిల్పాలను ఉంచడం ముదావహం

–కావేరి కరుణాకర్

ఆంధ్రసచిత్రవారపత్రిక

హ హ్హ హ్హా!!



హ హ్హ హ్హా!!

గెలవండి రు. 3200 లు!

హాస్య నవలికల పోటీ!

వర్తమాన సంఘం మీద కలం దూసి వ్యంగ్య రచనలు చేసే వారికి, రాజకీయ అవగాహన– సామాజిక స్పృహ వున్న చతుర కలం జీవులకి యిదే సవాల్!
40, 45 పేజీలు– పేజీకి 20 నుంచి 25 పంక్తులకు మించకుండా ఒక హాస్య చతుర సామాజిక నవలికను రాసి పోటీకి పంపండి! (వెకిలి రచనలు వద్దు సుమా!) మంచి యితివృత్తం ఎన్నుకోండి!

మొదటి బహుమతి	రు. 1500.00
రెండో బహుమతి	రు. 1000.00
మూడో బహుమతి	రు. 700.00

షరా మామూలే :

- ★ కాపీ కొట్టకూడదు– ప్రచురణ ప్రసారం అయిన వాటిని పంపకూడదు: సంపాదకుని నిర్ణయానికి, కట్టుబడి వుండాలి!
- ★ నిడివి ఎక్కువైనా చిక్కే.... తక్కువైనా యిబ్బందే...
- ★ రచయిత్రులు, రచయితలు అంతా పాల్గొనాలి! హామీ పత్రం జత చేయాలి. లావాదేవీలు వస్తే బాధ్యత వహించాలి!
- ★ రచనలు తిరస్కరింపబడితే త్రిప్పి పంపబడాలని కోరుకునేవారు– తగినన్ని తపాలా బిళ్ళలు అంటించిన– సొంత చిరునామాగల (చాలినంత) కవరుని పంపించాలి! లేదా ఆ వ్రాత ప్రతులు మరి దొరకవ్!

పోటీకి పంపే కథలని సంపాదకుడు, ఆంధ్ర సచిత్ర వారపత్రిక,
గాంధీనగరం, విజయవాడ – 520003" అనే చిరునామాకి పంపాలి.

–సం

గడువు తేదీ ఫిబ్రవరి 27, 1989 దాకా!

పెద్దకథ

చచ్చి ఏం సాధిస్తావ్? – కొమ్మిడి మత్స్యేంద్రరెడ్డి

లావణ్య వెళ్ళినాక – మళ్ళి ఆయన మస్తిష్కంలో ఆలోచనలు ముసురుకున్నయి

నిజమే! ఆర్థిక బలంవుంటే ఈ సమాజంతో పోరాడవచ్చు తమ నిర్ణయాలను నిర్భయంగా అమలుచేయవచ్చు అవి తప్పుగానీ – ఒప్పుకానీ

అలా కాకుండా –

పెళ్ళే ముఖ్యమని అనుకుంటే – తన కూతురుకు ఒక మగతోడు తప్పకుండా అవసరమని భావిస్తే అందుకు కూడా పరిష్కారం కనిపిస్తుంది

తమకన్నా దిగువస్థాయిలో వున్న ఒక కార్మికుడికో – ఉద్యోగం లేక చిన్నచిన్న వ్యాపారాలు చేసుకునేవాడికో – చిరు ఉద్యోగం చేసుకుంటున్న ఒక అవిటివాడికో – అందుడికో – కురూపికో –

(గత సంచిక తరువాయి)

ఎవరికయినా యిచ్చి తన కూతురి పెళ్ళి అతి ఘనంగా చేయవచ్చు వాళ్ళవాళ్ళ పరిధుల్లో వాళ్ళు సుఖంగానే బ్రతకడం తను చూస్తున్నాడు

తిండి – బట్టా తప్ప తన కుటుంబంమాత్రం యింకేం అనుభవించిందని?

మరి తనలా చేయగలడా? అమ్మాయిలూ – అనసూయా ఒప్పుకుంటారా? అసలు తామేకాదు – ఈ లోకంలోని ఏ తలి దండ్రులయినా అందుకు సిద్ధపడ్తారా? సమాజం మాత్రం అందుకు హర్షించి – సహకరిస్తుందా?

అన్ని విషయాలూ అటుంచి తను మాత్రం అందుకు సిద్ధమా? వున్నదంతా యిచ్చేసి – ఆ తర్వాత ఏమయిపోయినా సరే అనుకోవటం లేదా!

చివరికి తన ప్రాణాలనుసైతం పణంగా పెట్టడంలేదా!

అప్పుడు– సమాధానాల్లేని ఆ ప్రశ్నలు వుదయించిన తర్వాత మాస్టారు పెదాలపైన అప్రయత్నంగానే ఒక చిరునవ్వు కదులాడింది

అవును!

అదే పరిష్కారం!

వరకట్న సమస్యకు వున్న ఒకేఒక పరిష్కారమిది!

అది జరక్కపోతే – వీలుకాకపోతే ఇంతే!

ఇలా జరగవలసిందే!

అప్పుడప్పుడే ఎండ చల్లబడుతున్నది. సాయంత్రం పరుగెత్తుకు వస్తుంది

పాఠాలు చెప్పటం దాదాపు పూర్తి కావస్తున్న



తరుణంలో వెదురు కర్రలతో చేసిన గేటును **తీసుకొని వాకిట్లోకి వచ్చాడు మధుబాబు**

ఆ వూళ్ళోని మోతుబరి రాజయ్యగారి ఏకైక కుమారుడు మధుబాబు. మాస్టారు వద్ద ఓనమాలు దిద్దుకుని- విద్యాబీజం నాటుకున్న **అతడు** వైద్య విద్య పూర్తి చేసాడు పట్నంలోని ప్రభుత్వాసుపత్రిలో వుద్యోగం చేస్తున్నాడు నిండయిన వ్యక్తిత్వాన్ని- పరిపూర్ణమైన సంస్కారాన్ని పుణికిపుచ్చుకున్న మాస్టారి కుటుంబమంటే **అతడికి** మొదటి నుండి **అపరిమితమయిన** భక్తిప్రపృత్తులు- వూళ్ళో వున్నన్నాళ్ళూ రోజూ రెండు గంటలపాటు మాస్టారుతో గడపటం **అతడి అలవాటు.**

పిల్లల్ని పంపించి వేసి సాదరంగా **ఆహ్వానించాడు** మాస్టారు. కుశల ప్రశ్నలవుతూంటే కాఫీ **తీసుకుని** వచ్చింది లావణ్య

"- బాగున్నావా లావణ్యా ..." గ్లాసందుకుంటూ **అడిగాడు చిరునవ్వుతో**

"వూఁ ." **అంటూ తలాడించింది, అక్కడే** ఓ పక్కన కూర్చుంటూ

చిన్నప్పటి నుండీ పరిచయమున్నందు వలన వారి మధ్య బిడియాలు లేవు. చెప్పుకోదగ్గంత చనువు లేకపోయినా ఎదురెదురుగా కూర్చుని మాట్లాడుకునే సాన్నిహిత్యముంది

"**ఈ** మధ్య ఏమయినా కొత్త పుస్తకాలు చదివావా.. ?" మళ్ళీ మధుబాబే సంభాషణ కొనసాగించాడు.

"ఏదీ " **అంటూ** స్నిగ్ధంగా నవ్వింది లావణ్య- నాన్నగారి చిన్న లైబ్రరీలోని **అన్నీ** చదివేసాను. " **అంటూ.**

"**ఈ**సారి వచ్చినప్పుడు చలం సాహిత్యం పట్టుకు వస్తాను మీ లైబ్రరీ కోసం.. " మాస్టారి వంక చూస్తూ చెప్పాడు.

ఆ మాటలకు **తనూ** చిన్నగా నవ్వాడు మాస్టారు

సంభాషణ క్రమంగా పెళ్ళిళ్ళ వైపు **తిరిగింది.**

"ఏమో బాబూ **ఈ** వరకట్నాల సమస్య **ఈ** మధ్య మరీ ఎక్కువయిపోయినట్లనిపిస్తుంది **ఆడపిల్లల తండ్రి**నని కాదు కాని- ఒక్కొక్కసారి **అనిపిస్తుంటుంది** మన సమాజం ఎటు పోతుందా **అని!**"

"మనుషులు- **అంటే యువతీ యువకులే** కాదండీ గత **తరం** వాళ్ళు కూడా మారాలి **అప్పుడు** కాని **ఈ** సమస్య కొంతవరకు **తీరదు.**" **అంటున్న** మధుబాబు వైపు మెచ్చుకోలుగా చూసాడు మాస్టారు

లావణ్య మాత్రం **ఆ** సంభాషణలో **తలదూర్చలేదు.**

మామిడి చెట్టు వద్దనున్న కలుగులోంచి బయటకు వచ్చి **అటు**- యిటు చకచకా పరుగులు **తీస్తున్న** ఒక చిట్టెలుకను గమనిస్తూ నిశ్శబ్దంగా వుండిపోయింది.

"ఏం లావణ్యా! మౌనంగా వుండిపోయావ్!" **అన్న**

పాఠకులకో సవాల్!

6

టిట్ ఫర్ టాట్!

నోట్లు... వోట్లు... లేదా పోట్లు... ఇంతేగా ప్రజాస్వామ్యం!

ఇది ఓ వాగ్బాణం అనుకోండి దీన్ని మరో వాగ్బాణంతో మీరు ఉపసంహరించాలి- ఆ "రిపార్టీ" గుచ్చుకోవాలేగాని బాధించకూడదు. రసభరితంగా వుండాలేగాని అశ్లీలం కొట్ట వచ్చినట్లుండరాదు... కార్డు మీద మాత్రం రాయాలి. ఈ వాక్యం పైన రాసి మీ ప్రతి వాక్యం దాని క్రింద రాయండి. మీ పూర్తి చిరునామా ముఖ్యం. ప్రచురించిన రెంటికి రు. 25, రు. 15 చొప్పున బహుమతి వుంటుంది!- ఈ విషయంలో సంపాదకునిదే తుది నిర్ణయం. సంచిక విడుదలైన వారంలోగా పంపాలి.మర్చిపోకండి. –సం.

చాలా మంది వెంటనే "రిపార్టీ"ల వర్షం కురిపించారు. కొన్ని మాత్రం ఎంపిక చేసి వేస్తున్నాం. బహుమతులు పొందిన రెండూకాక- మరికొన్ని యిక్కడ వేశాము. తతిమ్మా వారి "వాగ్బాణాలు" స్థలాభావం చేత వేయలేకపోయాం. లాటరీ తీసి కొందరి పేర్లు మాత్రం వేస్తున్నాం! ఒకసారి బహుమతి రాలేదని నిరుత్సాహం పడక మళ్ళీ ప్రయత్నించండి!

"ఏంపమన్నావా? ఏం [illegible]! మరపు తగిలి! తెలుగుగంగ[illegible]!"

★ రు. 25 బహుమతి పొందిన రిపార్టీ:

"ఒక్క నిముషం స్వామీ! కాస్త ఈ పువ్వుని నా చెవిలో పెట్టుకుంటాను". –నవీన్‌కుమార్, (ధర్మవరం)

★ రు. 15 బహుమతి పొందిన రిపార్టీ:

"అవేమీ వద్దుకాని, ఓ గ్లాసుడు మంచినీళ్ళు చూడు బ్రదర్!" –వై. రాజ్‌కుమార్ (అనపర్తి)

మరికొన్ని వాగ్బాణాలు

"తొందరేముంది?.... ఇప్పుడప్పుడే ఎన్నికలేమీ లేవుగా?!"

–ఆర్ వీరరాఘవులు,(సూళ్ళూరుపేట)

"చాల్లే! కోతలు, దమ్ము వుంటే కట్నంలేకుండా పెళ్ళిచేసుకో!"

–కె జనార్దన్, వేమూరు

"సూర్యుణ్ణి ట్రై చేయకూడదూ? వెరైటీగా వుంటుంది". –శ్రీనివాసరాజు, గుడ్లవల్లేరు

లక్కీ పేర్లు:

జి. లలితా కిరణ్మయి (రామవరప్పాడు), టి. రాజగోపాల్ (రాజమండ్రి), కె. వెంకటరమణ (పినపళ్ళ), కె. ఎస్. యాదవ్, (రామచంద్రపురం), ఇ. అహల్య (మచిలీపట్నం), డి. శారద (విశాఖపట్టణం), వి రామారావు (అనపర్తి), జి రమేష్‌బాబు (ప్రత్తిపాడు), బి. నారాయణరెడ్డి (అనంతపురం), వి భారతి (అమలాపురం), బి చిన్నకేశవులు (సుండిపెంట), సురేష్ (నెల్లూరు), సి వి. నరసింహదాసు (విజయనగరం), డి లక్ష్మి (తోగుమ్మి), జి శ్రీనివాసరావు (శ్రీకాకుళం), ఎ ఖలీల్ (చిన ఓగిరాల), సి హెచ్ సత్యనారాయణ (పాలకొల్లు), కె ఎ నమ్మి (పెనుగొండ), ఎస్ ఆనందరావు (ద్రోణాచలం)



ప్రమాణం

"నీప్రేమ కోసం నేనేం చేయాలి పద్మా?" పద్మను ఆవేశంగా అడిగాడు శ్రీనివాసులు.

"పుట్టబోయే నా బిడ్డకు తండ్రిగా ఉంటానని ప్రమాణం చేయాలి శ్రీనూ" అంది పద్మ.

—పద్మశ్రీ

ఇలాంటి జోక్స్ మీరూ పంపవచ్చు సం

మధుబాబు మాటలకు మరొక్కసారి మందహాసం చేసింది ఆమె "ఏం మాట్లాడను?" అన్నట్లుగా

"ఏదయినా సరే! మాట్లాడు " బలవంతం చేస్తున్నట్లుగా అంటున్న అతడి వైపే తదేకంగా చూస్తున్న మాస్టారు మస్తిష్కంలో ఒక మెరుపు తళుక్కువ మెరిసింది

అవునూ... ఇది సాధ్యమా?

ఎందుక్కాదు!

చిన్నప్పటి నుండి చూస్తున్నాడు తనేమిటో - తన కుటుంబ పరిస్థితి ఏమిటో క్షుణ్ణంగా తెలిసినవాడు

తన పరిస్థితిని- బాధ్యతలను పూర్తిగా ఆకళింపు చేసుకున్నవాడు

విద్యాధికుడు వుత్తముడు

వరకట్న దురాచారం సమసిపోవాలంటే మానవుడు మారాలని ఆశిస్తున్నవాడు ఒప్పుకోడా?

తన బిడ్డకేం తక్కువయిందని? సంపద తప్ప లావణ్యకేం లోపించిందని-?

తప్పకుండా ఒప్పుకుంటాడు

ఆలోచిస్తున్న కొద్దీ అతడిలో ఒక నిర్ణయం బలంగా రూపుదిద్దుకోసాగింది

★ ★ ★

పడక్కుర్చీలో కూర్చుని తాపీగా చుట్ట వెలిగించుకోబోతున్న రాజయ్య, శాస్త్రులను చూస్తూనే అగ్గిపుల్లను ఆర్పేసి నోటి నిండా నవ్వుతూ ఆహ్వానించాడు "రండి రండి !" అంటూ

కుశల ప్రశ్నలు- పూర్వోని విషయాలు- అవీ- యివీ అయిన తర్వాత నెమ్మదిగా విషయం కదిపాడు శాస్త్రులు.

"మన మాస్టారు గురించి మీకు తెలుసు కదా! కూతురు పెళ్ళి కోసం అహర్నిశలూ ఆరాటపడుతున్నాడు ఆ మధ్య ఆరోగ్యం కూడా అంతంత మాత్రంగానే వుంది. "

ఆ మాటలు వింటూనే ముఖం చిట్లించిన రాజయ్య ఆ వుపోద్ఘాతం దేనికి నాందో వూహించాలని ప్రయత్నిస్తున్నాడు

"రోజు రోజుకూ రాజయ్యగారూ మనిషి మంచితనానికి- గుణగణాలకు విలువ లేకుండా పోతున్నది అంతా డబ్బు మయం అయిందంటే నమ్మండి " అంటూ మళ్ళీ ప్రారంభించాడు శాస్త్రులు. "కాస్త స్థితిమంతులు- చదువుకున్న సంస్కారవంతులైనా మానవ దృష్టితో ఆలోచిస్తే తప్ప ఈ జాతికి మనుగడ లేదనిపిస్తోందండీ "

"ఇంతకీ అసలు విషయం చెప్పండి నేనేమీ అనుకోను " నవ్వుతూ అన్న రాజయ్యను చూసిన తర్వాత కాస్త ధైర్యం వచ్చింది శాస్త్రులుకు

"అదేనండీ! మన మాస్టారుగారి పెద్దమ్మాయి లావణ్య లేదూ ఈ మధ్య చూసారో లేదో ముమ్మూర్తులా అపరంజి బొమ్మే అనుకోండి! చూసిన ప్రతి వాడూ ఆ రూపాన్నీ- ఆ అణుకువనూ పొగిడేవాడే కానీ- ప్రతిసారీ కట్నం దగ్గరే పేచీ వచ్చి పడుతూంది మాస్టారు పరిస్థితి మనకు తెలియనిది కాదు కదా .. "

"అయితే .?" ప్రశ్నార్థకంగా చూసాడు రాజయ్య శాస్త్రులు ఆగినప్పుడు

"అయ్యా! రాజయ్యగారూ! చల్లకు వచ్చి ఇంకా ముంత దాచటమెందుకు- అసలు విషయానికే వస్తున్నాను మన డాక్టరు బాబు గొప్ప సంస్కారవంతుడు మాస్టారు గురించి పూర్తిగా తెలిసినవాడు లావణ్య అంటే కూడా కాస్త- కూస్త ఇష్టమున్నట్లే కనిపిస్తున్నది మీరొక్కమారు 'వూ' అంటే చాలు వారిద్దరూ దంపతులయి నూరేళ్ళు సుఖంగా కాపురం చేసుకుంటారు అయ్యా-ఇది విషయం!" వూపిరి కూడా తీసుకోకుండా చెప్పి రాజయ్య వైపు చూసాడు శాస్త్రులు, అతడి ముఖంలో ఎలాంటి మార్పులొస్తున్నాయో గ్రహించాలని

కాని- తల వంచుకుని చుట్ట ముట్టించుకోవటంలో నిమగ్నుడయిన రాజయ్యలో ఏ భావాలు కదిలాయో గాని పైకి మాత్రం ఏమి కనిపించలేదు

ముట్టించుకుని- రెండు గుక్కలు పీల్చిన తర్వాత కళ్ళు విప్పాడు ఆ పిమ్మట సూటిగా శాస్త్రులు వైపు చూస్తూ చెప్పాడు- "చూడు శాస్త్రులూ నువ్వు అడిగావు కాబట్టి నేను కూడా దాపరికం లేకుండా మాట్లాడ్తాను నిజమే! నువ్వన్నట్లు మాస్టారు గురించి- ఇంకా చెప్పాలంటే వారి బిడ్డల గురించి నాకు పూర్తిగా తెలుసు నిజంగా అందరూ అసూయపడవలసిన కుటుంబం అది "

'అయితే " అంటూ ఆతృతగా అడ్డుకోబోయాడు శాస్త్రులు

"వుండు శాస్త్రులూ నేను చెప్పేది పూర్తిగా విను నాకూ పెళ్ళి కావలసిన ఒక కూతురుంది ఆమెను గొప్ప యింటి కోడలిని చేయాలని ప్రతి తండ్రిలాగే నేనూ కలలు కంటున్నాను ఈ మధ్యనే ఓ సంబంధం కూడా కుదిరింది అబ్బాయి ఇంజనీరు కట్నం లక్ష అడిగారు సరేనన్నాను నిజానికి నా దగ్గర అంత డబ్బు లేదు శాస్త్రులూ! అయినా ఒప్పుకున్నాను ఎందుకో తెలుసా? మధుబాబు డాక్టరు వాడికీ సంబంధాలు వస్తున్నాయి లక్షకు పైగానే యిస్తామంటున్నారు వాటిలో ఒకటి స్థిరపరుచుకుని ఆ డబ్బుతో అమ్మాయికి ఒప్పుకున్న లక్ష యిచ్చేందుకు నిశ్చయించుకున్నాను మా అమ్మాయి పెళ్ళి జరగాలంటే కూడా ఇదొక్కటే మార్గం మరి !" సుదీర్ఘంగా చెప్పి, ఆరిపోయిన చుట్టను వెలిగించుకునే ప్రయత్నంలో లీనమయ్యాడు

పొల్లుపోకుండా అంతా విన్న శాస్త్రులు సమస్యను అర్థం చేసుకున్నాడు అర్థం చేసుకున్నాక ఇంకేమీ మాట్లాడలేక పోయాడు కాసేపు కూర్చున్నాక సెలవు తీసుకుని లేచాడు కూడా. అయితే - ప్రస్తుతం వున్న సమస్యల్లా విషయాన్ని మాస్టారుకెలా చెప్పటమా అని

★ ★ ★

ఆ గ్రామంలోని శ్రీరామభక్త నాటక సమాజం కొత్తలో ఒక వెలుగు వెలిగినా కాలక్రమాన మూలబడింది

ఈ మధ్యనే వూళ్లోకి వచ్చి చేరిన మాజీ మునసబుగారి పుత్రుడు రామరాజు దానికి ప్రాణం పోసి మళ్ళీ పునరుజ్జీవింపచేసాడు దాని ఫలితమే చాలా కాలం తర్వాత ఆ రాత్రి 'స్త్రీ అభ్యుదయం' అన్న నాటక ప్రదర్శన

సాయంత్రం కావస్తుండగానే జనం గోలగా అక్కడికి చేరుకోసాగారు

తల్లికి నచ్చచెప్పి తామూ బయలుదేరారు లావణ్య- సీత

ప్రముఖుల కొరకు కేటాయించిన ముందు భాగంలో అప్పటికే సగ భాగం నిండిపోయింది ఖాళీగా వున్న రెండు కుర్చీల్లో కూర్చున్నారు అక్కాచెల్లెళ్ళు

స్టేజీపై ఏర్పాట్లు చూస్తూ హడావుడిగా తిరుగుతున్న రామరాజు దృష్టి చటుక్కున లావణ్యపై పడింది ఆమె చదువు మానేసి ఏడాది దాటింది మళ్ళీ చూడటం కుదర లేదు అప్పటికి- ఇప్పటికి ఆ అందం ద్విగుణీకృతమయింది' స్వగతంగానే అనుకుంటూ పలకరింపుగా చిరునవ్వు నవ్వి వెళ్ళిపోయాడు

"మునసబుగారబ్బాయి రామరాజు కదూ-?"

చచ్చి ఏం సాధిస్తావ్?

గమనిస్తున్న సీత అడిగింది

"అవును ఇంటర్‌లో నాకు సీనియర్ ముక్తసరిగా చెప్పింది లావణ్య

మరి కాసేపటికి నాటకం ప్రారంభమయింది

హీరో పాత్రదారిగా రామరాజు వేదికపైకి వచ్చాడు

'కథాపరంగా హీరో పేదవాడు స్నేహితుడి పెళ్ళికని వెళ్తాడు అక్కడ వరకట్నం తక్కువయిందనే కారణంగా పీటల మీది పెళ్ళిని ఆపు చేయిస్తాడు పెళ్ళికుమారుని తండ్రి వధువు తండ్రి కాళ్ళా వేళ్ళా పడినా ప్రయోజనం వుండదు

గమనిస్తున్న హీరో లేచి వరకట్న దురాచారాన్ని ఖండిస్తూ- ఆడపిల్లల దుస్థితిపై ఆవేశపూరితమయిన వుపన్యాసమిస్తాడు పురుషాధిత్యం మితిమీరిపోతున్న ఈ దేశంలోని స్త్రీ మేల్కొనాలని, 'మేల్కొని తనపై జరుగుతున్న అత్యాచారాలను ధైర్యంగా ఎదుర్కోవాలని- చివరంటా పోరాడాలని వుద్ఘాటిస్తాడు చివరికి- అదే ముహూర్తానికి ఆ అమ్మాయి మెడలో తాళికట్టి కథ సుఖాంతం చేస్తాడు టూకీగా యిదీ కథ '

నాటకం చివరి బాగం బ్రహ్మాండంగా రక్తికట్టింది ప్రేక్షకుల్లో చీమ చిటుక్కుమన్నా వినిపించేంతటి నిశ్శబ్దం ఆవరించుకుంది హీరో పాత్రలో రామరాజు గొప్పగా నటించాడు అందరి ప్రశంసలనూ పొందాడు

చూస్తున్న లావణ్య గుండెల్లోనూ ఏవో ప్రకంపనలు కదిలినయి నిజంగానే- ఈ వరకట్న దురాచారం నశిస్తే తనలాంటి ఆడపిల్లల జీవితాలలో ఎంత వెన్నెలో- నాన్నలాంటి నిస్సహాయులైన తల్లిదండ్రులు తమ శేష జీవితాలను ఎంత ప్రశాంతంగా గడుపుతారో కదా!

అసలే అందగాడు- అందులోనూ అంతటి ఆదర్శవాది మొదటిసారిగా ఒక పరపురుషునిపై ప్రత్యేకమయిన ఆసక్తి ఏర్పడింది ఆమెలో

స్టేజీ పక్కనే ఎవరితోనో మాట్లాడుతున్న రామరాజు, వెళ్ళిపోనటానికి సిద్ధపడుతున్న వారిని చూసి పడి పడిగా సమీపించాడు

"నమస్కారమండి గుర్తుందా?" అరచేతులు జోడించి అడిగాడు నవ్వుతూ

"ఆ గుర్తుపట్టక పోవడమేమిటి ఒక వూరివాళ్ళం!" తనూ నిర్మలంగా అంది లావణ్య పక్కనే వున్న సీతను కూడా పరిచయం చేస్తూ

"ఇంతకీ నాటకం ఎలా వుంది ?" వాళ్ళ పక్కనే నడుస్తూ అడిగాడు

"చాలా బాగుంది మీ కేరెక్టర్ మరీ ఎక్సలెంట్ జనాలను అదరగొట్టేసారనుకోండి" చెప్పింది సీత

"- నిజంగా మీలాంటి ఆదర్శవాదులు కొద్ది మంది వున్నా- ఎప్పుడో ఒకప్పుడు ఈ సమాజం మారుతుందన్న విశ్వాసం వుంటుందండీ" లావణ్య అననయితే అన్నది కాని అదిక చనువు తీసుకున్నానేమోనని కలవరపడింది ఆ తర్వాత

రామరాజు మాత్రం ఆమె ప్రశంసకు గలగలా. నవ్వుతూ '- థాంక్స్ రామరాజు మంచి బాలుడన్న సర్టిఫికేట్ యిచ్చిన మొదటి వ్యక్తి మీరే వెరీ వెరీ థాంక్స్ ' ఆహ్లాదంగా అన్నాడు

కాస్త ముందుకు వెళ్ళినాక వచ్చిన రెండుదారుల్లో చీలిపోయారు వాళ్ళా తర్వాత

* * * * * *

"అమ్మాయిలు కనిపించరేమిటి?" అప్పుడే వచ్చిన మాస్టారు కాళ్ళు కడుక్కుంటూ అడిగాడు

"వూళ్ళో ఏదో నాటకమట ఈ పాటికి అయిపోయే వుంటుంది మీరు రండి భోంచేద్దురుగాని " ఆ ఏర్పాటు చేస్తూ చెప్పింది అనసూయమ్మ

చాలాసేపటిదాకా మనసులోని మాట ఎలా చెప్పాలో తోచలేదు ఆమెకు

"ఏమిటి? ఏదో చెప్పాలనుకుని తటపటాయిస్తున్నావు ఏమిటో చెప్పు" సూక్ష్మగ్రాహి అయిన మాస్టారు పసిగట్టి అడగటంతో కాస్త ధైర్యం వచ్చిందావిడకు

"ఏమీ లేదండీ! ఏ సంబందం చూసినా వేలకు వేలే అడుగుతున్నారు దాని వయసు కూడా రోజు రోజుకు పెరుగుతున్నదే కాని తరగడంలేదు.. "

"ఈ వుపోద్ఘాతం ఎందుకుగాని అసలు విషయానికి రా " అసహనంగా అన్నాడు మాస్టారు ఈ మధ్య అమ్మాయి పెళ్ళి ప్రసక్తి తెస్తేనే చిరాకు పడిపోతున్నాడు కూతురు వివాహం తన అసమర్థతను మాటి మాటికీ బయట పెట్టినట్లనిపిస్తుండటంతో విసుగ్గా అన్నాడు

భర్త ధోరణి గమనించిన అనసూయమ్మ మాటలు నోట్లోనే వుండిపోయాయి

"అసలు విషయమేమిటో చెప్పవే నీ దృష్టిలో ఏదయినా సంబంధం కాని వున్నదా? చెప్పనిదే నాకెలా తెలుస్తుంది?" సాధ్యమైనంత సౌమ్యంగా అడగడంతో చెప్పింది


"గోపాలరావుగారని వరదరాజపురం పంచాయితీ మెంబరు వున్నాడట చూసారూ, అతడు పెళ్ళిచేసుకోవాలనుకుంటున్నాడట కట్నకానుకల ప్రసక్తి లేదట వుత్తముడని కూడా పేరున్నట్లుంది అదీ విషయం "

ఆమె చెప్తుండగానే అతడి నొసలు ముడిపడింది ముక్కుపుటాలు అదిరినయి క్షణాల్లోనే ముఖంలోకి రక్తవర్ణం పొంగుకొచ్చింది

ఆయన ఆకృతిని చూసి పూర్తిగా భయపడి పోయింది అనసూయమ్మ అప్రయత్నంగానే చెప్తున్న మాటలు తెగిపోయినయి

"ఆ గోపాలరావు రెండవ సంబంధం కోసం

గడుసులోకం —బాబు



చచ్చి ఏం సాధిస్తావ్

వెతుకుతున్నాడని కూడా తెలుసా? గత సంవత్సరం పురిట్లో అతడి భార్య పోయిందని ఆ పాప సంరక్షణ కోసమే మళ్లీ పెళ్ళికి తలపెట్టాడని– ఈ విషయాలన్నీ కూడా తెలుసా? తెలిసే నీ కూతురు కోసం అనుకుంటున్నావా?'' ఒక్కొక్క మాట పిడుగులా కురుస్తుంటే వుగ్రుడయి పోయాడు. చివరికి ఇన్నేళ్ళు కాపరం చేసిన భార్య కూడా తన అసమర్థతను వేలెత్తి చూపిస్తున్నదన్నమాట! అంతటి అశక్తుడాతను? ఆ వూహే భరించలేకుండా వుంది ఆయనకు

''వయసు కూడా ఏమంత'' ఏదో సర్ది చెప్పాలని నసిగింది అనసూయమ్మ

ఆ మాటలకు మరీ రెచ్చి పోయాడు మాస్టారు

''నోర్మూయ్ '' వురుముతూ ముందున్న పళ్లెన్ని ఒక్క తోపుతో సాదు

తనకు తెలిసినంత వరకు భర్తను ఆకృతిలో ఎప్పుడూ చూడలేదామె పూర్తిగా బెదిరిపోయింది

''ఏమంత వయసు లేదా నగ్గులేదూ ఆ మాట అనటానికి? ఇరవయి కూడా నిండని అమ్మాయికి నాలుగు పదులు దాటిన వరుడా చీ! చీ!నువ్వసలు కన్న తల్లివేనా'' ఆవేశంతో పాటు ఆయాసం– ఆ ఆయాసం తెచ్చిన కన్నీళ్ళు వుక్కిరి బిక్కిరి చేసాయాయనను

''కాస్త శాంతించండి ఆ సంబంధం '' ఆ విషయం ఇక వదిలేద్దామని చెప్దామనుకుంది కాని వినిపించుకునే స్థితిలో లేరాయన

''నోర్ముయ్– మళ్ళీ ఆ సంబంధం గురించి నోరెత్తావంటే పళ్ళు రాలగొడ్తాను ఏం నీ మొగుడు చచ్చిపోయాడనుకున్నావా? కూతురు పెళ్ళి కూడా చేయలేనంత వెధవ అయ్యాడని లోకానికి చాటింపు వెయ్యాలనుకున్నావా ''

ఒక్కొక్క మాట సమ్మెట దెబ్బలా పడుతూంటే– అలాగే కూలబడిపోయి భర్త కాళ్ళను వాటేసుకుని ఏడుస్తుంది అనసూయమ్మ

వాళ్లా సేపటిదాకా వారాస్థితి నుంచి తేరుకోలేక పోయారు తేరుకున్నాక నెమ్మదిగా ఆ గుమ్మం దాటబోయిన మాస్టారు అక్కడి దృశ్యం చూసి బిగుసుకుపోయాడు కాళ్ళలో సన్నని వణుకు ప్రారంభమయింది

వసారాలో గోడనానుకుని వెక్కి వెక్కి ఏడుస్తున్నారు అక్కా చెల్లెళ్ళిద్దరూ–

* * * * * *

ఆ వూళ్ళో వున్నది రామరాజు వాళ్ళది ఒక్కటే కూరగాయల తోట కొందరు ప్రతిరోజూ మరికొందరు రెండుమూడు రోజులకు ఎలాగయితేనేం వూరివారంతా చివరికి అతడి తోటకు వెళ్ళవలసిందే

రామరాజుతో పరిచయం ఏర్పడినాక ప్రతిదినం క్రమం తప్పకుండా వెళ్ళసాగింది లావణ్య, గొప్పవాడినన్న భేషజం ఏమాత్రం లేకుండా సరదాగా మాట్లాడే రామరాజంటే తనకు తెలియకుండానే అభిమానం పెంచుకుంది ప్రేమిస్తున్నానని అనుమానం కూడా కలిగింది అలా అనిపించిన తర్వాత తను కూడా ఇదివరకటి సిగ్గు– బిడియాలు విడిచి చనువుగా ప్రవర్తించసాగింది

ఎప్పటిలాగే ఆ రోజు కూడా సంచీ తీసుకుని బయలుదేరింది ఒంటరిగా

''రా . రా. వస్తావో– రావోనని భయపడి చస్తున్నాను.'' చేతిలోని సిగరెట్టును విసిరేసి చిరునవ్వుతో ఆహ్వానించాడు

''అంత భయమెందుకో? రాకపోతే ఏమవుతుంది'' మందహాసంతో ఎదురు ప్రశ్నించింది లావణ్య.

''–అదేమో కాని లావణ్యా నిన్ను రోజుకు ఒక్క సారయినా చూడలేకపోతే నాకేదో విపరీతమైన వెలితిగా వుంటుంది'' ఆరాధనగా చూస్తూ అన్నాడు

ఆ మాటలకు లావణ్య కళ్ళలో ఏదో అనిర్వచనీయమైన మెరుపు మెరిసింది ''అవునూ మీరేమిటి ఇలా వూరికి మకాం మార్చేసారు డిగ్రీ పూర్తి చేయలేదా?'' అంటూ గుండెల్లోని ఆలోచనలను బలవంతంగా అదిమిపెడ్తూ సంభాషణ మార్చేసింది

ఆ మాటలకు తన సహజసిద్ధమయిన నవ్వును గలగలా కురిపించాడు రామరాజు ''రెండేళ్ళకే ఓపిక నశించి పోయింది పైగా ఇక్కడి వ్యవహారాలు కూడా చూసుకోమని నాన్నగారి వత్తిడి కూడా ఎక్కువ కావటంతో ఇక తప్పలేదు '' సిగరెట్టు వెలిగించుకుంటూ చెప్పాడు

దానితో కుటుంబ వ్యవహారాల వైపు మళ్ళింది వారి సంభాషణ

ఆ సమయంలో అతడెంతో ఆత్మీయుడుగా కనిపించాడు లావణ్యకు నిర్మలమైన మనస్సుతో తన సమస్యను చెప్పింది తల్లిదండ్రులు పడుతున్న ఆవేదన– తన పెళ్ళికోసం వాళ్ళు ఎదుర్కొంటున్న పరిస్థితులను మొట్టమొదటిసారిగా ఒక పరాయి వ్యక్తితో చెప్పుకుంది

అంతా ఓపిగ్గా విన్న రామరాజు సమీపంలోని ఆమె అరచేతిని తన చేతుల్లోకి తీసుకున్నాడు

వద్దనిపిస్తున్నా నిరాకరించలేదు లావణ్య.

''చూడు లావణ్యా! చాలా కాలం నుండి నీకో విషయం చెప్పాలనుకుంటున్నాను ఈ నాటికీ ఆ అవకాశం దొరికింది నీ మీద జాలితో కాదు నేనీ మాటలు చెపుతున్నది నిన్ను మొదటి రోజు చూసినప్పుడే– పెళ్ళంటూ చేసుకుంటే నిన్నే చేసుకోవాలని నిర్ణయించుకున్నాను ...''

తనను స్పృశించి పెదవి కదల్చినప్పుడే తనీ మాటలు వూహించింది లావణ్య. కాని ప్రత్యక్షంగా వింటున్నప్పుడు మాత్రం గుండె విపరీతంగా కొట్టుకుంది కొట్టుకుని– కొట్టుకుని చివరికి ఆగిపోతుందేమోనన్న భ్రాంతి కలిగింది నిజంగానే ఈ పెళ్ళి జరిగితే– జరిగితే నాన్నకెంత ప్రశాంతి? ఎంత వుపశమనం? వృద్ధాప్యం చీకు చింతా లేకుండా గడిచి పోతుంది వీళ్ళకు డబ్బు కొదవలేదు. కట్నం తీసుకోవాలనుకుంటే రామరాజు ఈ ప్రసక్తి తెచ్చేవాడేకాదు అలా జరిగితే నాన్నగారి ఆరోగ్యం బాగుపడుతుంది సీత డిగ్రీ చదువుతుంది. ఓహ్! ఇదంతా నిజంగానే జరుగుతుందా– తను అంత అదృష్టవంతురాలా?

మంత్ర ముగ్ధలా కూర్చుండి వూహ ప్రపంచంలోకి వెళ్ళిపోయిన లావణ్య మౌనంగా వుండిపోయింది.

''– నీ కిష్టమయితేనే సుమా..'' నవ్వుతూ అన్నాడీమారు రామరాజు

''నిర్మా'' సుందరికి ఆదిలోనే హంసపాదు!



నిర్మా సుందరి సంగీతా బిజలానీ నటించిన తొలి హిందీచిత్రం 'ఖాతిల్' ఈమధ్య విడుదలయింది. ఈ చిత్రం బాక్సాఫీస్ ప్రమాణాలలో 'సగటు' స్థాయిలోవుంది అయితే ఇది విడుదలయిన రోజునే మల్టీస్టారర్ చిత్రం గంగ-జమున–సరస్వతి విడుదల కావడంతో ఆ వూపుకు యిది తట్టుకోలేక పోయింది. పాపం! సంగీతా తొలి చిత్రం యిలా దెబ్బతినడం దురదృష్టకరంకదా! అయితే ఆమె నటించిన మరో చిత్రం 'హత్యార్' హిట్ కావచ్చునంటున్నారు అందులో ధర్మేంద్ర, రిషీ, సంజయ్‌దత్‌లు వుండటమే కారణం!

ఆ మాటలకు వులిక్కిపడి తేరుకుంది లావణ్య సుషుప్తావస్థలోంచి

"మీవాళ్ళు మీ..." అంటూ తడబడింది

మధ్యలోనే అందుకున్నాడు రామరాజు, "ఆ విషయం కూడా ఆలోచించాను లావణ్యా మా నాన్న ఎలాంటి పరిస్థితుల్లోనూ అంగీకరించడు ఆయన పూర్తిగా డబ్బు మనిషి అందుకని ఒకప్లాను కూడా సిద్ధంచేసి వుంచాను.." అంటూ ఆమె కళ్ళలోకి సూటిగా చూసాడు.

ఆమె నేత్రాలు విప్పారితమయివున్నయి "ఏమిటి? అప్రయత్నంగా పెదాలు దాటివచ్చినయి మాటలు ఆ కళ్ళలో దోబూచులాడుతున్న భయాన్ని చప్పున గుర్తించాడు రామరాజు నవ్వుతూ అభయమిస్తున్నట్టుగా ఆమె అరచేయి నొక్కాడు మృదువుగా – 'అంత బయమెందుకు లావణ్యా? నాపైనమ్మకంలేదా?" అంటూ

"అహఁ అదికాదు. అదికాదు" కంగారుగా అందీసారి

అయితే యింకేం అనుమానాలు పెట్టుకోకుమరి' మనం రహస్యంగా పట్నం వెళ్ళి పెళ్ళిచేసుకుందాం వారం రోజుల తర్వాత తిరిగి వద్దాం అప్పుడు మా నాన్న ఏం చేయగలడు? వున్నది నే నొక్కడినే ఒప్పుకోక ఛస్తాడా? ఆఁ మీవాళ్ళకు కూడా తెలియనివ్వద్దు సుమా – అంతా గోప్యంగా జరిగిపోవాలి చివరికి ఎలాగూ సుఖాంతమవుతుంది సరేనా?"

అవాక్కయిపోయింది' అంతేకాదు అప్రతిభురాలయింది లావణ్య ఆ ప్రతిపాదన విని'

లేచిపోవటమా? తీసుకునివెళ్ళి ఎక్కడయినా వదిలేస్తే? పెళ్ళి చేసుకుంటే? నిప్పులాంటి నాన్న భరించగలడా? ఈ అపవాదుతో సీత పెళ్ళి ఈ జన్మకు జరుగుతుందా? ఆ ఆలోచన వస్తూనే చటుక్కున తలెత్తి రామరాజువైపు నిశితంగా చూసింది అదేపనిగా దేనికోసమో గాలించింది

అతడి చూపుల్లో ఎంతో నిజాయితీ పొంగిపొయి కొట్టొచ్చినట్టు కనిపించింది

ఛ' ఛ' తను అనవసరంగా అనుమానిస్తున్నదా' లేనిపోని భయాలు పెంచుకుంటున్నదా? అంతలోనే అనుకుంది మళ్ళీ రామరాజు అలాంటివాడు కాదు ఇన్ని రోజుల పరిచయంలో ఎన్నడూ అతడు అతిగా ప్రవర్తించలేదు ఎప్పటికీ అలా చేయడు తన జీవితం నిజంగానే నందనవనం కాబోతున్నది పెళ్ళిచేసుకుని తిరిగివచ్చిన తర్వాత నాన్న తప్పకుండా క్షమిస్తాడు రామరాజులాంటి గొప్పవాడు తనకు అల్లుడయినందుకు గర్వంతో వుప్పొంగిపోతాడు ఆ తర్వాత అతడికే బాధా వుండదు తన కుటుంబంలో ఇక కష్టాలుండవు కన్నీళ్ళుండవు వెళ్ళేటప్పుడు ఉత్తరంలో అన్ని విషయాలు వివరంగా వ్రాసిపెడ్తేసరి అలా అనుకున్నప్పుడుకాని ఆమె మనసు కాస్త కుదుటపడలేదు

(ఇంకావుంది)



రిఫ్రిజిరేటర్‌తో చెయ్యదగినవి చెయ్యకూడనివి!

★ రిఫ్రిజిరేటర్‌ను పూర్తిగా గోడకు ఆన్చి పెట్టకండి. మధ్య కనీసం ఐదు అంగుళాల ఖాళీ వదలండి.

★ రిఫ్రిజిరేటర్‌ను సూటిగా ఎండా, వేడి తగలకుండా ఉంచండి. స్టౌకి దూరంగా ఉంచండి.

★ తడిసిన మెత్తని గుడ్డతో రిఫ్రిజిరేటర్‌ను వారానికి ఒకసారి శుభ్రం చేయండి. సబ్బు నీళ్ళు గాని, వేడినీళ్ళు గాని ఉపయోగించండి. డిటర్జెంట్లను వాడకండి.

★ ఫ్రిజ్ వెనుక ఉండే కండెన్సర్‌లో దుమ్ము చేరకుండా జాగ్రత్త తీసుకోండి.

★ మంచు పావు అంగుళం కన్న ఎక్కువ పేరుకున్నట్టయితే ఫ్రీజర్‌ను డిఫ్రాస్ట్ చెయ్యండి. తద్వారా ఫ్రీజర్‌కు చల్లబరిచే శక్తి పెరుగుతుంది.

★ వేడి పదార్థాలను ఎప్పుడూ ఫ్రిజ్‌లో పెట్టకండి. వేడి పదార్థాలు పెట్టడం ద్వారా ఫ్రిజ్ లోపల ఉష్ణోగ్రత పెరుగుతుంది. ఇతర పదార్థాలు చెడిపోవచ్చు.

★ మంచుగడ్డలను ఒకసారి కరిగించాక మళ్ళీ గడ్డ కట్టించకండి. అలా చేస్తే ఫ్రీజర్‌లోని ఆహార పదార్థాల నుంచి దుర్వాసనను సంతరించుకున్న మంచుగడ్డలు వస్తాయి. తక్కువ వ్యవధిలో ఐస్‌క్యూబ్స్ కావాలంటే ట్రే పూర్తిగా ఖాళీ చేయకుండా రెండు క్యూబ్స్ ఉంచి మిగిలిన ఖాళీల్లో నీళ్ళు నింపండి.

★ వారం కన్న తక్కువ రోజులు ఎటయినా వెళుతున్నట్టయితే థర్మోస్టాట్‌ను తక్కువ ఉష్ణోగ్రతలో ఉంచండి. అంతకన్న ఎక్కువ రోజులు బైటికి వెళ్ళేట్టయితే ఫ్రిజ్‌ను ఖాళీ చేసి, పొడిగా, కరెంటు కనెక్షన్ విడదీసి వెళ్ళండి.

★ ఫ్రిజ్ తలుపు అవసరమయినంత సేపే తీసి ఉంచండి. లోపలికి గాలి జొరబడనిస్తే, ఫ్రిజ్ లోపలి ఉష్ణోగ్రతలో మార్పులు కలుగుతాయి.

★ గ్యాస్ నింపిన పానీయాల సీసాలను ఫ్రీజర్‌లో ఉంచకండి. ఆ సీసాలు పగిలిపోయే అవకాశం ఉంటుంది. పాల పాకెట్లు ఫ్రీజర్‌లో పెట్టుకోవచ్చు.

★ ఆహార పదార్థాల మీద సరిగా మూతలు ఉంచితే, పళ్ళు, కూరగాయలు విడిగా ఉంచితే వాసనలు రాకుండా అరికట్టవచ్చు. తినే సోడా డబ్బా మూత తెరిచి ఒక అరలో ఉంచితే లోపల గాలి బాగా శుభ్ర పడుతుంది.

★ ఐస్‌క్రీమ్‌ల లాంటివి త్వరగా గడ్డ కట్టాలంటే ఒక గంట ముందుగా టెంపరేచర్ కంట్రోల్‌ను గరిష్ఠ స్థాయిలో ఉంచాలి.

★ ఆహార పదార్థాలను కావలసినంతే వేడి చేసుకోవాలి. వేడి చేసుకోవడంలో పోషక విలువలు నశిస్తాయి.

★ గడ్డకట్టిన మంచును గీకడం ఫ్రీజర్ ఉపరితలాన్ని నష్టపరుస్తుంది.●

ఫాలాక్షుని ఢీర్

అతిచిన్న భగవద్గీత!

హిందూపురం కట్టా విశ్వనాధయ్య అనే ఆయన ఇంట్లో అతి చిన్న భగవద్గీత వున్నదట 176 పేజీలున్న యీ పుస్తకం వెడల్పు కేవలం ఒక్క అంగుళమేనట

సమస్య తెగక ఆత్మహత్యలు!

కాంచీపురానికి చెందిన 19 ఏళ్ళ షణ్ముగం అనే అతను 16 ఏళ్ళ దేవకిని ప్రేమించి పెళ్ళాడుదామనుకుంటే ఆమె తలిదండ్రులామెకు వేరే వ్యక్తితో పెళ్ళి జరిపించారట కొన్నాళ్ళు బగ్నహృదయుడుగా కాలం గడిపి అనక 17 ఏళ్ళ శాంతిని పెళ్ళి చేసుకున్నాడట అనక దేవకి తన భర్తతో కాపురం చేయక పారిపోయి తన ప్రియునింటికి వచ్చి అతనికి పెళ్ళయ్యుండడం చూసి నిశ్చేష్టురాలయిందట అనక ముగ్గురూ కూచుని యీ విషయాన్ని చర్చించుకుని. హాయిగా ఆత్మహత్య చేసుకుని ఈ పాపిష్టి జనసమాజ ప్రపంచంలోంచి నిష్క్రమించాలని అంతపనీ చేశారట చెరువులో వీరి ముగ్గురి శవాలూ దొరికాయట

దొంగ బంగారం పట్టివేత!

మద్రాసు గిండీలో వో యింట్లో జొరపడిన రెవెన్యూ అధికారులు 262 కిలోల బరువున్న 2250 బంగారం బిస్కట్లు పట్టుకున్నారట ఈ బిస్కట్ల కిమ్మత్తు 8 74 కోట్ల రూపాయలట

కాళియమ్మ కాళికావతారం!

పరమత్తికి చెందిన సుబ్బయ్య అనే అతను రోజూ సుష్టుగా తాగి రోజూ పెళ్ళాన్ని చితకతన్నే వాడట అతని భార్య కాళియమ్మ కూలిపని చేసి సంపాదించిన డబ్బు కూడా లాగేసుకుని తాగి చావగొడ్తుండే వాడట వీరికి ముగ్గురు పిల్లలు కూడనట ఒకరోజు సుబ్బయ్య ఫూటుగా తాగి, పెళ్ళాం తాను సంపాదించినది తన కివ్వనన్నందుగ్గాను రుబ్బురోలు పాత్రం ఎత్తి ఆమెను దాంతో కొట్ట బోయి, ఆ బరువుతో నిలబడలేక, తూలిపడిపోయాడట కాళియమ్మ తన నికృష్ట జీవితానికి స్వస్తి చెప్ప దలచి, కింద పడ్డ ఆ పాత్రం తీసుకుని. దాంతో అతని నెత్తినో పెట్టు పెట్టిందట దాంతో సుబ్బయ్య అక్కడి కక్కడే తలపగిలి చనిపోయాడట

జండా తగాదాలో యువకుడు బలి!

మా నా మధురకు చెందిన మళవరాయ నేన్దల్ అనే గ్రామంలో ఏ పార్టీ జండా వూళ్ళో కట్ట కూడదని గ్రామ పెద్ద వో తీర్మానం చేసి, వూరును హెచ్చరించారట కానీ ఆ వూళ్ళోని డి యం కె పార్టీ వారో నలుగురు కలసి ఆ పార్టీ జండా కట్టారట దీన్ని పదినెట్టాన్ అనే వో యువకుడు ఆపబోయాడట దాంతో వాగ్యుద్ధం అంచెలు మారి తారస్థాయికి వెళ్ళిందట డి యం కె కి చెందిన ఆ నలుగుర్నూ అతన్ని, అతని అనుయాయుడు ముత్తుసామిని కత్తులతో పొడిచారట పదినెట్టాన్ మాత్రం చనిపోయాడట ఈతని దేహానికి సెంట్రల్ మినిష్టర్ అరుణాచలం మాల వేసి. ఆ కుటుంబానికి వో అయిదు వేలు సహాయ మిచ్చి, అతని ముగ్గురు ఎల్లల్ని చక్కగా చదివించుతామని వొప్పుకున్నారట

పార్టీ గుర్తు వేస్తూ యువకుని మృతి!

సేలం జిల్లా అంతా కూడా ఎన్నికల సిద్ధంలో డి యం కె పార్టీ గుర్తు ఉదయించే (రెండు కొండల మధ్య) సూర్యుని బొమ్మలు రాత్రీ పగలూ వేస్తూనే వూరూరూ తిరుగుతున్న 21 ఏళ్ళ రవికి ఎగనాయాసం వచ్చి, గుండె పట్టేసి. తన షాపులో బ్యానరుకు పెయింట్ వేస్తూ వేస్తూ అలానేపడి (ఆడయాంపట్టి అనే గ్రామంలో) చనిపోయార్ట!

పెరుగుతున్న విద్యాసంస్థలు!

భారతదేశంలో 1951 వ సంవత్సరంలో 2.09 లక్షల ప్రయిమరీ స్కూళ్ళుండేవట ఇపుడు 5 5 లక్షలకు పెరిగాయట. మిడిల్ స్కూళ్ళు అలాగే యీ కాలంలో 14 వేల నుంచి లక్షా 40 వేలకు పెరిగాయట. అలాగే హయ్యర్, హయ్యర్ సెకండరీ స్కూళ్ళు 7000 నుంచి 68000లకు పెరిగాయట కాలేజీలు ఏడు రెట్లు, విశ్వవిద్యాలయాలు 5 రెట్లూ యీ 35 ఏళ్ళలో పెరిగాయట

●

ఆంధ్రసచిత్రవారపత్రిక

-నవ్వు నాలుగందాల ఆరోగ్యం!

అందుకే నవ్వించి పారితోషికం పొందండి!

★ అందాల పలువరుస మల్లెలు రువ్వినట్లు- మెరుస్తుంటే మనం నవ్వుతూ వుంటే.... ఓహోమని వుంటుంది!

★ అట్లా నవ్వించే సన్నివేశం రాసిపంపండి నవ్వు రాకపోతే మాత్రం యిక్కడ తిట్టుకుంటారు సుమా!

★ చదవటంలోనే అలిసిపోయే సన్నివేశాలు గాక హాస్య సన్నివేశాలు కల్పించి రాయండి. – అనుభవించి రాయండి. కాపీరైటుంటే మాత్రం తస్కరించి రాయకండి– పేచీలకి మీదే బాధ్యత.

మీ హాస్య రచన ఒక యిన్‌లాండ్ కవరు మీద విడి విడి లైనులో విడి విడి అక్షరాల్లో వ్రాసి సంపాదకుడు,నవ్వు నాలుగందాల ఆరోగ్యం శీర్షిక,గాంధీనగర్– విజయవాడ– 3 కి పంపండి!

గుడ్‌లక్!!

– సం.

అయిదవ గుళిక

ఆరోగ్యానికి సప్త గుళికలు

○○○○○○○

డాక్టర్ బి.జి.వి. నరసింహారావు

వ్యాయామం

సృష్టిలో మానవుడు తప్ప మిగిలిన ప్రాణులన్నీ తిండి కోసం శరీర శ్రమ చేయవలసి ఉంది. మానవు డొక్కడే శరీర శ్రమ లేకుండా అతిగా తింటూ అన్ని అనర్థాలను కొని తెచ్చుకుంటున్నాడు. శారీరక, మానసిక శక్తులను అభివృద్ధి చేయుటకు, శరీరంలోని అంతర, బాహ్య అవయవాలన్నింటికి రక్తప్రసరణ చక్కగా జరగటానికి – శరీర శ్రమ చేయవలసి ఉంది.

మనం తిన్నటువంటి తిండి శ్రమ చేసినప్పుడే జీర్ణమై శరీరానికి వంట బడుతుంది. అప్పుడే ఆరోగ్యాన్ని పొంద గలుగుతాం వ్యాయామాలను రెండు రకాలుగా వర్గీకరించారు. సౌమ్య వ్యాయామమని, తీవ్ర వ్యాయామమని. ఆసనాలు, సూర్య నమస్కారాలు, తోటపని, వృత్తి పనులు సౌమ్య వ్యాయామాల క్రింద వస్తాయి ఈ వ్యాయామం ఎప్పుడైనా మానటం జరిగితే ప్రక్క ప్రభావాలేవీ ఉండవు.

దండీలు తియ్యటం, బస్కీలు, కుస్తీ వెయిట్ లిఫ్టింగ్, బాక్సింగ్‌ల వంటివి తీవ్ర వ్యాయామాలు. వీటిని ఎప్పుడైనా మానటం జరిగితే, ఆహార సేవనంను తగ్గించాలి. లేకపోతే వయసు ముదిరిన తరువాత గుండె జబ్బులకు దారి తీయటం, స్థూల కాయులవటం జరుగును. తీవ్ర వ్యాయామాన్ని అందరూ అన్ని సమయాలలోనూ చేయకూడదు.



స్త్రీలు కూడా యోగాసనాలను అభ్యసించవచ్చు.

యోగాసనాల వలన ప్రత్యేకత ఏమిటంటే శరీరం ఆరోగ్యవంతంగా ఉంది, ఆహార అవసరాలు తగ్గి, మల మూత్ర విసర్జనం సక్రమంగా ఉంటుంది.

ఎటువంటి పరికరాలతో పని లేకుండా అందరూ – పిల్లలు, పెద్దలు, యువకులు, వృద్ధులు, అతివృద్ధులు, రోగులు, బలహీనులు యోగాసనాలను అభ్యాసం చేయవచ్చును. ఈ విషయాన్నే హఠయోగ ప్రదీపిక తెలుపుతుంది.


యువా వృద్ధోపి వృద్ధోవా
వ్యాధితో దుర్బలోపివా
అభ్యాసాత్సిద్ధి మాప్నోతి
సర్వయోగేష్వ తంద్రితః.

అంటే తరుణుడైనను, వృద్ధుడైనను, అతివృద్ధుడైనను, దుర్బలుడైనను సర్వ కాలములందును సోమరితనం లేక యోగాసనములను అభ్యసించిన సిద్ధిని పొందునని తెలుస్తుంది.

(వచ్చే వారం ఆరవ గుళిక...)

ఊపిరి సలపని అనిల్‌కపూర్

"తేజాబ్" చిత్రం విజయవంతం కావడంతో అనిల్‌కపూర్ ఉత్సాహంగా ఉన్నారు. మిస్టర్ ఇండియా తర్వాత ఆయన సాధించిన పెద్ద విజయం ఇదేనట. తేజాబ్ విజయోత్సవాన్ని సన్నిహిత కుటుంబ సభ్యులతో జరుపుకుంటూ ఇంకొక సంవత్సరం వరకు కొత్త చిత్రాలకు ఒప్పుకోనని ఆయన ప్రకటించారట. ఇప్పటికే ఆయనకు ఉన్న చిత్రాల సంఖ్యతో చూసినప్పుడు ఆయన అన్నిటికీ న్యాయం చేయలేనను కుంటున్నారట ఇంకా ఒప్పుకుంటూనే ఉంటే పరిస్థితి మరింత విషమిస్తుందని ఆయన భావిస్తున్నారట



మహారణ్యం

తిరపల్లె వీణావాణి

శీతాకాలం అంచుకే అయిదున్నర కాకముందే బాగా చీకటి పడిపోయింది ఎముకల్ని కొరికే చలి దానికి తోడు ఈదురు గాలి వీస్తూ వుంది పడక్కుర్చీలోంచి లేచి, నాలుగడుగులు వేసి బీరువా తలుపు తీశాను ఆ బీరువా లోపల బట్టలన్నీ చిందర వందరగా పడి వున్నాయి

తుఫాను వల్ల ప్రశాంతమయిన వాతావరణాన్ని కోల్పోయిన ప్రకృతి ఎంత అస్తవ్యస్తంగా వుంటుందో ఆడమనిషి లేని యింట్లోని వాతావరణం కూడా అలాగే వుంటుంది ఏ వస్తువు ఎక్కడుండాలో అక్కడే వుంచి యింటిని పరిశుభ్రంగా వుంచుకోవడం ఆడమనిషికే తెలుసు

కోడలు పురిటి కోసం పుట్టింటికి వెళ్లింది మా ఆవిడ తన కూతుర్నీ, మనవరాళ్లనీ చూసి రావడం కోసం వారం క్రితం తాడేపల్లిగూడెం వెళ్లింది యిక మా అబ్బాయి ఉద్యోగ రీత్యా రెండ్రోజుల క్రితం క్యాంపు వెళ్లాడు

ఒంటరిగా బతకడం అలవాటై పోయిన వాడికి జనసమ్మర్ధంలో మసలడం ఎంత యిబ్బందిగా వుంటుందో యింట్లో జనాల మధ్య మసలిన వాడికి ఒంటరిగా వుండవలసి రావడం అంతే యిబ్బందిగా వుంటుంది

వారం రోజుల నుండి నా పరిస్థితీ అలాగే వుంది యింట్లో మంచి పుస్తకాలుండబట్టి సరిపోయింది లేకుంటే ఈ వారం రోజుల్లో నిజంగానే నాకు పిచ్చెక్కి పోయేది బీరువా లోంచి ఓ పాత శాలువాని బయటకు తీసి విదిలించి నా ఒంటి నిండా కప్పుకున్నాను

నేను ఉద్యోగ విరమణ చేసిన సందర్భంలో మా కాలేజీలోని సహ అధ్యాపకులు వీడ్కోలిస్తూ నాకు బహూకరించిన శాలువా అది అదంటే నాకు అమితమైన యిష్టం సజీవులైన కొందరు మనుషులతో కంటే యిలాంటి నిర్జీవ పదార్థంతోటే ఒక్కోసారి మనిషికి అనుబంధం ఏర్పడవచ్చు

తలుపు మీద ఎవరో దబదబా బాదిన చప్పుడు విన్పించడంతో పాత జ్ఞాపకాల నుండి తేరుకుని, గబగబా వెళ్లి తలుపు గడి తీశాను ఎదురుగా గోపాలరావు 'నమస్కారం రామనాధంగారూ' అన్నాడాయన

రండి గోపాలరావు గారూ! చాలా రోజులకి అగుపించారు నవ్వుతూ అన్నాను

'తీరికెక్కడుంచండి? జీవితమంతా ఆఫీస్ తోటే గడిచిపోతూ వుంది మొత్తానికి మీరు అదృష్టవంతులు' అన్నాడు గోపాలరావు మందహాసం చేస్తూ

'ఏమిటండీ నా అదృష్టం?"

ఆ రొంపిలోంచి బయట పడ్డారుగా

ఏ రొంపి?"

అదేనండి ఉద్యోగం లోంచి

ఉద్యోగమనేది రొంపి అవునో కాదో మీకు రిటైర్డయ్యాక తెలుస్తుంది లెండి

ఏమోనండి నాకు మాత్రం నిజంగా ఉద్యోగ విరమణా జీవితమే మేలనిపిస్తుంది

'అంతేనండీ గోపాలరావుగారూ! దూరపు కొండలెప్పుడూ ఎగుడు దిగుడుగా అగుపించవులెండి" అంటూ పకపకా నవ్వేశాను

అది సరే గానీ యింట్లో మీరు తప్ప యింకెవ్వరూ సందేహంగా అడిగాడు గోపాలరావు

"నేను తప్ప యింకెవ్వరూ లేరండి' ఎవరెవరు ఎక్కడెక్కడి కెళ్లారో వివరించాను•

మరి మీకు భోజనం'

నా చేతుల్ని చూస్తే మీ ప్రశ్నకి సమాధానం గ్రహించగలరు అంటూ అక్కడక్కడా కాలి వాతలు బడ్డ నా రెండు చేతుల్ని చూపెట్టాను

అయ్యయ్యో! అదేమిటండీ అలా కాల్చుకున్నారు? పని మనిషి చేత వంట "

అఁ. మొదట ఆ పనే చేశాననుకోండి పని మనిషికే వంట బాధ్యతని అప్పగించి వెళ్లింది మా ఆవిడ ఒక్కరోజు మాత్రం పని మనిషి వండితే తిన్నాను ఆ రెండో రోజు నుండి మానేశాను ఎందుకని అడగరేం? ఆ తిండే తిన్నానంటే మా ఆవిడ తిరిగొచ్చే వరకైనా బ్రతుకుతానో లేదోనని

నేనలా అనడం తోటే గోపాలరావు విరగబడి నవ్వేశాడు గతంలో మేం ఓ నాలుగేళ్ళు గోపాలరావు వాళ్ల పక్కింట్లో అద్దెకుండే వాళ్లం కనుక వాళ్ల కుటుంబ సభ్యులకీ మా కుటుంబ సభ్యులకీ మంచి పరిచయమే వుంది అప్పుడప్పుడూ గోపాలరావు మా యింటికొచ్చి పోతుంటాడు

'రామనాధం గారూ! మీరేమైనా అనుకోండి వచ్చే రోజుల కంటే పోయే రోజులే నయమనిపిస్తున్నాయి రాబోయే రోజుల్లో ఈ భూతలం మీద ఆవగింజంత మానవత్వమైనా అగుపించదేమో అన్నాడు గోపాలరావు

ప్రశ్నార్థకంగా చూశాను

'కృతయుగంలో దర్మం నాలుగు కాళ్లతో నడిచేది త్రేతాయుగంలో ఓ కాలు తెగి ధర్మదేవత మూడు కాళ్లతో నడిచేది ద్వాపర యుగంలో రెండు కాళ్లే మిగిలాయి ఈ కలియుగంలో ధర్మదేవతకి ఒకే ఒక్క కాలు మిగిలింది ఆ ఒక్క కాలు కూడా యిప్పుడు ఘోరంగా నరికెయ్యబడుతూ వుంది

'ఎందుకలా అనుకుంటున్నారు?' తల తిప్పి గోపాలరావు వేపు చూశాను

మన కళ్ల ముందే విరాట్ స్వరూపాన్ని దరించి అవినీతి, అధర్మం విలయతాండవం చేస్తూ వుంటే యిక అలా అనుకోక తప్పడం లేదు తెలుగు నిఘంటువులోని 'అవినీతి' అనే పదం వుంది చూశారూ! అదివాళ సమస్త మానవ జీవితాన్ని శాసించే శక్తిలా పరిణమించి పోయింది

చిత్రంగా చూశాను ఆయన వేపు

అవును రామనాదం గారూ! యివాళ ప్రతి మనిషి నాలుక మీద అదృశ్యంగా వుండే బీజాక్షరాలు 'అవినీతి', ఈ దురన్యాయ వ్యవస్థలో అదే ఓంకారం. ఈ భారతదేశమనే భూగోళం మీద గంగ, యమున, బ్రహ్మపుత్ర యివి కాదు అన్యాయం, అక్రమం, లంచగొండితనం ఈ మూడే జీవనదులు" ఆవేశంగా అన్నాడు గోపాలరావు

'మీ మాటలు చిత్రంగా వున్నాయ్"

'చిత్రంగానే వుంటాయ్ రామనాధం గారూ! శరద్రాత్రుల్ని మాత్రమే చూసిన వాళ్ళు. అమావాస్య రాత్రుల్ని నమ్మలేరు నీతీ, నిజాయితీల మద్య జీవించి యిప్పుడు మీరు యింట్లో విశ్రాంతి తీసుకుంటున్నారు ఒక్కసారి వెలుపలికొచ్చి మన స్వతంత్ర బారత దేశాన్ని చూడండి వేదాలు పుట్టిన ఈ భూమి ఎంతగా క్షతగాత్రమై పోయిందో మీకే తెలుస్తుంది ఇతిహాసాల, పురాణాల సారాన్ని జీర్ణించుకున్న ఈ పవిత్ర క్షేత్రం లంచగొండితనంతో ఎంతగా కుళ్లి పోయిందో మీకే అర్థమవుతుంది యివాళ దురన్యాయమే మానవజాతి మత గ్రంధమని తెలుసుకోవాలనుకుంటే మీరోసారి వెలుపలి ప్రపంచంలోకి రండి'

'గోపాలరావుగారూ! మీరేదో ఆవేశంలో పడిపోతున్నారు మీ మాటలు వింటుంటే నాకు మా శంకరం గాడే గుర్తొస్తున్నాడు చదువుకునే రోజుల్లో శంకరం కూడా యింతే ప్రతి చిన్న విషయానికీ తీవ్రంగా ఆవేశపడిపోయేవాడు. అడగడం మరిచాను యింతకీ మీ శంకరం ఎలా

వున్నాడు? ఏం చేస్తున్నాడు?" శంకరం గురించి అడిగాను

"వాడి విషయం గుర్తుకొచ్చే నేను కాస్త ఆవేశపడ్డాను రామనాథంగారూ! శంకరం చదువైపోయి మూడేళ్ళు దాటింది. ఈ వూళ్ళోనే ఒక ప్రయివేటు కంపెనీలో సంవత్సరం నుండి వర్క్ చేస్తున్నాడు' చెప్పాడు గోపాలరావు

'ఉద్యోగం పర్మనెంటేనా?'

"ఓ అయిదు వేలు లంచం యివ్వగలిగితే పర్మనెంటవుతుంది లేదా ఈ నెల చివరికల్లా శంకరం ఉద్యోగం వూడిపోతుంది" గోపాలరావు దిగులుగా అన్నాడు.

'అదేమిటి?"

చచ్చిన తర్వాత వొల్లకాట్లో కాటికాపరి చేతుల్లో పెట్టేది బతికున్నప్పుడు ఆలయంలో దేవుడి హుండీలో వేశేదీ చ స్తూ బతుకుతున్నప్పుడు పై అధికారులకు సమర్పించేదీ. . దీన్నే లంచమంటారు లెండి '

"అసలు విషయం చెప్పండి

"మా తమ్ముడు శంకరం వర్క్ చేస్తున్న కంపెనీకి సంబంధించిన హెడ్డాఫీసు హైదరాబాద్‌లో వుందండి అందులోని మేనేజింగ్ డైరెక్టర్ గారికి అయిదు వేలు లంచం గానీ యిస్తే . శంకరాన్ని పర్మనెంటు చేస్తారట "

"అలాగా?"

"అవునండి. ఆ అయిదు వేలూ ఈ నెల చివరికల్లా తెచ్చివ్వమన్నాడట ఆ మేనేజింగ్ డైరెక్టర్ మా ఆర్థిక స్థితిగతులు మీకు తెలిసిందేగా శంకరాన్ని డిగ్రీ చదివించడానికే నేను చాలా యిబ్బందులు పడ్డాను మా అమ్మాయి పెళ్ళికి చేసిన అప్పు యింకా తీరలేదు" అన్నాడు గోపాలరావు

బరువుగా ఓ నిట్టూర్పు విడుస్తూ గోపాలరావు వేపు సానుభూతిగా చూశాను

మీకో షాకింగ్ న్యూస్ చెప్పనా?" అన్నాడు గోపాలరావు నా కళ్ళల్లోకి చూస్తూ

"చెప్పండి "

' ఆ మేనేజింగ్ డైరెక్టరెవరో కాదు ఒకప్పుడు మీ దగ్గర చదువుకున్న స్టూడెంట్ "

'ఈ న్యూస్‌కి నేను షాకై పోలేదండి నా స్టూడెంటైనంత మాత్రాన లంచగొండిగా మారడానికి వీల్లేదని శాసనం లాంటిదేమీ లేదనుకుంటాను '

గోపాలరావు మాట్లాడలేదు

"ఈ రోజు దేశాన్ని దోచుకుంటున్న కొందరు రాజకీయ నాయకులనబడే లైసెన్స్ డెకాయిట్స్. ఒకనాడు కాలేజీల నుంచి 'గుడ్ కాండక్ట్' సర్టిఫికెట్స్ తీసుకు వెళ్ళినవాళ్ళే '

"రామనాథంగారూ! యిప్పుడు నేను నిజంగానే మీకు షాకింగ్ న్యూస్ చెబుతున్నాను' అన్నాడు గోపాలరావు ఓ చిన్న మందహాసం చేస్తూ

' చెప్పండి "

"గిరిబాబు అనే అబ్బాయి ఈ వూళ్ళోని కాలేజీలో కొన్నేళ్ళ క్రితం బి. కాం. చదివాడు. అప్పట్లో మీరు వాళ్ళ క్లాసుకు వెళ్ళేవారు. అతనికి మీరంటే చాలా అభిమానం ఎంతో గౌరవం. ఈ గిరిబాబే శంకరాన్ని అయిదు వేలు లంచం అడిగిన ఆ మేనేజింగ్ డైరెక్టర్ అన్నాడు గోపాలరావు.

నేను ఆశ్చర్యపోయాను గిరిబాబు నా ఓల్డ్ స్టూడెంట్. నేనంటే అతనికి నిజంగానే ఎంతో అభిమానం. ఆర్నెల్ల క్రితం ఓ సారి గిరిబాబు నాకు హైదరాబాద్‌లో అగుపించి నాతో ఎంతో అభిమానంగా మాట్లాడాడు.

నేను దిగిన లాడ్జిలోని నా రూంని ఖాళీ చేయించి. నన్ను బలవంతంగా తన యింటికి తీసుకు వెళ్ళి నాకు రెండ్రోజులు ఆతిథ్యమిచ్చాడు గిరిభాబు

"రామనాథం గారూ! మా శంకరానికి మీరు గానీ అనుకుంటే ఆ ఉద్యోగాన్ని పర్మనెంటు చెయ్యగలరండి" నా వేపు అభ్యర్థనగా చూశాడు గోపాలరావు.

ఆయన మనసులోని అభిప్రాయాన్ని గ్రహించడానికి నాకు ఎక్కువ సేపు పట్టలేదు

వెంటనే కుర్చీలోంచి పైకి లేచి, బీరువా దగ్గరికి వెళ్ళి బట్టలు మార్చుకున్నాను ఓ సూట్‌కేస్‌ని ఓపెన్ చేసి, అందులో వున్న పాత డైరీని అందుకుని, పేజీలను తిరగేశాను గిరిబాబుకు సంబంధించిన విజిటింగ్ కార్డును జేబులో పెట్టుకుని గోపాలరావు దగ్గరి కొచ్చాను

"రండి గోపాలరావు గారూ!'

ఎక్కడికి?"

'గిరిబాబుకు ఫోన్ చేద్దాం '

"టెలిఫోన్ ఎక్ఛేంజిలోని జె ఇ గారు నాకు బాగా తెలుసు" అన్నాడు గోపాలరావు

"అయితే యింకేం పదండి '

యింటికి తాళం వేసి పావుగంటలో టెలిఫోన్ ఎక్ఛేంజికి చేరుకున్నాం టెలిఫోన్ జె ఇ తో మాట్లాడి హైదరాబాద్‌లోని గిరిబాబుకి ఎస్ టి డి చేశాం

"హలో" గిరిబాబు గొంతు.

"హల్లో గిరీ! నేను.. రామనాథం ."

"నమస్తే సార్! ఏమిటి విశేషం?"

"నువ్వో సాయం చెయ్యాలి గిరీ!"

' విత్ ప్లెజర్ "

"ఏం లేదు... యిక్కడ మా వూళ్ళో వున్న మీ కంపెనీ బ్రాంచాఫీస్‌లో శంకరం అనే కుర్రాడు టెంపొరరీ పోస్టులో వర్క్ చేస్తున్నాడు' అంటూ శంకరం గురించి వివరంగా చెప్పి సాయం చెయ్యమని అడిగాను

"థ్యాంక్యూ గిరీ!" ఫోన్ పెట్టేశాను

"ఏమంటున్నాడండి?' అమితమయిన ఆతృతతో అడిగాడు గోపాలరావు.

"యింకో మూడ్రోజుల్లో శంకరానికి పర్మనెంట్ ఆర్డర్ వస్తుంది" నేనా మాట అనడం తోటే కృతజ్ఞత నిండిన చూపుతో నా చేయి పట్టుకున్నాడు గోపాలరావు



యిద్దరం కల్సి హోటల్లో టిఫిన్ తిని, రోడ్డు మీది కొచ్చాం. గోపాలరావు దగ్గర సెలవు తీసుకుని రిక్షాలో, నేను యింటి కొచ్చేశాను. వీధిలోంచి యింట్లోకి వెళ్తూ వుంటే... 'నమస్కారం మాస్టారూ' అన్నారెవరో. తిరిగి చూశాను. మా యింటి ముందు నిలబడి నా వేపే చూస్తున్నాడో యువకుడు.

"బావున్నారా మాస్టారు? నేను మీకు బహుశా గుర్తులేకపోవచ్చు. ఆరేళ్ల క్రితం ఈ వూళ్లోనే నేను డిగ్రీ చదువుకున్నాను. నా పేరు దామోదరం. మీరు మాకు 'కాస్టింగ్' టీచ్ చేశేవాళ్లు. మాదీ వూరు కాదు, ముప్ఫయ్ కిలో మీటర్ల దూరంలో ఓ పల్లెటూరు" చెప్పాడా అబ్బాయి.

"అలాగా బాబూ! యిప్పుడేం చేస్తున్నావ్" అడిగాను దామోదరం వేపు చూస్తూ.

"ఉద్యోగ ప్రయత్నంలో విసిగిపోయాను. సార్! మీరు కాస్టింగ్‌లో అబ్ నార్మల్ వేస్టేజి, నార్మల్ వేస్టేజి గూర్చి చెబుతుండే వారు" అన్నాడు దామోదరం

బదులుగా నేను నవ్వాను

"యిండియా అనబడే ఈ యిండస్ట్రీలో నార్మల్ వేస్టేజ్ మెటీరియల్ ఏమిటో తెలుసా సార్? మిడిల్ క్లాస్ యిదొక యూజ్‌లెస్ క్లాస్" విరక్తిగా అన్నాడతడు.

"యింతకీ ఏం పని మీదొచ్చావు బాబూ?' అన్నాను ఏం మాట్లాడాలో తోచక

"మా నాన్నగారికి రావలసిన పెన్షన్... దానికి సంబంధించిన వర్కు మీద యివాళే ఈ వూరొచ్చాను యిక వస్తాను మాస్టారూ" నమస్కరించాడతడు.

"మంచిది నాయనా వెళ్లిరా" అంటూ దామోదరానికి ప్రతి నమస్కారం చేశాను

అతడు వెళ్లిపోయాడు

డిగ్రీ కాలేజి లెక్చరర్‌గా పదవీ విరమణ చేసిన నాకు.. అప్పుడప్పుడూ పాత విద్యార్థులు అగుపిస్తుంటారు. గౌరవాభిమానాలతో పలకరిస్తూ వుంటారు

అదో తియ్యని అనుభూతి

విద్యార్థి చేత గౌరవింపబడే లెక్చరర్ కంటే. లెక్చరర్ని గౌరవించే సంస్కారమూ సహృదయమూ గల విద్యార్థే ఉన్నతుడని నా అభిప్రాయం

మూడు రోజులు గడిచిపోయాయి క్యాంపు కెళ్లిన మా అబ్బాయి యింకా రాలేదు. మా ఆవిడ కూడా రాలేదు. యింట్లో ఏం తోచకపోవడంతో అలా తిరిగొద్దామని బజారుకి బయల్దేరాను. ట్రంక్ రోడ్డు మీద బి పి యస్ సెంటర్ దగ్గర మళ్లీ కన్పించి పలకరించాడు దామోదరం

ఏం దామోదరం! యింకా వూరెళ్లలేదా?" అడిగాను దామోదరాన్ని.

'లేదు మాస్టారూ! వచ్చిన పని యింకా జరగలేదు అసలు జరిగేటట్టు లేదు."

"అదేమిటి?"

'అంతే మాస్టారూ! ఈ దౌర్భాగ్య వ్యవస్థలో లంచగొండితనం మానవత్వానికి కర్మకాండలు నిర్వహిస్తూ వుంది"

"ఏమైంది దామోదరం?"

"తాలూకా ట్రెజరీ కార్యాలయంలో రెండు వందలు లంచం యివ్వని కారణంగా ఆ క్లర్కు నా పని చేసి పెట్టడం లేదు" అసలు విషయం చెప్పాడు దామోదరం.

ట్రెజరీ ఆఫీస్‌లో ఉద్యోగం చేస్తున్న గోపాలరావు గుర్తొచ్చాడు నాకు

"సరే దామోదరం . రేపు ఉదయం పదకొండు గంటలకి నువ్ ట్రెజరీ ఆఫీస్‌కి వచ్చేయ్ నేనూ వస్తాను తప్పకుండా నీ పని జరిగిపోతుంది. ఆ ఆఫీసులో గోపాల్రావని నాకు బాగా పరిచయమున్న ఒకాయన . "

'లంచం యివ్వమని నాల్గు రోజుల్నుంచి నన్ను వేపుకు తింటున్నది ఆ గోపాల్రావే మాస్టారూ!"

'ఆ..." శిలలా బిగుసుకు పోయాను మనిషి ద్వంద్వ ప్రమాణాలతో జీవిస్తున్నాడా??

"దామోదరం! తప్పకుండా రేపు ఉదయం పదకొండు గంటలకి ఆఫీస్ దగ్గరికి వచ్చేయ్"– అనేసి అక్కడ్నుంచి వెనుతిరిగి మళ్లీ యింటి కొచ్చేశాను

అరగంట తర్వాత ముఖం చాటంత చేసుకుని మా యింటి కొచ్చాడు గోపాలరావు

"రామనాథం గారూ! మీ ఋణమెలా తీర్చుకోవాలో తెలియడం లేదండి మా శంకరం గాడికి యివాళే పర్మనెంట్ అపాయింట్‌మెంట్ వచ్చింది."

"చాలా సంతోషం గోపాలరావుగారూ! మిమ్మల్ని ఓ మాట అడుగుతాను. నిజం చెబుతారా?"

"అడగండి "

"దామోదరం అనే ఓ అబ్బాయి ఓ పని మీద మీ ఆఫీస్ కొచ్చి నాల్గురోజుల్నించి మీ చుట్టూ తిరుగుతున్నాడు మీరతన్ని రెండొందలు లంచమడిగారా లేదా?"

నేనలా సూటిగా ప్రశ్నించే సరికి గోపాలరావు బిత్తరపోయాడు నా ముఖంలోకి చూడలేక తల దించుకుని నేల చూపులు చూస్తూ తగ్గు స్వరంతో "నిజమేనండి అడిగాను" అన్నాడు గోపాలరావు. రెండు క్షణాల పాటు మా మధ్య మాటలు కరువై.. మౌనం అల్లుకు పోయింది.

"మీ శంకరం ఉద్యోగానికి గిరిబాబు అయిదు వేలు లంచం అడిగినందుకు ధర్మం, న్యాయం, అంటూ మీరెంతగా ఘోషించారో మీకు గుర్తుందా? చూడండి! ధర్మం, న్యాయం, నీతీ యివి మనకు గుర్తు రావలసింది మనకు ఎదుటి వాడి వల్ల అన్యాయం జరిగినప్పుడు కాదు ఎదుటి వాడికి మన వల్ల అన్యాయం జరుగుతున్నప్పుడు "

గోపాలరావు మాట్లాడలేదు

'కలియుగంలోని ధర్మదేవతకి మిగిలిన ఆ ఒక్క పాదం కూడా నరికెయ్యబడుతూ వుందని బాధ పడ్డారు అందులో మీ పాత్ర కూడా వుందని గుర్తించండి. నిఘంటువులోని 'అవినీతి' అనే పదం నిఘంటువును వదిలేసి, మీబోటి వాళ్ళ గుండెల్లో శాశ్వత స్థావరాన్ని ఏర్పరచుకొన్నదని ఏనాటికైనా గ్రహించండి గోపాలరావు గారూ!"

అయన ముఖం పాలిపోయింది.

"ఏ రకం మనుషుల నాలుకల మీద 'అవినీతి' అనే బీజాక్షరాలు అదృశ్యంగా వున్నాయో.. ఏ తరగతి మనుషులకి అది ఓంకారమో .. ఏ రకమైన జాతికి దురన్యాయం ఒక మతగ్రంథమో.. వేదాల్ని పుట్టించిన ఈ భారత మాత దేహం ఏ దానవ జాతి వల్ల క్షతగాత్రమై పోయిందో పురాణాల సారాన్ని పూర్తిగా జీర్ణించుకున్న ఈ పవిత్ర క్షేత్రం... లంచగొండితనంతో కుళ్లి పోవడానికి ఏ తెగ పురుగులు కారణమో యివన్నీ మీకు తెలియదని నేననుకోను" తీవ్రంగా అనేశాను.

"రామనాథం గారూ! ఈ వ్యవస్థలో నేనింక అంతర్భాగాన్ని మాత్రమే. యిదొక దట్టమైన అడవి. యిందులో సంచరించే జంతువుల కొక నిర్దుష్టమైన జీవన విధానం వున్నట్టు అగుపిస్తుంది కానీ వుండదు. యిక్కడ ప్రతి ప్రాణీ తన కంటే బలవంతమైన ప్రాణి నుండి . తనను తాను రక్షించుకుంటూ తన కంటే బలహీనమయిన ప్రాణిని వేటాడుతుంది. నేనూ అదే చేశాను మృగ ధర్మమే ఈ నాటి యుగధర్మం" గోపాలరావు మాటలకి నేను స్థాణువైపోయాను. ●

''రాయల్ కామన్ వెల్త్ సొసైటీ'' (లండన్) నిర్వహించిన వ్యాస రచన పోటీలో భారతదేశంలో ఆంధ్రప్రదేశ్‌కి చెందిన తూర్పు గోదావరిలోని కాకినాడకు చెందిన కుమారి ఐ హిమబిందుకి అవార్డు లభించింది. ఈ బాలిక గోదావరి ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ రీజనల్ మేనేజరు శ్రీ ఐ కృష్ణమూర్తి కుమార్తె



ANDHRA SACHITRA VARA PATRIKA (Weekly)

Effective from 1-2-1989

(ALL FLAT RATES)

INSIDE FULL PAGE (B & W)	Rs	2,500/-
INSIDE HALF PAGE "	Rs	1,300/-
INSIDE QUARTER PAGE "	Rs	650/-
INSIDE FULL PAGE (MULTICOLOUR)	Rs	5,000/-
BACK COVER (MULTI COLOUR)	Rs	8,000/-
SECOND/THIRD COVERS	Rs	3,000/-
CENTRE SPREAD (MULTI COLOUR)	Rs	10,000/-
DOUBLE SPREAD B & W	Rs	5,000/-

Opening Page/Specified Position	15% Extra
Bleed Size	25% Extra
Box No Charges	Rs 8/- Extra
Classified advertisment minimum space acceptable 5 Cm x 1 Col	Flat Rate Rs 200/-

TECHNICAL DATA

Overall/Bleed Size	27 Cm x 20 Cm
Full Page	23 Cm x 17 Cm
Quarter Page	11 5 Cm x 8 5 Cm
Quarter Page Horizontal	6 Cm x 17 Cm
Half Page Vertical	23 Cm x 8 5 Cm
Half Page Horizontal	11 5 Cm x 17 Cm

LAST DATE FOR ACCEPTANCE OF MATERIALS:
For Black & White 30 days, for Colour 40 days before the date of Publication

DAY OF PUBLICATION: FRIDAY



PRINTED IN PHOTO OFFSET PROCESS

పెద్దల్లుడు

టి.వి. పద్మావతి

"ఎట్లాగూ అంత దూరం వెళ్తున్నారు కదా! అమ్మాయి ఇంటి దాకా వెళ్ళి రండి అల్లుడు గారితో కూడ విషయం చెప్పండి భర్త చేతికి సంచి యిస్తూ చెప్పింది- భారతమ్మ

"చూద్దాం" అన్నాడు శివరామయ్య

"నా మాట వినండి కోప తాపాలకు ఇది సమయం కాదు ఆడపిల్లను యిచ్చిన చోట మనమే సర్దుకపోవాలి తప్పుతుందా అదీగాక పెద్దల్లుడాయె

పెద్దల్లుడు నిరసనగా గొణుక్కున్నాడు శివరామయ్య

"మన తప్పు ఎందుకు వుండాలి ఈ ఒక్కసారి నా మాట వినండి ప్రాధేయపడింది భారతమ్మ

"అలాగేలే ఇంటి దగ్గర జాగ్రత్త"

'జాగ్రత్తగా వెళ్ళిరండి

* * * *

రైల్లో కిటికి ప్రక్కన కూచొని చేతిలో వున్న ఖాళీ సంచి వొంక చూసుకుని చిన్నగా నవ్వుకున్నాడు శివరామయ్య

జీవితంలో ఇలాంటి పరిస్థితి వస్తుందని ఎప్పుడూ వూహించలేదు ఇద్దరు ఆడపిల్లలంటే లక్ష్మి, సరస్వతులని మురిసిపోయాడు గాని- వాళ్ళే 'లక్ష్మి' కోసం తననిట్లా తిప్పలు పెడతారని వూహించలేదు

పెద్దమ్మాయి పెళ్ళి అంత కష్టమనిపించలేదు పల్లెటూర్లో బడి పంతులుగా ఉద్యోగం చేస్తుండ బట్టి, శివరామయ్య మంచితనం తెలిసిన వూరి పెద్దలు తలా ఒక చెయ్యి వెయ్యటం వలన సులభంగానే జరిగిపోయింది

రిటైర్మై పట్నంలో స్థిరపడి–చిన్నదాని పెళ్ళి చేయవలసి వచ్చేసరికి కష్టమేమిటో తెలియవచ్చింది నిజానికి పెద్ద అల్లుడు దగ్గర వుండి అన్ని పనులు చూసుకోవలసింది కాని ప్రాణం కంటె అభిమానానికి ఎక్కువ విలువ నిచ్చే శివరామయ్య 'ముహూర్తాలు' పెట్టుకుంటున్నట్టు కార్డు ముక్క కూడ వ్రాయలేదు

అందుకు కారణం – శివరామయ్యకు అల్లుడు మీద ఏర్పడిన కోపమే! ఎలాంటి అల్లుడు రావాలని ఆశించాడో, అందుకు విరుద్ధంగా జరిగిందని బాధపడిపోయాడు

పెద్ద అల్లుడు కోసం పడిన ఆరాటం శివరామయ్య .కళ్ళ ముందు కదలాడింది అప్రయత్నంగా మనసు గతంలోకి పరుగులు తీసింది

* * * *

శివరామయ్యకు పెద్దమ్మాయి సుజాత అంటేనే రవంత ఎక్కువ ఇష్టం చిన్నమ్మాయి సుశీల కొంచెం అల్లరి సుజాత అట్లాకాదు పసితనం నుంచే ఎంతో లలితంగా వుండేది.

ఎప్పుడైనా కోపం వస్తే– చిన్నపిల్లను కసిరేవాడు గాని పెద్దమ్మాయి జోలికి వెళ్ళేవాడు కాదు "ఏం తల్లీ!" అని ఆప్యాయంగా పిలుచుకునేవాడు.

భారతమ్మ పైకి అగుపించేది కాదు గాని 'సుజాత' అంటేనే ఆమెకూ చాలా ఇష్టం ఆ ఇష్టతకు కారణం– ఆ అమ్మాయిలోని అమాయకత్వం, వినయం ఏ విషయంలోను తల్లిదండ్రుల మాటకు ఎదురు చెప్పి ఎరగదు సుజాత

అందుకే పువ్వుల్లో పెట్టి చూసుకున్నారు

'ఎట్లా పెంచుకున్నా, ఎలా చూసుకున్నా– ఓ 'అయ్య' చేతిలో పెట్టక తప్పుతుందా!

ఆస్తి, అంతస్తు లేకపోయినా– సహృదయుడైన కుర్రాడు పెద్దల్లుడుగా రావాలని శివరామయ్య ఇష్టం

కుందనపు బొమ్మలా వున్న సుజాతకు చాలా సంబంధాలు వచ్చాయి కాని శివరామయ్య ఆశించిన కుర్రాడు ఆయన దృష్టిలోకి రాలేదు

సుజాత పెళ్ళి విషయంలో ఎలాంటి సర్దుబాట్లకు పోవటం ఆయనకు ఇష్టం లేదు

అందుకే తొందరపడలేదు పెద్దల్లుడి అన్వేషణ మాత్రం కొనసాగిస్తూనే వున్నాడు. నమ్మకమైన మిత్రులకు చెప్పి వుంచాడు

ఒకరోజు – హైస్కూల్లో తెలుగు మాస్టారుగా పని చేస్తున్న మిత్రుడు రంగయ్య ఓ కుర్రాణ్ని వెంట బెట్టుకుని వచ్చాడు

కుర్రాడు పెద్ద రంగు కాదు కానీ, చక్కని చిరునవ్వుతో ఆకర్షణీయంగా వున్నాడు

"మన కుర్రాడే మిమ్మల్ని పరిచయం చేద్దామని తీసుకొచ్చాను అన్నాడు రంగయ్య మాష్టారు

విషయం కొంచెం అర్థమైంది– శివరామయ్యకు

పరిచయాలు పూర్తయ్యాక– కాసేపు బాతాఖానీలో పడ్డారు కుర్రాడు ప్రక్కనే వున్న పత్రికలో తలదూర్చాడు

అప్పుడు నిశితంగా పరీక్షించాడు శివరామయ్య

కుర్రాడు చక్కగానే వున్నట్లనిపించింది వెంటనే ఒక నిర్ణయానికి వచ్చే మనస్తత్వం కాదు కాబట్టి ఆలోచిస్తూ వుండిపోయేడు. ఎలాంటి సంబంధం వొచ్చినా "ఇంకా మంచి సంబంధం రావాలి నా తల్లికి' అనుకునే వాడు. అందుకే ఒక నిర్ణయానికి రాలేకపోయేడు

ఇంతలో కాఫీ లొచ్చాయి.

మా పెద్దమ్మాయి సుజాత" అని పరిచయం చేశాడు శివరామయ్య వంట పని చేస్తూ అట్లాగే వచ్చినట్లుంది చాలా సహజంగా, మామూలుగా వుంది, చిరునవ్వుతో 'నమస్కారం' అంది రంగయ్య మాస్టారి వొంక చూస్తూ

"రెండో అమ్మాయి 'సుశీల' అని పరిచయం చేశాడు. చక్కగా ముస్తాబై వుంది సుశీల

మళ్ళీ రవంత సేపు పిచ్చాపాటీ మాట్లాడుకున్నారు

వాళ్ళు వెళ్ళే ముందు– 'కుర్రాడి పేరు ఏమిటన్నావ్" అడిగేడు శివరామయ్య

"శశిధర్" చెప్పేడు రంగయ్య– 'మళ్ళీ కనిపిస్తాను' అని చెప్పి కుర్రాడిని తీసుకుని వెళ్ళిపోయేడు రంగయ్య మాస్టారు

కొంచెం దూరం నడిచాక శశిధర్‌ను అడిగేడు రంగయ్య

"అమ్మాయి ఎలా వుంది."

శశిధర్ దృష్టిలో అలంకరించుకుని వున్న చిన్నమ్మాయి 'సుశీల' మెదులుతోంది మామూలుగా వున్న 'సుజాత'ను పరీక్షించి చూడలేదు కూడా సామాన్యంగా పెళ్ళి కాబోయే అమ్మాయినే ముస్తాబు చేస్తారు కదా'అనుకున్నాడు.

చాలా బావుంది' అన్నాడు సుశీలను గుర్తు తెచ్చుకుంటూ


'అమ్మాయి చాలా మెతక సంసారానికి అనువైన పిల్ల ఆయన ఆశలన్ని పెద్దల్లుడి మీదే వున్నాయి అందుకేఎందరు వచ్చినా ఆయన తొందరపడలేదు "

పెద్దల్లుడా?

"అవును సుజాతను చూడలేదూ! ఆ అమ్మాయి సంగతే నేను చెప్పేది'

'క్షమించండి నేను చిన్నమ్మాయి విషయం అనుకున్నాను సుజాతను నేను సరిగా' గమనించలేదు" నొచ్చుకున్నట్లు మాట్లాడేడు శశిధర్

రంగయ్య మాస్టారుకు విషయం అర్థమైంది



"భలే! వాడివయ్యా! మరోసారి వెళ్ళి చూద్దాంలే!" ముందుగా నీకు వివరించి చెప్పకపోవటం నాదే తప్పు

"అఖ్ఖర్లేదు. నేను పెద్దమ్మాయినే చేసుకుంటాను అభ్యంతరం ఏమీ లేదు."

'మరి చూడలేదన్నావ్ "

"ఆ అమ్మాయిని చూడవలసిన అవసరం లేదు. ఆ అమ్మాయిలో వుండే 'సింప్లిసిటి' నాకెంతో నచ్చింది అలాంటి అమ్మాయే నాకు కావాలి శివరామయ్య గారిని కనుక్కోండి. వాళ్ళ అభిప్రాయంతో ఉత్తరం వ్రాయండి అని వెళ్ళిపోయేడు శశిధర్.

రంగయ్య మాస్టారు ద్వారా జరిగిన విషయం తెలుసుకున్న శివరామయ్య సంబరపడిపోయేడు శశిధర్ ఆ మాట అనటం శివరామయ్యకు పరమానందం కలిగించింది. తను ఎన్నాళ్ళగానో ఎదురు చూస్తున్న పెద్దల్లుడి లక్షణాలు శశిదర్‌లో కనిపించాయి.

వెంటనే తమ్ముడు నాగేంద్రానికి కబురు పెట్టేడు కుర్రాడి గురించి పూర్తి వివరాలు తెలుసుక రమ్మని పంపించాడు

నాగేంద్రం చాలా హుషారైన వ్యక్తి

నేరుగా వెళ్ళి శశిధర్‌తో మాట్లాడేడు శశిధర్ అతనికి అన్నివిదాల నచ్చాడు పెద్దగా ఆస్తి అంతస్తు లేకపోయినా 'ఉద్యోగం' వుంది. ఇంట్లో బాదర బంద్రీ లేదు తల్లి, తను వుంటున్నారు శశిధర్ వాళ్ళ అమ్మ కూడ పాత కాలం మనిషి

తర్వాత తనకు తెలిసిన వ్యక్తుల ద్వారా శశిధర్ చాలా మంచి కుర్రాడని, కవిత్వం కూడ రాస్తాడని, ఈ కాలపు కుర్రాడు కానే కాదని- తెలుసుకుని తృప్తిగా తిరిగి వచ్చాడు

అన్ని విషయాలు నాగేంద్రం పూసగ్రుచ్చినట్లు చెప్పుంటే ఆనందంతో శివరామయ్య కళ్ళు చెమ్మగిల్లినై

తను వూహించిన దాని కంటె 'ఉత్తముడు' లభిస్తే ఆనందం గాక మరేమిటి?

ఆ రాత్రి ఇంట్లో చిన్న సమావేశం ఏర్పాటు చేశాడు

పిల్లలిద్దరితోను చాలా కలిసిమెలసి వుంటాడు శివరామయ్య ఆ ఇంట్లో అందరూ మంచి స్నేహితుల్లాగా వుంటారు

–అంతా చెప్పి "నీ అభిప్రాయం చెప్పు తల్లీ అని సుజాతను ప్రేమగా అడిగాడు.

"మీ ఇష్టం నాన్నగారు' అంది సుజాత

'అక్కయ్యతో పోలిస్తే కొంచెం కలర్ తక్కువ అంది సుశీల

"మనసు తెల్లగా వుండాలి కాని మనిషి ఎలా వుంటే ఏమమ్మా అయినా కుర్రాడి కేం?" అన్నాడు శివరామయ్య

"నా అభిప్రాయం చెప్పాను అంది సుశీల

ఆ మాట పట్టించుకోకుండా సుజాత వంక ప్రశ్నార్థకంగా చూశాడు శివరామయ్య

"మీరు చెప్పిందే నిజం నాన్నగారూ' అన్నిటి కంటె మనసు ముఖ్యం అంది క్లుప్తంగా సుజాత.

అందరి అంగీకారంతో, సంతోషంగా సుజాత పెళ్ళి జరిగి పోయింది. శివరామయ్య మనసు పరమానంద భరితమైంది.

సుజాత కంటె ఎక్కువగా అల్లుణ్ని చూసుకున్నాడు. కాదంటే పెళ్ళిలో చిన్న అపశృతి పలికింది

కట్నం డబ్బు ముప్పైవేలు అమ్మాయి పేరుతో "ఫిక్సడ్" చేయమని, తనకేమీ అభ్యంతరం లేదని పెళ్ళికి ముందు శశిధర్ చెప్పేడు. శశిధర్ మంచితనానికి అందరూ మురిసిపోయేరు

పెళ్ళి సమయంలో మాత్రం శశిధర్ వాళ్ళ అన్నయ్య సుతరామూ అంగీకరించలేదు. "కట్నం డబ్బుతో మీకు పనేమిటి? ఆ డబ్బు మీ అమ్మాయి పేరుతో వుండేది ఏమిటి? మా అబ్బాయి మీద నమ్మకం లేదా? అని నిలదీసి అడిగేసరికి అందరూ మౌనంగా వుండిపోయేరు

"పెద్దల్లుడు"

అదీ నిజమే! కుర్రాణ్ని నమ్మి అమ్మాయినే అప్పగిస్తున్నప్పుడు డబ్బు దేముంది? ఆ విషయంలో శివరామయ్య ఏమీ బాధపడలేదు ముప్పైవేల రూపాయలకు చెక్కు రాసి శశిధర్ చేతికిచ్చారు.

పెళ్ళి అయిన వారం రోజులకు ఆషాఢ మాసం వొచ్చింది. శశిధర్ వెళ్ళిపోయేడు. సుజాత ఇంటి దగ్గరే వుండిపోయింది.

వారం రోజుల తర్వాత శివరామయ్య బ్యాంక్‌కి వెళితే బ్యాంక్ మేనేజర్ పలకరించాడు. మాటల మధ్యలో

"మీ అల్లుడుగారు నిన్ననే వచ్చి చెక్ క్యాష్ చేసుకుని వెళ్ళారు" అన్నాడు.

శివరామయ్య ఆశ్చర్యపడిపోయాడు.

అల్లుడు ఇంత దూరం వచ్చి కనిపించకుండా వెళ్ళాడంటే నమ్మశక్యం కాలేదు. వెంటనే అల్లుడుకి వుత్తరం రాసేశాడు.

"ఆషాఢం కాదు ఇంటికి రాకూడదని రాలేదు. బ్యాంక్ నుంచి నేరుగా వూరికి వొచ్చేశాను" అని శశిధర్ తిరుగు జవాబు రాశాడు

తొలిసారిగా శివరామయ్య మనసు కలుక్కుమంది.

తను అడిగే వరకు వచ్చిన విషయమే తెలియజేయలేదు. ఈ విధంగా వచ్చి క్యాష్ తీసుకెళ్ళాను 'అని వ్రాసి వుంటే ఎంత బావుండేది? అని మనసులోనే మథనపడ్డాడు.

కాని బైటపడ తలుచుకోలేదు.

క్రొత్త దంపతుల్ని ఆషాఢ మాసం బారి నుండి రక్షించటానికి తిరుపతి, బెంగుళూరు వెళ్ళిరమ్మని డబ్బులు కూడ యిచ్చాడు. వెంకటేశ్వర స్వామికి కళ్యాణం చేయించమని మరికొంత డబ్బు ప్రత్యేకంగా యిచ్చాడు.

కూతురు, అల్లుడు వెళ్తుంటే ఆనందంగా చూస్తుండిపోయేడు.

తిరుపతి, బెంగుళూరుల్లో వున్న బంధువులకు ముందుగా వుత్తరాలు రాశాడు. తిరుపతి, బెంగుళూరు, మైసూరు, వూటి అన్ని తిరిగి ఆషాఢ మాసం చివరి దశలో తిరిగి వచ్చారు

సుజాత విశేషాలు చెప్తుంటే తృప్తిగా విన్నాడు శివరామయ్య.

"స్వామి దగ్గర కళ్యాణం ఎవరి పేరుతో చేయించారమ్మా" అడిగేడు

సుజాత మౌనంగా వుండిపోయింది

"కళ్యాణం చేయించలేదు నాన్నా"

"అదేమిటమ్మా! ఎందుకని?"

"వారు వొద్దన్నారు నాన్నా' అనవసరంగా 'డబ్బులు దండగ అన్నారు' శివరామయ్య బాధ పడ్డాడు.

"దైవ కార్యానికి డబ్బులు దండగ ఏమిటి? అని మనసులోనే అనుకున్నాడు

డబ్బులు విషయంలో అల్లుడు చాలా పిసినారి అని తీర్మానించుకున్నాడు. కాని పైకి ఏమీ అనలేదు ఆలోచిస్తూ మౌనంగా వుండిపోయేడు

నాలుగు రోజులు గడిచాక సుజాత ఓ రాత్రి పడక గదిలో శశిధర్‌ని అడిగింది

"నేనొక మాట అడుగుతాను మీరు బాధ పడరు కదా!'

"ఏమిటో అడుగు "

"మీరు బ్యాంక్ నుంచి పైకం తీసుకెళ్ళిన విషయం నాన్నగారికి ఎందుకు చెప్పలేదు?"

'ఎందుకు చెప్పాలి? నాకు ఇచ్చిన డబ్బులే కదా!

కనీసం ఇంత దూరం వచ్చినపుడు కనిపించైనా వెళ్ళాల్సింది. లేకుంటే జాబు ద్వారా తెలియజేసినా బావుండేది.'

సమాధానం చెప్పలేదు– శశిధర్

'కోపం వచ్చిందా?" అడిగింది సుజాత

"లేదు. చెప్పకపోవటం పొరపాటేనేమో!" అన్నాడు

'మరి ఆ డబ్బులు ఏం చేశారు?"

"చెప్పాలా?"

"అక్కర్లేదు వూరకే అడిగాను "

అంతే. సుజాత మరేమీ మాట్లాడలేదు.

శశిధర్ వూరెళ్ళిపోయేడు. వారానికి వస్తానన్న మనిషి రెండు వారాలైనా రాలేదు. వుత్తరం లేదు

విషయం తెలుసుకున్న శివరామయ్య కూతుర్ని మందలించాడు మరెప్పుడూ అలా అడగవద్దని చెప్పాడు

ఆ రోజే ఒక నిర్ణయానికి వొచ్చేశాడు డబ్బుల విషయంగా అల్లుణ్ని ఏమీ అడగకూడదు. ఆ విషయంలో మాత్రం అల్లుడు మహాగట్టి వాడు– అని తీర్మానించుకున్నాడు

ఆత్మాభిమానం నిండుగా వున్న శివరామయ్య, అల్లుడి ప్రవర్తనకు తగ్గట్టుగానే తనూ వుండాలని స్థిరంగా అనుకున్నాడు

వేన్నీళ్ళు ఎవరు పెట్టమన్నారు? నాకు చన్నీళ్ళు చాలు డబ్బులు దండగ "

"నా కోసంగా వేరే కూరలేమీ చెయ్యవద్దు పిండి వంటలు అసలే వద్దు అనవసర ఖర్చు'– శశిధర్ వున్న కొద్ది రోజులూ ఈ విధంగా ఏదో ఒక మాట అంటూ వుండటం, శివరామయ్య గమనించాడు

గతాన్ని తలచుకుని బాధ పడే మనిషి కాదు శివరామయ్య భవిష్యత్తు గురించి మాత్రమే ఆలోచించే వ్యక్తి

పెద్దల్లుడిని ఎంచుకోటంలో తను పొరపాటు పడ్డానని మనసులోనే బాధ పడ్డాడు శివరామయ్య

సుజాత కాపురానికి వెళ్ళింది

ఒకటి రెండు సార్లు వెళ్ళి చూసి వచ్చాడు భార్యాభర్తలిద్దరూ సంతోషంగానే వున్నట్లు గమనించాడు

కనీసం భార్యనైనా సరిగా చూసుకుంటే చాలు'– అనుకున్నాడు

"ఆయన చాలా మంచివారు నాన్నా' అలా అగుపిస్తారు కాని మీరంటే ఎంతో ప్రేమ" అని సుజాత చెప్తుంటే–

శివరామయ్య కూతుర్ని మనసులోనే అభినందించేవాడు.


"ఏ ఆడపిల్ల అయినా భర్త విషయంలో ఎట్లా మారిపోతుందో" తలచుకుని ఆశ్చర్యపోయేవాడు.

ఒకసారి– సుశీల పెళ్ళి విషయం మాట్లాడుతున్నాడు.

'మంచి సంబంధం చూడండి నాన్నగారూ" అంది సుజాత.

'చూస్తున్నాను తల్లీ! డబ్బుల విషయంలోనే భయంగా వుంది" అన్నాడు శివరామయ్య

అంతవరకు మౌనంగా వింటున్న . శశిధర్



సాధనా శ్రీవాత్సవ్ అభిమానులు

నేషనల్ నెట్‌వర్క్ అనౌన్సర్ సాధనాశ్రీవాస్తవ్ అభిమానుల సంఖ్య పెరుగుతున్నట్టుంది. ఆమె పురుషాభిమానులు ఆమెలో అందాన్ని, ఆకర్షణీయతను, సొగసును చూస్తున్నారట. ఆమె కంఠం, ఆమె వాడే భాషా కూడ ఆమెకు సహకరిస్తున్నాయి.

ఈలోగా మరో వార్త ప్రకారం, ఆమెకు సిద్ధార్థ శ్రీవాస్తవ్ అనే కజిన్ ఉన్నాడని తెలుపుతోంది. ట్రిస్టార్ విడియో అధిపతి అయిన సిద్ధార్థ కూడ బ్రహ్మచారేనట. విడియో నిర్మాతగా, పంపిణీకర్తగా పని చేసే సిద్ధార్థ జనం దృష్టిలో పడడానికి ఎక్కువగా ఇష్టపడడంట.



పులిక్కిపడ్డట్టు లేచి ఆఫీసులో అర్జంటు పని వుందని వెళ్ళిపోయేడు

శివరామయ్య తలకొట్టేసినట్టు బాధ పడ్డాడు శశిధర్‌ను డబ్బులు అడగాలన్న కోర్కెగాని, అతడు ఇస్తాడన్న ఆశగాని శివరామయ్యకు ఏ మాత్రం లేదు

తను ఆ మాట మాట్లాడటం వల్లనే అల్లుడు వెళ్ళిపోయేడని భావించుకున్నాడు పెద్దల్లుడి సహాయం లేకుండానే సుశీల పెళ్ళి ఘనంగా చెయ్యాలని మనసులో దృఢంగా నిర్ణయించుకున్నాడు

సుజాత ఎంత వుండమని బ్రతిమాలినా, వినిపించుకోకుండా వెంటనే తిరుగు ప్రయాణం కట్టాడు.

ఇంటికి వచ్చి జరిగినదంతా భార్యతో చెప్పి బాధ పడ్డాడు శివరామయ్య ఆమె కూడ భర్త వైపే మాట్లాడి అతనికి మరింత ధైర్యాన్ని కలిగించింది

ఆ వంతం మీదనే– సుశీలకు ముహూర్తం పెట్టుకుంటున్న, విషయం కూడ పెద్దల్లుడికి తెలియజేయలేదు. అందర్నీ పిలిచినట్టు పెళ్ళికి మాత్రం పిలుద్దామనుకున్నాడు

ముహూర్తం పెట్టుకున్న మాటే గాని, శివరామయ్య గుండె భయంతో వణకసాగింది కాని హైదరాబాద్‌లో వున్న స్నేహితుడు నమ్మకంగా చెప్పబట్టి ధైర్యంగా వున్నాడు హైదరాబాద్‌కు తిరిగి వుత్తరం వ్రాసి జవాబు కోసం ఎదురు చూస్తూ కూచోని, ఇహ లాభం లేదని తనే స్వయంగా బయల్దేరేడు

పెద్దల్లుడు వుండేది కూడ హైదరాబాదే కాబట్టి, ఆ విషయం కాస్త అల్లుడికి చెప్పి రమ్మని భారతమ్మ కోరింది సుజాతను చూడాలని, కనీసం సుజాత కోసమైనా వెళ్ళాలని అప్పుడు నిర్ణయించుకున్నాడు శివరామయ్య భార్య ముందు మాత్రం బైట పడలేదు

* * * *

అలసిన ముఖంతో, ఖాళీ సంచితో వాకిట్లో నిలబడి వున్న తండ్రిని చూచి ఆశ్చర్యపోయింది సుజాత

"నాన్నగారూ!" అంటూ ఒక్క పరుగున శివరామయ్య చెంతకు పరుగెత్తింది

నిస్తేజంగా కూతురుతో కలిసి ఇంట్లోకి నడిచేడు శివరామయ్య

ఎప్పుడు వచ్చారు? అమ్మ ఎలా వుంది? సుశీ బావుందా? ప్రశ్నల వర్షం కురిపించింది– సుజాత

శివరామయ్య రవంత సేపటికి మామూలు మనిషి అయ్యాడు

'ఉదయమే వచ్చాను తల్లీ' స్నేహితుడొకడు డబ్బులు ఇస్తానంటే వచ్చాను తీరా నేను వచ్చేసరికి వాడు ఫారిన్ వెళ్ళాడని తెలిసింది కనీసం మాట కూడ చెప్పకుండా పోయేడు ఆలోచిస్తూ అన్నాడు శివరామయ్య

"ఇప్పుడు డబ్బులతో ఏమి అవసరం నాన్నగారూ?

కూతురు ముఖం చూస్తూ అబద్ధం చెప్పలేకపోయేడు

సుశీల పెళ్ళి నిశ్చయమైంది అన్నాడు

సుజాత తండ్రి వొంక ఆశ్చర్యంగా చూసింది కనీసం మాట వరసకైనా చెప్పకుండానే సుశీల పెళ్ళి నిశ్చయించారంటే నమ్మలేకపోయింది

నిజమా! నాన్నగారూ'

"పెద్దల్లుడు"

'అవును తల్లీ

"మేము బ్రతికే వున్నాం కదా' ఒక్కమాటైనా చెప్పకూడదా' అంత కాని వాళ్ళమైపోయామా? ఏడ్చేసింది సుజాత

శివరామయ్య ఇలాంటి పరిస్థితిని ఎదుర్కోవలసి వస్తుందని ముందుగా వూహించలేదు సుజాత కన్నీళ్ళు పెట్టుకుంటే సహించగలడా'

"లేదమ్మా' అనుకోకుండా జరిగిపోయింది జాబు వ్రాస్తే మీరు బాధపడతారని నేనే స్వయంగా వచ్చాను" అని సముదాయించాడు

"కుర్రాడు ఏం చేస్తుంటాడు నాన్నా!"

బ్యాంక్‌లో ఉద్యోగం ఈడు జోడు బావుంటుంది "

"మరి ఇంత త్వరగా ముహూర్తాలు పెట్టుకోవటం ఏమిటి?'

చెప్పాను కదమ్మా' తర్వాత ఆర్నెల్ల వరకు మంచి ముహూర్తాలు లేవట అందుకే అనుకోకుండా అంతా జరిగిపోయింది.

'కట్నం ఎంత అడిగారు నాన్నా" చెప్పాడు శివరామయ్య

"అంత డబ్బు మీ దగ్గర ఎక్కడ వుంది?"

'లేదు తల్లీ' ఆ పని మీదే వచ్చాను. వచ్చాక తెలిసింది లాభం లేదని అన్నిటికి భగవంతుడే వున్నాడు" నవ్వుతూ అన్నాడు శివరామయ్య

ఇంతలో శశిధర్ రావటంతో సంభాషణ ఆగిపోయింది

శివరామయ్య నవ్వుతూ పలకరించాడు

శశిధర్ కూడ ఆప్యాయంగా కుశల ప్రశ్నలు అడిగాడు అందరూ భోజనానికి కూచున్నారు

మామగారు వచ్చిన విషయం తెలుసుకున్నాడు శశిధర్. సుజాత భర్తతో - సుశీల పెళ్ళి విషయం అంతా చెప్పింది కాని, శివరామయ్య డబ్బు కోసం పడుతున్న తిప్పలు మాత్రం చెప్పకుండా దాటేసింది

కూతురు తెలివికి శివరామయ్య సంతోషించాడు

అల్లుడికి ఆ విషయం తెలియటం శివరామయ్యకు సుతరామూ ఇష్టం లేదు. తను కూడ చెప్పదలుచుకోలేదు.

భోజనాలు అయిన తర్వాత - తను వెళ్తానని పట్టుబట్టేడు శివరామయ్య

సుజాత, శశిధర్‌లు వొప్పుకోలేదు

రేపు వెళ్ళండని బ్రతిమాలారు

కాని శివరామయ్య ఆలోచన వేరు వూరెళ్ళి మళ్ళీ డబ్బు కోసం తీవ్రంగా ప్రయత్నించాలి రోజులు అట్టే గడిచిపోతాయి కదా' ముందుగా జాగ్రత్తపడకపోతే, తర్వాత బాధ పడి లాభం వుండదు.

'ఎన్నో పనులు వుండిపోయాయి ఈ విషయం మీకు చెప్పటానిగ్గాను మళ్ళీ వస్తాను కదా" అన్నాడు

'సరే నేను ఆఫీసు నుంచి త్వరగా వస్తాను మీరు రెడీగా వుండండి" అంటూ వెళ్ళిపోయేడు శశిధర్

శశిధర్ చెప్పిన టైంకి రాకపోయేసరికి- శివరామయ్య ప్రయాణానికి సిద్ధమయ్యాడు

కుమార్తెతో వస్తానని చెప్పి రైల్వే స్టేషన్‌కు వెళ్ళిపోయేడు

* * * *

హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్‌లో కూచోని దిగులుగా ఆలోచిస్తున్న శివరామయ్యకు ప్లాట్‌ఫారమ్ మీద పరుగెత్తుకుంటూ వస్తున్న శశిధర్ కనిపించాడు

ప్రతి కంపార్టుమెంటు పరిశీలిస్తూ వస్తున్నాడు శశిధర్

శివరామయ్య దగ్గరకు వచ్చేసరికి గార్డు 'విజిల్' వేశాడు

శశిధర్ తన చేతిలోని ప్యాకెట్ మామయ్య చేతికిస్తూ- అందర్ని అడిగినట్టు చెప్పండి" అన్నాడు

చేతిలోని ప్యాకెట్ వంక చూస్తూ-

'ఇదేమిటి బాబూ!" అన్నాడు శివరామయ్య

శశిధర్ చిన్నగా నవ్వుతూ-

మీరు సుజాతతో మాట్లాడిన మాటలన్ని నేను విన్నాను మామగారూ ఆ రోజు మీరు కట్నంగా యిచ్చిన డబ్బులు బ్యాంక్‌లో వేసి వుంచాను వాటి అవసరం నాకు రాలేదు ఆ కట్నం డబ్బులే ఇవి సుశీల పెళ్ళి నిర్విఘ్నంగా జరిపించండి" అన్నాడు


ఇంతలో పెద్ద శబ్దం చేసుకుంటూ ట్రైన్ కదిలింది

ఆకాశమంత ఎత్తు ఎదిగిన పెద్దల్లుడ్ని చూస్తున్న శివరామయ్య కళ్ళు ఆనందంతో వర్షించినై ●

ఈ' వేమన పద్యాలు

పాప సముద్రం

అల్పసుఖము గోరి యతివలపై యాస
స్వల్పమైన పెరిగి సాంద్రమగును
భ్రమల జిక్కినపుడె ప్రబలును పాపంబు
విశ్వదాభిరామ వినురవేమ



శ్రీకృష్ణలీలావైభవం

ప్రయాగ రామకృష్ణ

రుక్మిణమ్మ పెండ్లికూతురాయనే....

విదర్భ దేశాన్ని భీష్మకుడు అనే రాజు పరిపాలిస్తుండే వాడు. ఆయనకు రుక్మి, రుక్మరథుడు, రుక్మబాహుడు, రుక్మకేశుడు, రుక్మమాలి అని అయిదు గురు కొడుకులు. వీళ్ళందరికీ ముద్దుల చెల్లెలు రుక్మిణి. ఒకే ఒక కూతురు కావడంతో తల్లిదండ్రులు ఆ అమ్మాయిని చాలా గారాబంగా పెంచారు. రుక్మిణి, పండితుల సన్నిధానంలో విద్యాబుద్ధులు నేర్చుకుని పెరిగి పెద్దదయింది. గుణ శీలాలలో మంచి పేరు తెచ్చుకుంది. అందంసంగతి సరేసరి.

భీష్మక మహారాజును చూడటానికి ప్రతి రోజూ అనేకమంది వస్తుండేవారు. వాళ్ళందరూ కృష్ణుడి రూపాన్ని గురించీ, గుణ గణాలు గురించీ, ధైర్య సాహసాలు గురించీ గొప్పగా చెప్పేవారు. అవన్నీ విని రుక్మిణి కృష్ణుణ్ణి ప్రేమించింది ఆయననే తన భర్తగా భావించి మనసులో ఆరాధించింది. రుక్మిణి తల్లిదండ్రులు, బంధువులూ కూడా రుక్మిణిని కృష్ణుడికే ఇచ్చి పెళ్ళి చేస్తే బాగుంటుందనుకున్నారు. కాని అన్నగారు రుక్మి మాత్రం తన చెల్లెలిని శిశుపాలుడికిచ్చి పెళ్ళి చెయ్యాలని నిశ్చయించాడు. రుక్మిణికి విషయం తెలిసి బాధ పడింది! తన శ్రేయస్సుకోరే సునందుడనే బ్రాహ్మణుడ్ని పిలిచి తన ప్రేమను కృష్ణుడికి తెలియ చెయ్యమని వేడుకుంది! ఆ విప్రుడికి రకరకాల బహుమానాలూ, కానుకలూ ఇచ్చి ద్వారకానగరానికి పంపింది.

సునందుడు హుటాహుటిన ద్వారకకు వెళ్ళి వాసుదేవుణ్ణి దర్శించి రుక్మిణి పక్షాన ఆమె చెప్పమన్న వన్నీ చెప్పాడు. శ్రీ కృష్ణుని మీద రుక్మిణికి గల ప్రేమానురాగాలను పూసగ్రుచ్చినట్టు చెప్పాడు చెల్లెలి అభీష్టానికి వ్యతిరేకంగా రుక్మి చేస్తున్న పెళ్ళి ప్రయత్నాలను కూడా వివరంగా చెప్పి "కృష్ణా! నువ్వు అతిలోక సుందరుడవు. జగత్ పతివి. లీలా మానుష స్వరూపుడవైన నిన్ను, శ్రీ మహాలక్ష్మి అంశతో పుట్టిన రుక్మిణి తనకు తానై వరించింది. అదే నీ త్రిజగన్మోహనత్వానికి నిదర్శనం. రుక్మిణి ఇప్పుడు నీ చరణదాసి. అంతఃపురంలో వుండే తాను, నిన్ను చేరుకునే వుపాయం కూడా ఆలోచించింది" అని రుక్మిణి సందేశాన్ని అంద చేశాడు విప్రుడు. కృష్ణుడు ఆ సందేశం చూసుకున్నాడు.

"స్వామీ! నువ్వు వచ్చి శిశుపాల జరాసంధులను దండించి నన్ను నీ దాన్నిగా చేసుకో. చతురంగ బలాలతో రా."

"వివాహ సమయానికి ముందు వధువు స్వయంగా వెళ్ళి నగరం వెలుపల గల కుల దేవత "సర్వ మంగళ"ను కొలవటం మా ఆచారం. గౌరీదేవిని పూజించేందుకు నన్ను మా వాళ్ళు ఆ ఆలయానికి తీసుకువెళ్తారు. అక్కడికి నువ్వు వచ్చి నన్ను తీసుకు పో" అని రుక్మిణి వేడుకుంది.



రుక్మి, చెల్లెలి పెళ్ళి కోసం పెట్టిన ముహూర్తం వివరాలు సునందుడి ద్వారా తెలుసుకుని కృష్ణుడు వెంటనే రథసారధి దారుకుడికి కబురంపాడు.

బలరాముడ్నీ, మరి కొందరు యాదవ మిత్రుల్నీ తోడు తీసుకుని శైబ్యు, సుగ్రీవ, మేఘపుష్ప, వలాహంక అనే నాలుగు గుర్రాలున్న రథమెక్కి ఒకే ఒక రాత్రిలో విదర్భ రాజధాని కుండిన నగరం చేరుకున్నాడు.

కుండిన నగరంలో రుక్మి చెల్లెలి పెండ్లి పనుల్లో తలమునకలుగా వున్నాడు. పెండ్లి కుమారుడు శిశుపాలుడు తన సైన్యంతో సహా అప్పటికే అక్కడ విడిది చేసి వున్నాడు. నగరమంతా కోలాహలంగా వుంది. అంగ, కళింగ, మాళవ, కేకయ, వంగ, మగధ, కోసల, సాళ్వ, చోళ, పాండ్య, కేరళ ఇంకా అనేక దేశాల రాజులు రుక్మిణి పెండ్లి సంబరం చూసేందుకు తరలి వచ్చారు. శిశుపాలుడి స్నేహితులు జరాసంధుడు, దంతవక్త్రుడు, సాల్వుడు, విదూరథుడు, పౌండ్రకుడు మొదలైన వారు మగపెళ్ళి వారి తరపున బంధు మిత్రులకు స్వాగతం చెబుతూ వారికి కావల్సిన ఏర్పాట్లు చేస్తున్నారు.

ఊరు పూరంతా సందడిగా వుంది.

రుక్మిణి ఒక్కర్తే దిగులుగా వుంది.

తెల్లవారితే పెండ్లి.

సునందుడు వెళ్ళాడో, లేదో!

కృష్ణుడికి అసలు తన మీద ప్రేమ వుందో, లేదో! యదువంశ భూషణుడు వస్తున్నట్టా రానట్టా?

ఇంతవరకూ ఏ కబురూ లేదేమిటి?

ద్వారకకు వెళ్ళిన సునందుడు ఏమయ్యాడు? మధ్య దారిలో మార్గాయాసానికి గురి కాలేదు కదా!

నా అదృష్టం ఎలా వుందో!

ఇలా రకరకాలుగా మనసులో మధన పడింది రుక్మిణి.

అంతలో నే సునందుడు వచ్చాడు.

కుండిన నగరానికి శ్రీకృష్ణుడు వచ్చాడని చల్లని కబురు చెప్పాడు. "నందనందనుడు నిన్ను తప్పక పెండ్లి చేసుకుంటాడు. నువ్వు ఆయనకు

రుక్మిణమ్మ పెండ్లికూతు రాయనే....

పట్టమహిషివై నూరేండ్లు సుఖంగా వర్ధిల్లుతావు" అని ఆశీర్వదించాడు

రుక్మిణి మనసు కుదటపడింది. సునందుడికి కృతజ్ఞతలు చెప్పి రకరకాల బహుమానాలు ఇచ్చి సత్కరించింది.

పెళ్ళి చూడటానికి బలరామ కృష్ణులు వచ్చారనుకుని భీష్మకుడు మేళ తాళాలతో ఎదురు వెళ్ళి ఘనంగా స్వాగతం చెప్పి వాళ్ళకు మంచి విడిది ఏర్పాటు చేశాడు. కళ్యాణ ముహూర్త సమయం సమీపించింది. గౌరీపూజ కోసం రుక్మిణిని వూరి వెలుపలి ఆలయానికి తీసుకు వెళ్ళారు. అక్కడ ఆమె మనసారా "మాధవుణ్ణి భర్తగా పొందే అదృష్టం కలగచేయి తల్లీ" అని మొక్కింది. ఆ తరువాత ముత్తయిదువులకు పూజలు చేసింది. శ్రీకృష్ణుని మనసులో నిలుపుకుని ఆలయం నుంచి బయటకు వచ్చింది. చుట్టూరా వున్న అనేక మంది రాజులు ఆమె సౌందర్యానికి అబ్బురపడ్డారు. శిశుపాలుడి మీద కొందరికైతే అసూయ కూడా కలిగింది.

ముఖం మీద పడుతున్న జుట్టును మునివేళ్ళతో సర్దుకుంటూ రుక్మిణి తలెత్తి చూసింది.

కృష్ణుడు రథం దిగివచ్చి, చుట్టూ వున్న రాజులు చూస్తుండగానే రుక్మిణి చెయ్యి పట్టుకుని తీసుకు వెళ్ళి, రథంలో కూర్చో బెట్టుకుని, పాంచజన్యం పూరించి, రథాన్ని ద్వారక వైపు ఉరికించాడు.

అనుకోని ఈ సంఘటనకు అక్కడ వున్న వారందరూ ఆశ్చర్య పోయారు.

అపారమైన ప్రేమ

రుక్మిణి అంటే శ్రీ కృష్ణునికి అపారమైన ప్రేమ వుండేది. ఒకసారి, ఇంద్రుని ఆదేశం మేరకు విశ్వకర్మ శ్రీకృష్ణుని కోసం ఒక అత్యద్భుత భవనాన్ని నిర్మించాడు. మహామేరు శిఖరాగ్రం మెరిసినట్టు బంగారు కాంతులతో ఆ దివ్య సౌధం ధగధగలాడుతుండేది. దానిని శ్రీ కృష్ణుడు రుక్మిణికి తన ప్రేమ కానుకగా ఇచ్చాడు.

శిశుపాలుడి స్నేహితుడు జరాసంధుడు కృష్ణుణ్ణి వెంబడించాడు. యుద్ధం చెల రేగింది. యాదవ వీరులు జరాసంధుడ్నీ, అతని సైన్యాన్నీ చెల్లా చెదరు చేశారు. అది చూసి రుక్మి ఒక్కడూ అక్షౌహిణి సేనతో కృష్ణుడి మీదకు వెళ్ళాడు. వెళ్తూనే కృష్ణుడ్ని నానా దుర్భాష లాడాడు.

కృష్ణుడు ఒక్క బాణంతో అతని ధనుస్సు ఖండించాడు. మరికొన్ని నిశిత బాణాలతో అతని గుర్రాలనూ, రథాన్నీ కూడా నేలకూల్చాడు. చివరికి రుక్మి కృష్ణుని చేతిలో చిక్కి చావబోతే రుక్మిణి అడ్డుకుని మీ శక్తి తెలియక మా అన్న చేసిన అపరాధం మన్నించండి స్వామీ! నా తల్లిదండ్రులకు పుత్రశోకం కలిగించకండి. మా అన్నకు ప్రాణ భిక్ష పెట్టండి. విడిచి పెట్టండి" అని రుక్మిణీ దేవి ప్రార్థించింది. శ్రీకృష్ణుడు మనోహరిణి ప్రార్థన మన్నించి రుక్మిని సంహరించకుండా వదిలేశాడు. అతనిని బంధించి అతని తలకట్టు సగం చేసి, మీసాలు కొంతవరకూ కోసి విడిచి పెట్టాడు.

తరువాత ద్వారకలో రుక్మిణీ కృష్ణుల వివాహం వైభవంగా జరిగింది.

సాక్షాత్తూ లక్ష్మీదేవి అవతారమైన రుక్మిణీ దేవితో కృష్ణుడు సంసార యాత్ర సాగింది.

ప్రద్యుమ్నుడు, చారుదేష్ణుడు, సుదేష్ణుడు, చారుదేవుడు, సుచారువు, చారు గుప్తుడు, భద్రచారువు, చారు భద్రుడు, విచారువు, చారువు అనే పదిమంది కొడుకుల్ని కన్నాడు. అలాగే మిగిలిన ఏడుగురు పట్టమహిషులకు ఒక్కొరికి పదేసి మంచి కొడుకులు కలిగారు. అష్టపత్నులు కాక శ్రీ కృష్ణుడికి మరో పదహారు వేలమంది భార్యలున్నారు. వారందరికీ కూడా ఒక్కొరికి పది మంది చొప్పున కుమారులు కలిగారు. ఈ కుమారు లందరికీ మళ్ళీ కుమారులు కలిగారు.

యదు, వృష్ణి, భోజ, అంధక, మొదలైన పేర్లతో నల్లనయ్య కులం నూటొక్క కులాలై వర్ధిల్లింది. ●

సీరియల్ ప్రారంభం!

మైథిలి

కుందుర్తి ఇందిరా దేవి



అమృతాంశుని వెలుగు కిరణం ఒకటి ఎత్తుగా పెరిగిన చెట్లమధ్య ఎలాగో జొరబడి కిటికీలో నుండి జారి మైథిలి ముఖం మీద పడుతోంది.

కిటికీ తెరలు ప్రక్కకులాగి కట్టబడి వుండటంతో యధేచ్ఛగా లోపలికి వస్తున్న చల్లటి గాలికి ఆమె ముంగురులు హేలగా కదులుతున్నాయి.

నేలమీద జీరాడుతున్న పయిట చెంగు ఫ్యాన్‌గాలికి ఎగురుతోంది.

గదిలో పరుచుకున్న నీలం సబ్‌డ్యూడ్ కాంతిలో, వీపుమీద నుండి జారి నేలను తాకుతున్న పొడుగాటి జడ కదులుతున్న త్రాచులా వుంది

టేబిల్‌మీద చేతులుమోపి, వాటిపై గడ్డం ఆనించి తదేకంగా చూస్తున్న ఆమె ముఖం భావ రహితంగావున్నా, కళ్ళల్లో లీలగా విషాదం కనిపిస్తోంది

టేబిల్‌మీద గోడ కానించివున్న పాతకాలపు పెద్ద రేడియోమీద ఫొటో ఫ్రేమ్ వుంది అందులో ఒకప్రక్క బొచ్చుకుక్క నెత్తుకుని నవ్వుతున్న పదహారేళ్ళ అమ్మాయి, ఆ అమ్మాయినే చూస్తూ చిరుదరహాసం చేస్తున్న మైథిలి బస్ట్‌సైజ్ ఫొటోలు ఆ పల్చని వెలుగులో అస్పష్టంగా కనిపిస్తున్నాయి

గంట క్రితం కూతురు విసురుగా వచ్చి కోపంగా హేళనగా అన్నమాటలే చెవుల్లో మార్మోగుతున్నాయి

చీ' వెధవ జన్మ! ఇంతకన్నా చావటం మేలు' ఏమిటమ్మా మున్నీ ఏమైంది?" అని దరిజేరబోతే ఇంకా ఏం కావాలి' గోపీ వాళ్ళ ఇంటికి వెడితే, వాళ్ళ నాన్నగారు నీ గురించి ఎంత అసహ్యంగా మాట్లాడారో తెలుసా? నువ్వు నాన్నని వదిలేశావట. "

ఆమె కళ్ళు పెద్దవైనయి

నీ క్యారెక్టర్ మంచిది కాదుట '

ఆమె పళ్ళు పటపట కొరికింది అప్రయత్నంగా

'తల్లిదండ్రుల నీడలో గౌరవంగా బ్రతుకాల్సిందిపో, యి ఎంత షేమ్. చీ

ఆమె చూపులు గుమ్మం వైపు తిరిగాయి

డ్రాయింగ్ రూమ్ చీకటిగావుంది. ఆ చీకట్లో గంట నుండీ కూతురు ఒంటరిగావుంది ఏడుస్తూ

మైథిలి కళ్ళల్లో వేదన

టేబిల్‌మీద రాముడు వెలుగులు విరజిమ్ముతున్నాడు

బుద్ధుడు ధ్యానముద్రలో వున్నాడు.

సాయంత్రం వాటి దగ్గర పెట్టిన పూలు వికసించి సౌరభాలు వెదజల్లుతున్నాయి

గాలికి చెట్ల కొమ్మలు కదిలినప్పుడల్లా ఆమె ముఖం మీదికి అప్పుడప్పుడల్లా వచ్చిపోతున్నాయి వెలుగు నీడలు

అరమోడ్పులయిన కళ్ళు కంజాతదళాల్లా వున్నాయి.

ఆ నిశ్శబ్దాన్ని చీలుస్తూ ఫోన్ మోగింది.

అది రింగయిన క్షణం చేస్తున్న పని వదిలి స్వయంగా తనే రిసీవ్ చేసుకునే మైథిలి యిప్పుడు తల కూడా తిప్పలేదు.

ఫోన్ ఇంకా గోలచేస్తూనేవుంది అయినా మైథిలి కదిలే ప్రయత్నం కూడా చెయ్యలేదు

నిమిషం తర్వాత విసురుగా వినిపించింది మున్నీ గొంతు

హలో . నువ్వు సారీ చెప్పాల్సిన అవసరంలేదు నో నో అర్హతలేకుండా అందని పూలకోసం అర్రులు చాచినందుకు నేనే సారీ చెప్తున్నాను' మున్నీ రోషంగా అంటోంది.

ఇక నీ సంజాయిషీలు అవసరంలేదు గుడ్‌బై. గుడ్‌బై పరెవర్ .." ఫోన్ పెట్టేసింది

క్షణం తర్వాత టిక్‌మన్న స్విచ్‌తో ఒక్కసారి వెలిగి ఆరిపోయి తెల్లగా పరుచుకుంది ట్యూబ్‌లైట్ కాంతి

రియాలిటీకన్నా మొరాలిటీ గొప్పదని చెప్పే నువ్వు యింత నీచమైనపని ఎందుకుచేశావు? కేవలం కేవలం.. నీ వ్యక్తిత్వం నిలబెట్టుకోవటం కోసమేనా?

మెలుగు చిమ్మే రాముడినే చూస్తున్న కంజాతదళాలు చప్పున తిరిగి చూసినయి

'నీ జీవితం నీ ఒక్కదానిదేనా? ని కూతురి జీవితంగురించి ఒక్కక్షణమైనా ఆలోచించావా .

"ఒక్క క్షణమెనా ' జీవితమంతా నీ భవిష్యత్ గురించి ఆలోచించడంతో నే గడిచిపోయిందమ్మా

కదిలీ కదలని పెదవులమధ్య పిగలనిమాట!

"ఒక్క తప్పు' చిన్నతప్పు! జరిగిందే అనుకో అంతమాత్రాన సంసారం వదులుకుని వచ్చెయ్యడమేనా? పదిమంది వ్రేలెత్తి చూపేలా బ్రతకటం కంటే....."

చివ్వున తిరిగి వెళ్ళబోతుంటే అప్పుడు కనిపించింది.

రిఫ్లెక్ట్ అవుతున్న ట్యూబ్‌లైట్ కాంతిలో సీతారాముల పర్ణశాల - గోడమీద ఆయిల్ పెయింట్

"సీత రాజభోగాలు విసర్జించి నార చీరలు ధరించి తేళ్ళమధ్య సెలయేళ్ళమధ్య నిర్మించుకోబోయే పర్ణశాలలో నివసించడానికి వెడుతున్న రాముడిని ఎందుకు అనుసరించిందో తెలుసా మమ్మీ?"

శ్రీరాముడు గుణవంతుడు ఏకపత్నీవ్రతుడు కాబట్టి

నిర్మలంగా నవ్వుతున్న రాముడు ఒక్క విసురున టేబిల్‌మీద నుండి క్రిందపడి బ్రద్దలయ్యాడు

ఒక్కవ్రేలు ఎదుటివాళ్ళని ఎత్తి చూపితే మిగిలిన నాలుగు వ్రేళ్ళూ మనల్నే చూపిస్తాయి

గాజులాంటి అరిస్టోక్రసీ బ్రద్దలైనక్షణం'

న స్త్రీ స్వాతంత్ర్య మర్హతి అన్న మనువు సాంప్రదాయాన్ని కాదని

శీల పరీక్ష కోసం అగ్నిప్రవేశం చేసిన సీత ఆదర్శాన్ని త్రోసిరాజని

భర్తని గంపకెత్తుకుని వేశ్యదగ్గరికి మోసుకెళ్ళిన సుమతి పతిభక్తిని అసహ్యించుకుని

మహాప్రభంజనంలా విజృంభించి అన్నివిధాలా అధోగతిలోవున్న ఆడదాన్ని ఆకాశానికెత్తి వారి అంధకారబంధుర విపరీత జీవన విధానాన్ని నిరసించి బ్రతుకుని స్వేచ్ఛగా చక్కదిద్దుకోమని ప్రబోధించి అలమటించిపోయిన చలం కలలుగన్న ధీరోదాత్త నాయికలా కష్టాల్ని సహితం చిరునవ్వుతో ఎదుర్కొని ఇంత జీవితాన్ని సునాయాసంగా గడిపేసిన ఆ స్త్రీమూర్తి ఆ క్షణంలో ధైర్యమంతా దిగజారిపోగా మున్నీ అన్న రెండక్షరాలు పెదవులుదాటి రాకముందే కుర్చీలో కూలిపోయింది

ఇరవై సంవత్సరాల తర్వాత వెనక్కి తెరిగి చూసుకుంటే

★ ★ ★

గోడకి చేరబడి కూర్చుని పూలు మాలకడుతోంది మైథిలి ముందుగదిలో సందడి వినబడుతోంది


"విమల ట్రేలో ఫలహారాలు పట్టుకెడుతూ త్వరగా కానివ్వు అని హెచ్చరించింది

"ఇంకా అవలేదుటే అమ్మాయి? శారదాంబ హడావిడిగా లోపలికివచ్చింది

ఇదో! అయిపోయింది అంటూ కట్టిన మాలలో సగం తెంపి ఆవిడ వారించేలోపలే ఆవిడ తలలో తురిమింది వాళ్ళు నన్ను చూడ్డానికి కాదే వచ్చింది అందావిడ

మంచినీళ్ళు పట్టుకెడుతున్న మురళి ఇంకా అలాగే కూర్చున్నావేం? కానివ్వు అని అరిందలా కసురుకున్నాడు

నువ్వు లేచి చీర కట్టుకోవేతల్లీ పూలు నే కడతాను ఇలా తే శారదాంబ మైథిలి చేతిలోనుండి పూలదండ తీసుకుంది.



మైథిలి కదిలే ప్రయత్నం చెయ్యకుండా ఆవి పూలు అందిస్తూ "నాకు ఓపికలేదత్తయ్యా! ఏం బట్టలుబాగాలేవా?" అంది.

ఆవిడ కట్టటంఆపి "బట్టలెలావున్నా న బావుంటావు" అంది. ఆవిడ కళ్ళల్లో ప్ర తొంగిచూసింది.

"మరింకేమిటిట......" ఆమె నవ్వింది.

"కొంచెం ముందుచెప్పినా పెందలాడి కోసి కట్టేదాన్ని. అంతా హడావిడేనాయి. నువ్వు బట్టలు మార్చుకో."

"వదినగారూ మీరూ రండి" విమల కా తీసుకువెడుతూ శారదాంబను కూడా పిలిచింది.

"మైథిలి యింకా చీరకూడా కట్టుకోలేదు."

విమల చప్పున ఆగి ట్రే ఆవిడకిస్తూ " వాళ్ళని కాస్త మాటల్లో పెట్టండి" అని ఆవి పంపి మైథిలి దగ్గరకొచ్చింది.

మహా విమల కూతురి భుజం తట్టింది. "ముందు పేరకట్టుకో నాన్నగారికి కోపం [illegible]చకు

[illegible] తలెత్తలేదు దీక్షగా పూలు కడుతూనే వుంది

విమల మోకరిల్లి కూర్చుని ఆమె చుబుకంపట్టి [illegible]తూ బ్రతిమిలాడుతున్న ధోరణిలో నా మాట [illegible]నవా" అంది.

మైథిలి ఒక్కక్షణం కళ్ళెత్తి చూసి మళ్ళీ తనపనిలో పడిపోయింది. లాలిత్యము, సౌకుమార్యము మూర్తీభవించిన ముఖంలో మూసిన కనురెప్పలు విసనకర్రలైతే, కళ్ళు కంజాతదళాలు!

విమలా ప్రసాదరావు పిలుపుకి విమల ఉలిక్కిపడిలేచి నువ్వు చెప్పినమాట వినకపోతే మీ నాన్నగారు ముఖం వాచేలా నన్ను చివాట్లు పెడతారని గుర్తుంచుకో అనేసి వెళ్ళిపోయింది

పూలు పెట్టుకుని మోకాళ్ళమీద చేతులువేసుకుని మౌనంగా కూర్చుండిపోయింది మైథిలి

మనసులో ఉక్రోషం! ఏం చెయ్యాలో తోచని నిస్సహాయత!

ఇంకా చదువుకుంటాను మొర్రో అని మొత్తుకుంటున్నా వినకుండా పెళ్ళిప్రయత్నాలు చేసే తండ్రిమీద కసితో అలాగే కూర్చుండిపోయింది.

పక్షపాతకోసం వచ్చిన మురళి "అక్కా! పెళ్ళికొడుకు నంబర్ వన్ హీరోలా వున్నాడు కావాలంటే చూడు" అన్నాడు

మైథిలి మనసులో చిలిపి ఆలోచన! నెమ్మదిగాలేచి కిటికీ తెర తొలగించి చూసింది

పచ్చని పసిమి. పెద్దపెద్ద మీసాలు. చార్మింగ్‌ఫెలో! మైథిలి చప్పున ముఖం త్రిప్పుకుంది



మైథిలి

పేకాటకోసం తరచు వాళ్ళింటికివచ్చే చిదంబరం పెళ్ళికొడుకు తండ్రిహోదాలో కూర్చుని మాట్లాడుతున్నాడు ఆయన ఇంట్లో అందరికీ పరిచితుడే.

ఆయన భార్య సుగుణ చాలా అందమైనదిలావుంది మైథిలికి అనుమానంవచ్చి మళ్ళీ తెరలాగి తొంగిచూసింది.

కరక్టే! ఆవిడ అందగత్తె. కొడుకు అచ్చం ఆవిడ ప్రతిబింబంలా వున్నాడు పేరుకు తగ్గట్టు మోహనుడే

ఉక్రోషంగా మూలుగుతున్న మనసుకి రవ్వంత ఊరట!

ఆయన కొడుక్కి అందమైన పిల్ల కావాలని, మైథిలి అయితే కానీ కట్నం కూడా అక్కర్లేదని చిదంబరం సూచించటంతో, ప్రసాదరావు ఆనంద పడిపోయి పెళ్ళిచూపులు ఏర్పాటుచేశాడు

మైథిలి చూపులు హఠాత్తుగా గోడమీద నిలువెత్తు ఫొటో మీద పడినయి. తను తల్లికి ప్రతిబింబంలా ఉంటుందిట. నిజమేలావుంది

బైట కబుర్లు జోరుగా సాగుతున్నాయి.

మోహన్ చూపులు మాటిమాటికీ గుమ్మంవైపే తిరుగుతున్నాయి అతని ఆదుర్దా మిగిలినవాళ్ళకి పట్టినట్టులేదు.

మైథిలి పెదవులపై సన్నని హాసరేఖ

అతను దర్జాగా కాలుమీద కాలేసుకుని కుర్చీలో కూర్చున్నాడు. తను సంతలో వస్తువులా ఆ చాపమీద కూర్చోవాలి కాబోలు.

పరధ్యాసగా నిలబడిన మైథిలి మోహన్ హఠాత్తుగా కిటికీవైపు చూడటంతో చప్పున ప్రక్కకి తప్పుకుంది.

ఆ ఒక్కక్షణంలోనే అతని పెదవి చిరునవ్వుతో విచ్చుకోవటం చూసింది.

సన్నగా నవ్వు వినిపించి చూసింది. పెదవులమధ్య నవ్వుని బిగబట్టిన విమల కనిపెట్టాలే అన్నట్టు ఒక్క చూపుతో తెలియజేసి 'రా' అంది.

"ఊహూ! నాకు భయమేస్తోంది.'

"కిటికీలో నుండి తొంగిచూసినప్పుడు బయం వెయ్యలేదా?"

మైథిలి ఉక్రోషంగా చూసింది ముఖం కందిపోతుంటే 'నే రానుపో" అనేసి కూర్చుండిపోయింది

అది బెట్టని విమలకు తెలుసు

"మీ రిద్దరంటే కిటికీలో నుండే చూసుకున్నారు పాపం సుగుణమ్మగారు నిన్ను కిటికీలో చూడలేదుగా" నవ్వుతూ వచ్చి కూతురి చెయ్యి పుచ్చుకుంది

మైథిలి సాగుతూనే లేచింది

'అదేమిటి చీర కట్టుకోలేదు' విమల విస్మయంగా చూసి అంతలోనే ఏదో అర్థమైనట్టు సరేసరే నీకు కిటికీ పట్టుకు వ్రేళ్ళాడ్డమే సరిపోయుంటుంది బాగానే వున్నాడు పద" అంది.

'అబ్బ చెయ్యి వదులు" మైథిలి తల్లి వెనకే వెళ్ళి చాపమీద కూర్చుంది.

హఠాత్తుగా అందరి చూపులు తనని పట్టిపట్టి చూస్తున్నట్టు తోచటంతో ముడుచుకుపోయి తలైనా ఎత్తలేదు

ఆ క్షణం అనుకోకుండా రజనీ గుర్తొచ్చాడు

"పెళ్ళిచూపులు గట్రా .. అన్నీ వెదవ సెంటిమెంట్స్. అమ్మాయిని, అబ్బాయినీ ఎదురెదురుగా కూర్చోబెట్టినంతమాత్రాన వాళ్ళ అభిరుచులేమిటో తెలుస్తాయా?

పోనీ అలాగైనా ఫ్రీ ఉంటుందా అంటే అదీ ఉండదు. కుర్చీలో నీలుక్కుని కూర్చుని ఫోజులు ఒలకబోస్తూ స్మైల్‌గా ఉండటానికి ప్రయత్నించే అబ్బాయి అరువు తెచ్చుకున్న నగల భారంతో చాపమీద వంగిపోయి అవస్థపడే అమ్మాయి. అంతకన్నా సంతలో పశువు నయం. చుట్టూ ఎంతమంది చేరినా ఫ్రీగా అరుస్తుంది, తల తిప్పుతుంది, తోకాడిస్తుంది, అవసరమైతే ఝాడించి తంతుంది

'అది భారత దేశంరా రజనీ' అని నవ్వే,శారదాంబ

'నాన్సెన్స్' భారత దేశమైనంత మాత్రాన బానిసలా ప్రవర్తించాలా" అని చిరాకు పడిపోయే రజనీకాంత్

'నువ్వేలా పెళ్లి చేసుకుంటావో చూస్తాగా..'

"నేనైతే ఛస్తే తలొంచుకుని కూర్చోను .' సవాలు చేసింది తను.

అరే! తనిప్పటి వరకూ తల వంచుకునే కూర్చుందా! నిటారుగా కూర్చుని తల ఎత్తేసరికి అందరూ నిలబడి ఉన్నారు అందరి ముఖాలు నవ్వుతున్నాయి. విమల ఆవిడకు బొట్టు పెడుతోంది

చివ్వున లేచి వచ్చెయ్యబోతుంటే సు గుణ ఆపి మైథిలికి బొట్టు పెట్టి పళ్ళు, పూలు చేతిలో పెట్టింది

వాళ్ళని సాగనంపి వచ్చిన ప్రసాదరావు "మైథిలీ' అని కేకేశాడు

అరటిపండు వలుస్తున్న మైథిలి అదిరిపడి చూసింది.

విమల నుదురు కొట్టుకుంటూ 'నే చెప్తానే ఉన్నాను. ఆ పాత లంగా, వెలిసిపోయిన ఓణీ మార్చుకోవేమ్మా అని" అంది.

ఇంతలో ప్రసాదరావే అక్కడికి వచ్చి మట్టిలో ఉన్నా మాణిక్యం మాణిక్యమేనోయ్ వాళ్ళకి మన మధు నచ్చిందట" అన్నాడు.

పేకాట వ్యసనంలో సమస్తం తగలేసిన ప్రసాదరావుకి పైసా కట్నం అడక్కుండా, అట్టే శ్రమపడకుండా, మంచి సంబంధం అందులో ఒక్కడే కొడుకై పుట్టిన మోహన్ అల్లుడవుతున్నాడని సంబరపడటంలో ఆశ్చర్యం లేదు

★ ★ ★


మైథిలి వివాహం నిశ్చయమైంది.

పెళ్లి వారం రోజాలుందనగా ఒక రోజు సాయంత్రం తమ్ముడితో గుడికి వెళ్లింది. దైవ దర్శనం చేసుకునివచ్చి మెట్లమీద కూర్చుంది.

మురళి కొబ్బరిచిప్ప పగలగొట్టే ప్రయత్నంలో ఉన్నాడు.

ఎండ తగ్గిపోయిన సాయంత్రం చల్లగా, ఆహ్లాదంగా ఉంది. ఆ వాతావరణం మైథిలికి చాలా యిష్టం!

గుడి ప్రాంగణంలో పెరిగే గడ్డిపూలు, పావురాళ్ళు, చుట్టూ నెలకొన్న ప్రశాంతత, మధ్య మధ్య మృదువుగా వినిపించే గుడి గంటలు... ఆమెకి మరీ



యిష్టం.

హఠాత్తుగా కళ్ళకి ఒక వింతయిన దృశ్యం కనబడింది. బావికి కొంచెం అవతలగా ఉన్న గన్నేరుచెట్టు దగ్గర మోహన్ నిలబడి ఉన్నాడు. అతని ప్రక్కనే దాదాపు ఇరవై సంవత్సరాల అమ్మాయి ఏదో మాట్లాడుతోంది.

కానీ బాగా ఆకర్షించింది మాత్రం మోహన్ చెయ్యి ఒకటి ఆ అమ్మాయి భుజాల చుట్టూ, రెండోది ఆమె చుబుకం పట్టుకుని ఉండటం.

మైథిలి కళ్ళు ప్రత్తికాయలైనాయి.

అతనికి తోడబుట్టినవాళ్ళు కూడా ఎవరూ లేరు. ఆమె ఎవరు?

వాళ్ళేం మాట్లాడుతున్నారో తెలియటంలేదు కాని మొత్తానికి ఘర్షణ పడుతున్నారని అర్థమవుతోంది. పది నిముషాల తర్వాత యిద్దరూ వెళ్ళిపోయారు.మోహన్ చెయ్యి ఇప్పుడు ఆమె భుజంమీద కాకుండా నడుంమీద ఉంది.

స్థాణువులా కూర్చున్న మైథిలి తమ్ముడి పలకరింపుకి ఉలిక్కిపడింది. చేతిలో కొబ్బరి ముక్కను పట్టుకొని ఉదాసీనంగా కూర్చున్న అక్కను మురళి తెల్లబోయి చూశాడు.

హుషారుగా వెళ్ళిన కూతురు, ఉదాసీనంగా తిరిగి రావటం విమల చూడనే చూసింది.

ఆమె చేతిలో మల్లెలు, కనకాంబరాలు కలిపి కట్టిన పెద్ద మాల ఉంది.అది గోడకి ఉన్న ఫోటోకి వేసే ప్రయత్నంలో ఉంది.

ఆ ఫోటో మైథిలి తల్లి అన్నపూర్ణది. మైథిలిని ప్రసవించి పురిటిలోనే పోయిందావిడ.

ఆ పసిబిడ్డ ఆలనా పాలనా చూడడానికి ప్రసాదరావు విమలని పెళ్ళి చేసుకున్నాడు. సహనానికి, ఓర్పుకి మారుపేరనిపించే విమల మైథిలిని కళ్ళల్లో పెట్టుకొని పెంచింది.

మైథిలికి కూడా ఆవిడ సవతితల్లి అని ఎప్పుడూ అనిపించదు. ఆ ఊహ కూడా రాదు.

"దర్శనం అయిందా" దండ వేయటం పూర్తిచేసి వెనక్కి తిరుగుతూ అడిగింది విమల.

ఆమె తెప్పరిల్లింది. "చాలా బాగా దర్శనం అయింది" అనేసి వెళ్ళిపోయింది.

పెళ్ళి పనులతో క్షణం తీరికలేని విమల దొడ్లో తులసికోట ప్రక్కన మంచంమీద గుట్టగా పడివున్న బట్టలను మడత పెట్టమని కేకేసింది.

అరగంట తర్వాత దొడ్లోకి వచ్చిన విమల తెల్లబోయింది. మంచంమీద బట్టలు అలాగే ఉన్నాయి. కూతురు తులసికోట ప్రక్కనే కూలబడి మంచం కోడుకి తలానించి దీర్ఘాలోచనలో పడిపోయి ఉంది.

విమల అనుమానంగా చూసి "మధూ" అని పిలిచింది. ఆ చిన్న పిలుపుకే మైథిలి అంతెత్తున ఎగిరిపడింది.

"ఏమిటా పరధ్యానం... బట్టలు మడత పెట్టమంటే కూర్చుని కలలు కంటున్నావా..." విసుక్కుంటూ. గుట్టగా వున్న బట్టలు మడతలు వేస్తూ అంది.

"కలలు కనే అవసరం కనిపించటంలేదమ్మా" లోగొంతుకతో బట్టలు మడత పెడుతూ అంది.

ఆ స్వరంలో మార్పుని విమల ఇట్టే పసిగట్టింది.

"గుళ్ళో నీ స్నేహితులెవరన్నా కనబడ్డారా. కాలేజీ కబుర్లు చెప్పి ఊరించారా".

"ఊహూ..."

"మరింకేమిటి?"

"మోహన్ కనిపించాడు. "

మోహనా! ఏ మోహన్..." అంటూ ఆగిపోయి "అరె మన మోహనా" అన్నది. "ఏమిటి విశేషాలు"

"నేనడగలేదు."

"ఓహో"

ఒక్క క్షణం ఆగి "అతను నన్ను చూడలేదు" అంది.

విమల పెదవులు సన్నగా నవ్వాయి. "అందుకా కోపం..."

"కోపమా ! నాకెందుకు. కాని నేను మాత్రం అతన్ని గన్నేరు చెట్టు క్రింద చూశాను "విచారంగా అంది ఒకమ్మాయితో"

చివరిమాట వినగానే విమల నవ్వాపేసింది

నవమినాటి వెన్నెల పల్చగా పరుచుకుని ఉంది వంట గదిలోనుండి పడుతున్న లైటు వెలుతురు మైథిలి పాదాల దగ్గర గీతలా పడుతోంది

తేరుకున్న విమల "చెల్లెలో అక్కో అయివుంటుంది" అంది.

"అతను ఒక్కడే సంతానం"

"బంధువుల అమ్మాయేమో"

"బంధువుల అమ్మాయే అయితే చాటుగా గుళ్లో కలుసుకోవటం ఎందుకు"?

"తెలిసిన అమ్మాయేమో..."

"తెలిసిన వాళ్ళమ్మాయి అయితే భుజాలు చుట్టూ చెయ్యి వెయ్యవచ్చా?"

విమల బట్టలు అవతల వదిలేసి మైథిలి దగ్గరగా మంచంమీద కూర్చుంది.

"నిద్ర పోతున్నావా..."

"ఇన్ని రోజులూ హాయిగా నిశ్చింతగా నిద్రపోయాను. ఇక ముందు మెలుకువగా ఉండికూడా నిద్రపోతున్నానని చెప్పాల్సి వస్తుందేమో"

చిత్రకారుడి కుంచెలోంచి జారిన అద్భుత చిత్రంలా నేలమీద చెట్ల నీడలు కదులుతున్నాయి

వికసించిన పూల సౌరభం తేలివస్తోంది

"ఒక్కోసారి మన కళ్ళూ. చెవులూ కూడా మనల్ని మోసం చేస్తాయి మధూ. బంధువుల పిల్లలతో సన్నిహితం పెంచుకోవటం తప్పు కాదమ్మా' విమల ఊరడింపుగా అంది.

"సమర్థిస్తున్నావా" మైథిలి తల్లిని సూటిగా చూసింది.

"నువ్వు మురళితో ఈరోజుకు ఆటలు ఆడతావు. వాడూ పసివెధవలా నిద్ర కూడా పోతాడు".

మైథిలి నవ్వింది.

"ఇకనుండీ రహస్యంగా ఏ గుళ్ళోనో, ఏ చెట్టు చాటునో వాడి భుజాలు పుచ్చుకుని, గడ్డం పుణుకుతూ ఒరే తమ్ముడూ అని కబుర్లు చెబుతాను."

చివ్వున లేచి వెళ్ళిపోతున్న కూతుర్ని విమల నిశ్చేష్టురాలిలా చూసింది. గుండెలమీద చేయి వేసుకొని పైకి చూస్తూ గొణిగింది

"ఓ చరాచర సృష్టి లయకారుడా! నీ దర్శనార్థం వచ్చిన పదహారేళ్ల పసిదాన్ని అనుమానాస్పదమైన పరిస్థితులు సృష్టించి బాధించటం న్యాయమా ప్రభూ...!"

(ఇంకావుంది)



పేరులో నె గలదు "ఆడతనం

జానీ లివర్ సెక్స్ మార్పిడి చేయించుకుంటే అప్పుడు ఆయనను ఏమని పిలవాలి? "చల్తే చల్తే" వీడియో పత్రికలో జానీ లివర్ సెక్స్ మార్పిడి చేయించుకున్నారు. ఆ శస్త్ర చికిత్స తర్వాత తన అనుభవాలను ఈ వీడియో పత్రికలో చిత్రీకరిస్తున్నారు.

జెన్నీ అనేది స్త్రీల పేరు కాబట్టి ఆయనను జెన్నీ లివర్ అందాం. స్త్రీలు ఆకర్షణీయమైన వారని గుర్తించి వారిలో కలిసిపోదలచుకున్న పురుషుడి పాత్రను ఆయన సమర్థంగా నిర్వహిస్తున్నారు.

సినిమా...సినిమా... జి.వి.జి.



"మహత్యమంత ముద్దు"లో సీత

చిరంజీవి కొండవీటి దొంగ"

సూపర్‌మాన్ అనిపించే రీతిలో హీరో పాత్రను పరుచూరి సోదరులు మహాద్భుతంగా మలిచారు అన్నారు ఎ కోదండరామిరెడ్డి ఈయన స్క్రీన్‌ప్లే దర్శకత్వంలో రూపొందే పై చిత్రంలో చిరంజీవి సరసన విజయశాంతి రాధ నాయికలు ఊర్వశి శారద మోహన్‌బాబు సత్యనారాయణ రావు గోపాలరావు నూతన్ ప్రసాద్ శ్రీవిద్య తదితర తారాగణం పరుచూరి సోదరులు కథ సంభాషణలు రాశారు ఇళయరాజా సంగీతం వి ఎస్ ఆర్ స్వామి ఛాయ భాస్కరరాజు శిల్పం, తార నృత్యాలు దోనవల్లి కోటేశ్వరరావు డి రామ్మోహనరావు- ఎ సుదాకర్ ప్రొడక్షన్ కోటగిరి వెంకటేశ్వరరావు కూర్పుతో 70 ఎం ఎం లో ఈ చిత్రాన్ని నిర్మించే టి త్రివిక్రమరావు జనవరి నుంచి జూన్ వరకు జరిగే షెడ్యూల్స్‌తో షూటింగ్ పూర్తవుతుంది" అన్నారు

"టూ టౌన్ రౌడీ"

"ఫిబ్రవరి 1–5 మార్చి 1–10 ఏప్రిల్ 1–5 మే 1–20 షెడ్యూల్స్‌తో షూటింగ్ పూర్తవుతుంది పాటలను కాశ్మీర్‌లో షూట్-చేస్తాం" అన్నారు దాసరి సి వెంకటరాజు జి శివరాజు నిర్మించే విజయలక్ష్మి ఆర్ట్ ప్రొడక్షన్స్ వారి పై చిత్రంలో వెంకటేశ్ ఊర్వశి శారద రాధ మోహన్‌బాబు, అమ్రేష్‌పురి ప్రభాకరరెడ్డి అల్లు రామలింగయ్య వేలు హరిప్రసాద్ మాగంటి సుధాకర్ ప్రసాద్ బాబు గోకినరామారావు శ్రీహరి నగేష్‌బాబు శ్రీలక్ష్మి నిర్మల వగైరా నటవర్గం రాజశ్రీ కథా సహకారం రాజ్-కోటి సంగీతం కె ఎస్ హరి ఛాయ పేకేటి రంగా శిల్పం, ఎ రవికుమార్ సంయుక్త దర్శకత్వం నిత్యం సహకార దర్శకత్వం, తార నృత్యాలు విజయన్ సాహసాలు, ధవళ చిన్నారావు ప్రొడక్షన్ కృష్ణంరాజు కూర్పు తెరవెనుక హంగులు



"స్వరకల్పన"

"వ్యక్తిగతంగా పండిపోయిన ప్రేమికుల అంతరంగ మథనం ఎలా ఉంటుందో పరస్పరం వారు స్తుతి చేసుకోవడం ఈ చిత్ర ఇతివృత్తం" అన్నారు వంశీ ఈయన దర్శకత్వంలో పూర్ణోదయా ఆర్ట్ క్రియేషన్స్ నిర్మించే పై చిత్రంలో రాజశేఖర్ రాళ్ళపల్లి మల్లికార్జునరావు శ్రీరామ్, భరణి ఆదిగాగలవారు పాల్గొంటారు తనికెళ్ల భరణి రచన అమర్ సంగీతం హరి అనుమోలు ఛాయ అరుణ్ గోడ్కాంకర్ శిల్పం జగన్మోహనరావు - రాజగోపాల్ ప్రొడక్షన్, అనిల్ మల్నాడ్ కూర్పు, ఏడిద రాజా నిర్వహణతో తాడి రామకృష్ణ, తాడి హరిబాబు తాడి భాస్కీ సహ నిర్మాతలు "ఇళయరాజా సోదరుడు గంగై అమరన్ సంగీత దర్శకుడు నాయికగా నూతన నటిని పరిచయం చేస్తున్నాం మార్చిలో విశాఖపట్టణంలో షూటింగ్ ప్రారంభించి ఆ పరిసరాలలో ఒకే షెడ్యూలులో షూటింగ్ పూర్తి చేస్తాం అన్నారు నిర్మాత ఏడిద నాగేశ్వరరావు

ఈమె ఎవరు?
వైసంచికలో వివరంగా...
చదవండి!



సమర్పించే పై చిత్రంలో సురేష్, రాశీ సింగ్, సుధాకర్ బాలయ్య కోట శ్రీనివాసరావు పద్మనాభం, చిట్టిబాబు, డబ్బింగ్ జానకి, శీలారెడ్డి శిల్ప జయమాల నటించారు ఆత్రేయ మాటలు, సి నారాయణరెడ్డి పాటలు, ఎం ఎస్ విశ్వనాదన్ సంగీతం సూర్యనారాయణశర్మ ఛాయ పాండు - వాసు ప్రొడక్షన్‌తో ఇమంది రామారావు దర్శకత్వం వహించిన ఈ విశిష్టమైన చిత్రానికి చదలవాడ శ్రీనివాసరావు నిర్మాత




కృష్ణ, రాధ

మార్చిలో పాటలు రికార్డు చేసి ఏప్రిల్‌లో షూటింగ్ ప్రారంభం. మూడు షెడ్యూల్స్‌లో జూన్‌కి షూటింగ్ ముగుస్తుంది. మే. నెలలో పాటలను ఊటీలో పిక్చరైజ్ చేస్తాం" అన్నారు ఎం. మల్లికార్జునరావు. ఈయన స్క్రీన్‌ప్లే, దర్శకత్వంలో జి. విజయభాస్కర్, ఎల్. ఉమాదేవి సమర్పించే శ్రీ నవచిత్ర ఆర్ట్స్ వారి చిత్రంలో కృష్ణ సరసన.రాధ నాయిక.రాయప్రోలు గోపి సంయుక్త దర్శకత్వం, ఎం. ఆర్. సనత్‌కుమార్ నిర్వహణతో ఎం. ఎల్. నారాయణబాబు నిర్మాత.

"లైలా"

"హీరో చదువుకుంటూ కవిత్వం రాస్తుంటాడు. అతని కవిత్వానికి ముగ్ధురాలైన నాయిక తన హృదయాన్ని అర్పిస్తుంది. వీరిప్రేమకు అంతస్తులు అడ్డొస్తాయి. ఆ తర్వాత అనూహ్యమైన మలుపులతో సాగే మనోహరమైన టీనేజ్ లవ్ స్టోరీ" అన్నారు చదలవాడ తిరుపతిరావు. ఈయన



నాగార్జున సినిమాస్కోప్ చిత్రం

"ఫిబ్రవరి 11 నుంచి షూటింగ్" అన్నారు రామ్‌గోపాల్‌వర్మ. ఈయన్ని దర్శకునిగా పరిచయం చేసే అన్నపూర్ణా స్టూడియోస్ అండ్ ఎస్. ఎస్. క్రియేషన్స్ చిత్రంలో నాగార్జున, అమల, రఘువరన్‌తో పాటు హైదరాబాద్‌లోని కళాకారులు పాల్గొంటారు. తనికెళ్ల భరణి మాటలు, ఇళయరాజా సంగీతం, ఎస్. గోపాల్‌రెడ్డి ఛాయ, తోట తరణి శిల్పం, రాజా సాహసాలు, సుందరం నృత్యాలు, అక్కినేని వెంకటరత్నం నిర్వహణతో వెంకట్ అక్కినేని, యార్లగడ్డ సురేంద్ర నిర్మాతలు.

సంతోష్ ఫిలిమ్స్

"హైదరాబాద్‌లో ఒకే షెడ్యూల్లో షూటింగ్ పూర్తవుతుంది" అన్నారు కోనేరు రవీంద్రనాథ్. ఈయన స్క్రీన్‌ప్లే, దర్శకత్వంలో కోనేరు రాధాకుమారి నిర్మించే సంతోష్ ఫిలింస్ చిత్రంలో చంద్రమోహన్, జయసుధ, గుమ్మడి, ప్రభాకరరెడ్డి, బ్రహ్మానందం, శ్రీలక్ష్మి, సుధారాణి, పావలా శ్యామల పాత్రధారులు. కె. ఎల్. ప్రసాద్ సంభాషణలకర్త. సి. నారాయణరెడ్డి, సీతారామశాస్త్రి గీతాలను వాసురావు స్వరపరిచారు. నవకాంత్ ఛాయాగ్రాహకుడు. ఇ.వి. వి. సత్యనారాయణ సంయుక్త దర్శకుడు


"గురుశిష్యులు"

"ఫిబ్రవరి రెండవ వారం నుండి మే వరకు షెడ్యూల్స్" అన్నారు ఎస్. పి. ముత్తురామన్. ఈయన దర్శకత్వంలో పూర్ణప్రకాష్ నిర్మించే శ్రీలతా ఆర్ట్స్ ప్రొడక్షన్స్ పై చిత్రంలో కృష్ణంరాజు, సుమలత, రాజేంద్రప్రసాద్-కుష్బూ, నూతన ప్రసాద్, గొల్లపూడి మారుతీరావు, సుధాకర్, హేమసుందర్, మాడా, జానకి, మనోరమ వగైరా తారాగణం. "మద్రాసు, మైసూర్‌లలో షూటింగ్" అన్నారు సమర్పకులు ఎస్. ఎస్. రావు. ఎం.డి. సుందర్ కథకు గణేష్ పాత్రో సంభాషణలకర్త. ఇళయరాజా స్వరకల్పనలో ఆత్రేయ గీతాలు రాశారు. వినాయకం ఛాయ, బి. చలం శిల్పం, జూడో రత్నం సాహసాలు, పి. సరోజ నృత్యాలు, లక్ష్మీనారాయణమూర్తి - నారాయణ సహకార దర్శకత్వం, ఆర్. విటల్ కూర్పు తెర వెనుక హంగులు. మొదటి షెడ్యూలు ఫిబ్రవరి10 నుంచి 22 వరకు మద్రాసులో, తదుపరి షెడ్యూలు మైసూరు లలితమహల్ పేలస్‌లో ఏప్రిల్ 10న ప్రారంభమై మే 3 వరకు ఆ పరిసరాలలో జరుగుతుంది. దీంతో షూటింగ్ పూర్తవుతుంది.

"భూపోరాటం"

"నాటికీ నేటికీ ఏ రాజ్యంలోనైనా, ఏ దేశంలోనైనా రైతు స్థితి గతులలో మార్పు లేదు. గ్రామాల్లో ఎన్నికలు వచ్చినప్పుడు హత్యలు చేసుకోవడం. ఎన్నిక లయ్యాక ఆత్మహత్యలు చేసుకోవటం– ఇదీ ఈ నాటి మన దేశంలోని రైతుల పరిస్థితి. రైతుకు న్యాయం జరగటం లేదన్న సంగతి అందరికీ తెలిసిందే. రైతు కూలీలు తమపై ధ్వజమెత్తే భూస్వాములపై సాగించే పోరాటమే ఈ చిత్రం. భూస్వామ్య దౌర్జన్యాలు సాగనివ్వ కూడదనే సందేశాన్ని అందించాం," అన్నారు ఆర్. నారాయణమూర్తి. ఈయన కథ, స్క్రీన్‌ప్లే సమకూర్చి, స్వీయ దర్శకత్వంలో నిర్మించిన స్నేహ చిత్ర వారి పై చిత్రంలో సత్యనారాయణ, పి. ఎల్. నారాయణ, రాళ్ళపల్లి, వేలు, నర్రా, మల్లికార్జునరావు, జయభాస్కర్, సాయిచంద్, ముక్కురాజు, గరగ, పూల నాగేశ్వరరావు, పి. ఎల్. మహదేవ్, పయని సూర్యనారాయణ, అదపా ప్రభాకర్, కొడాలి రవి, రామరాజ్, రేణుక, లక్ష్మిప్రియ, మోనిషా, భానుజ్యోతి, భీష్మ సుజాత, నారాయణమూర్తి నటించారు. పి. ఎల్. నారాయణ మాటలు, వాసూరావు స్వరకల్పనలో వంగపండు ప్రసాదరావు గీతాలు రాశారు. వెంకట్ ఛాయ, నాగేశ్వరరావు శిల్పం, రమేష్ బాబు- కె. బి. ఆనంద్ సహాయ దర్శకత్వం, రాజా నృత్యాలు, సాంబశివరావు సాహసాలు, రాఘవ ప్రొడక్షన్, జోసఫ్ కూర్పు నిర్వహించారు.

పరుదాటాక...



కదులుతున్న కొబ్బరాకుల మధ్యనుండీ చల్లగా కురుస్తున్న పండు వెన్నెలలో ఆరుబయట మడతమంచంమీద వెల్లకిలా పడుకుని, నిండు చంద్రుడిని తదేకంగా చూస్తున్నాడు రాంబాబు భాగ్యనగరం శివార్లలో వున్నా, హడావిడి నీడపడని బ్యాంక్ కాలనీ అది నాలుగైదు వరుసలుగా ఇళ్ళు కట్టబడివున్నాయి అక్కడి నుండీ ఫర్లాంగు దూరంలో వున్న మెయిన్‌రోడ్డును కలుపుతూ మట్టిరోడ్డు వేయడంతో, ఇప్పుడిప్పుడే చుట్టూవున్న బంజరుభూముల్లో అక్కడక్కడ యిళ్ళు కడుతున్నారు సిటీలో దొరకని చల్లగాలిని ఏకాంతంగా అనుభవిస్తున్న రాంబాబు, వారం రోజులక్రితం పుట్టింటికి వెళ్ళిన అర్ధాంగి గురించి ఆలోచిస్తున్నాడు. కొత్తగా పెళ్ళయిన జంటని సంక్రాంతి పండక్కి రమ్మని, మావగారు ఉత్తరం వ్రాయడంతో, అప్పటికే తల్లిమీద బెంగపడిన భార్యని ముందుగా పంపించాడు.

"ఏంటి గురూగారూ అప్పుడే పడకేశారు?" భోంచేసి లేచినట్టున్నాడు, వక్కపొడి నోట్లో వేసుకుంటూ అడిగాడు పక్కింట్లోంచి అప్పారావు. ఆ పరిస్థితిలో ఆయనకు సమాధానం చెప్పి, గతంలో తను బలైపోయిన విషయాలు గుర్తొచ్చి, చటుక్కున కళ్ళు మూసుకుని కదలకుండా పడుకున్నాడు. "ఏంటోయ్! నీకు ముగ్గులైటం గూడా వచ్చా?" నీళ్ళబకెట్ మోసుకొచ్చి గేటుదగ్గర పెడుతున్న శంకర్రావుని పలకరించాడు అప్పారావు

"లేదుసార్, మా ఆడోళ్ళకి జస్ట్..... హెల్పింగ్.. ." అంటూ చేతులు నలుపుకుంటూ ప్రహరీగోడ దగ్గరకు వస్తున్న శంకర్రావుని కనుకొనల నుంచే జాలిగా చూస్తున్నాడు రాంబాబు ఆ వీధిలో ఆడపిల్లలు ఎక్కువగా వుండడంతో, పోటీలుపడి మరీ వేస్తున్నారు సంక్రాంతి ముగ్గులు. రాత్రిపూటే కళ్ళాపుజల్లి అట్టేపెట్టుకుని, పొద్దున్నే నాలుగ్గంటలకే లేచి ముగ్గేయడం మొదలెడితే, రంగులూ, పూలూ అన్నీ వేసేసరికి ఆరవుతుంది.

చల్లగాలి నెమ్మదిగా చలిగాలిగా మారుతోందని గమనించి, పైగా ఒంటిమీద ఒక్క లుంగీ తప్ప మరే అచ్ఛాదనా లేకపోవడంతో, లేచి లోపలికెళ్ళి దుప్పటి తెచ్చుకోవాలా, లేక ఏకంగా లోపలికి వెళ్ళి పడుకుందామా అని బద్ధకంగా ఆలోచిస్తూ అలాగే నిద్రలోకి జారిపోయాడు రాంబాబు.

ఒక్క ఊపులో లేచి నుంచున్నాడు రాంబాబు గాఢ నిద్రలోంచి ఒక్కసారిగా మెలకువరావడంతో, తనెక్కడున్నానా అని ఆలోచించే వ్యవధిలేకుండానే చోర్. . పకడో అన్న కేక మరోసారి వినిపించింది కనురెప్పలు అతుక్కుపోయినట్టు, ఎంత ప్రయత్నించినా తెరుపుపడక, చుట్టూవున్న పరిసరాలు రెప్పల సందులనించే అస్పష్టంగా కనిపిస్తున్నాయి పూర్తి నిద్రకీ, పూర్తి మెలకువకీ సరిగ్గా మధ్యస్థితిలో వున్నాడతను దరిచేరని సముద్రపు అలలమధ్య తన శరీరం తేలుతున్నట్టుగా అనిపిస్తోంది మంచంమీద కూలబడి, కళ్ళు నలుపుకుంటుండగా, వెనకపక్కగా దబ్బుమని లేత కొబ్బరిబోండం రాలినట్టుగా చప్పుడైంది. రాంబాబు ఉలిక్కిపడి వెనక్కి తిరిగి చూశాడు.

ఎత్తయిన తెల్లని గోడపక్కగా లేచి నిలబడుతున్నదో నల్లని ఆకారం "దొంగ.... దొంగ..... పట్టుకోండి" కేకలు వినిపిస్తుండగా తనవైపుకు దూసుకువస్తున్న వ్యక్తిని అయోమయంగా చూస్తూ చేతులు సాచాడు తనని దాటుకునిపోయినవాణ్ణి అందుకోవడానికి అదేవైపుకి పరుగెత్తి, వీధిలోకి వచ్చాడు రాంబాబు తెల్లని ట్యూబ్‌లైట్ల కాంతిలో పట్టపగల్లా కనిపిస్తున్న ఆ నిశ్శబ్దవీధిలో దూరంగా పరిగెడుతున్న ఆకారం వైపుకు దూసుకుపోయాడు వేగంగా

హరి
మోహన
కృష్ణ

అదేసమయంలో బైటకువచ్చిన మరికొందరు హడావుడిగా అటువైపుకు పరుగెత్తారు. ఇళ్ళలో వున్న ఆడవాళ్ళు చకచకా లైట్లన్నీవేసి ఆ కాలనీని కాంతిమయం చేశారు. ముందు బయటకు రావడానికి జంకినా, కిటికీలోంచి నలుగురినీ చూసి ధైర్యం తెచ్చుకొని అప్పారావు లాంటి ఒక రిద్దరు, లుంగీలు సర్దుకుంటూ వీధిలోకి వచ్చారు.

"మూర్తిగారింట్లో దొంగలు పడ్డారు. ఒక డిటు పరిగెత్తాడు" గాబరాగా చెబుతున్నారెవరో.

అయాసంతో, ఆవేశంతో పరిగెడుతున్న రాంబాబు, తన పరుగులో, తన కదలికల్లో ఏదో లోపం– ఏదో అసహజత్వం అనిపించింది. అదేమిటో తెలుసుకున్న ఉత్తర క్షణంలో, తన వెనక పరుగెత్తుకువస్తున్న మిగతా జనాన్ని గమనించాడు. అప్పటికే అతను వీధి దాటి బంజరుభూముల్లోకి వచ్చేశాడు. ఏం చేయాలో పాలుపోని ఆసమయంలో, అనాలోచితంగా దగ్గరలో వున్న . పెద్దసైజు కొండరాయి చాటుకు పరిగెత్తాడు. దొంగని పట్టుకోవడానికికాదు, తన నగ్నత్వాన్ని దాచుకోవడానికి. ముందుకు పరిగెత్తుకుపోయిన జనం కాలనీ చివరవున్న ఖాళీస్థలాల్లో దొంగ ఎటువైపు వెళ్ళివుంటాడా అని వెదుకుతుంటే, బండరాయి చాటుకు చేరిన రాంబాబు తన లుంగీ ఎక్కడ జారిపోయిందా అని కళ్ళు చిట్లించి, నేలమీద వెదుకుతున్నాడు ఆ చుట్టుపక్కల డొంకల్లో కాసేపు గాలించి, వెనక్కి తిరిగివచ్చిన వాళ్ళు పూర్తిగా కాలనీలోకి వెళ్ళిపోయేదాకా ఊపిరి బిగబట్టి కూర్చున్న రాంబాబు మెల్లగా యివతలికివచ్చి హడావుడిగా యిందాక తను పరిగెత్తిన ప్రదేశంలో వెతకడం మొదలెట్టాడు. అదృష్టవశాత్తు పౌర్ణమిరోజు కావడంతో, నేలంతా స్పష్టంగా కనిపిస్తోంది.

రాత్రంతా కురిసిన మంచువల్ల కాబోలు తివాసిలా పరుచుకున్న పచ్చగడ్డి తడితడిగా తగుల్తోంది చేతులకి. కళ్ళు బాగా చీకటికి అలవాటుపడటంతో, మధ్యమధ్య తలెత్తి చుట్టూ చూసుకుంటున్నాడు తన నెవరన్నా గమనిస్తున్నారేమోనని. చల్లటి గాలితెమ్మెర తన శరీరాన్ని స్పృశిస్తూ వెళ్ళిపోతుంటే, చక్కిలిగింతగా ఫీలయి తల పైకెత్తి ఆకాశంలోకి చూశాడు రాత్రి పడుకోబోయేముందు నడినెత్తిన వున్న చంద్రుడు బాగా క్రిందకు దిగిపోయి దూరంగా కనిపిస్తున్న చెట్ల తోపుల మధ్యకి పారిపోతున్నట్టుగా, జారిపోతున్నాడు. అనుమానం వచ్చినచోటల్లా వంగి తడిమి చూసుకుంటూ, కాలనీవైపుకి వెడుతున్న రాంబాబుకి, ఆరుబైట నగ్నంగా తిరగడం కొద్దిగా అలవాటయి, ఒక్కింత నిటారుగా నిలబడగలుగుతున్నాడు. వీధి చివరగా చీకట్లో నిలబడి రోడ్డునంతా ఆత్రంగా పరిశీలిస్తున్న రాంబాబుకి, వీధి మధ్యలో చేరి పెద్దగా చర్చించుకుంటున్న చుట్టుపక్కలవారి మాటలు అస్పష్టంగా వినిపిస్తున్నాయి కేకలు విని కాబోలు పక్కలైనులోంచి వచ్చిన కొందరికి, దొంగలు వచ్చిన వైనాన్ని కళ్ళకుకట్టినట్టు వివరిస్తున్నారు ఒక రిద్దరు ఉత్సాహవంతులు. ఆ పరిసరప్రాంతాల్లో ఎక్కడా తన లుంగీ లేదన్న నిజాన్ని మెల్లమెల్లగా జీర్ణంచేసుకుంటున్న రాంబాబుకి ఒక్కసారిగా నిస్సత్తువ ఆవరించినట్లయింది. అంత చలిలో గూడా, నుదిటికి పట్టిన చెమట కణతలమీదుగా కారుతోంది తన పరిస్థితికి పొట్ట చెక్కలయ్యేలా నవ్వాలో, సిగ్గుతో కుంచించుకుపోయి బావురుమని ఏడవాలో తెలియని సందిగ్ధావస్థలో వున్నాడతను. ఆదమరచి నిద్రపోతున్న తనకు, ఎక్కడో ఏదో కేకలాంటిది వినబడటం, అసంకల్పిత ప్రతీకార చర్యలా తను త్రుళ్ళిపడిలేవడం, చివరికి యిలా ఒంటరిగా చీకట్లో, ఆరుబయట దిగంబరంగా దేవులాడటం అంతా ఒక కలలా జరిగి పోయింది.

ఒక్కక్షణం యిదంతా కలగా ఐపోయి, తను మడతమంచంమీద నిద్రలేస్తే ఎంత బాగుండు ననిపించింది. హడావుడి సద్దుమణిగి, ఎవరిళ్ళలోకి వాళ్ళు వెళ్ళిపోయాక, చల్లగా తన గూటికి చేరవచ్చునన్న ఆశ మదిలో మెదులుతూండగా, సంకేతస్థలం వద్ద ప్రియునికోసం ఎదురుచూసే పడతిలా చీకటిలో నుంచున్నాడు రాంబాబు

* * *

దొంగలకోసం తాము దొంకల్లో గాలించిన విషయాన్ని మరింత రసవత్తరంగా, అక్కడజేరిన ఆడవాళ్ళకి చెపుతున్న ప్రభాకరానికి మధ్యమధ్య అడ్డొస్తూ తను కూడా అందులో దూరడానికి విశ్వప్రయత్నం చేస్తున్నాడు సుబ్బరాయశాస్త్రి. ఏదైనా ప్రత్యేకమైన సంఘటన జరిగినపుడు అందులో తమ పాత్ర ప్రస్ఫుటంగా కనిపించాలనే యిగో వున్న చాలామంది లాంటివాళ్ళే వారుగూడా. "బాత్ రూం కెడదామని బయటికొచ్చా నాంటీ, చీకట్లో మూర్తిగారింటి కిటికీ దగ్గర ఎవరో నుంచున్నట్టుగా అనిపించింది. నన్నుచూసి పరిగెత్తబోయాడు. ఇంతలో నే విసిరిన రాయి వాడికాలికి తగిలింది......" అమాయకంగా చెంపన చెయ్యిపెట్టుకుని వింటున్న జగదాంబగారికి చెపుతున్నట్టుగా వుంటుంది చూసేవాళ్ళకి. కానీ అతని స్వరం మాత్రం కొద్దిదూరంలో నుంచుని యిదే చూస్తున్న వాళ్ళమ్మాయి చెవుల్లో దూరడానికి నానాతంటాలూపడుతోంది "అసలు మొత్తం నలుగురొచ్చారు. ముగ్గురేమో మూర్తిగారింటి బాత్‌రూం వెంటిలేటర్‌లోంచి లోపలికెళ్ళార్ట అలికిడి విని నిద్రలేచిన ఆయన్ని కత్తితో బెదిరించి బ్యాంక్ తాళాలు యిమ్మని అడిగార్ట ఈలోగా పక్క గదిలో నిద్రపోతున్న వాళ్ళ తమ్ముడు సుందరం లేచి, పరిస్థితి అర్థంచేసుకుని, వాకిట్లోకి పరిగెత్తి అరిచాట్ట. దాంతో ఖంగారుపడి ముగ్గురూ వెనకవైపు గోడదూకి పారిపోయారు. ఒకడు మాత్రం రాంబాబుగారి దొడ్లోకి దూకాట్ట. వెంటపడ్డాం. కానీ వాడూ దొరకలేదు. కొద్దిలో తప్పించుకున్నాడు....." జరిగిందంతా చెపుతూంటే, ఆసక్తిగా అక్కడ గుంపుగా చేరారు పెద్దలంతా. "గారెంటీగా వాళ్ళు బ్యాంకు రాబరీకే వచ్చుంటారు. ఎందుకంటే యింట్లో సామానుకానీ, డబ్బుకానీ ముట్టుకోలేదు" తేల్చి చెప్పేశాడు శంకర్రావు. "మరో మొన్న వారాసిగూడాలో అట్లాగే జరిగిందట. బ్యాంక్ మేనేజరింటికి నలుగురూ, కాషియరు యింటికి నలుగురూ వెళ్ళేది, రెండు తాళంచెవులూ తెచ్చి, బ్యాంక్ దోచుకునేదీ చాలా యీజీ అయిపోతోంది వాళ్ళకి' రెండుచేతుల్నీ గట్టిగా రుద్దుకుంటూ అన్నాడు నరసింహం. సాధారణంగా అటువంటి బాతాఖానీలకు రాంబాబు ఎక్కువగా వెళ్ళడం అలవాటులేకపోవడంతో అతను లేకపోవడాన్ని ఎవరూ గమనించలేదు

"ఓసారిలాగే, ఫార్టీ సెవెన్‌లో అనుకుంటాను.... అమలాపురంలో నేను చదువుకునే రోజుల్లో....." అంటూ హిస్టరీ ఎత్తుకోబోతున్న అప్పారావు దృష్టి తమమీద పడకుండా మెల్లమెల్లగా అక్కడినుంచి తప్పుకుని యిళ్ళవైపు కదలసాగారు ఒక రిద్దరు దూరదృష్టికలవారు. అంతలో టైమెంతైందని అడిగా రెవరో. చెవిలో తిప్పుతున్న కాకీకను చటుక్కున కిందపడేసి, చెయ్యి పైకెత్తి తీక్షణంగా వాచీ వంక చూశాడు ప్రభాకరం "నాలుగూ యిరవై ఐదు" చెప్పి ఆప్యాయంగా లుంగీతో ఓసారి దాన్ని తుడుచుకున్నాడు. అత నా వాచీ కొని యింకా వారం దాటలేదు. అందుకనే నిద్రపోతూ గూడా పెట్టుకొని పడుకుంటాడు.

"అబ్బో! తెల్లారిపోయిందన్నమాట. నేనింకా ఏ, మూడో అయ్యుంటుంది, పోయి పడుకుందామనుకుంటున్నా. ఇంకో పావుగంటలో పాల వ్యాను వచ్చేస్తుం దెలాగూ." లుంగీ పైకిలేపుకుని కట్టుకుంటూ అన్నాడు శంకర్రావు మెల్లమెల్లగా ముసుగులోకి దూరుతున్న పిల్లల్ని "రోజూ ఎలాగూ లేచేడవరు. ఈ రూపేణా లేచారుగా, ఇవాళ్ళన్నా పుస్తకాలు తీసుకుని చదవండి. తెల్లవారుజామున చదివితేనే బుర్రలో కెక్కుతాయి. పైగా పరీక్షలు గూడా దగ్గరకొస్తున్నాయి" గదమాయించాడు సుబ్బరాయశాస్త్రి. గోడపక్కనే వున్న లైటుస్థంభాన్ని అప్పుడే తడిపి పైకిలేస్తున్న శంకర్రావు "రోజూ యిలాగే దొంగలొస్తుంటే బాగుణ్ణు, వీళ్ళకి చీకటితో లేవటమన్నా అలవాటవుతుంది" అని కిసుక్కున నవ్వి చుట్టూ చూశాడు. ఎవరూ తన జోకని కాచ్ చెయ్యలేదని గ్రహించగానే సమయస్ఫూర్తిగా మరో టాపిక్‌లోకి మాట మార్చాడు చాలామందిలాగే

అప్పటికే లంగాలు పైకి ఎగదోపుకుని, ఓణీలు



బిగించి కట్టుకుని, లెక్కపెట్టుకుంటూ ముగ్గుతో చుక్కలు పెట్టేస్తున్నారు ఆడపిల్లలు "పిన్నిగారూ! కాస్త ముగ్గుంటే యిస్తారా? అనక్కి బాబిగాడిచేత తెప్పించి యిచ్చేస్తా" తన దినచర్య ప్రారంభించేసిం దో యిల్లాలు. "ఇవాళ మేం సీతాకోక చిలుకల ముగ్గేస్తున్నామని ఒక రంటే, మాది పిట్టల ముగ్గు మరీ పెద్ద ముగ్గులే. సర్లేకానీ నా దగ్గర పసుపురంగైపోయింది కాస్తిస్తావా? కావాలంటే నా దగ్గర ఆరెంజీ వుంది తీసుకో" ఎక్కడా కనపడని మ్యూచువల్ కోఆపరేషన్ అక్కడ తాండవిస్తోంది

* * *

ఒక్కసారి ఉలిక్కిపడి పైకి చూశాడు రాంబాబు. రాత్రంతా మినుకుమినుకు మంటూ బ్రతికిన నక్షత్రాలు, సూర్యుడి ఆగమన ఛాయలు ముందుగనే పసిగట్టి, అతనిముందు తమ ఉనికి వెలవెలబోవడం యిష్టంలేక, ముఖావంగా తెరమరుగవుతున్నాయి. ఎక్కడో దూరంగా ఒకటి రెండు కాకులు

వుండివుండి అరుస్తున్నాయి కొద్దిసేపట్లో తెల్లవారబోతోందన్న నిజం అర్థమైన మరుక్షణంనించి రాంబాబు వెన్నులో వణుకు ప్రారంభమైంది అప్రయత్నంగా రెండుచేతుల్ని జోడించి భగవంతుడా! దయచేసి నన్ను రక్షించు నన్ను కాపాడు నీకు కొబ్బరికా కాదుకాదు అభిషేకం చేయిస్తాను ఎలాగోలా ఈ ఆపదనించి నన్ను గట్టెక్కించు నీకు పుణ్యముంటుంది ఏ వంటున్నాడో కూడా తెలీకుండా, ఏవేటే ఏటో గొణుక్కుంటున్నాడు అస్పష్టంగా అంతకు ముందెప్పుడో దేముడున్నాడా? ఏడీ నాకు కనిపించమను అంటూ చేసిన చాలెంజీలు గుర్తొచ్చికాబోలు రెండు చెంపలూ గట్టిగా వాయించుకున్నాడు కసిగా ఆకాశంలోంచి ఏదైనా అంగోస్త్రం ఎగిరివచ్చి తనమీద పడితే బావుణ్ణునుంది విఠలాచార్య సినిమాలోలా మరోసారి వీధిలోకి తొంగిచూశాడు ముచ్చటగా ముగ్గులు పెడుతున్న అతివలమధ్యనించి వేగంగా పరిగెత్తుకునివెళ్ళి తన యింట్లోపడితే! అని ఒక్కక్షణం ఆలోచించి తరువాత అదెంత ప్రమాదకరమైన ఆలోచనో గ్రహించి విరమించుకున్నాడు దూరంగా మైన్ రోడ్డు మీద పాల వేన్ వస్తున్న శబ్దం. అది నిజమో, తన ఆలాపనో అర్థమై చావడంలేదు. ఏదేమైనా కొద్దిసేపటిలో తాను నగ్నంగా ఎవరో ఒకరి కంటపడటం ఖాయం ఆ ఆలోచన రాంగానే రాంబాబు మెదడు మొద్దుబారినట్లయింది కనుకొనలను దాటడానికి విశ్వప్రయత్నం చేస్తున్నాయి వెచ్చని కన్నీళ్ళు గట్టిగా గొంతుచించుకు అరవాలనీ, ఊది చేతిలో కొచ్చేలా జుట్టుపీక్కోవలనీ, తలక్రిందులుగా శీర్షాసనం వేయాలనీ, శరీరమంతా ఒక్కసారిగా లుంగచుట్టుకుపోయి, భూమిలోకి దిగబడిపోవాలనీ..... యిలా ఏదో ఏదో అయిపోవాలనీ అర్థంకాని, అగమ్యగోచరంగా ఆలోచనలు . ఇక అక్కడ నుంచుని ప్రయోజనం లేదన్నట్లుగా, మెల్లగా మైన్‌రోడ్‌వైపుకి నడవసాగాడు.

దూరంగా రైలుకట్ట వెనకనుండి ఉదయభానుడి తొలి కిరణాల వెలుగు తాలూకు ఛాయలు అస్పష్టంగా కనిపిస్తున్నాయి. మట్టిరోడ్డును దాటి, తారు రోడ్డుమీదకొచ్చి నిలబడ్డాడు రాంబాబు. పగలంతా రణగొణ ధ్వనులతో అలసిపోయిన ఆ ప్రదేశం నిశ్శబ్దంగా నిద్రపోతోంది. మూసివున్న కిళ్ళీకొట్టు కింద నిద్రపోతున్న కుక్కపిల్ల రాంబాబు అడుగుల చప్పుడికి నిరసనగా ఓ అరుపు అరిచి, నీరసంగా ముడుచుకు పడుకుంది.' రోడ్డుపక్కగా కొత్తగా కట్టిన షాపులు వున్నాయి. 'ఇందిరా ఫ్యాన్సీస్టోర్స్..... పక్కనే 'మాధవి' క్లాత్ షోరూం అన్న అక్షరాలు చదువుకుని చిన్నగా నవ్వుకున్నాడు రాంబాబు. ఆ షాపు లోపల అచేతనంగా పడివున్న తానులకొద్దీ బట్టలు, బయట జానెడు గుడ్డముక్క కోసం నగ్నంగా దేవులాడుతున్న మనిషి.. ఆలోచిస్తూ నడుస్తున్న రాంబాబు కాళ్ళు సడన్ బ్రేకుతో ఆగిపోయాయి

ఆపకుండా ఖళ్ళుఖళ్ళుమని దగ్గుతూ, ముసుగులో అసహనంగా కదులుతున్న బైరాగి పైన కప్పుకున్న దుప్పటి అని పిలవబడే ముతక గుడ్డను పక్కకితీసి, బద్ధకంగా ఆవులించి, లేచి కూర్చున్నాడు రాగి రంగులో అట్టలుకట్టి అసహ్యంగా కనిపించే జుట్టు, నో రెక్కడుందో కనిపించకుండా గుబురుగా పెరిగిన గడ్డం, ఎక్స్-రేతో పనిలేకుండా ఏ ఎముకెక్కడుందో స్పష్టంగా కనిపించే మురికిపట్టిన శరీరం, మొలకో మాసిపోయిన కాషాయగుడ్డా, భుజంమీద ఏమహానుభావుడో దానంచేసిన బొక్కలుపడ్డ గళ్ళ దుప్పటి యివన్నీ బైరాగిగాడి బయోడేటా వివరాలు గుంటలుపడ్డ కళ్ళతో, దొంగచూపులు చూస్తూ బస్‌స్టాపులదగ్గర అడుక్కోవడం వాడి దినచర్య



ఊరంతా వాడిదే అందుచేత వా డా సమయంలో అక్కడ కనిపించడం రాంబాబుకు ఆశ్చర్యమేమీ అనిపించలేదు కానీ, ఒక్కక్షణం క్రితం తన మదిలో మెరిసిన మెరుపుతాలూకు కాంతిరేఖలు, అప్పటివరకూ నిస్తేజంగా వున్న కళ్ళలో ప్రతిస్పందించాయి·

మెల్లగా వాడిదగ్గరకు నడిచి మెట్టుమీద మోకాళ్ళు ఆన్చి, కూర్చున్నాడు రాంబాబు. "చూడుబాబూ! నాకో చిన్న సాయం జేస్తావా?" అని ఒక్కక్షణం ఆగాడు. ఆకులు నాకేవాడు తన చేతులు నాకేవాణ్ణి చూసినట్టుగా తనకేసి చూస్తున్న బైరాగోడికి ఎలా చెప్పాలో తోచక కాస్త తటపటాయించి "ఏంలేదు... నీ దుప్పటి నాకిస్తావా... కాస్త.... పుణ్యముంటుంది" ఎందుకో తన గొంతు తనకే వింతగా వినిపించింది రాంబాబుకి "ఎళ్ళెల్లు....." అని యింకేదో అనబోతున్న వాడి చూపులు తన శరీరంమీద ఎక్కడో నిలిచిపోయి తీక్షణంగా చూస్తున్నాయి ఒక్కక్షణం తరువాత గ్రహించాడు మసకవెలుతురులో మెరుస్తూ కనిపించిన తన చిటికినవేలి బంగారు ఉంగరాన్ని విషయం అర్థంకాక అయోమయంగా చూస్తున్న వాడి కళ్ళకి కనిపించేటట్టుగా ఉంగరాన్ని తీసిపట్టుకుని "కావాలంటే యిది యిస్తాను నిజంగా బంగా రందే నామీదొట్టు నీ దుప్పటిచ్చెయ్ .' ఏమిటేమిటో మాట్లాడుతున్నాడు పొంతన లేకుండా మరి నిజంగా అది బంగారందే అని నమ్మాడో, లేక తళుక్కుమని మెరిసిన దానిలోని తెల్లరాయి నచ్చిందో కానీ, మెల్లగా ఒంటికి చుట్టుకున్న దుప్పటి తీసి కిందపడేస్తూ, రాంబాబు చేతిలోని ఉంగరాన్ని గుంజుకున్నాడు ఆత్రంగా. ఎలిక చచ్చిన కంపుకొడుతున్న దుప్పటిని చటుక్కున చేతుల్లోకి తీసుకుని వేగంగా యివతలికి వచ్చేశాడు రాంబాబు మరో క్షణానికి వాడి బుద్ధి మారిపోయి దాన్ని లాక్కుంటా డేమోనన్న అనుమానంతో

అప్పటివరకూ నగ్నంగా తిరగడం అలవాటైన శరీరానికి దుప్పటి కప్పేసరికి ఒక్కసారిగా ఎక్కడలేని సిగ్గు ముంచుకు వచ్చేసి, రోమాలు నిక్కబొడుచుకున్నాయి. మెడదగ్గరనించి మోకాళ్ళదాకా చుట్టగా కప్పుకుని తారురోడ్డు దిగుతుండగా చూశాడు దూరంగా వస్తున్న పాలవేను హెడ్‌లైట్ కాంతిని

* * *

'ఏంటి గురూగారూ! పొద్దున్నే మార్నింగ్ వాక్ కెళ్ళొస్తున్నారా?' పాలపాకెట్లకోసం వెడుతున్న సుబ్బరాయశాస్త్రి పలకరించాడు వడివడిగా కాలనీవైపు నడుస్తున్న రాంబాబుని "ఆఁ ఆఁ మరేఁ . అబ్బ! ఈ చలిలో చచ్చిపోతున్నామనుకోండీ లోపల చొక్కా, స్వెట్టరు వేసుకొని పైన ఈ దుప్పటి కప్పుకున్నాగూడా చలాగిచావడంలా. ' తను అనవసరంగా ఎక్కువగా మాట్లాడుతున్నానని గ్రహించి, చిన్నగా నాలిక కొరుక్కున్నాడు దాదాపు తెల్లవారిపోతుండగా రంగురంగుల ముగ్గుల మధ్యనించి జాగ్రత్తగా నడుస్తూ వెళ్ళి, తన యింటి కాంపౌండ్‌లోకి అడుగుపెట్టాడు యుద్ధభూమి నుంచి చావుతప్పి కన్ను లొట్టబోయి, తిరిగొచ్చిన మహారాజులా. మంచుపడి చల్లగా తడిసిన దిండుకిందనించి తాళంచెవి తీసుకుంటుంటే కనిపించింది మడత మంచం పక్కనే కుప్పగా పడివున్న నీలంరంగు లుంగీ. కసిగా దాన్ని ఒక్క తన్నుతన్ని లోపలికి నడిచాడు.

అరగంటక్రితం తన మానాన్ని కాపాడిన దుప్పటిని కర్రతో ఎత్తి గోడవతల చెత్తకుండీలోకి విసిరేసి, స్నానంచైడానికి బాత్‌రూంలోకి దూరాడు రాంబాబు. అప్పటి కెన్నిసార్లు స్నానం చేశాడో గుర్తులేదుగానీ, కొత్త షాంపు సీసా దాదాపు సగానికి ఖాళీ అయిపోయింది. అప్పటివరకూ తను అనుభవించిన టెన్షన్, మానసిక క్షోభ యిప్పుడు తల్చుకొంటే

ప్రశ్నావళి

-కె. రామలక్ష్మి

డి. ఆర్. ఆర్. విశాఖపట్నం

ధనవంతులెప్పుడు సంతోషవంతులే కాదన కలరా?

● ధనమేనా సంతోషమేనా– అనుభవించాలంటే దాన్ని స్వయంగా సృష్టించి వుండాలి సంపాదించని డబ్బూ, తాము సృష్టించని సంతోషం– అనుభవించే అర్హత వుండదు

మనిషి నిలకడగా వుండాలంటే?

● తనపై తను ఆధారపడ్డమే! ఏదీ తనని బలహీన పరచలేదన్న నమ్మకం! తన తప్పులు తన నుండే దిద్దుకోకలనన్న విశ్వాసం వుంటే– నిలకడగా వుండవచ్చు ఎవరి పైన ఆధారపడ్డా– ఆధారం తొలగితే సాగిలపడవచ్చు తనే తనకు దాపు అయితే– ఆ బెంగ వుండదు!

ఎమ్. కె. కాకినాడ

ప్రేమికులు ఎందుకు విడిపోతూంటారు?

● అతి ప్రేమ అలసత్వానికి దోహదం చేస్తుందన్న– సంగతి వినలేదా సోదరీ?!

సి. హెచ్. ఎన్. ఆర్. సత్తెనపల్లి

పాఠకులు ఒక ప్రశ్న ఆలోచించడానికి కొంత కాలం పడుతుంది మరి మీరు సమాధానం యివ్వడానికి?

● అది చదవడానికి పట్టినంత సమయం చాలు!

పతనమౌతూన్న హిందూ మతాన్ని ఉద్ధరించడానికి కొందరు ప్రయత్నిస్తున్నారు ఇది చాలా శుభ సూచకం కదా?

● ఎవరికి?!

ఇతర శీర్షికలలో ప్రశ్నలు పంపిన వారికి– ఇతర విధాల ప్రోత్సాహం వుంటుంది మీ శీర్షికలో అవి ఎందుకు ప్రవేశపెట్టరు?

● నా ప్రశ్నావళిలో ఏది ఉత్తమ ప్రశ్న? అని ఎవరు నిర్ణయించాలి? నేనా? సంపాదకులా? పరితలా? అలాంటి పిచ్చి సరదా నాకు లేదు బహుమతి లేకుంటే– ప్రశ్నలు రావా? వేయరా?!

మెదడుని ఉపయోగించే రచయితలు మంచి ఊహలు వచ్చుటకు ఏమైన పదార్థాలు తీసుకొంటారా?

● ఘనమా? ద్రవమా? మీరడిగేది? రెండూ దండగే– ఒకటి శరీరాన్ని ఇంకోటి మెదడునీ ఫూల్ చేసి వదులుతుంది

కె. పి. నెల్లూరు

★ స్త్రీ స్వరూపం వర్ణిస్తారా?

● ఎవరి కళ్ళతో చూసి?!

ఎల్. ఎస్. ఆర్. ఎమ్. కోటబొమ్మాళి

★ మనోవ్యాధికి మందు లేదు అంటారు మరి మనోవ్యాధి లేకుండా వుండాలంటే ఏమి చెయ్యాలి?

● మనసుని చంపుకొని బ్రతకాలి

కె. ఎన్. గూడూరు

★ ఆనాటి చెలి మనోభావాలు చిత్ర రూపంలో తెలిపే వారు నేడు?

● ఊరేగిపోయే వాద్య సంగీత నేపథ్యంలో కోతి కూస్తోంది- నేటి చెలి మన చిత్రరంగంలో-

జి. ఎన్. కొమరపూడి

★ ప్రేమించడం ఎలాగో కొంచెం చెప్తారా?

● గురువులు నేర్పలేని విద్య ఇదొక్కటే- అందుకే- వ్యక్తుల అభిరుచుల/ అభిమతాలకి దర్పణంగా వెల్లుతూంటుంది వారి ప్రేమ ●

ఆదోరకమైన థ్రిల్లింగ్‌గానూ, మాటల్లో చెప్పలేనింత అనుభవంగానూ వుంది అనుభూతి పంచుకోవడానికి అర్ధాంగి యింట్లో లేకపోవడంతో, ఎలాగో అలా స్వయంపాకం తిన్నాననిపించి ఆఫీసుకు బయలుదేరారు.

బ్రౌన్ కలర్ షూ క్రింద మెత్తగా నలుగుతున్న గడ్డిపరకలు కిసుక్కున నవ్వుతున్నాయి. కొద్ది గంటలక్రితం పిచ్చెక్కినవాడిలా, తడుముకుంటూ తిరిగిన ఖాళీస్థలాల మధ్యనుంచే రోజులాగే హడావిడిగా నడుచుకుంటూ మెయిన్‌రోడ్డుకు చేరుకున్నారు రాంబాబు.

నీడగావున్న షెల్టర్‌కిందకి అడుగులు వేస్తూ చిన్నగా ఉలిక్కిపడ్డారు. కొద్దిదూరంలో మట్టిలో దొర్లుతున్నాడు బైరాగి అంతకుముందు తగిలిన బూటుకాలి దెబ్బకి కాబోలు కడుపు పట్టుకుని అరుస్తున్నాడు "ఉంగరం మెక్కడినుంచి దొబ్బుకొచ్చావురా.. దొంగలం... కొడకా....' లాఠీ కర్రతో డొక్కలో పొడుస్తూ అడుగుతున్నాడు బీటుకానిస్టేబుల్ అంజనేయులు. తొలిచూపులోనే, అది బంగారందని కనిపెట్టి, తన సుడికి మురిసిపోతున్నాడు గుంభనంగా. పరిస్థితిని మెల్లమెల్లగా అర్థంచేసుకున్న రాంబాబు గుండె ఒక్కసారి బాధగా మూలిగింది. తన పెళ్ళికి మావగారు పెట్టిన ఉంగరం. ఎంతలేదన్నా మూడు



వేలన్నా వుంటుంది ఖరీదు 'ఛ ఛ ముందూ వెనకా చూసుకోకుండా ఓ దరిద్రపుగొట్టుకి ధారపోశాడు తను. నిన్నటిదాకా తన చిటికిన వేలిన తళుక్కుమని మెరిసేది. ఇవాళ మురికిపట్టిన చేతిలో కళావిహీనంగా వుంది. అంతేకాదు, రేపొద్దున అంజనేయులి పెళ్ళాం వేలిని చేరినా ఆశ్చర్యంలేదు.

దగ్గరకెళ్ళి కల్పించుకుంటే బైరాగి తనని గుర్తుపట్టి పంచాంగం విప్పుతాడేమోనన్న శంక ఓ పక్క లాగుతున్నా, రాంబాబుకి అంజనేయులుతో కాస్త పరిచయం వుండడంతో మెల్లగా అటువైపుకి నడిచారు.

అప్పటికే ఉంగరం తీసి ఎర్రరంగు బూటుకాళ్ళదగ్గర పడేసి బ్రతుకుజీవుడా అని పరుగు లంకించుకున్న బైరాగిని ఆపి "వాడు దొంగకాదు, వాడికి దాన్ని నేనే యిచ్చాను" అని చెప్పాలని ఒక్కక్షణం అనిపించినా, ఆ తరువాత తన్నో పిచ్చివాడికింద జమకడతారని వూరుకున్నారు

కిందనించి ఉంగరాన్ని తీసి దుమ్ము దులుపుతూ చూశారు పక్కనే నిలబడ్డ రాంబాబుని "ఏంటిసార్ యిది మీదేనా?" అని అడిగారు, కాదనాలని వెయ్యిదేముళ్ళకు మొక్కుకుంటూ

"హర్రె..... యిదిక్కడికెలా వచ్చింది? పొద్దునించీ దీనికోసం వెతకని చోటులేదు పొద్దున్నే పాలకోసం వచ్చినపుడు జారిపోయినట్టుంది బుజ్జిముండ చూశావా – కష్టార్జిత మంటే యిదేనోయ్..... యివాళ లేచినవేళ మంచిది...." అంటూ తనెంత సహజంగా నటించగలనా అని అబ్బురపడి పోతున్నారు రాంబాబు. "థాంక్సోయ్ నువ్వుకాబట్టి సరిపోయింది, డ్యూటీలో మరింకే వెధవలన్నా వుండుంటే స్టేషన్ చుట్టూ తిరగాల్సొచ్చేది ఈ వెధవ ఉంగరంకోసం" అంటూ సున్నితంగా అతని చేతుల్లోంచి దాన్ని తీసుకొని, ఏడవలేక నవ్వుతున్న అంజనేయులికి కానుకగా ఓ చిరునవ్వు నవ్వి యివతలికి వచ్చేశారు. □

ఫొటో వ్యాఖ్య పోటీ – 4
పోటీ ఫలితాలు



బహుమతి పొందిన వ్యాఖ్య

"అమ్మకానికి కాదీ అమెరికా పాపాయి
అమ్మాయి కాదు అమ్మమ్మగారే ఆకతాయి!"

–ఆళ్ళ నాగమణి (రామచంద్రాపురం)

వీరికి ఆంధ్ర సచిత్ర వారపత్రిక రెండు మాసాలు పంపబడుతుంది – సం

బొమ్మని అమ్మకానికి పెడితే బేరమౌతుంది
అమ్మాయిని అమ్మకానికి పెడితే నేరమౌతుంది

–ఏ వి ఎస్ శర్మ (వరంగల్)

* * *

"షాపింగ్‌కి వెళ్ళిన అమ్మమ్మ
పాప్పాయికి విధించిన పనిష్‌మెంట్
షాపింగ్‌కి వచ్చిన వారికి
ఇది ఒక ఎంటర్‌టైన్‌మెంట్"

–జి వి రాఘవేంద్రరావు (మచిలీపట్నం-2)

సౌందర్యదీపం

చల్లా ఝాన్సీరాణి



ఆలివ్ ఆయిల్‌తో మరో పద్ధతి

మీ ముఖానికి సరిపడినంత గ్లాస్కో బట్ట - లేదా గాజు గుడ్డ తీసుకుని కళ్ళు- ముక్కు ప్రాంతాల్లో రంధ్రాలు చెయ్యండి.

ఆలివ్ ఆయిల్‌ని కొద్దిగా వేడి చేసి ఈ బట్టను నూనెలో ముంచి ముఖాని కంటించుకోండి.

అతివల అందాలకు వన్నెల చందనం 'చమురు'

ఓ అరగంటయాక మెత్తటి బట్టతో ముఖాన్ని తుడుచుకోండి. మీ చర్మం మెత్తబడుతుంది.

ఇదే పని మీరు రాత్రి పడుకునే ముందు చేస్తే ఇంకా మంచిది. నూనెలో తడిపిన గాజు గుడ్డని ముఖానుంచుకుని అరగంటయాక తీసేసి- ముఖం కడుక్కోకుండా అలాగే పడుకోండి. ఉదయం లేస్తూనే గోరు వెచ్చటి నీళ్ళతో ముఖం కడుక్కుని తర్వాత చల్లని నీళ్ళు ముఖం మీద జల్లుకోండి.

ముఖం మీద ముడతలు పోగొట్టుకోవాలంటే

ఏ క్రీములూ బజార్లో కొనక్కర్లేదు. ఇంట్లోనే స్వయంగా ముడతల్ని పోగొట్టే క్రీంని తయారు చేసుకోవచ్చు. కావలసినవి రెండే రెండు. ఒక కోడి గుడ్డు- కొంచెం ఆలివ్ ఆయిల్. కోడి గుడ్డు తెల్ల సొనని కొంచెం తీసుకుని దాన్లో ఓ టీ స్పూను ఆలివ్ ఆయిల్ వేసి బాగా కలిసేలా స్పూన్‌తో కొట్టండి. ఆ మిశ్రమాన్ని ముఖానికి మెడకీపట్టించి- ముఖం బిరుసుగా ఆరిపోయే వరకూ ఉంచి- దూదిని వేడినీళ్ళలో ముంచుతూ మెల్లగా ఆ పట్టీని తీసెయ్యండి.

ఇలా చేస్తే మీ ముఖంలోని సున్నితమయిన కండరాలకు ఆటోమేటిక్‌గా మసాజ్ అయి మిమ్మల్ని ఇబ్బంది పెట్టే ముడతలు పోతాయి. కనీసం వారం రోజులయినా ఇలా చేస్తే తప్ప ఫలితం కనిపించదు. ముడతలు తగ్గిపోయాయి కదా అని అశ్రద్ధ చేస్తే మళ్ళీ వచ్చే అవకాశముంది. గనుక రెండ్రోజులకో సారి కనీసం ఈ మాస్క్ వేసుకుంటూ ఉంటే శాశ్వతంగా ముడతలు ముఖంలో కన్పించకుండా చేసుకోవచ్చు. ముప్పై ఐదు సంవత్సరాలు పైబడ్డ వాళ్ళకి ఈ మాస్క్ అతి తేలిగ్గా చౌకగా దొరికే సౌందర్య సాధనం.

మరో రకం బ్యూటీ మాస్క్

1 టేబుల్ స్పూను ఆలివ్ ఆయిల్

1 టేబుల్ స్పూను శనగపిండ

1/4 టీ స్పూను కమలా తొక్కల పొడి. (కమలాల సీజనులో- కమలా తొక్కలు పడెయ్యకుండా ఎండబెట్టి మెత్తటి పొడిగా చేసి పెట్టుకుంటే - ఎన్నో మాస్క్‌లకి వాడుకోవచ్చు. ఇది మీ చర్మానికి చక్కటి టానిక్‌లా ఉపయోగపడుతుంది.)

1 టేబుల్ స్పూను చిలికిన పెరుగు.

ఈ నాలుగింటినీ బాగా కలిపితే పేస్ట్‌లా తయారవుతుంది ఈ పేస్ట్‌ని ముఖానికి మెడకీ పట్టించి- ఆరాక రెండు చేతుల వేళ్ళతోనూ మెల్లగా ముఖంలోకి మెరుపు వచ్చే వరకూ రుద్దండి.

మాస్క్ అంతా రాలిపోయాక మొదట వేడి నీళ్ళతోనూ- ఆ తర్వాత చల్లటి నీళ్ళతోనూ ముఖాన్ని కడగండి. ఈ మాస్క్‌తో ముఖంలోని మచ్చలు -పగుళ్ళు పోయి మృదువుగా మారుతుంది.

ఎండలో బాగా తిరిగేవాళ్ళకి

చేసే ఉద్యోగాన్ని బట్టి కొంతమంది గంటల తరబడి ఎండలో తిరగాల్సి రావొచ్చు. దీనివల్ల చర్మం తన సహజ మృదుత్వాన్ని -రంగునీ శాశ్వతంగా పోగొట్టుకునే ప్రమాదం వుంది. అందుకే ఎండలో తిరిగే వాళ్ళు-తమ చర్మం పట్ల మరి కాస్త ఎక్కువ శ్రద్ధ వహించక తప్పదు.

వెన్న- నెయ్యి- ఆలివ్ ఆయిల్- కోల్డ్ క్రీం.... మీకు అందుబాటులో ఉన్న ఏదో ఒక క్రీంని ముఖానికి రాస్తూ ఐదు నిముషాలపాటు మసాజ్ చెయ్యండి తర్వాత ఆవిరి పట్టండి. దాంతో ముఖంలో చేరిన దుమ్మూ- ధూళీ బయటికి వచ్చేస్తుంది. తర్వాత మెత్తటి టవల్‌తో ముఖాన్ని తుడుచుకుని చల్లటి నీళ్ళతో ముఖం కడిగేసుకోండి.

తర్వాత ఓ టీ స్పూను ఆలివ్‌ఆయిల్లో కొంచెం నిమ్మరసం కలిపి ముఖానికీ మెడకీ పట్టించండి మెడ కూడా మీ ముఖంలో ఓ భాగం అనే విషయం మర్చిపోకండి. ఆ మాస్క్‌ని ఓ ఇరవై నిమిషాల పాటు అలాగే ఉంచి కాటన్‌తో శుభ్రంగా తుడిచెయ్యండి.

చల్లటి నీళ్ళతో ముఖం కడుక్కుని - ఐస్ క్యూబ్‌తో ముఖాన్ని ఐదు నిమిషాల పాటు రుద్దండి.

మీ అలసట పోవడంతోపాటు- ఎండ వేడిమికి కమిలిన మీ చర్మం మామూలు స్థితికి వస్తుంది. ●

ఇటీవల హైదరాబాదులో ప్రముఖ సినీ గాయకుడు శ్రీ ఎస్. పి. బాలసుబ్రహ్మణ్యం 1988 సం.పు ఘంటసాల పాటల అవార్డును కుమారి బి. వాణిశ్రీకి బహూకరిస్తున్న దృశ్యం.



అన్వేషి

సీరియల్

చక్కిలం విజయలక్ష్మి

(గత సంచిక తరువాయి)

నేను స్నానం చేసి వచ్చేసరికి గదిలో శృతి కూర్చుని వుంది. ఆమెను చూడగానే ఇందాకటి దృశ్యం కళ్ల ముందు కదిలి నవ్వు వచ్చింది.

ఏమిటో నీలో నీవే నవ్వుకుంటున్నావు అంది శృతి.

చెప్పాను. నవ్వింది శృతి.

అంత శిక్షకు పాత్ర మయ్యేంత నేరం వాళ్ళేం చేశారో!' అన్నాను కాఫీకి నీళ్ళు పెడ్తూ.

నేరం ఎంతటిదో అయితేనే శిక్ష వేయాలా? నేరం అన్న పదం సంపూర్ణం కాదు. నేరము– శిక్ష ఇదే సరియైనది. అంటే ఎక్కడ నేరం వుందో అక్కడ శిక్ష వుంటుంది. వుండాలి అంది శృతి.

అయితే మన నిఘంటువులోంచి పశ్చాత్తాపం, క్షమనే పదాలను తొలగించుకోవాలా? కుతూహలంగా అడిగాను.

అవసరం లేదు. పశ్చాత్తాపం అంటే ఒక రకమైన శిక్షే. నిజమైన పశ్చాత్తాపం ఎప్పుడూ హృదయ మథనంలోంచీ, అమిత బాధ లోంచీ పుడ్తుంది. ఇతరులు విధించే శిక్ష కంటే స్వతహా కలిగే పశ్చాత్తాపమే బాధా తప్తమైంది. కఠినమైంది.

మరి క్షమ సంగతేమిటి?

నవ్వింది శృతి.

క్షమ విషయంలో నాకు పెద్దగా సదభిప్రాయం లేదు. నేరం చేసిన వాళ్లను ఎందుకు క్షమించాలి? అది నేరాన్ని ప్రోత్సహించినట్లే అవుతుంది. క్షమ అన్నది గొప్ప ఔదార్య గుణంగా చెప్పబడింది గానీ క్షమను పొందే నేరస్తులకది మేలు చేసేది కాదు.

నాకు ఆశ్చర్యం వేసింది. సాధారణంగా రచయిత(త్రు)లు తమ సొంత జీవితం ఎలాంటిదైనా పైకి క్షమ, త్యాగం లాంటి వాటి గురించి గొప్ప అభిప్రాయాలు వెలిబుచ్చుతూ వుంటారు. మరి శృతి ఇంత నిర్మొహమాటంగా మాట్లాడుతుందేమిటి!

నవ్వుతూ అంది శృతి. నా అభిప్రాయాలు నీకు నచ్చవు గానీ త్వరగా కాఫీ కలుపు తాగుదాం.

కాఫీ కలుపుకుని ఇద్దరం తాగాం.

అన్నట్లు వచ్చిన విషయం మరచిపోయాను. ఈ పూట వంట పని పెట్టుకోకు. రాత్రి మా ఇంటికి గెస్టులొస్తున్నారు. డిన్నర్ వుంది. చీఫ్ గెస్ట్ నీవే. నవ్వింది మళ్ళీ.

నీ వెప్పుడూ ఇంటి పనులతో, డిన్నర్లతో బిజీగా వుంటావు. నీ అమూల్యమైన సమయాన్నిలా వేస్ట్ చేసుకోవటం నాకు బాధగా వుంది శృతీ. కావాలంటే డిన్నర్‌కు నేను ప్రిపేర్ చేస్తాను. నీవు రాసుకో' అన్నాను.

'చాలా థేంక్స్. కానీ నేను రాసే యంత్రాన్ని మాత్రమే కాదు. నాకు సంసారం, సరదాలు, స్నేహాలు అన్నీ అందరి లాగే కావాలి. నాకు రాయటం అన్న అదనపు క్వాలిఫికేషన్ కూడా వుంది. నిజమే. కానీ దేవుడిచ్చిన ఈ వరాన్ని, బలవంతంగా రాయడానికి కూర్చుని ఒక తలనొప్పిగా తయారు చేసుకోవడం నా కిష్టం లేదు. రాయటం అన్నది గొప్ప అనుభూతిగా వుండాలని నా కోరిక. అందుకే తీరిక వున్నప్పుడు, రాయాలనిపించినప్పుడు మాత్రమే రాస్తాను.

సరిసరి నేను వెళ్ళాలి. వీలైతే ఓ సారి నా కిచెన్ పావనం చెయ్యి' అంటూ అకస్మాత్తుగా లేచింది.

* * * *

శృతి నన్ను తన కిచెన్‌లోకి ఎంటర్ కానివ్వలేదు.

'అసలే నా వంట గది చిన్నది. ఇలా కూర్చుని కబుర్లు చెబుతూ వుండు చాలు' అంటూ గుమ్మం ఇవతల కిచెన్ చెయిర్ వేసి కూర్చోబెట్టింది. అరకప్పు ఘుమ ఘుమలాడే టీ ఇచ్చింది.

'ఏం కలిపావ్ శృతీ ఇందులో?' అన్నాను.

'నా ప్రేమ అనే పరిమళాన్ని' అంది, సిన్సియర్‌గా.

'అయితే ఈ కప్పు మీ వారిది కాబోలు! పొరపాటున నా కిచ్చినట్లున్నావ్' అన్నాను ఇబ్బందిగా ముఖం పెట్టి.

పక్కున నవ్వింది శృతి.

దిగులు పడకు. ప్రేమలో రకాలున్నాయి అంది.

అయితే ఇదే రకం ప్రేమ? అని అడిగాను.

శొంఠి, ఏలకులు కలిపిన ప్రేమ.

చాలా బాగుంది.'

కబుర్లు చెబుతూనే చకచక వంట ముగించింది శృతి. పదార్థాలున్న గిన్నెల్ని, ప్లేట్లను, స్పూన్లను డైనింగ్ టేబుల్ మీద అందంగా అమర్చి, కొత్తిమిర, టొమాటో ముక్కలు, జీడిపప్పు, ద్రాక్ష లాంటి వాటితో పదార్థాలను డెకరేట్ చేసింది. ఉల్లిపాయలను ముచ్చిక వరకు ముచ్చిక తెగకుండా నిలువుగా గీతల్లా కోసి, చిన్న చిన్న గాజు ప్లేట్లలో ఒక్కొక్కటి వెల్లకిలా పెట్టింది. ఉల్లిపాయలు పువ్వుల్లా విచ్చుకుని తమాషాగా వున్నాయి. మంచి నీళ్ల జగ్‌లో రెండు చుక్కలు పన్నీరు కలిపింది. దోసకాయకు చెక్కు తీసి చాకుతో అర విచ్చిన మల్లె మొగ్గలా చెక్కి, మధ్యన అగరొత్తులు గుచ్చి పెట్టింది. పొట్టిగా, దాదాపు పళ్లెంలా వున్న ఫ్లవర్ వాజ్‌లో రకరకాల ఆకులు నింపి వాని మధ్య రెండే రెండు తాజా గులాబీలు సర్దింది.

శృతి కిచెన్‌లో పెద్దగా సామాను లేదు. చాలా అందమైనవీ లేవు. కానీ ఆయా పదార్థాలకు తను పాత్రలు ఎన్నుకున్న విధానం వల్ల ఎంతో అందం వచ్చింది. పదార్థాలు చిన్నా పెద్దా అని లేకుండా ఏ గిన్నెలో పడితే ఆ గిన్నెలో వేసి పెట్టకుండా పచ్చళ్లకు ఒకలాంటివి, కూరలకు ఒక లాంటివి, సూపులకు ఒక లాంటివి– ఇలా యూనిఫాంగా ఎన్నుకుని పదార్థాలు సర్దింది.

డైనింగ్ టేబుల్ ఎంతో కళాత్మకంగా కన్ను చెదిరేలా వుంది. అమర్చిన విధానం, అలంకరించిన పద్ధతి ఎంతో ఆహ్లాదకరంగా, ఆకలి పుట్టించేదిగా వుంది.

నేను విస్మయంగా చూస్తుండగానే నిముషాల్లో స్నానం చేసి వచ్చింది సుస్నాతంగా, అందంగా వుంది. చక్కగా తయారై వచ్చిన ఆమెను చూస్తుంటే ఇంత సేపూ కష్టపడి ఇవన్నీ చేసిన మనిషిగా కాక, ఈ టేబుల్ ముందుకు రావలసిన చీఫ్ గెస్ట్ వచ్చినట్లుగా వుంది.

'ఇవన్నీ ఎక్కణ్ణుంచి నేర్చుకున్నావ్ శృతీ!'

నా ఇల్లు, నా సంసారం అనే తాపత్రయం లోంచి' నవ్వింది శృతి.

ఆ తాపత్రయం అంత తీయనిదా?"

ఆహా తీయనిదీ, తనివి తీరనిదీ అని శృతి అంటూ వుండగానే ఈవెనింగ్ వాక్ వెళ్ళిన చిరంజీవిగారు, పిల్లలు లోపలికి వచ్చారు.

నేను లేచి రాబోయాను.

'మీరు కూడా వుండండి. అందరం కలిసే డిన్నర్ తీసుకుందాం' అన్నారు చిరంజీవి గారు.

"ఎంత వరకు వచ్చింది?" అని అడిగారు భార్యను.

"తినే వరకు' అంది శృతి నవ్వుతూ.

అంతలో చిరంజీవి గారి చూపు డైనింగ్ టేబుల్ మీద పడింది. ప్రశంసా పూర్వకంగా భార్యను చూస్తూ "థేంక్స్" అన్నారు.

జరిగిన కథ –5 :అమూల్య ఇంటర్ పాసయి, డిగ్రీ కోసం హైదరాబాదుకు చేరుతుంది. అమూల్య రూంమేట్ మైనా విచ్చలవిడిగా తిరుగుతుంటుంది. అమూల్యకు బెనర్జీ నుంచి ప్రేమలేఖ వస్తుంది. సెలవులకు ఇంటికి వచ్చిన అమూల్యతో కుసుమ భర్త మోహన్ విచిత్రంగా ప్రవర్తిస్తాడు. ఏడి గదిలో చేరిన అమూల్యకు శృతి పరిచయమవుతుంది.

మరి పది నిముషాల్లో గెస్ట్సు వచ్చారు. గెస్ట్సు కాదు. గెస్ట్. ఆ వచ్చిన గెస్ట్‌ను చూసి తెల్లబోయాను. ఆయన మరెవరో కాదు. మా తెలుగు లెక్చరర్, ప్రసాదరావు గారు!

శృతి నన్ను ఆయనకు పరిచయం చేయక ముందే ఆయన పెదిమలు "అ...మూ...ల్యా" అంటూ మౌనంగా, మధురంగా కదిలాయి.


నేనే చెప్పాను "మా తెలుగు లెక్చరర్" అని. వాళ్ళిద్దరూ "ఔను కదూ" అన్నారు.

"బాగా చదువుతున్నారా?" అని అడిగారు ప్రసాదరావు గారు.

"తెలుగు మాత్రం" అన్నాను. అన్న తర్వాత అలా చొరవగా అన్నందుకు సిగ్గుపడి పోయాను.

చురుగ్గా చూసి, తర్వాత నెమ్మదిగా నవ్వారు.

"బి. ఏ. అంటే తెలుగు కాదు. బి. ఏ లో తెలుగు ఒక భాగం."



ఇప్పుడూ సిగ్గుపడిపోయాను.

మాస్టారు లోలోపల నవ్వుకున్నారు?

"ఈ మధ్య ఏమైనా రాశావా?" అన్నారు శృతినుద్దేశించి.

"నవల ప్రారంభించాను" అంది శృతి.

"అది పూర్తయ్యే సరికి కొన్ని సంవత్సరాలు పడ్తుంది" అన్నారు చిరంజీవిగారు.

"సావధానంగానే రాయనీయ్. చూచి వ్రాత కాదు కదా" అన్నారు మాస్టారు.

'అయిందా?' అన్నట్లుగా భర్త వైపు చూసి ఎగతాళిగా నవ్వింది శృతి.

తర్వాత డిన్నర్ మొదలయింది.

ప్రసాదరావు గారు, చిరంజీవిగారు మంచి స్నేహితుల్లా వున్నారు. ఛలోక్తులు విసురుకుంటూ. గట్టిగా నవ్వుకుంటూ తింటున్నారు. హఠాత్తుగా నన్ను అడిగారు మాస్టారు "మీరేమిటి! ఏమీ మాట్లాడ్డం లేదు!"

"మీ రిద్దరూ అవకాశం ఇస్తే కదా!" అంది శృతి అందరూ నవ్వారు.

నేను ఇక్కడ అద్దెకుంటూన్న సంగతి చెప్పింది శృతి.

"మీకు చాలా మంచి కంపెనీ దొరికింది" అన్నారు మాస్టారు.

అది ఎవరిని వుద్దేశించి అన్న మాటో నాకూ, శృతికీ కూడా అర్థం కాలేదు.

అద్దెకిచ్చే వాళ్ల బాధలు, అద్దెకుండే వాళ్ల బాధల గురించి కొంచెంసేపు సంభాషణ నడిచింది.

డిన్నర్ ముగిసింది.

"తెలుగంత కమ్మగా వుంది శృతీ నీ వంట" అన్నారు మాస్టారు.

తెలుగు ఎడల ఆయనకున్న అభిరుచికి, అభిమానానికి నా కాశ్చర్యం వేసింది

చిరంజీవి దంపతులు ఆయనతో నవ్వుతూ త్రుళ్ళుతూ మాట్లాడుతున్నారు. పిల్లలు 'అంకుల్' అంటూ ఆయన భుజాల మీదకు ఎక్కుతున్నారు చాలా సరదాగా, నవ్వుతూ వున్నారు మాస్టారు ఆయన నాకు మాస్టారు వాళ్లంత ఫ్రీగా నే నుండ లేకపోతున్నాను

హఠాత్తుగా వెళ్తానంటూ లేచారు.

"నీ ముచ్చటైన సంసారాన్ని చూడడానికే నే వచ్చే డిన్నర్లను యాక్సెప్ట్ చేస్తుంటాను చిరంజీవీ" అన్నారు

"కృతజ్ఞుణ్ని" అన్నారు చిరంజీవి గారు అందరి దగ్గరా శలవు తీసుకుని వెళ్లిపోయారు.

* * * *

తలుపు మీద ఎవరో బాదుతూ వుంటే మెలకువ వచ్చింది. లేచి వెళ్లి తలుపు తీశాను

మైనా పెట్టే బేడాతో గుమ్మంలో నిల్చు ని వుంది.

"ఇదేమిటి! ఊరికి వెళ్తున్నావా?" అన్నాను.

"అమూల్యా డియర్! ఎంత దుర్మార్గురాలివి! నిన్ను వదలి వుండలేక, నీ ఎడబాటు సహించలేక తెల్లవారక ముందే రెక్కలు కట్టుకువాలిన నన్ను వూరికి వెళ్తున్నావా అంటావా!" అంది నిష్ఠురంగా.

తన ప్రేమకు నాకు సంతోషం కలుగలేదు.

"అయితే ఇక్కడ వుండడానికి వచ్చావా?" అన్నాను ఇబ్బందిగా

"ఆహా. అక్షరాలా" అంటూ నన్ను తోసుకుని లోపలికి వచ్చింది.

గుమ్మంలో అడ్డంగా ఎందుకని తన సామాన్లు లోపలకు చేర్చాను.

మంచం మీద కూర్చుని కాళ్ళూపుతూ "నా రాక నీకు ఇబ్బందిగా వుంటుందని నాకు తెలుసు కానీ అక్కడ నాకు ఇబ్బందిగా వుంది తన్ను మాలిన ధర్మం లేదు కదా? అందుకని వచ్చేశాను" అంది.

'ఏడ్చావ్' అనుకున్నాను మనసులో.

"శృతి కాఫీలాంటివి సప్లై చేయదా? ఓయ్, శృతీ, శృతీ" అంటూ గట్టిగా కేకపెట్టింది.

"ఇదిగో, నీవు వస్తే వచ్చావు గానీ, ఇలా ఇంటి ఓనర్‌ను ఇబ్బంది పెట్టి ఇల్లు ఖాళీ చేయించే స్థితి మాత్రం తీసుకురాకు" అన్నాను గాభరాగా.

కిలకిల నవ్వుతూ "అయితే కాఫీ పెట్టు" అంటూ పేస్ట్, బ్రష్ తీసుకొని బాత్‌రూం వైపు వెళ్ళింది.

నిట్టూర్పు ఆపుకున్నా ఆగలేదు.

★ ★ ★

మొదట ఖర్చులు ఇద్దరం సమానంగా భరించే ఒప్పందం మీద ఇద్దరికీ వంట చేసుకొనే వాళ్ళం. కానీ ఇది మైనాకూ, నాకూ కూడా ఇబ్బందిగా తయారయింది.

తనకు ప్రతి పూటా గ్రుడ్లు కావాలి. వారంలో నాలుగు రోజులు మాంసాహారం కావాలి. అది నేను ముట్టుకోనని గోల చేసినా వినేదికాదు. తనే స్వంతంగా తయారు చేసుకొనేది. రెండు పూటలా టిఫిన్లు కావాలి. కష్టపడి అన్నీ చేసుకున్నా భోజనం ఇంట్లో చేస్తుందో, బయటే చేసి వస్తుందో తెలీదు. ఈ వంటలో పడి చదువుకోవడానికి సమయం లేకుండా పోయింది పైగా ఏ వుద్దేశ్యంతో అయితే నేను హాస్టల్ బయటకు వచ్చానో ఆ వుద్దేశం దెబ్బతింది. డబ్బు నీళ్ళలా ఖర్చవుతోంది చివరకు ఈ సమస్యకు శృతి పరిష్కారం కుదిర్చింది.

"అమూల్య భోజనం కంటే చదువుకోవడం తనకు ముఖ్యమంటోంది. అందువల్ల నీవు మా ఇంట్లో పేయింగ్ గెస్ట్‌గా వుండు. ఎటూ నేను మూడు పూటలా వండి వార్చుకతప్పదు. ఇక అమూల్య ఇష్టమైతే చేసుకుంటుంది. లేకపోతే వున్న దానితో సర్దుకుంటుంది" అంది మైనాతో.

ఈ పద్ధతి నాకూ, మైనాకు కూడా నచ్చింది.

"నీవు చాలాసార్లు బయటే తినివస్తుంటావు. నాకేమీ అభ్యంతరం లేదు. తినని పూట నీవు డబ్బు కట్ చేసుకోవడం సాధారణ న్యాయం. కానీ ఇక్కడ ఆ న్యాయం చెల్లదు. ఎందుకంటే నీవు రాని పూట భోజనం మిగిలిపోదు వేస్టవుతుంది, అంతే. అందువల్ల నీవు ఆ పూటకు, నెలసరి పేమెంట్ కాక, అదనంగా మిల్స్ బిల్ కట్టాలి. తెలిసిందా?" అంది శృతి తర్జని చూయిస్తూ.

ఈ దెబ్బతో హడలిపోయిన మైనా వీలయినంత వరకూ ఇంట్లోనే భోజనం చేస్తోంది.

శృతి నన్ను కూడా పేయింగ్ గెస్ట్‌గా వుండమందిగానీ నే నంగీకరించ లేదు. వీలైనంత తక్కువ ఖర్చులో ముగించుకు పోవాలన్నది నా ధ్యేయం....

★ ★ ★

వారం రోజులు గడిచిపోయాయి. మైనా కోసం అబ్బాయిలు మా గదికి వచ్చి అడగటం ప్రారంభించారు. రోజుకు పదిదాకా ప్రేమలేఖలు రావటం మొదలయింది. ఇదంతా నాకు చాలా చికాకును కలిగించింది. ఆ రాత్రి ఆలశ్యంగా వచ్చిన మైనాను పట్టుకుని దులిపేశాను. మరెవరినో తిడుతుంటే సానుభూతిగా వింటున్న దానిలా తాపీగా వింది.

"ఈ వెధవ వ్యవహారమంతా నేను భరించలేను. నీవెక్కడయినా మరో గది చూసుకుని వెళ్ళు. లేదా నన్ను వెళ్ళమంటే నేను వెళ్తాను" అన్నాను చివరగా.

"నీకు గది దొరకదుగా" అంది 'పాపం ఎలాగా?' అని సానుభూతి చూపుతున్నట్లుగా.

"దొరక్కపోతే మళ్ళీ హాస్టల్‌కే వెళ్ళిపోతాను" అన్నాను కచ్చగా.

ఫక్కున నవ్వింది మైనా.

"అబ్బాయిల్ని కలుసుకోడానికి, ఉత్తరాలు రిసీవ్ చెసుకోవడానికే హాస్టల్ వదలి వచ్చానని అనుకుంటున్నావా అమూల్యా? హాస్టల్ ఆవరణ నా వ్యవహారాలకు అడ్డు వస్తుందనుకుంటున్నావా? నెవర్. నేను వచ్చింది నీ కోసం. మళ్ళీ నన్ను వేరే గది చూసుకొమ్మంటే లేదా నీవు హాస్టల్‌కు వెళ్ళిపోతానంటే మరి నా గతేం కాను?" అంది.

మైనా మాటలు నన్నేమీ కరిగించలేదు.

"ఈ నాటకాలన్నీ కట్టిపెట్టు. ముందు నీవా, నేనా అన్నది తేల్చు" అన్నాను కోపంగా.

"సరే. నాకేం? నేను ఫుట్‌పాత్ మీదైనా బ్రతికేస్తాను. నీవు బ్రతకలేవు కదా! నీకో నీడ, గూడు, రక్షణ అన్నీ కావాలి. ఓ కే. నీవే వుండు". అంది.

"అవన్నీ నీకు అఖ్ఖర్లేదా?" అన్నాను కొంచెం మెత్తబడి.


"సొమ్ము వున్న వాళ్ళకే దొంగల భయం. నా దగ్గర దాచుకోవలసింది ఏమీ లేదు. అంతా ఎప్పుడో.... సరే, ఇప్పుడే వెళ్ళి వుందును. గానీ నిద్రొస్తోంది. తెల్లారగట్టే లేపు. వెళ్తాను" అంటూ మంచం మీద అడ్డంగా పడుకుంది.

"భోంచేయవా?" అన్నాను.

"బ్యాగ్‌లో డబ్బులున్నాయి. ఈ పూట వంటకాలు వేస్ట్ చేసినందుకు శృతికి 'పే' చేసెయ్" అంది కళ్ళు మూసుకునే.

★ ★ ★

మామూలుగా తెల్లవారు ఝామునే మెలకువ వచ్చింది గానీ మైనా కోరినట్లుగా తనను లేపలేకపోయాను. నేను చాలా అన్యాయంగా ప్రవర్తిస్తున్నాననిపించింది. మైనానుఇక్కడి నుండి వెళ్ళగొట్టడానికి నాకేం అధికారం వుంది? ఈ గది మైనాచూసి పెట్టింది. శృతి మైనాస్నేహితురాలు. తన ప్రవర్తన నాకు నచ్చకపోతే నేనే వెళ్ళిపోవడం



నా యం.

నేనే వెళ్ళిపోవడానికి నిశ్చయించుకున్నాను.

గంట ఎనిమిదవుతున్నా మైనా లేపకపోవడంతో వెళ్ళిపోయి వస్తుందని నాటకమాడటం లేదు కదా అనుకుని. తనది దొంగ నిద్రా కాదా అన్నది తెల్సుకోవడానికి తన ముఖం మీదికి వంగి చూశాను. మైనా నిట్టూర్పులు వేడి ఆవిర్లలా నా ముఖాన్ని మండించాయి.

గాభరాగా మైనా నుదురు తాకి చూశాను.

నిప్పు గడ్డలా వుంది! పరిగెత్తుకు వెళ్ళి శృతిని తీసుకు వచ్చాను. శృతితో పాటు చిరంజీవిగారు కూడా వచ్చారు.

మైనాకు స్మారకం లేనంత తీవ్రంగా వుంది జ్వరం.

చిరంజీవిగారు ఇంట్లోకి వెళ్ళి డాక్టర్‌కు ఫోన్ చేసి వచ్చారు. పావు గంటలో డాక్టరుగారు వచ్చారు ఇంజక్షన్ చేసి మాత్రలు రాసిచ్చారు. ఎలా వాడాలో చెప్పి వెళ్ళిపోయారు.

అప్పటికి కాలేజీకి టైమయింది.

"నీవు కాలేజీకి వెళ్ళు. నేను చూసుకుంటాను" అంది శృతి.

నేను వుండి కూడా చేసేదేమీ లేదనిపించింది గబగబా తయారై వెళ్ళిపోయాను.

లైబ్రరీలో పని వుండి మధ్యాహ్నం ఇంటికి రాలేకపోయాను సాయంకాలం ఇంటికి వస్తూంటే గుర్తు వచ్చింది మైనా జ్వరంతో వుందని నా మతి మరుపుకు ఆశ్చర్యపోతూ వచ్చాను

గదిలో మైనా మంచం మీద అలాగే పడుకుని వుంది. పక్కలో శృతి కూర్చుని వుంది.

నన్ను చూడగానే "హమ్మయ్య! వచ్చావా! మైనా నిన్నే కలవరిస్తోంది" అంది శృతి లేస్తూ.

"ఇలా వచ్చి కూర్చో. నేను వెళ్ళి కాఫీ కలుపుకు వస్తాను" అంటూ వెళ్ళిపోయింది.

మైనా పక్కన కూర్చుని నుదుటి మీద చేయి వేశాను.

కళ్ళు తెరచి చూసింది మైనా. నన్ను చూడగానే తన ముఖంలోకి కాంతి వచ్చింది. నీరసంగానే నవ్వుతూ అంది. "అమూ డియర్! చచ్చిపోతానని భయం వేసింది. భయం చచ్చిపోతానని కాదు. నిన్ను చూడకుండా, నీతో మాట్లాడకుండా చచ్చి పోతానేమోనని".


"యూ సిల్లీ. జ్వరానికే చచ్చిపోతే ఇప్పటికి ప్రపంచంలో ఒక్క మనిషీ వుండేవాడు కాదు" అన్నాను కోపగించుకుంటూ.

"తప్పనిసరిగా చేయాల్సిన పని ఒకటున్నప్పుడు ప్రతిదీ మృత్యువు లాగే భయపెడుతుంది అమూ". అంది గంభీరంగా.

ఈ రకంగా మాట్లాడటం మైనా తత్వం కాదు కదా!!?

"మైనా మామూలుగా మాట్లాడవే" అన్నాను కాస్త బెరుగ్గా.

జాకీ తిప్పలు!



"హీరో" జాకీష్రాఫ్‌కు అందరు నటీ, నటులకువున్నట్లే ఓ కార్యదర్శి యూసఫ్ వున్నాడు. నిర్మాతల చుట్టూ తిరిగి హీరోకు "బుకింగ్"లు తేవడం, కాల్‌షీట్లు చూడడం, డబ్బు వసూలు చేయడం ప్రధానంగా ఆ కార్యదర్శి పని! సదరు యూసఫ్‌భాయ్ ఈమధ్య ప్రముఖ నిర్మాత కె.సి. బొకాడియా వెనుకే నీడలా తిరుగుతూ కన్పిస్తున్నాడు. అది సినిమా వాళ్ళపార్టీ కానివ్వండి, సినిమా ముహూర్తం కానివ్వండి, ఆఖరికి పెళ్ళి ముహూర్తం కానివ్వండి! బొకాడియా ఎక్కడుంటే యూసఫ్‌భాయ్ అక్కడ హాజరు. అమితాబ్ బచన్ హీరోగా బొకాడియా తీస్తున్న కొత్త చిత్రంలో రెండో హీరోపాత్ర జాకీకి దక్కింది! బహుశా సెక్రటరీ అవిరామకృషి – కాకాయిజమ్-ఫలితమే అయివుంటుంది!

– శశిరేఖ

గట్టిగా నవ్వబోయి చేతగాక ఆగిపోయింది మైనా.

"నేను గంభీరంగా, బరువుగా వుండటం బాగా లేదు కదూ? విచ్చలవిడిగా, జాలీగా, బేఫికర్‌గా వుంటేనే బాగుంటుంది. ఔనా?" అంది జాలిగా నవ్వుతూ

"వెఁవఁ మాటలు కట్టిపెట్టి రెస్ట్ తీసుకో" అన్నాను

ఇంతలో శృతి కాఫీ తీసుకు వచ్చింది.

★ ★ ★

మరునాడు ఆదివారం కావటంతో, ఇంట్లోనే వున్నాను. మైనాకు జ్వరం మరీ తీవ్రమయింది. నుదుటి మీద తడిగుడ్డ వేస్తూ పక్కనే కూర్చున్నాను.

నల్లని మైనా ముఖం జ్వర తీవ్రతకు ఎర్రగా కందిపోయి వుంది. ఊర్పులు వేడిగా వున్నాయి. ఊపిరి పీల్చుకోడానికి కష్టపడుతున్న దానిలా బరువుగా పీల్చుకుంటోంది.

మైనా బాగా నలుపు. కానీ పొడుగాటి మనిషి. సన్నటి నడుము చక్కని కనుముక్కు తీరుతో ఆకర్షణీయంగా వుంటుంది. మగవాళ్ళే మైనా వెంట పడ్తారో, మైనాయే మగవారి చుట్టూ తిరుగుతుందో తెలీదు. కాని రోజుకో అబ్బాయితో కంపెనీ.

మైనా బుగ్గల మీద మానిన పంటి గాట్లు గాయాలు కనీ కనిపించనట్లుగా వున్నాయి. ఏ గాయం ఏ మగాడు చేసిందో మైనా కూడా చెప్పలేదేమో!

మైనాను చూస్తుంటే నాకసహ్యం వేయసాగింది. ఛీ ఛీ, ఖర్మ. ఈ పిల్లకు సేవ చేయవలసి రావటమేమిటి! భరించలేని దానిలా లేచి ఇవతలకు వచ్చాను.

★ ★ ★

మరో నాలుగు రోజులకు గానీ మైనాకు జ్వరం తగ్గలేదు. పగలంతా శృతి చూసుకునేది. కాలేజీ నుండి వచ్చాక నేను చూసుకునేదాన్ని. మైనాకు పథ్యం పెట్టిన రోజు నేనూ, శృతీ కూడా మనస్ఫూర్తిగా సంతోషించాము.

లేచి తిరుగాడటం ప్రారంభించాక ఒక రోజు హఠాత్తుగా అంది మైనా "నేను హాస్టల్‌కు వెళ్ళిపోతాను" అని.

తనెందుకలా అంటోందో నాకు గుర్తు వచ్చింది.

మైనా రెండు చేతులూ పట్టుకుని అన్నాను. "మైనా నీవంటే నాకేమి కోపమూ, ద్వేషమూ లేవు. నీ మంచేమిటో నీవు గ్రహించుకోకుండా పెడదారిన పడిపోతున్నావనే నా బాధ".

కిసుక్కున నవ్వింది మైనా.

"నవ్వు నడిచే దారే నాకు పెడదారిలా కనిపిస్తుందని అంటాననుకో. నీవేమంటావ్?" అంది.

"చెంపకు ఒక్కటిచ్చి నీ తప్పు ఒప్పుకోవటం చేతగాక డొంక తిరుగుడుగా మాట్లాడుతున్నావంటాను" అన్నాను.

"ఇవ్వు ఇవ్వు" అంటూ చెంప చూయించింది.

నవ్వుతూ తన బుగ్గ మీద ముద్దు పెట్టుకున్నాను. పెట్టుకున్నాక గుర్తు వచ్చింది. ఆ బుగ్గమీద ఎన్ని ముద్రలు పడి వుంటాయో అన్న సంగతి.

"ఏమిటలా ఆముదం తాగిన ముఖం పెట్టావ్? నా బుగ్గ చేదుగా వుందా?" అని అడిగింది.

"ఊహూ. తీపెక్కువగా వుంది".

ఇద్దరం నవ్వుకున్నాము.

"అమూ డియర్, అయితే నేనిక్కడే వుండి పోవచ్చా?" అంది వుత్సాహంగా.

"ఆహా. నిక్షేపంగా."

"హుర్రే!" అంటూ గంతులేయటం ప్రారంభించింది. (ఇంకా ఉంది)



14

మన శాస్త్రవేత్తలు

ఏ కోణంలోంచి చూచినా "మేఘనాథుడే"

శాస్త్రజ్ఞుడిగా మాత్రమే కాదు- సంఘ సేవకుడిగా. సంస్కర్తగా, దేశభక్తుడిగా కూడా-మేఘనాథ్ సాహాకు భారతదేశ చరిత్రలో ఒక విశిష్టమైన స్థానం ఉంది.

1905లో బ్రిటిష్ ప్రభుత్వం బెంగాల్ రాష్ట్రాన్ని తూర్పు బెంగాల్‌గా, పశ్చిమ బెంగాల్‌గా (ఇప్పుడు బంగ్లాదేశ్) విభజించినప్పుడు- ఆ నిర్ణయానికి నిరసన తెలుపుతూ చెలరేగిన ఉద్యమంలో- సాహా మనస్ఫూర్తిగా పాల్గొన్నాడు. అప్పుడు ఆయన వయస్సు కేవలం 12 సంవత్సరాలు మాత్రమే. స్కూల్‌ను బ్రిటిష్ గవర్నర్ ఆఫ్ బెంగాల్ సందర్శిస్తున్నారని తెలిసి కూడా ఆయనకు స్వాగతం చెప్పడానికి సాహా హాజరు కాలేదు. ఫలితంగా ఆయన స్కాలర్‌షిప్‌ను పోగొట్టుకోవలసి వచ్చింది. అయినా ఆయన బాధపడలేదు. ఆయన జాతీయ ఏకతాభావస్ఫూర్తి అట్టిది! కొన్ని నెలలైనా గడవకముందే మళ్ళీ స్కాలర్‌షిప్‌ను సాధించగలగడం ఆయన ప్రతిభకు ఒక చిన్న నిదర్శనం మాత్రమే అని చెప్పాలి.

అక్టోబర్ 6, 1893లో ఇప్పటి బంగ్లాదేశ్‌కి చెందిన ఢాకా జిల్లాలోని సియోరతలిలో సాహా జన్మించాడు ఈయన పేదరికంతో బాధపడ్డవాడే. కాని ఈయన తెలివి తేటలు చూచి ఎంతోమంది సహాయం చేయడానికి ముందుకు వచ్చారు. తండ్రి సంతోషంతో కొడుకును చదివించగలిగాడు. స్కాలర్‌షిప్‌లను సాధిస్తూ సాహా కలకత్తాలోని ప్రెసిడెన్సీ కళాశాలలో విద్యాభ్యాసాన్ని పూర్తి చేసాడు. జగదీశ్‌చంద్రబోస్. ప్రఫుల్ల చంద్ర రే వంటి మహామహులు ఈయనకు ఉపాధ్యాయులైతే ప్రపంచం మొత్తం గర్వించదగ్గ సత్యేంద్రనాథ్ బోస్, ప్రశాంత చంద్ర మహలనోబిస్‌లు ఈయనకు సహాధ్యాయులు.

ఎం.ఎస్సీ పూర్తయ్యాక ఆర్థిక యిబ్బందుల దృష్ట్యా సాహా "ఇండియన్ ఫైనాన్స్ సర్వీస్"లో చేరాలని అనుకున్నాడు కాని భారత స్వాతంత్ర్య సమర వీరులైన సుభాష్‌చంద్రబోస్, రాజేంద్రప్రసాద్ వంటివారు అందుకు సమ్మతించలేదు. 1917లో కలకత్తాలోని యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్‌లో లెక్చరర్‌గా చేరేవరకు సాహా సైకిల్‌మీద తిరుగుతూ ట్యూషన్‌లు చెప్పేవాడు. థర్మో డైనమిక్స్, సాపేక్షతా సిద్ధాంతం, పరమాణు సిద్ధాంతాలు, ఖగోళ భౌతిక శాస్త్ర విషయాలు- వీటి గురించి మేఘనాథ్ సాహా ఆసక్తికరమైన వివరణలను ఎన్నింటినో ఇచ్చేవాడు.

సూర్యుడి గురించి, నక్షత్రాల గురించి ఏగ్నెస్ క్లార్క్ రాసిన పుస్తకాలను చదువుతూ ఉండగా ఈయనకు ఎన్నో సందేహాలు కలిగేవి. సూర్యకాంతి వర్ణమాపకంగుండా ప్రయాణం చేసినప్పుడు, వర్ణమాల ఏర్పడే విషయం అందరికీ తెలిసిందే "స్పెక్ట్రోస్కోపి" పెద్ద శాస్త్ర విభాగమై ఈవేళ నివాళులందుకొంటున్న విషయం కూడా తెలియంది కాదు. కాని సాహా కాలంనాటికి "స్పెక్ట్రల్‌లైన్స్" ఎందుకు ఏర్పడుతాయో ఇంకా ఆవిష్కరించబడని శాస్త్రీయ రహస్యంగానే ఉండింది. ఈ రహస్యాన్ని ఛేదించడానికి సాహా ప్రయత్నం చేసి చేసి "అయొనైజేషన్ ఫార్ములా"ను రూపొందించాడు. దీంతో ఈయన ప్రతిభను విశ్వం యావత్తూ కొనియాడడం మొదలు పెట్టింది. ఈ ఫార్ములాను ఆధారంగా చేసుకుని ఖగోళ నిర్మాణం దేనిదైనా సూర్యుడుకాని, గ్రహంకాని. నక్షత్రం కాని, మరేదైనా కాని ఆ నిర్మాణాన్ని గురించి పూర్తిగా తెలుసుకోవచ్చు. ఉష్ణోగ్రత, అంతర నిర్మాణం, రసాయనిక సంఘటనం, పీడనం - ఇత్యాది విషయాలను స్పష్టంగా వెల్లడించవచ్చు. ఖగోళ శాస్త్ర వికాసానికి ఈ ఫార్ములా ఎంతగానో దోహదపడుతుందని సుప్రసిద్ధ విజ్ఞాన శాస్త్రవేత్తలందరూ ఆనాడు కొనియాడారు. అప్పుడు సాహా కేవలం పాతికేళ్ల యువకుడు. 1927లో ఈయనను ఫెలో ఆఫ్ రాయల్ సొసైటీగా ఎన్నుకున్నారు.

అలహాబాద్ విశ్వ విద్యాలయంలో భౌతిక శాస్త్రాచార్యునిగా పదవీ బాధ్యతలను నిర్వహిస్తున్న కాలంలో సాహా స్పెక్ట్రోస్కోపిపై పరిశోధనలను విస్తృతంగా చేపట్టి అంతర్జాతీయ కీర్తిని గడించాడు. మళ్ళీ కలకత్తా చేరినప్పుడు రేడియో సైన్స్‌మీద ఎక్కువ దృష్టిని కనబరచాడు. 1940లో కేంద్ర కాల సంయుగ్మ చర్యను గురించి తెలిపిన ఆటంబాంబ్ సృష్టికర్త ఒట్టో హాహ్న్ నూక్లియార్ ఫిజిక్స్ గురించి ఎన్నో పరిశీలనలను చేపడుతున్న కాలం నాటికే - సాహా కూడా నూక్లియార్ ఫిజిక్స్‌ను కలకత్తా విశ్వ విద్యాలయంలో ప్రవేశపెట్టాడు. 1948, నాటికి ఇప్పటి "సాహా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నూక్లియర్ ఫిజిక్స్" రూపకల్పన చేసుకొంది. 1950 నాటికి భారత దేశంలో మొదటిసారిగా సైక్లోట్రాన్ ప్రవేశ పెట్టబడింది. అందుకు కారణం సాహాయే.

సాహా చరిత్ర, భూగర్భశాస్త్రం, పురాజీవశాస్త్రం అంటే మక్కువ చూపేవాడు. శకగణన గాని లెక్క వేసి కొన్ని రకాల శిలల వయస్సును కూడా ఈయన నిర్ణయించాడు. ఈయన పారిశ్రామికీ కరణం వైపుకి మొగ్గు చూపాడు. అనారోగ్యం నుంచి, దారిద్ర్యం నుంచి, అజ్ఞానం నుంచి - బైట పడగలిగినప్పుడే - మానవజాతి వికసిస్తుందని త్రికరణశుద్ధిగా నమ్మి. అందుకు తోడ్పడేవాడు కూడా! దామోదర్, భాక్రా-నంగల్, హీరాకుడ్‌వంటి ప్రాజెక్ట్‌లు - ఒక రకంగా ఆలోచిస్తే - ఎన్నో సంవత్సరాలుగా కొనసాగిన సాహా ఆలోచనల తాలుకూ శ్రమఫలాలే అని అనుకోవలసి వస్తుంది. సంఘ సేవను మించిన దైవపూజ ఉండదని నమ్మేవారిలో సాహా కూడా ఒకడు

సాహా సంపాదకుడు కూడా "సైన్స్ అండ్ కల్చర్" అనే వైజ్ఞానిక పరిశోధనా పత్రికను వ్యవస్థాపించాడు. అంతేకాదు 1952లో పార్లమెంట్‌కు ఇండిపెండెంట్‌గా ఎన్నికై-పేదవారి అభ్యున్నతి కోసం పాటుపడ్డ మానవతావాది సాహా ఫిబ్రవరి 16, 1956న ఇహలోక యాత్రను మేఘనాథ్‌సాహా ముగించినప్పటికీ, ఆయన మొదలు పెట్టిన విజ్ఞాన శాస్త్ర యాత్ర మాత్రం ఎప్పటికీ ముగిసిపోదు. అలా ఆయన ఎప్పటికీ చిరస్మరణీయుడే.

- డాక్టర్ గుమ్మనూరు రమేష్‌బాబు

మీరు కవలలా?

★ మీకు కవల పిల్లలా?

★ ఏవైనా యిద్దరి మధ్య చాలా తమాషా పోలికలు– అలవాట్లు కలయికలు వగైరా వుంటాయి!

★ ఆడా మగా కవలలైతే మరీ విచిత్రంగా వుంటుంది.

★ మీ యిద్దరి ఫొటో పంపండి! అనుభవంలో జరిగిన "తమాషా" వుంటే రాయండి.

ఆంధ్రసచిత్రవారపత్రిక

లో మీ యిద్దరి ఫొటో – వివరం వేస్తాము. మీ ఫొటో – విషయం రెండూ ప్రచురణామోదం కానిపక్షంలో త్రిప్పి పంపగోరువారు తగినన్ని తపాలా బిళ్ళలంటించిన కవరు జత చేయాలి– పడ్డ ఫొటోలు త్రిప్పి పంపటం సాధ్యం కాదని మనవి!

– సం.

అమ్మ కావాలి

గోగినేని మణి

అంబా... అంబా... అంబా...అంబా...

లేగ దూడ అరుపులకు చిట్టితల్లికి మెలకువ వచ్చేసింది. కళ్ళు నులుముకుంటూ లేచి కూర్చుంది. మెల్లగా పెరట్లోని గొడ్ల చావిడి దగ్గరకు నడిచింది. అక్కడ చిన్న కర్రాటకు కట్టి వున్న దూడ దగ్గరకు చేరింది. ఆ వేకువలో వెన్న ముద్దలా వున్న దూడను తన చిట్టి చేతులతో నిమురుతూ 'బుజ్జీ కన్నా... ఆకలేస్తోంతా' అని అడిగి 'వుండు నే ఇప్పుతాలే అంటూ హామీ ఇచ్చింది.

లేగదూడ అర్థమైనట్టుగా హుషారుగా అటూ ఇటూ గెంతులు వేసింది. చిట్టితల్లి ఆ చిన్న కర్రాట పైకి ముడిని మెల్లగా చేతులు కందిపోయినా ఓర్చుకుంటూ కష్టపడి పైకి తప్పించింది.

బంధ విముక్తి కాగానే దూడ తాడుతో సహా ఛెంగున తల్లి దగ్గరకు దూకింది! ఆబగా, ఆర్తిగా, పాలు తాగుతోంటే... పులకించి పోయినట్టుగా గోమాత కళ్ళు మూసుకుంది ఒక క్షణం. ఆ తరువాత కృతజ్ఞతగా చిట్టితల్లి వేపు చూసింది. నడుంమీద చేతులు పెట్టుకుని చిట్టితల్లి ఆ దృశ్యాన్ని ఆనందంగా చూస్తూ నిలబడింది.

"ఒరే నారిగా.. ఎక్కడ తగలడ్డావురా! దూడ తాడు విప్పుకుంది. త్వరగా రా పాల తపాలాతో నీళ్ళు తీసుకురా!" వాకిలి వూడుస్తున్న రాజమ్మ చేతిలోని చీపురును క్రింద పడేసి కేకలు పెట్టింది.

నీళ్ళ గాబు కడుగుతున్న నారయ్య రాజమ్మ కేకలకు హడలిపోయి, ఆ పని మానేసి తపాలాతో ప్రత్యక్షమయ్యాడు అది రాజమ్మ చేతికిచ్చి దూడను ఇవతలకు లాగికర్రాటకు బంధించాడు.

"నాన్నమ్మా... బుజ్జికి ఆకలేసి 'అంబా' అని అరుస్తోంటే... మరే... నేనే వదిలిపెత్తాను.."ముద్దు మాటలతో చెప్పింది చిట్టితల్లి.

"ఓసి భడవా! ఇది -నీ నిర్వాకమన్నమాట!" మురిపెంగా చిట్టి తల్లి బుగ్గల్ని పుణికింది."అయ్యో తల్లీ! అర చేతులు చూడు ఎలా కందిపోయామో!" అంటూ లేత చిగుళ్ళు లాంటి ఆ అరచేతుల్ని బుగ్గలను తాకించుకుని ముద్దు పెట్టుకుంది పాల తపాలా ఒకచేతిలో పట్టుకుని, మరొక చేతిలో చిట్టితల్లిని నడిపించుకుంటూ ఇంటి లోనికి వెళ్ళబోతూ, గాబు దగ్గిర మొహం కడుగుతున్న కొడుకుని చూసి ఒక క్షణం ఆగింది రాజమ్మ.

"చూశావ్రా రావుడూ... చిట్టితల్లి తెలివి తేటలు! నిన్న నన్ను 'దూడ అంబా అని ఎందుకు అరుస్తుందీ' అనడిగితే ఆకలేసి అమ్మని అలా పిలుస్తుందని చెప్పా. అందుకని ప్రొద్దున్నే దూడకి ఆకలేసి అరుస్తోందని తాడు వూడదీసింది! మొహం ఇంత చేసుకుని కొడుక్కి చెప్పింది. మనమరాలి ముచ్చట్లు గురించి చెప్పేటప్పుడు ఆవిడ మొహంలో ఆనందం ఒకటే రెపరెపలాడి పోతుంది! ఆవిడ కొడుకుతో ఎపుడు మాట్లాడినా, ఆ మాటల్లో రెండే విషయాలు చోటు చేసుకుంటాయ్! పొలం అచ్చట్లు... చిట్టితల్లి ముచ్చట్లు!

"చిట్టితల్లి ఏంచేసినా అమెకి అపురూపంగా, ఆశ్చర్యంగా వుంటుంది!" మనసులో అనుకుంటూ చిన్నగా నవ్వి వూరుకున్నాడు రామారావు.

వంట గదిలో వున్న విమలకి అత్తగారు మురిసిపోతూ చెప్పిన మాటలు వినిపించాయి. మండుతున్న పొయ్యిలా మనసు భగభగ లాడింది. విసురుగా వచ్చి చిట్టితల్లి వీపుమీద ఒక్కటేసి కుర్చీలో కూలేసింది లోపలకు లాక్కువెళ్ళి.

"ఆగొడ్ల చావిడిలోకి ఎందుకు తగలడ్డావు? ఆవుల్తో, దూడల్తో నీకేంటి పని? పాలు పితుక్కోవటం... పిడకలు చేసుకోవటం... ఇదే రాత దేముడు నీ మొహాన రాసినట్టున్నాడు. అందుకే నీకిలాంటి బుద్ధులు!" అందరికీ వినిపించేటట్టు కేకలు వేసింది.

రాజమ్మ నిశ్చేష్టురాలై నిలబడిపోయింది. 'రోజూ ఉన్నదేగా. ఈ రోజు క్రొత్తగా ఏం జరిగిందని పసిదాని మీద చేయి చేసుకుంది? మనసులో ఏదో పెట్టుకుని దానిమీద విరుచుకుపడింది. అత్తమీద కోపం దుత్తమీద చూపటం అంటే ఇదే కాబోలు' అనుకుంటూ లోపలికి నడిచింది.

పొయ్యి రాజేసి పాలు పడేసింది. రామారావు వరండాలో కూర్చుని పేపరు చదువుకుంటూంటే చేటలో బియ్యం పోసుకుని కొడుక్కు దగ్గరగా మెట్టు మీద కూర్చుంది.

"ఏవిట్రా రావుడూ... కోడలు అదోలా వుంటోంది. నువ్వేమైనా అన్నావా? ఉత్త పున్నానికేఇందాక ఆ పసి దాని మీద విరుచుకుపడింది. రాత్రి కూడా అంతే.

"అమ్మీ... అమ్మీ" అనమని చెప్పి కోప్పడుతోంది. 'మొండిదానివి. నీచేత ఒక్క మాట చెప్పించలేక పోతున్నాను' అంటూ పిల్ల నెత్తిమీద ఒక్కటేసింది!" అంది రాజమ్మ.

రామారావు నవ్వాడు.

"అమ్మీ కాదే బాబూ! మమ్మీ అనమని అయి వుంటుంది".

"సరేలే. ఏదో ఒకటి. ఇంతకీ సంగతి ఏంటంట?" అంటూ ఆరా తీసింది.

కొడుకు చెప్పిన విషయం విని ఆశ్చర్యంతో బుగ్గలు నొక్కుకుంది. నాలుగేళ్ళ పసిముండ హాస్టల్లో వుండి చదువుకోవాలా? ఈ వూళ్ళో బడి పనికి రాదా? కన్నతల్లి గుండె జాలీ, మమతా లేని రాతి బండయి పోయిందా?!

"నువ్వేమన్నావ్?" ఆత్రంగా అడిగింది కొడుకుని.

"ఒప్పుకోలేదనే ఆ కోపం" కొడుకు సమాధానం విని తేలిగ్గా నిట్టూర్చింది. ఎలిమెంటరీ స్కూలుకాకపోతే శర్మగారి బడికి పంపిద్దాం. ఆయన కూతురు బి. ఏ. చదివిందిగా. ఆ అమ్మాయి పాఠాలు చెబుతోందట. ఇంగ్లీషు చెప్పమందాం. ఏదైనా చెప్పిన వెంటనే ఇట్టే నేర్చుకుంటుంది మన చిట్టితల్లి" రాజమ్మ అంటోంటే విసురుగా వచ్చి విమల కల్పించుకుంది.

"నా కూతుర్ని ఆ తాటాకుల బడిలో వెయ్యాలా? ఏం, కాన్వెంట్‌లో చదివించుకునే తాహతు లేదా మీకు? ఆ రాయుడిగారి కొడుకు పిల్లల్ని చదివించుకోవటానికి ఏకంగా పట్నంలో కాపురమే పెట్టాడు. నీ కొడుకెలాగూ ఈ వూరినీ, ఆ పొలాన్నీ వదిలి రాడు. పోనీ పిల్లనయినా హాస్టల్లో పెట్టి చదివించుకోటానికి వీల్లేదా?"

"ఆఁ... ఆ రాయుడిగారి కామేశం సంగతే చెప్పు. పెళ్ళాం పల్లెటూళ్ళో వుండలేనని గోలపెడితే, పిల్లల చదువు వంకతో కాపురం పెట్టాడక్కడ. అందుకే ఏడాదికో ఎకరం అమ్ముకుంటున్నాడు. ఆ పిల్లలు సవ్యంగాచదివి, ఏదో నౌఖరీ చేసి తల్లీ తండ్రీ అని ఇంత పెడితే తప్ప, చివరకు వాళ్ళకు తింటానికి ఎకరం కూడా మిగలదు! స్వంతంగాచేసుకునే సేద్యానికీ, కమతగాళ్ళతో చేయించే దానికీ వున్నంత తేడా తల్లీతండ్రీ ఆలనా పాలనాలో పెరిగిన పిల్లలకీ, హాస్టలుతో పెరిగేవాళ్ళకీ ఉంటుంది! ఎక్కడైనా అవే అక్షరాలు గందా, ఏ వూరైనాచదువు ఒకటి కాదూ? వూరు వూరికీ మారిపోతుందా? డబ్బెక్కువ ఖర్చు పెడితే చదువు గొప్పదైపోతుందా?"

"పిండికొద్దీరొట్టె అన్నారు. అలాగే డబ్బుకొద్దీ

చదువెందుకు కాదూ...?" అంటూ విసురుగా లోపలికి వెళ్ళిపోయింది విమల. "ఈ చాదస్తపు ముసలావిడికి చదువులు ఈ రోజుల్లో ఎలా వున్నాయో తెలియదు. చెబితే అర్థం కాదు" విసుక్కుంది మనసులో.

"పిచ్చి బాగానే తలకెక్కినట్టుంది" రాజమ్మ గొణుక్కుంది మెల్లగా.

సమయం వచ్చినప్పుడల్లా భర్తతో వాదన పెట్టుకుని తన పంతం నెగ్గించుకోవాలని విమల తాపత్రయపడుతోంది. విమలని ఆ ఆలోచన నుండి ఎలా తప్పించాలా అని రామారావు ఆలోచిస్తున్నాడు. ఆ పెళ్ళి ప్రయాణం లేకుంటే ఈ గొడవ వచ్చేది కాదేమొ అనుకున్నాడు.

అంతకు రెండు రోజుల ముందు రామారావు, విమలా చిట్టితల్లితో ప్రక్కనున్న బస్తీకి బంధువుల పెళ్ళికని వెళ్ళారు. ఆ వూళ్ళోనే వుంటున్న పెళ్ళికి వచ్చిన విమల పెద్దమ్మ కూతురు లత ఆ రోజు వాళ్ళబ్బాయి సునీల్ పుట్టిన రోజని ముహూర్తం కాగానే వాళ్ళింటికి బలవంతం చేసి తీసుకెళ్ళింది విమలా వాళ్ళని.

వీళ్ళు వెళ్ళేసరికి లత పిల్లలిద్దరూ కాన్వెంట్‌కి వెళ్ళటానికి రెడీ అయి వున్నారు. యూనిఫామ్, బూట్లు, టై, టిఫిన్ బాక్సులు, పుస్తకాల బాగ్స్... హంగూ, ఆర్భాటంగా తయారై 'మమ్మీ టా...టా...' అని చెబుతూ రిక్షాలెక్కి స్కూలుకి వెళ్తుంటే విమలకి చాలా ముచ్చటగా అనిపించింది.

సాయంకాలం లత కొడుకు సునీల్ తన ఫ్రెండ్సుని నలుగురైదుగురిని తీసుకు వచ్చాడు. లత, లత భర్త శంకర్‌ల ఫ్రెండ్సు కూడా కొంతమంది తమ పిల్లలతో పార్టీకి వచ్చారు.

పార్టీ జరుగుతున్నప్పుడు ఆ పిల్లలు 'ఐ వాంట్ వన్ మోర్, ఆంటీ, ప్లీజ్' 'నో, థాంక్స్', 'ఐ డోంట్ టాకిట్'... ఇలాంటి చిన్న చిన్న మాటలు మాట్లాడుతోంటే ఆశ్చర్యంగా, అపురూపంగా వుంది విమలకు. ఎంతైనా కాన్వెంట్‌లో చదివే పిల్లల కళే వేరు' అనుకుంది మనసులో.

లత కొడుకు సునీల్ వారపత్రిక తెచ్చి ఏదో బొమ్మని చూపించి 'ఇదేం సినిమా, మమ్మీ' అనడిగితే పేరు చెప్పి యాభై రోజుల ఫంక్షన్ జగింది ఆ సినిమాకి' అని వివరం చెప్పింది లత. 'యాభై అంటే ఎంత అన్నాడు మళ్ళీ. 'ఫిఫ్టీ' అని చెప్పి ఒక కులాసా నవ్వు నవ్వి 'వీళ్ళకి తెలుగు రాయటం, చదవటం కూడా రాదు' అంది విమలతో.

"మరి తెలుగు రాకపోతే ఫెయిల్ అవరా?" సందేహం వెలిబుచ్చింది విమల.

"వాళ్ళ కాన్వెంట్‌లో తెలుగు వచ్చినా, రాకపోయినా అసలు పట్టించుకోరు. ఆ సబ్జెక్ట్‌లో మార్కులు రాకపోయినా ఫెయిలవరు" అంది లత అదే కాన్వెంట్‌లో ప్రత్యేకత అన్నట్టు.

"ఈ వూరు మొత్తంమీద మా పిల్లలు చదివే



'వికాస్' కాన్వెంట్‌లోనే ఫీజులు ఎక్కువ తెలుసా?" కొంచెం గర్వంగా చెప్పి, ఆ కాన్వెంటులో సీట్ల కోసం ఎలాంటి రికమెండేషన్లు ఉపయోగించిందీ, ఎంత డొనేషను ఇచ్చిందీ ఆ పాట్లన్నీ గొప్పగా వర్ణించింది.

ఇక సంభాషణ కాన్వెంట్ చదువుల మీదకు వెళ్ళింది. వికాస్‌కాన్వెంట్‌లో పిల్లలు చదువుకోవటం తల్లిదండ్రులకి ప్రిస్టేజీని అందరూ అంగీకరించి లత, శంకర్‌లు అదృష్టవంతులని ఏకగ్రీవంగా తీర్మానించారు. ఆ తర్వాత వాళ్ళ పిల్లలు చదివే కాన్వెంట్ గురించి అంతే యధాశక్తి వివరించారు. "మా కాన్వెంట్‌లో పిల్లలు పుట్టగానే అప్లై చేస్తే, వాళ్ళకి నాలుగేళ్ళు వచ్చేసరికి గానీ సీటు ఇవ్వరని ఒకరంటే 'మా కాన్వెంట్‌లో అయితే పుట్టక ముందే ప్రెగ్నెన్సీ రాగానే అప్లై చేయాలని మరొకరు, మా పిల్లలు చదివే కాన్వెంట్‌లో బూట్లు పాలిష్ చేసి లేకపోయినా, బట్టలు ఐరన్ చేసినవి వేసుకు రాకపోయినా, వెంటనే వెనక్కి పంపించేస్తారని ఇంకొకరు చెప్పుకొచ్చారు.

ఆ కాన్వెంట్ చదువుల వైభవాన్ని విమల ఒళ్ళంతా చెవులు చేసుకుని ఆసక్తిగా వింది. రామారావుకి మాత్రం చాలా చిరాకుగా అనిపించింది. ఇంగ్లీషుకి ప్రాముఖ్యత వుంది. నిజమే. దానిని ఎవరూ కాదనరు కాని తెలుగు వాళ్ళ పిల్లలకి తెలుగు రాకపోవటాన్ని చిన్నతనంగా అనుకోకుండా, అదే ఒక ప్రత్యేకతగా ఫీలవుతున్నారేమిటా అని ఆశ్చర్యపోయాడు.

"స్కూల్లో తెలుగు సరిగా చెప్పకపోతే, వీళ్ళకి ట్యూషనుంది కదా, ఇంటి దగ్గరెందుకు చెప్పించటం లేదు?" రామారావు అడిగాడు.

"ఆ ట్యూటర్ ఆంగ్లో ఇండియన్. ఆమెకే తెలుగు సరిగా రాదు. ఇక వీళ్ళకేం చెబుతుందీ! నన్ను 'ఆయన ఆఫీసు నుండి వచ్చారా' అనడగటానికి 'అది ఆఫీసు నుండి వచ్చిందీ' అనడుగుతుంది" పకపక నవ్వుతూ లత చెప్పింది.

అంతా నవ్వారు.

"మా పిల్లలూ అంతే. తెలుగు పుస్తకాలు ముట్టుకోరసలు. అదేమిటో తెలుగంటే ఎలర్జీ వాళ్ళకి" ఒకామె చెప్పింది.

ఆ తర్వాత నలుగైదుగురు పిల్లలు వాళ్ళ స్కూలులో నేర్పించిన రైమ్స్ యాక్షన్ చేస్తూ చెప్పారు. ఒక్క మాటా పలకలేకపోయినా, వాళ్ళు ఏదో అవ్వా బువ్వా అంటూ చెబుతోంటే, విమల ముగ్ధురాలై పోయింది. అంత చిన్న పిల్లలు ఇంగ్లీషులో చెబుతున్నారంటే ఎంతయినా గొప్పగా అనిపించింది.

ఎవరో చిట్టితల్లిని చెప్పినా చెప్పమని అడిగితే [illegible]

[illegible]

ఏమనాలో చిట్టితల్లి అని చెప్పింది. తన పేరు 'శీల' అని చిట్టితల్లికి గుర్తుండదు. రాణమ్మ చిట్టితల్లి అని పిలుస్తోంటే, ఇంట్లో వాళ్ళకీ వూళ్ళో వాళ్ళకీ ఆ పేరే అలవాటయి పోయింది. అప్పటంతా తన పిల్లలని [illegible] బిట్టూ, ట్వింకిల్ అని ముద్దు పేర్లతో పిలుస్తోంటే చిట్టితల్లి, [illegible] అని పేరు పెట్టిన అత్తగారి మీద అకస్మాత్తుగా ఆగ్రహం కలిగింది విమలకి.

ఒకామె వాళ్ళబ్బాయి పేరు శశికాంత్ అయితే 'షషి' అని పిలవటం గమనించింది. ఇక నుండీ తను కూడా చిట్టితల్లీ అని పిలువకుండా 'షీల' అని పిలవాలని నిర్ణయం చేసుకుంది.

చిట్టితల్లిని ఇంకా స్కూలులో చేర్పించలేదా అని ఒకామె ఆశ్చర్యం వెలిబుచ్చింది. విమల చిన్న బుచ్చుకుంది. అదేదో తప్పయినట్లుగా. వాళ్ళ వూళ్ళో కాన్వెంట్ లేదు కాబట్టి రెసిడెన్షియల్ స్కూలులో చేర్పించమని ఇంకొకరు ఉచిత సలహా ఇచ్చారు. ఇంకొకామె చిట్టితల్లి వయసే వున్న తన పిల్లలిద్దరినీ వూళ్ళోనే అయినా హాస్టల్‌లో చేర్పించాననీ, ఇంట్లో పిల్లలు గారాబంతో పాడయి పోతారనీ, అక్కడయితే, క్రమశిక్షణ నేర్చుకుంటారని చెప్పుకొచ్చింది.

"అంతేనా? లేక పిక్నిక్కులకో, పార్టీలకూ తిరగటానికి అడ్డొస్తారనా?" చిరాకుగా మనసులోనే విసుక్కుంటూ అక్కడ నుండి లేచి లోపలికి వెళ్ళిపోయాడు రామారావు.

కానీ ఆ సలహా అద్భుతంగా నచ్చింది విమలకు. తను పుట్టి పెరిగింది పల్లెటూరిలో. హైస్కూలు చదువుతో ఆగిపోయింది పల్లెటూళ్ళో కాపురం వెలగబెడుతోంది. తన కూతురు కూడా తనలాగే అయిపోవాలా? అంతే అంతంత డబ్బు ఖర్చు పెట్టి కాన్వెంటులో చదివించుకుంటూంటే... వాళ్ళంతా కలెక్టర్లు, ఇంజనీర్లు, డాక్టర్లు అయిపోతే తన చిట్టితల్లి మామూలుగా వుండిపోవాలా? వీల్లేదు. ఏమైనా సరే, కాన్వెంట్‌లో చేర్పించాలి. మనసులో గట్టిగా ప్రతిన బూనింది విమల.

అందుకే ఇంటికి రాగానే తన నిర్ణయాన్ని చెప్పి పట్టుబట్టింది రామారావు ఒప్పుకోక పోయేసరికి సత్యాగ్రహం మొదలుపెట్టింది. ఆ కోపంలో విమలకి తమ పద్ధతులు... జీవన విధానం అన్నీ మోటుగా అనాగరికంగా కనిపిస్తున్నాయి.


అత్తగారు కొడుకుని రావుడూ... అని పిలుస్తూంటే "రావుడూ, భీముడూ అంటూ ఏమిటా పిలవటం అంత వయసొచ్చిన కొడుకుని. 'బాబూ, రామూ' అని పిలవకూడదూ" అని విసుక్కుంది భర్త దగ్గర.

"ఇంకా నయం. ఏమండీ, రామారావుగారూ అని పిలవాలనలేదు. అమ్మ అలా పిలుస్తోంటే, అమ్మ గుండెలోని ఆప్యాయత అంతా ఆ పిలుపులోనే ఒలుకుతున్నట్లు... నాపై చిలుకుతున్నట్లు వుంటుంది నాకు మాత్రం!" కవ్విస్తూ రామారావు అన్నాడు చిరునవ్వుతో.

విమల చిటపటలాడి పోయింది రోషంతో.

"ఆ ముసలావిడతో కూడా కూడా తిరుగుతూ పిల్ల కూడా మోటుదానిలా పల్లెటూరి గబ్బిలాయిలా తయారవుతోంది" విసుక్కుంది విమల.

ఆ మాటలకి రామారావులో బుస్సున కోపం పొంగింది. కానీ తమాయించుకున్నాడు. తల్లి అంటే రామారావుకి ఎంతో ప్రేమే కాదు ఆరాధన కూడా.





అసమాన యోధుడు

ఐర్లండ్‌లో కౌంటీక్లేర్ అనే చోట 1800 సంవత్సరంలో ఛార్లెస్ జేమ్స్ పాట్రిక్ మహోన్ అనే ఆయన జన్మించాడు. ఆ రోజు సేంట్ పాట్రిక్ డే కూడా. మహోన్‌కి"ది ఒగోర్ మాన్ మహోన్ ఆఫ్ ఎనిస్" అన్న బిరుదం ఉండేవి. 21 సంవత్సరంలోనే ఈయన "జస్టిస్ ఆఫ్ పీస్"గా ఎన్నికయ్యాడు. ఆయన బ్రిటిష్ పార్లమెంట్‌కి ఆరుసార్లు ఎన్నికయ్యాడు. ఈయనకి కత్తి యుద్ధం చేయడం హాబీ. ఖాళీ ఉన్న సమయాల్లో 13 సార్లు కత్తి యుద్ధాలు చేసి గెలుపొందాడు. ఈయన పొందినన్ని సైనికపరమైన గౌరవాలు, హోదాలు వేరెవరూ పొందలేదు. ఆయనఐరిష్ మిలీషియాలోనే కాకుండా టర్కీ, రష్యా, ఆస్ట్రియా, ఫ్రాన్స్, బ్రెజిల్, నికరాగువా, కోస్టారికా, పెరూ, యునైటెడ్ స్టేట్స్‌కు చెందిన సైన్యంలో కర్నల్‌గా పనిచేశాడు. అంతేకాదు. ఉరుగ్వే ఆర్మీలో జనరల్‌గానూ, బిలియన్ నేవీలో అడ్మిరల్‌గానూ నికరాగువన్ ప్రావిన్స్ గవర్నర్‌గానూ కూడా పని చేశాడు. 91 సంవత్సరాల వయస్సులో కన్నుమూసే నాటికి కూడా ఆయన ఆ శతాబ్దపు అత్యంత సుందరుడైన ఐరిష్ వ్యక్తిగా పరిగణించేవారు.

- కె. ఆర్. కె. మోహన్

తండ్రి చిన్నతనంలోనే చనిపోతే రాజమ్మే తల్లీతండ్రీ అయి రామారావుని పెంచి పెద్ద చేసింది. ఒకసారి రామారావు బడి మానేసి స్నేహితులతో ఆటలాడాడని తెలిసి గంటసేపు ఎండలో నిలబెట్టి తనూ నిలబడింది.

తప్పు చేసింది నేనేగా, నువ్వు కూడా ఎండలో ఎందుకూ" అంటే-

"పిల్లలు తప్పుదారి పడితే, ఆ తప్పులో తల్లికీ భాగముందిరా, అందుకు". అని బదులు చెప్పి అలానే నిలబడింది. కొడుకుని ఎంత గారాబం చేసేదో, తప్పు చేస్తే అంతగానూ దండించేది.

ఆ రోజు నుండీ రామారావు ఏనాడూ బడి మానలేదు. రాజమ్మ కూడా కొడుకుని వేయి కళ్ళతో కనిపెట్టేది. మాష్టర్లందరి దగ్గిరకూ వెళ్ళి ఎలా చదువుతున్నాడో వాకబు చేసేది. తెలియనివి చెబుతుండమని అభ్యర్థించేది. రాత్రిళ్ళు కొడుకు చదువుకుంటున్నంత సేపూ మేలుకొని వుండి గమనిస్తూ వుండేది. ఆ వయసులో తల్లి చేసిన పునాదితోనే యూనివర్సిటీలో గోల్డు మెడల్ సంపాదించాడు రామారావు. తల్లి దగ్గర నేర్చుకున్న ఆత్మ విశ్వాసంతోనే స్వతంత్రంగా వ్యవసాయం చేసుకుంటూ, రైసుమిల్లు నడుపుతూ, ఊళ్ళో పెద్ద రైతుగా అందరి గౌరవం పొందుతున్నాడు.

తనుఈ రోజు ఈ స్థితిలో వుండటానికితన తల్లే కారణమని నమ్ముతాడు రామారావు.

'అమ్మ పెంపకంలో చిట్టితల్లి మాణిక్యంలా తయారవుతుంది. అది ఈ వయసులోనే అన్ని విద్యలూ, కథలూ నేర్చుకున్నది అమ్మ దగ్గిర కాదూ" రామారావు మాటల్లో, కళ్ళల్లో, తల్లి పట్ల గల ప్రేమాభిమానాలు ప్రతిఫలించాయి.

విమలకి భర్త చాదస్తానికి చిరాకు రెండితలయింది.

"అఁ... ఈవిడేమో ఉప్పు కప్పురంబు అంటూ వేమన శతకం నేర్పిస్తోంది. శర్మగారి బడికిపంపిస్తుందట. ఆయనేమొ శ్రీరాముని దయచేతను... అంటూ సుమతీ చతకం నేర్పిస్తాడు! దాని చదువంతా నీతి శతకాలతో చతికిలబడుతుంది" వ్యంగ్యంగా ఎత్తిపొడిచింది.

"అసలు నన్నడిగితే ఈ రోజుల్లో ఆ నీతి శతకాలను వల్లె వేయించి ఆ శతకాలలోని నీతులూ... జీవిత సత్యాలూ మనసుకు హత్తుకునేటట్టుగా నేర్పించక పోవటమే, మనుష్యుల నైతిక, ప్రవర్తన నానాటికీ దిగజారి పోవటానికి గల కారణాలలో ఒకటని నా అభిప్రాయం" అన్నాడు నవ్వుతూ.

"చూడు విమలా! ఆ లతా వాళ్ళు ఎంతసేపూ తమ పిల్లలకి తెలుగు రాకపోయినా ఫర్వాలేదని అనుకుంటున్నారే కానీ తెలుగుదనం, తీయదనం ఎంత నష్టపోతున్నారో గుర్తించడంలేదు. వాళ్ళంతా అక్కర్లేదనుకుంటున్న తెలుగులో చదవటం చిన్నతనంగా నువ్వు అనుకోవటం ఏం బాగాలేదు. ఓర్పుగా నచ్చ చెప్పబోయాడు రామారావు.

"మాటల్లో మిమ్మల్ని నేనేం గెలవగలను?" నిరాశ పడింది. విమల మెడ చుట్టూ చేతులు వేసి అనునయించే ధోరణిలో అన్నాడు.

"మాటల్లో గెలవకపోతేనేం, మమకారంతో ఎనాడో నన్ను గెలిచావుగా".

"అయితే ఆ అధికారంతోనే అడుగుతున్నాను. చిట్టితల్లిని లతావాళ్ళ పిల్లలు చదివే కాన్వెంటులో చేర్పించండి. నేనింతవరకూ ఏ విషయంలో అయినా మీరు, అత్తయ్యా అవునన్నది కాదన్నానా?" అంటే విమల పట్టువదలగా.

రామారావు హతాశుడైపోయాడు. విమల తన పట్టు వదలదని గ్రహించాడు.

ఆ మర్నాడు తన ఫ్రెండు వెంకట్రావుకి వికాస్ కాన్వెంట్ ప్రిన్సిపాల్ తెలుసంటే తీసుకుని వెళ్ళాడు. అన్ని ప్రయత్నాలూ చేసివాళ్ళడిగినంతా డొనేషను, ఫీజులు కట్టి సీటు సంపాదించాడు.

చిట్టితల్లికి యూనిఫామ్ రెడీమేడ్ డ్రెస్సులు, బూట్లు, బాగ్ అన్నీ కొంటోంటే విమలకి ఎంతో ఉత్సాహంగా, ఆనందంగా వుంది. తన కూతురికి బంగారం భవిష్యత్తును బ్యాంకులో డిపాజిట్ చేసి పెడుతున్నట్టే మహదానంద పడిపోయింది!

రాజమ్మ మాత్రం ఈ విషయం తెలిసి నవనాడులూ కృంగిపోయినట్టుగా అయిపోయింది. 'ఇదేం చోద్యం'! అంటూ గోల పెట్టింది.

"రావుడూ ... అయిదారేళ్ళ వరకూ తల్లి బడిని మించిన బడి లేదన్నారు. దాని చదువుకి అప్పుడే ఏం తొందరొచ్చిందని పొరుగూళ్ళ వుంచాలి? అది ఒక్క రోజన్నా అమ్మని విడిచి వాళ్ళ అమ్మమ్మగారింట్లో అయినా వుండలేదెప్పుడూ. అలాంటిది హాస్టళ్ళో వుండగలదా? ఇల్లంతా తిప్పి తినిపిస్తే కానీ అన్నం తినని పసిపిల్లరా అది. చదువు పేరుతో దూరం చేయకండిరా. తల్లీ తండ్రీ లాలింపూ, బుజ్జగింపూ పిల్లలకి కావాల్సింది ఈ వయసులోనే. వాళ్ళ ముద్దు ముచ్చట్లు మనం చూసుకొనేదీ ఈ వయసులోనే. చుట్టం మొచ్చినట్టుగా శెలవులకి వచ్చిపోతుంటే, అనుబంధాలేం వుంటాయిరా?"

తల్లి వాదనలోని నిజాన్ని రామారావు కాదనలేదు. అలా అని విమల కోరికను కాదని ఇంట్లో గొడవల్ని భరించేందుకు సిద్ధంగానూ లేడు. తన బాధను తనలోనే దాచుకుని రాయిలా మౌనంగా వుండిపోయాడు.

చిట్టితల్లికి కావలసినవన్నీ ఇచ్చి మళ్ళా వారం పది రోజులలో వచ్చి చూస్తానని ప్రిన్సిపాల్‌కి చెప్పి వచ్చారు.

చిట్టితల్లి వెళ్ళాక ఆ యిల్లు మౌన ముద్ర దాల్చినట్టుగా అయింది. ఆ యింట్లోని పెద్దవాళ్ళు ముగ్గురినీ, కలిపి వుంచిన మధుర మధురమైన పూల బంధమేదో వాడిపోయినట్టుగా ఒకరికొకరు సంబంధం లేని మనుష్యుల్లా ఎవరి పనులు వాళ్ళు చేసుకుంటున్నారు మౌనంగా!

ఇల్లంతా గిరగిరా గిలకలా తిరుగుతూ, చిలకలా ఎపుడూ ఏవో కబుర్లు చెబుతూండేది చిట్టితల్లి.

జిలిబిలి పలుకుల జాబిల్లిలా... బులి బులి నవ్వుల పాలవెల్లిలా అదర్నీ పరవశింప చేసిన చిట్టితల్లి సందడినంతా తనతోనే పట్టుకెళ్ళిపోయింది!

ఏ పని చేస్తున్నా రాజమ్మకి నిరంతరం చిట్టి తల్లిని గురించిన ఆలోచనలే! ఉయ్యాలలోని

పసివాడు ఏడుస్తోంటే... ఏడవకురా తమ్ముడూ అంటూ ఉయ్యాల వూపుతూ నాయనమ్మని అనుకరిస్తూ 'రామలాలీ... మేఘ శ్యామలాలీ' అంటూ ఆరిందాలా ముద్దుగా పాడే చిట్టితల్లి ...

పనసకాయ కోస్తోంటే... "పచ్చ పచ్చని తల్లి ... పసిడి పిల్లల తల్లి తల్లిని చీలిస్తే... తియ్యని పిల్లలు... ఏమిటో చెప్పుకో చూద్దాం." అంటూ తను. చెప్పిన పొడుపు కథ తనకే చెప్పే చిట్టితల్లి....

పెరుగు చిలుగుతోంటే వచ్చి చేయి చాపి నిలబడినపుడు ఏం కావాలంటే 'దోసెడు నీళ్ళల్లో జలకాలాడే దొరసానీ' అంటూ తెలివిగా అడిగి వెన్నముద్దను పెట్టించుకు తినే చిట్టితల్లి... కనుల ముందు కదులుతూంటే చెమ్మగిల్లిన కళ్ళను చెంగుతో తుడుచుకుంటూ, మనసు చిక్కబట్టు కుంటోంది రాజమ్మ.

ఈ యింటి మురిపాల మొలకను తీసుకెళ్ళి మరొక చోట పెట్టారు. అక్కడ వేళ్ళూనుతుందా? వుండగలుగుతుందా? ఈ ఆలోచనలతో ఎపుడూ దిగులుగా వుంటోంది రాజమ్మ.

పగలంతా నాన్నమ్మతో తిరిగినా, నిద్రపోయే టప్పుడు తప్పనిసరిగా అమ్మ మీద చేయి వేసిగాని నిద్రపోయేది కాదు చిట్టితల్లి. మనసులో ఏ దిగులు 'కాన్వెంటులో గొప్ప చదువు చదవుకుంటోంది' అనే భావనతో దిగమింగుతోంది విమల.

నిద్ర లేవగానే తండ్రి ప్రక్కలో చేరి నాన్నమ్మ దగ్గర విన్న కథలన్నీ వచ్చీరాని మాటలతో చెప్పేది. తండ్రి ఎంతో శ్రద్ధగా మైమరిచి వింటోంటే, 'నాన్నమ్మ, నీకీ కథలన్నీ చెప్పలేదా' అనడిగేది. రామారావు కూడా 'లేదమ్మా. నాన్నమ్మకి నువ్వంటేనే ఇష్టం. అందుకని నీకు చెబుతోంది. అయినా నువ్వు నాకవన్నీ చెబుతున్నావుగా' అంటూ నవ్వేవాడు. ఆ జ్ఞాపకా లతో మనసు బరువెక్కుతోంటే ... అస్థిమితంగా రోజులు గడుస్తున్నాయి అతనికి.

అక్కడ చిట్టితల్లి తల్లీ తండ్రీ తనని అక్కడ ఎందుకు వదిలి పెట్టారో అర్థం కావటంలేదు. గట్టిగా ఏడవటా నికి కూడా భయమేసి బెంగ బెంగగా బెరుకు బెరుకుగా వుంటోంది. ఆగలేక ఆకలికి రెండు ముద్దలు తింటోంది. రాత్రిపూట మెలకువ వచ్చి నపుడు అమ్మ కనిపించక... ఆయా కసురు తుందేమోననే భయంతో మెల్లగా ఏడిచేడిచి నిద్ర పోతోంది.

ఏమడిగినా 'అమ్మ కావాలి' అనే ఒకే మాట అంటోంది దీనంగా చూస్తూ. ఆ రోజు అసలే చిరాకుగా వున్న టీచర్ చిట్టితల్లి ప్రవర్తనతో విసిగెత్తి 'నీకు అమ్మ కావాలి. మీ అమ్మకేమో నువ్వక్కర్లేక ఇక్కడ పడేసి వెళ్ళింది' అని చిరాకు పడింది.

ఆ మాట చిట్టితల్లి మనసులో బలంగా గుచ్చు కుంది. అమ్మ తనని ఇక్కడ ఎందుకు వదిలేసింది? నాన్న, నాన్నమ్మ ఎవరూ ఎందుకు కనిపించటం లేదు? అమ్మతో జట్టు ఢీకొట్టాలి. నాన్నమ్మ జట్టే వుంటానని చెప్పాలి... అమ్మ దగ్గిరకు వెళ్ళాలి... ఆ పసి మనసులో అస్తమానూ ఇవే ఆలోచనలు. నిద్రలో కూడా 'అమ్మ' అన్న పలవరింతలే!

ప్రిన్సిపాలు అన్ని క్లాసులూ తిరుగుతూ చిట్టితల్లి గురించి అడిగింది టీచర్ని. ఈ నాలుగైదు రోజుల్లో ఎవుడు పలకరించినా 'అమ్మ కావాలి' అనే మాట తప్ప మరొకటి చెప్పలేదని టీచరు ఇంగ్లీషులో చెప్పింది.

ప్రిన్సిపాల్ చిట్టితల్లి దగ్గరకు వచ్చి 'నీకు మమ్మీ కావాలా' అనడిగింది. కాదని తలూపింది. 'అమ్మ కావాలి' అంది.

"అలాగే. మీ అమ్మను రమ్మంటాలే" అంటూ బుజ్జగించి 'టెంపరేచరు వున్నట్లుందే' అని హాస్టల్‌కి పంపి డాక్టర్‌కి ఫోను చేసింది. ఒకసారి వచ్చి చూసి వెళ్ళమని కార్డు వ్రాసి పడేసింది రామారావుకి.

ఆ కార్డు అందుకుని రామారావు, విమలా ఆదుర్దాగా ప్రయాణమయ్యారు.

"బెంగతో జ్వరం వచ్చిందేమొ. ఇంటికి తీసుకు వచ్చేస్తాము. ఎంత మనసు సరిపెట్టుకుందామన్నా నావల్ల కావటంలేదు." అన్నాడు రామారావు తల్లితో బయలుదేరే ముందు.

"ఇంత డబ్బు ఖర్చు పెట్టి ఇప్పుడు ..." అని విమల ఏదో అనబోతూంటే "ఇక నువ్వు మాట్లాడకు" అని కసురుకున్నాడు.

రాజమ్మ మనసు పొంగుతున్న పాలసముద్రమే అయింది. చిట్టితల్లికి ఇష్టమైన పిండివంటలు చేసి వుంచాలని హడావుడిగా వంట గదిలోకి చొరబడింది వాళ్ళు వెళ్ళగానే.

అక్కడ చిట్టితల్లి ఆయా నిద్రపోతూంటే ప్రక్క మీద నుండి లేచి బయటకు వచ్చింది. ఎవరకూ కనుపించకుండా క్రోటను మొక్కల వెనుక నక్కి నక్కి హాస్టలు గేటు నుండి స్కూలులోకి వచ్చింది. అప్పుడే బెల్ కావడంతో ఇంటికి పోతున్న పిల్లల గుంపులో కలిసి స్కూలు బయటకు వచ్చేసింది.

జ్వరంతో నీరసంగా వున్నా అమ్మని చేరుకోవాలనే ఆరాటంతో తడబడే అడుగుల్ని కూడదీసుకుంటూ వడివడిగా అడుగులు వేసింది.

ఒంటరిగా వస్తోన్న చిట్టితల్లినీ, చెవులకున్న చిన్నబంగారు రింగుల్నీ రిక్షా సోములు ఆశగా చూసాడు. పలకరించి అమ్మ కోసం వూరు వెళ్తోందని తెలుసుకున్నాడు. తను పంపిస్తానని చెప్పి బస్‌స్టాండుకు తీసుకు వచ్చాడు. 'టిక్కెట్టు కొనాలి పాపా. ఇవి ఇస్తేగానీ ఇవ్వర'ని మెల్లగా చెప్పి చెవి రింగులు తీసేసుకున్నాడు. బస్సుని దూరం నుండి చూపించి 'అది ఎక్కితే మీ వూరు వెళ్తావు పాపా' అని చెప్పి వెనక్కి తప్పుకున్నాడు.

విమలా రామారావులు దిగిన బస్సులోకే చిట్టి తల్లి జనంతో కలిసి ఎక్కబోయింది ఆరాటంగా. జ్వరంతో నీరసంగా వున్న చిట్టితల్లి పట్టు తప్పి పై మెట్టు మీద నుండి దబ్బున క్రింద పడిపోయింది. అక్కడ నేలమీద వున్న రాతికి తల తగిలి 'అమ్మా' అన్న ఆక్రందనతో మైకంలోకి జారిపోయింది.

'అయ్యో' అంటూ అంతా చేరుతోంటే, రిక్షా బేరం చేస్తోన్న విమలా రామారావు వచ్చి చూశారు. చిట్టితల్లి అక్కడికి ఎందుకు ఎలా వచ్చిందో అర్థం కాక షాక్ తగిలిన వాడిలా రామారావు నిలబడి పోయాడు. నిలువెల్లా నీరయి... కన్నీటి ఏరయి "హా చిట్టితల్లీ" అని అరుస్తూ విరుచుకు పడిపోయింది విమల.

హాస్పిటల్ బయట అందరూ నిలబడి ఎదురు చూస్తున్నారు డాక్టరు ఏం చెబుతాడా అని!

'అమ్మకోసం ఆరాటపడిన చిట్టితల్లి తల్లిని చూసుకుంటుందా?' టీచరు మౌనంగా రోది స్తోంది.

"మా చిట్టితల్లి మళ్ళీ అమ్మా, నాన్నా అని పిలుస్తుందా? మా నట్టింట అడుగు పెడుతుందా?" శోకమూర్తుల్లా రామారావు, విమలా కూర్చున్నారు.


గాలి కూడా ఆగి ఆగి జాలి జాలిగా వీస్తోంది. □

మనసు

నా గుండె గూటిలో
రెక్కలు విప్పుకున్న ఆశల విహంగాలు
వాస్తవాల దిక్కుల్ని దాటి
ఊహల చుక్కల్లో విహరిస్తున్నప్పుడు
నా బ్రతుకొక నందన వనంలా
నా జీవితం వికసించిన నందివర్ధనంలా
కనిపించి
నా మనసు మయూరిలా నాట్యం
చేస్తుంది
నా కళ్ళ వాకిళ్ళలో
నిలిచి ఉన్న గతకాలపు చేదు
అనుభవాలు
వర్తమానపు వలయాన్ని ఛేదించుకుని
భవితవ్యపు అంతఃపొరలలోకి
తొంగిచూస్తున్నప్పుడు
నా బ్రతుకొక బీడు నేలలా
నా జీవితం మోడువారిన పూల తీగలా
అనిపించి
నా మనసు రెక్కలు తెగిన పక్షిలా గిలగిల
లాడుతుంది.

—మంతెన విజయలక్ష్మి

షేర్ మార్కెట్‌లో పెట్టుబడులు



—ఎన్. రామ్‌జీ, న్యూఢిల్లీ


జెనెటిక్, ఎసిసి. కంపెనీల టేక్ ఓవర్ గురించి చాలా మంది అడుగుతున్నారు. జెనెటిక్‌లో మేజర్ షేర్‌హోల్డర్స్‌గా మల్టినేషనల్ సంస్థ వున్నప్పుడు వారికి ప్రజల యందు ప్రేమ వున్నా లేకున్నా, వారి పేరెంట్ కంపెనీకి పెద్ద మొత్తంలో డివిడెండ్‌లు పంపాలి కనుక, సరైన ప్రాఫిట్ డిస్ట్రిబ్యూషన్ వుండటమే కాక ప్రతి 2–3 సంవత్సరాలకు వున్న రిజర్వ్‌ను వాటాదారులందరుకు బోనస్ రూపంలో డిస్ట్రిబ్యూట్ చేస్తారు. కాబట్టి ఇటువంటి కంపెనీల మీద ప్రజలకు మోజు ఎక్కువగా వుండేది. ఇటువంటి సమయంలో వున్నట్టుండి ఆ మల్టినేషనల్ సంస్థ మన దేశంలో పే ఔట్ పాలసీ లాస్ట్ నుంచి ఫస్ట్ వచ్చి కంపెనీలలో చోటైన మోడిగ్రూప్ కొనటంతో ధబేలున 275– 60 రూపాయిలకు ఫటాఫట్‌మని కుప్ప కూలిపోయింది

ఇక్కడ ఇంకొక విషయం గమనించాలి. 1987 చివరి భాగంలో బిర్లావారు ఇండోగల్ఫ్ ఫర్టిలైజర్ అనే సంస్థను స్థాపిస్తున్నాం. వాటాలు తీసుకోండి అని ప్రజలను అనేక రకాలుగా బతిమాలి, మాయ చేసినప్పటికి ప్రజలు ఆ కంపెనీలో వాటాదారులు కాలేదు. అదే సమయంలో పారిశ్రామికవేత్త, ధీరుభాయి అంబాని కూడా రిలయన్స్ జి కన్వర్టబుల్ డిబెంచర్స్‌లను మార్కెట్‌లోకి వదిలితే సుమారు 2న్నర రెట్లు అధికంగా ప్రజలు వాటాదారులుగా చేరటానికి ధనం వారివద్ద పదిలపరిచారు.

ప్రజలు నేడు మంచి చెడులను గుర్తించ కల్గుతున్నారు. నిజంగా చెప్పాలంటే బిర్లా వంటి మహా సంస్థ యొక్క వాటాలు అమ్ముడు పోక, దేహి అని ఫైనాన్షియల్ ఇన్‌స్టిట్యూషన్‌ను అర్థిస్తే వారు కనికరించి మిగిలిన వాటాలను భర్తీ చేశారు. ఇంత-కన్నా సిగ్గుచేటు ఏమైనా వుందా 100 సంవత్సరాలుగా భారతదేశంలో అనేక పరిశ్రమలను స్థాపించి స్పెక్యులేషన్ అనే వ్యాపారానికి నాంది పలికిన ఈ మహాసంస్థ, కేవలం గత 10– 15 సంవత్సరాలలో అడి వెలుగులోకి వచ్చిన అంబాని లత పోటీక నిలబడలేక పోపటం. అంతే కాక అంతకు ముందు అతను కేవలం ఒక సేల్స్ రిప్రజెంటేటివ్‌గా వున్న వ్యక్తి సుమా! వారిలాగా తండ్రులు తాతలు వ్యాపారవేత్తలుకాదు.

ఆంధ్రప్రదేశ్‌లోని వ్యాపారవేత్తలు కూడా ఈ సంగతిని గమనించి జాగ్రత్తగా వుండాలి. మీకు ఇష్టం వచ్చినట్లు పబ్లిక్ కంపెనీలలో, మీ సొంత సిక్ యూనిట్‌లను కలిపి లాస్‌లు చూపితే ఇక ముందు మిరు ప్రజల ముందుకు రాలేరు సుమా! ప్రజలు చైతన్యవంతులవుతున్నారు. మీరు అనవసరంగా ఖర్చు పెట్టిన గెస్ట్ హౌస్‌ల బిల్‌లు మొదలైన దుబారా ఖర్చుల మీద కూడా త్వరలోనే ప్రభుత్వం ద్వారా తప్పక వత్తిడి తెస్తాం. పాఠకులలో చాలా మందికి ఈ పాటికి తెలిసే వుంటుంది. ఒక మందుల కంపెనీ ఈ విధంగానే చేయటం మూలంగా చాలా బాగా పెరగాల్సిన ఆ కంపెనీ షేర్ ధర 72–40 పడిపోయింది. లేకుంటే ఈ పాటికి 90 రూపాయిలు చేరి వుండేది.

కొన్నిసార్లు ఈ టేక్ ఓవర్‌బిడ్‌ల వలన మంచి ఫలితాలు కూడా వుంటాయి మన ఎసిసి లాటివి. పాల్కివాలా (ఈయన గొప్ప మేధావి, మరింత లిటిగెంట్, కాని లాభాలు ప్రజలకు పంచాలంటే మనసొప్పదు ఈయనకు కూడా) అధీనంలో వున్నప్పుడు కేవలం ఎసిసి ధర రు. 136 వుంటే, నేడు టాటాలు తీసుకొనేటప్పటికి రు. 360 అయ్యింది. కేవలం 4 నెలలలో సుమా ఈ ఎసిసి టేక్‌ఓవర్‌లో టాటాలకు బాంబే డైయింగ్ నస్లీవాడియాకు, మరొక కలకత్తా పారిశ్రామికవేత్తకు చాలా గొడవ జరిగింది. ●



సీరియల్

ఆడపిల్లలు- అనుభవాలు

హరికిషన్

(గతసంచిక తరువాయి)

> జరిగిన కథ– 37 :సత్యభామ అంతరంగ విశ్లేషణ చేస్తూ, హిత బోధతో ఒక ఉత్తరం వస్తుంది. సత్యభామ అభిలాష్‌ను తన వెంట తిరగమని కోరుతుంది. కోసలరామ్ తనకు, విజేతకు మధ్య జరిగిన సంఘటనలు సావిత్రికి చెపుతాడు. శ్రీవిద్య, హేమంత్‌లు మళ్ళీ కలుసుకుంటారు. శ్రీవిద్య తనపై హేమంత్ రాసి పెట్టుకున్న అభిప్రాయం చదువుతుంది. జగదీష్ స్థాపించిన పార్టీ వార్షికోత్సవంలో వరకట్న సమస్యపై శార్వాణీ, మనిషి శీలం గురించి జగదీష్ ఉపన్యసిస్తారు.

మంచి చెడ్డల విచారణ చేసేది మనస్తత్వము అని అందరికీ తెలుసు. అంటే తెలుసుకోవడం అనేది మనస్సు స్వభావము. చేయుట దేహ స్వభావము. ఈ మనస్సు స్వభావాన్ని, దేహ స్వభావాన్ని కూడా ప్రేమకే అంకితం చేస్తున్నాము. మనస్సుని "ప్రే"కి అంటే ప్రేరణకి, దేహాన్ని "మ"కి, అంటే మమకారానికి, చివరకు ప్రేమ ముదిరితే సెక్సావతారం దాలుస్తున్నది. అంటే పూర్తిగా శారీరక స్వార్థం కాని నిజమైన ప్రేమకు కావలసింది సేవ, కరుణ, జాలి కాని స్వార్థం కాదు.

కొంతమంది ప్రేమికులు చెపుతూ ఉంటారు. ప్రేమ విచిత్ర మైనది, ప్రేమ పవిత్ర మైనది, ప్రేమ అనిర్వచనీయ మైనది, ఇదమిత్థంగా మాటలతో వర్ణనలతో చెప్పనలవి కానిది అని. అంటే ఒకరకంగా ప్రేమను వివస్త్రను చేసి అపమార్గం పట్టిస్తున్నారా, అని అనుకోవాలి. ఎందుకంటే స్వార్థమూ, స్వప్రయోజనమూ లేనిదే ఎవరూ ఎవరినీ ప్రేమించడం లేదు. ఈ ప్రేమకూ, స్వేచ్ఛకూ కూడా సంబంధం ఉన్నది. కాని సరిగ్గా ఆలోచిస్తే విజ్ఞతకు పరమావధి స్వేచ్ఛ. జ్ఞానానికి పరమావధి ప్రేమ. సంస్కృతికి పరమావధి పరిపూర్ణత్వం. విద్య పరమావధి నడవడి లేక ప్రవర్తన. సద్భావాలను పుణికి పుచ్చుకున్న ప్రేమ ఎప్పుడు కలుగుతుంది?మనసులోని ఆత్మ నుంచీ వెలువడే హాయిని గొలిపే సుశబ్దాలను సుస్పష్టంగా విన గలిగినప్పుడు– వెలుగుని ప్రేమిస్తాం

కిలకిల నవ్వే చుక్కల్ని ప్రేమిస్తాం,

మనిషి మనుగడకు ప్రధాన మైనవాడు

కనుక సూర్యుణ్ణి ప్రేమిస్తాం,

స్వేచ్ఛా ప్రియత్వాన్ని వ్యక్తీకరిస్తున్నయ్యి గనుక

పక్షుల్ని ప్రేమిస్తాం

విశ్వాసానికి మారు పేరు కనక

కుక్కల్ని ప్రేమిస్తాం,

ప్రేరణ ఉత్సాహాన్ని కలిగించే

మనుష్యుల్ని ప్రేమిస్తాం

కాని నన్ను నమ్మి ప్రేమించిన అమ్మాయిని మాత్రం వేధిస్తాను

కారణం? ఎందుకు? ఎందుకని?

నాలోని స్వార్థ పూరిత మైన ప్రేమని గుడ్డిగా నమ్మింది కనుక.

ఈ నాడు ప్రేమను గురించి ఇంతగా ఎందుకు చెబుతున్నానంటే, ఈ నాటి ప్రేమకు స్వార్థం అనే గ్రహణం పట్టింది. ఏది తప్పో, ఏది వొప్పో మన అంతరాత్మ చెపుతూనే ఉంటుంది. తెలీదనటం నయవంచన. ఈ ప్రపంచంలో అతి పవిత్రమైనది దేహం. ఈ దేహానికి అందించ వలసింది పవిత్రమైన ప్రేమ. ప్రేమించి పెళ్ళి చేసుకోవడం గొప్ప కాదు, పెళ్ళి చేసుకున్న తరవాత జీవిత కాలమంతా ప్రేమించ గలగటమే గొప్ప విషయం. కాని చాలా మంది విషయంలో ఆ విధంగా జరగడం లేదు. దీనికి కారణాలూ, పరిష్కారం కూడా ఆలోచించాలి? కొన్ని సందర్భాల్లో వ్యక్తిగత విషయమే సాంఘిక సమస్య అవుతుంది

ఇచ్చి పుచ్చుకోవటంలోనే ప్రేమ జీవిస్తుంది. తీసుకొని మర్చి పోవటంలోనే స్వార్థం జీవిస్తుంది. ఇది ఎవరికి వారుగానే తెల్సుకోవాలి. సుఖమయ జీవన సారము ప్రేమే కాని మోహము కాదు. కాని ఈ నాడు మోహానికే ప్రేమ అనే పేరు పెట్టడంచేత మొహం తీరగానే ప్రేమ పరారయి పోతున్నది. ఈ నాటి యువతీ యువకులు ఈ విషయాన్ని తెల్సుకొని సంచరించాలని కోరుతున్నాను" అని తన ఉపన్యాసాన్ని ముగించాడు జగదీష్.

సేవా కార్యక్రమాల్ని గురించి చెపుతూ ప్రేమను గురించి ఇంతగా ఎందుకు చెప్పాడో చాలామందికి ప్రశ్నగానే మిగిలిపోయింది.

★ ★ ★

ఆ మర్నాడు ఉదయమే జగదీష్ దగ్గరకు ఒక వ్యక్తి వచ్చాడు. కొన్ని విషయాలు మాట్లాడాలన్నాడు. పర్ణశాల ఆవరణలోనే ఒక చివరగా రెండు కుర్చీలు వేశాడు జగదీష్. తేనె, నిమ్మరసం కలిపిన నీరు ఇచ్చాడు జగదీష్. అతను తీసుకున్నాడు.

"చెప్పండి" అన్నాడు జగదీష్.

"మీ ఆశ్రమంలో ఆడవాళ్ళున్నారు. సభ్యతగా ఉంటుందంటారా" ప్రశ్నించాడతను.

"ఏ సేవాసమితిలోనైనా మహిళా విభాగం ఉంటుంది. మహిళలకు ఉద్దేశించబడిన సేవా కార్యక్రమాలు వీళ్ళు చేస్తూ ఉంటారు"

"భార్య అంటే భరించబడేది. భర్త అంటే భరించువాడు అంటారు కదా, భర్త విషయంలో భార్య అనకువగా ఉండక్కర్లేదా"

"అణుకువ అంటే గౌరవప్రదమైన మర్యాద అని అర్థం, కాని లొంగి ఉండటం అనేది కొందరి భర్తల అభిప్రాయం, కాని అదే తప్పు"

"భార్యాభర్తలు చాలా అన్యోన్యంగా, ప్రేమగానే ఉంటారు. మనస్పర్థలు అనేవి ఉండవు. కాని నా పొందును ఎక్కువగా అభిలషిస్తున్నాడు. నా భర్త అనే ఒక పడగ్గది వరకే పరిమితం కావలసిన పాయింట్‌ని ఆధారంగా తీసుకుని, అతని కామాభిలాషను తన స్వవిషయాలకు ప్లస్ పాయింట్‌గా తీసుకొని, ఆ భార్య తన భర్తను చులకనగా చూట్టం మంచిదేనంటారా" అన్నాడు అతను

అతని ముఖ కవళికల్లో అణచి పెట్టుకున్న కోపాన్ని చూసేడు జగదీష్. ఈ ఆశ్రమవాసి ముఖంలోని ప్రశాంతతను చూసేడు అతను. అతను ఎందుకు వచ్చాడో, ఎట్లాంటి వాడో జగదీష్‌కు తెలుసు. దోషం అంతా ఆడదాని మీదనే వేసి తన అభిప్రాయాన్ని చెప్పాలనుకున్నాడు అతను.

"నేను నా అభిప్రాయాన్ని చెప్పటంలేదు, రెండు మూడు సూక్తులు అంటే కొందరు మేధావుల అభిప్రాయాలు చెప్తాను.

"హృదయ స్పందన, అనుభూతి పరంగా ప్రేమించి

చేసుకున్న ప్రేమ వివాహాలు విఫలంకావు. మోహంతో చేసుకున్న ప్రేమ వివాహం ఎప్పుడో ఒకప్పుడు స్వల్ప కాలంలో నే విఫలం కాక తప్పదు".

యౌవ్వనంలో అతిగా అనుభవించినవారు ముప్పై ఏళ్ళ తరవాత వృద్ధాప్యంలో .వడ్డీతో సహా వాటి దుష్ఫలితాల్ని అనుభవిస్తారు".

"దాంపత్యంలో ఇచ్చి పుచ్చుకొనే సుఖాన్ని మించిన రుచి ప్రపంచంలో మరొకటి ఉండదు"

"మన భార్యలు పవిత్రంగా ఉండాలి, కాని మనకు పవిత్రత అక్కర్లేదు, మన దగ్గర పని చేసే వాళ్ళకు నిజాయితీ అవసరం. మనకు మాత్రం నిజాయితీ అవసరం లేదు".

ఈ నాలుగు సూక్తుల్లో మీకు వర్తించేవి ఏవయినా ఉన్నయ్యేమో మీరు ఆలోచించి చూడండి" అన్నాడు జగదీష్. అతని ముఖం వెల వెలబోయింది.

"మీరు చెప్పిన కారణాలు నిజమే కావచ్చు కాని భర్తకు ఉన్న మానసిక బలహీనతల వల్ల భార్య మనస్సు కష్టపడిందే అనుకుందాం. కాని ఆ భార్య భర్తను వదిలేసి వచ్చేస్తే, ఆ వివాహిత స్త్రీని మీ ఆశ్రమంలో, సేవా సమితిలో ఉంచి ఆశ్రయం కల్పించటం సబబేనంటారా జగదీష్‌గారూ" అన్నాడతను కోపంగా.

జగదీష్ చిరునవ్వుతో చూసేడు.

"నేను చెప్పిన నాలుగు విషయాల్లో మొదటి మూడు విషయాలూ సగానికి పైగా నిజం, నాలుగో విషయం పూర్తిగా నిజం. అవునా" అన్నాడు జగదీష్.

"కావచ్చు"

"తన భర్తలో ఇన్ని దుర్గుణాల్ని చవిచూసి, అనుభవించిన భార్య మనస్సు పాలలో పడ్డ ఉప్పు పాలను ఏ విధంగా విరిచేస్తుందో అట్లాగే ఆమె భావాల్ని విరిచేస్తుంది. ఏ సుఖాలయినా పరిమితంగా అనుభవించినప్పుడే ఆనందం, అవి విపరీతం అయితే దారుణ ఫలితాల్ని ఇస్తుంది. భార్య పరిస్థితి ఇట్లా, ఉన్నప్పుడు, చట్టం ఆ భార్యాభర్తల కాపరాన్ని నిలబెట్టలేదు. ఆ స్త్రీకి కావలసింది రక్షణ. అటువంటి గౌరవప్రదమైన రక్షణ ఆవిడకు ఇక్కడ లభిస్తున్నది. ఆవిడ మానాభిమానాలు, గౌరవ మర్యాదలూ, వివేకమూ ఉన్న భర్త పరిత్యక్త". అన్నాడు జగదీష్.

అతను కోపంతో రెచ్చిపోయాడు.

"నా భార్యను నాతో పంపుతారా లేదా"

జగదీష్ ఆమెను పిలిచాడు. వచ్చింది.

"నీ భర్తతో నీవు వెళతావా, అతను నిన్ను తీసుకు వెళ్ళటానికి వచ్చాడు" అన్నాడు జగదీష్.

భర్త వైపు చూసింది. "పది నిమిషాల్లో వస్తాను" అన్నది జగదీష్‌తో. అతను సంతోషించాడు. పది నిమిషాల్లోనే వచ్చిందావిడ.


తెల్లని మల్లు ధోవతి కట్టుకున్నది. ముఖాన బొట్టు లేదు మెళ్ళో సూత్రాల తాడు, మంగళ సూత్రాలూ లేవు. చేతిలో ఒక చిన్న ప్యాకెట్, అది అతనికి ఇచ్చింది, కాళ్ళకు మట్టెలూ లేవు.

"ఇన్నాళ్ళ నుంచీ దాంపత్య జీవితానికి మనం దూరంగా ఉన్నా, నా భర్త ఎటువంటి కటిక దుర్మార్గుడయినా, బ్రతికి ఉన్నాడు అనే గుర్తు కోసం, ఈ అలంకారాలు అన్నీ నా శరీరం మీద ఉన్నయ్యి. ఈ రోజు నుంచీ నా భర్త బ్రతికి ఉన్నా చచ్చిన వానితో సమానం. నేను వైధవ్యాన్ని మిగుల్చుకుని, అలంకారాల్ని మీకే ఇచ్చేస్తున్నాను. అన్నీ ఈ ప్యాకెట్‌లోనే ఉన్నయ్యి. శలవు" అని తొ పలికి వెళ్ళిపోయింది ఆవిడ.

అతను నిశ్చేష్టుడై తల వంచుకుని వెళ్ళిపోయాడు. కళ్ళు తుడ్చుకున్నాడు జగదీష్.

★ ★ ★

ఆ రోజు శుక్రవారం. తలంటు పోసుకుని కొత్త చీరె కట్టుకుని, మ్యాచింగ్ బ్లౌజ్ వేసుకుని చెవులకు కొత్త రింగులు పెట్టుకుని తల్లికీ, తండ్రికీ చేతికి అక్షింతలు ఇచ్చి ఆశీర్వదించమని, పాదాలకు నమస్కారం చేసింది అనిరమ్మ. ఆశ్చర్యపోయి అక్షింతలు వేసి ఆశీర్వదించారు తల్లీ, తండ్రి.



"ఒసోసి ఈ కొత్త కోక ఎక్కడిదే" అన్నది తల్లి ఆ చీరెని పట్టుకుని చూస్తూ.

"ఇయ్యాల నా పుట్టిం రోజని మొన్ననే కొన్నది అక్కయ్య. ఈ జాకెట్టు కూడా నీకు తెలవకుండానే కుట్టించింది. నువ్వు నన్ను చూసి మురిసిపోవాలని నీకు సెప్పొద్దన్నది" అన్నది అసిరమ్మ


"అమ్మ తల్లి నాగున్నావే అసిరా, ఇదేదో సాయిత్రి పురమాయింపేనని నేను అనుకుంటూనే ఉండా, బావున్నావే అసిరీ, పెళ్ళికూతురు కల అక్కయ్య నొదిలేసి నీకొచ్చిందే" అన్నాడు తండ్రి నరసయ్య

గదిలో ఉన్న సావిత్రి ఇవతలికొచ్చింది

"నాన్నా, నాకు నీ అంతటి ధైర్యం ఆలోచనా లేకపోవచ్చు. ఇద్దరం చక్కగా, ఏపుగా, చూడ ముచ్చటగా ఎదుగుతున్నాం. మాకు పెళ్ళి చేసి అత్తారింటికి పంపించే బాధ్యతను మరిచి పోతున్నావ్ నాన్నా" అన్నది సావిత్రి.

ఆ తల్లికీ, తండ్రికీ మతిపోయింది.

"ఏవిటి సాయిత్రీ నువ్వంటున్నది, నేను నా పిల్లలికి పెళ్ళి చేయాల్సిన బాధ్యతని మరిసిపోతున్నానా, నేదు తల్లీ, అంత మాటనకు. నిన్నా అబిలాస్‌బాబు పెళ్లాడుతాడనే నమ్మకంతో నే ఉన్నానమ్మా, ఆడు నిన్ను మోసం సేశాడా సెప్పు. ఆడి ఎముకలు ఏరేసి సముద్రంలోకి ఇసిరేత్తాను ఏటీ, మాట తప్పేడా నాయాల" కోపంతో అన్నాడు



నరసయ్య. బిక్క మొహం పెట్టి సావిత్రి వైపు చూస్తూ గోడవారన సతికిల పడింది తల్లి రవణమ్మ.

"నీకు ఆవేశమే గాని ఆలోచన లేదు నాన్నా. అభిలాష్ నన్ను మోసం చెయ్యడు. అతను అలాంటి వాడు కాదు. చదువుకున్న దాన్ని. నాకూ కాస్త విచక్షణా జ్ఞానం తెలుసు, ఉన్నది. కాని అసిరమ్మ, నిజంగా అమ్మ తల్లిలానె ఉన్నది అది ఆ చిల్లర కొట్టు సాంబయ్య కొడుకు కేశవరావుతో..."

అసిరమ్మ వైపు కోపంతో చూసింది సావిత్రి. గజ గజలాడుతూ వణికి పోయింది అసిరమ్మ. ఒక్క క్షణంలో తల్లీ, తండ్రీ రౌద్రరూపం దాల్చారు. చూరులో నుంచి గొడ్డలి లాగాడు నరసయ్య.

జుట్టు పుచ్చుకుని వంగదీసి బాదింది రవణమ్మ. తండ్రి చేతిలో గొడ్డలి లాగి పారేసింది సావిత్రి.

"గొడ్డలితో తల నరికితే కూతురు జీవితానికి పరిష్కారం కుదురుతుందా నాన్నా. నీకు జైలు శిక్ష, అమ్మకు ఆజన్మ దుఃఖం. ఇదేనా నువ్వు కోరుకొనే పరిష్కారం. చెప్పు నాన్నా" అన్నది సావిత్రి.

"నా కడుపున చెడబుట్టావే అసిరి ముండా, నిన్నూ" అని కొట్టబోయాడు నర్సయ్య. కోపంలో వళ్ళు తెలీలేదు. తమాయించుకో లేకపోయాడు.

"నాన్నా, దాని వంటి మీద చెయ్యి వేశావంటే నేను ఊరుకొనేది లేదు. వయసొచ్చిన ఆడపిల్లకు వరుణ్ణి చూడాలి గాని, కన్న తండ్రి యముడుగా మారిపోవడం కాదు నాన్నా, కావల్సింది పరిష్కారం కాని పౌరుషం కాదు. అసిరమ్మా నువ్వు కేశవరావుని ప్రేమించావా, బాగా ఆలోచించి సరయిన సమాధానం చెప్పాలి" బుజ్జగిస్తూ అడిగింది సావిత్రి.

"అవును".

"ప్రేమంటే"

"సినిమాల్లో సూట్టంలేదూ. అది. ఒకరి మీద





స్వామి మహిమ

నా స్నేహితుడు మధుసూదనరావు గత సంవత్సరం అయ్యప్ప దీక్షకన్నెస్వామిగా తీసుకున్నాడు

నా స్నేహితుడు బ్రహ్మచారి. ఒక రోజు అయ్యప్ప పూజ చేసి పదిహేను మంది భక్తులకు భోజనం పెట్ట సంకల్పించాడు నా ఇంకో స్నేహితుడు శ్రీనివాస్,



నేను, మధు కలసి స్వయంపాకం మొదలు పెట్టాము. మీరు నమ్ముతారో నమ్మరో కాని మాకు అసలు వంట అంటే తెల్యదు. ఆరోజు అయ్యప్పే మాలో ఆవహించి వంటలంతా రుచికరంగా తయారు చేయించి తన భక్తులకు కడుపునిండా తినిపించారు. చాలా గొప్ప మహిమలు గల దేవుడు స్వామి అయ్యప్ప !"స్వామియే శరణ మయ్యప్పా!"

–న్యాయపతి రమేష్‌బాబు,

హైదరాబాదు.


★ ★ ★

నెల్లూరు జిల్లాలో బంగాళాఖాతం తీరాన మా దొక చిన్న వూరు. మా వృత్తి సేద్యం. నేను నాస్తిక బృందంలో సభ్యుడిని. మా వూరిలో నలభై మంది అయ్యప్పస్వామి వ్రతదీక్ష తీసుకున్నారు. ఆ రోజు మా పల్లె నడివీధిలోని రచ్చబండపై మిత్ర బృందంతో కూర్చుని నేను నా నోటికొచ్చింది వాగసాగాను తిరుమల ఆలయం ప్రపంచ ఖ్యాతిగాంచి వున్నది ఆదాయంలో, మహిమలో రోమ్‌లోని వాటికన్ సిటీలోని చర్చి తర్వాత తిరుపతి విశ్వ వ్యాప్తంగా ప్రథమస్థానం అలంకరించి వుంది అంతటి స్వామికి సైతం ఒక్కటి రెండు రోజుల వ్యవధి ప్రయాణం, వంద రూప్యముల వ్యయం చాలు మరి ఏమిటి

బట్టలు నల్లన! మహిమ తెల్లన!!

కారునలుపు బట్టలు, నలభై రోజుల కఠోర నియమాలు, వేయి రూపాయలదాకా అనవసర వెచ్చింపు పైగా అయ్యప్ప భక్తులను "స్వామి"! అని సంబోధించాలట మనిషి స్వామి అవుతాడా! దైవరూపుడు కాగలడా! భక్తి ముదిరి, పైత్యం రెట్టింపయి, చపలం, చంచలం ద్విగుణీకృతమయితే అయ్యప్పస్వామి భక్తుడుగా పరిణామం చెందుతాడు కాబోలు!" ఈ ధోరణిలో నే నేను గడబిడా మాట్లాడేశాను.

ఆనాడు అక్టోబర్ 23 కార్తీక పున్నమి అదే రాత్రి, నేను పొలంలో పంపు సెట్టు వద్దకు ఒంటరిగా వెళ్లాల్సి వచ్చింది. బియ్యపు పిండి ఆరబోసినట్లున్న పాలవెన్నెలలో ఒక ఆకారం నల్లకంబళి కప్పుకొనినట్లు ఎలుగుబంటిలా నావైపు మెల్లిగా అడుగులేస్తూ నడవసాగింది. భయోత్పాతం కలిగిస్తున్న ఆ వికృత రూపం నా శరీరంపై చెమటలు పోయించింది. రోమాలు నిక్క బొడుచుకున్నాయి. నాలుకపై తేమ ఆరిపోయింది. కాళ్ళ క్రింద భూమి కంపించింది. కళ్లు బైర్లు కమ్మాయి. ఆ భయంకర దృశ్యం నాపై వురికినట్లుగా దాదాపు మీద పడ్డంతగా దుమికింది ఒక్కసారిగా నా నోటమ్మట 'స్వామియే శరణమయ్యప్పా' అన్న వాక్కు నా ఎరిక లేకనే వెలువడింది. ఆ పిలుపు ఆ పరిసరమంతటా ప్రతిధ్వనించిందట.



ఆ మరునాడు నేను మా ఇంటి సభ్యులతో సంప్రదించి వెనువెంటనే స్వామి అయ్యప్ప వస్త్రాలు ధరించాను. ఆ వ్రతంలో తరించాను. భక్తి, ముక్తి, మోక్షంతో బాటు చూడ చక్కని నీతి, నిష్ఠ, నియమాలతో మరే దేవుని ఆరాధనలో సైతంలేని విధాన నలభై రోజుల కఠోర దీక్ష శబరిమలేశ్వరుని ప్రాముఖ్యత. అయితే నా జీవితంలో మరపురాని ఆ పవిత్ర వ్రత కాలం పూర్తయినాక కూడా నలభై ఒకటవ రోజునే కాదు ఆ పైన కూడా క్రమక్రమంగా ఆ భక్తిపూర్వక అలవాట్లు, ఆచారాలు సద్గుణాలే నా కలవడసాగి నా స్నేహితులను సంభ్రమ పరిచాయి.

–కొండ్రెడ్డి రాధాకృష్ణారెడ్డి

మరొకరికి ఇట్టం. అదేటమ్మా లవ్వు"

"అతనూ ఇష్టపడ్డాడా"

"అవును".

"అతని ప్రేమలో పడటానికి కారణం"

"బావున్నాడు. ఓ రోజున కొబ్బరినూనె కొంటా వుంటే పైట కొంగు జారింది అతనూ జూశాడు. నాకూ సిగ్గేసినాది. సదూక్కీ పొంగుకీ సంబంథం నేదు. రాత్రిల్లు ఏటోగా ఉండేది. ఓ రోజున అడిగేసినాను. అల్లూ మన కులపోల్లే. అసిరీ నిన్ను పెల్లాడతా. మనువు కట్నం అయిదేలు, మీ ఓల్లని అడిగి సూడు; అన్నాడు మా అయ్య అయిదేలు కట్నం ఈనేదన్నా. ఓనాడు...." చెప్పలేక పోయింది.

"భయం లేదు చెప్పు" అన్నది సావిత్రి.

"ఓనాడు నువ్వూ అబిలాసు బాబూ బీచిలో

ఆడపిల్లలు – అనుభవాలు

కూకుని కబుర్లాడుతా ఉంటే, నేనూ ఆ సుందరమ్మ కూతురు కనకమాలచ్చిమీ, మ్యాట్నీకెల్లొత్తా సూసినా, పేమించటం తప్పు కాదనిపించినాది. ఆ తరువాత కేశవరావుకు చెప్పినా. నాను రెడీ అని. ఓ రోజున వుల్లిపాయలకి కొట్టుకెళితే, అల్లోల్లు ఎవురూ నేరు. రుచి జూపిస్తే ఎయ్యి తగ్గిత్తానన్నాడు. రుచి కరీదు అంతా అనుకుని సరేనన్న. ఇద్దరం రుచి జూసుకున్నాం. ఆ తరవాత ఎప్పుడు ఈలయితే అప్పుడు.... కట్నం బాకీ అట్ట దీర్చేసిన. అయ్యా, పెల్లి సేసెయ్యి" అన్నది అసిరమ్మ సావిత్రి వెనగ్గానిల్చుని.

"విన్నావుగా అమ్మా, దాన్ని తిట్టి, కొట్టి అల్లరి చేసుకునే కన్నా ముందు దానికిపెళ్ళి చేయండి తరవాతనే నా పెళ్ళి. జ్ఞానం చేత శరీరాన్ని అదుపులో పెట్టుకోవచ్చు గాని, ఒక్కసారి కోరిక తీర్చుకున్న తరవాత శరీరం అదుపులో ఉండదమ్మా, నేను ఆనాడే చెప్పాను దాని శరీరం ఏపుగా పెరుగుతున్నదని. కావాల్సింది తర్క వాదన, భయపెట్టటం కాదు. అసిరమ్మ పెళ్ళి. దానిపెళ్ళి కాందే నేను పెళ్ళి చేసుకోను" అని నిష్కర్షగా చెప్పింది సావిత్రి. ఆ మర్నాడే వెళ్ళి సాంబయ్య కాళ్ళ మీద పడ్డారు నర్సయ్యా, రవణమ్మ. అసిరమ్మను ఆ ఇంటి కోడలుగా చేసుకోమని ప్రాధేయపడ్డారు.

(ఇంకా ఉంది)

దూరదర్శనం — లత

సంగీత దర్శకుడు రాజు

ప్రముఖ సంగీతదర్శకుడు టి. వి. రాజుగారితో పరిచయం. ఈయన సంగీత దర్శకత్వంలో నే నొక సినిమాకి వ్రాశాను. అవును ఒకటో రెండో పాటలుకూడా – మంగమ్మశపథం – పిడుగు రాముడు – నిండుహృదయాలు లాటి సినిమాలలోంచి పాటలు వినిపించారు. రాజసులో చనగారు ఘంటసాలగార్ని మర్చిపోయినట్టున్నారు. ఇచ్చిన పాటలు ఆయన సంగీతంలో ఎదురుగుండా దొరికినవిలాగున్నాయి.

చివరకు మిగిలింది

– నాటిక. దయానిధి అనే లంచగొండి ఆఫీసరుకి త్రాగుబోతు కొడుకూ, తిరుగుబోతు కూతురూ వుంటారు. కొడుకు ఒక పిల్లని తల్లి చేస్తాడు. గర్వంగా వాడు మగవాడు అంటాడు ఆఫీసరు. అదే తన కూతురుకి అయితే కుటుంబరావుగారికి మనం వియ్యం అందబోతున్నామండీ అని చెవుతాడు. మావాడు మొగవాడు అంటాడు కుటుంబరావు. ఆఫీసరు ఓవర్ యాక్షన్ అలావుంచి మాట్లాడితే బళ్ళారి రాఘవ ఫొటోకి క్లోజప్‌యిచ్చి అవమానించారు. అదీగాక బుచ్చిబాబుగారు చివరకు మిగిలేది అనే నవల వ్రాశారు. అందులో హీరో దయానిధి – ఈ నాటిక చివరకుమిగిలింది. రచయిత పేరు చూడలేదు. పైగా థీము ద్వారేవనుగాని సౌండ్‌గాని సరిగాలేదు. ఈ పాత నాటికలో – చిత్రాతిచిత్ర నాటకం.


పింగళి నాగేంద్రరావు

ఈవారం సుప్రసిద్ధ సినిమా కవి పింగళి నాగేంద్ర రావుగారిని గురించిన కార్యక్రమం యిచ్చారు వ్యాఖ్యాత వేటూరి సుందరరామమూర్తిగారు. లక్ష్మీ కాలనీ టి.నగర్‌లో మా యింటికెదురుగా ఉండేవారు నాగేంద్రరావుగారు. వారు సినిమారంగానికి వచ్చిన తరువాత నేను ఎరుగుదును. ఆయన గొప్ప రచయిత. ఏ విధమైన సందేహంలేదు. అయినా పోతన – నాచనసోముడు – లాటివారితో పోల్చటం వేటూరివారి అభిమానం

భారత్ ఏక్ ఖోజ్

బుద్ధుడి కాలంలో కోసల గణతంత్ర నాశనంతో ప్రారంభమయిన వినాశనం చాణక్యవిష్ణుగుప్తుడు పూర్తిచేశాడు. అవమానితుడయిన చాణక్యుడు తన అర్థశాస్త్రాన్ని గౌరవించకపోగా అవమానించిన నందరాజ్యం నిర్మూలనం చేస్తానని ప్రతిజ్ఞ పట్టాడు – అదివరకు దాసీ పుత్రుడుగా కనిపించిన చంద్రగుప్తుడే రాజు అవాలని సంకల్పించాడు. అవతల సెల్యూకస్ భారతదేశాన్ని ఆక్రమించుకోరాదని రాయబారం నడిపాడు – కాగా సెల్యూకస్ సోదరిని చంద్రగుప్తుడికి పెళ్ళిచేయాలని షరతుపెట్టాడు. అదివరకే చంద్రగుప్తుడు సుహాసిని అనే అమ్మాయిని ప్రేమించాడు. దురదృష్టవశాత్తు నందుడే ఆమెను తన స్త్రీగా చేసుకొంటాడు. ఆమె తండ్రి చంద్రగుప్తుడికి ద్వితీయ పత్నిగా వుండమంటాడు. ఆమె వినదు. ఇలావుండగా.... గణాధిపతులతో మంతనాలుచేసి ప్రస్తుతం నంద నిర్మూలనం అయ్యేవరకూ మిరు తిరగబడవద్దు అని సరిదిద్దుతాడు. జాడ్యమతం నిర్మూలించి వేదమతాన్ని స్థాపించిన చాణక్య విష్ణుగుప్తుడినే కౌటిల్యుడంటారు. ●





ఫ్యాక్టరీ కయ్యిమని కూసింది. తుళ్ళిపడి లేచింది కమల. గుండెలు దడుక్ దడా మనసాగేయి. ఒక క్షణం వరకూ ఏం జరిగిందీ తెలియలేదు. ఓ నిమిషానికి నిద్రమత్తు వదిలింది. అప్పుడు స్థిమితపడింది. టక్కుటకా శబ్దం వస్తోంది. అటు టేబిలుమీదకి చూసింది. అలారం టైంపీసు, పది దాటుతోంది. ఇటు కిటికీలో నుండి చూసింది. చిక్కటి చీకటిలో ఫ్యాక్టరీ. అష్టమినాటి ఆకాశంలో మీద పొగ గొట్టంలో నుండి వస్తున్న పొగ దుష్ట దెయ్యపు విరబోసుకున్న జుత్తులా భయంకరంగా కనబడింది. పొగ గొట్టం దాని కుత్తుకలా పొడుగ్గా వుంది. చుట్టూ చీకటివున్నా ఫ్యాక్టరీ కాంపౌండు నిండా దీపపు కాంతులతో నిజానికి పంకంలో పద్మంలా వుంది. కాని కమల కళ్ళకది నిప్పుల సెగ మధ్య అప్పుల జీవితంలాగానే కనిపిస్తోంది.

ముఖం తిప్పుకుంది కమల.

ప్రక్క గదిలో అలికిడి. సద్దుమణిగింది. మెత్తగా తలుపు చప్పుడు. నెమ్మదిగా దూరమై పోతున్న అడుగుల సవ్వడి. మళ్ళీ కిటికీలోంచి కళ్ళు పొడుచుకు చూసింది. ఫ్యాక్టరీ లోంచి వచ్చే దీపాల కాంతి యిక్కడిపరకూ రోడ్డు మీదికి వర్షపు జల్లులా పడుతోంది.... అందులో తడుస్తూ వడివడిగా వెళ్తున్న మురళి. అటు రోడ్డు నుండి యిటు మరో వైపు నుండీ తోటి కార్మికులు వస్తూ కలుస్తూ... ఫ్యాక్టరీ వైపు వెళ్తున్న మహా ప్రవాహంలా.... అంత నిప్పుల సెగా ప్రవాహపు వెల్లువకు చల్లగా చల్లారి పోయినట్టు ఊహ.

నవ్వుకుంది. నిద్ర దూరమైంది. ఆవలించింది. ఒళ్ళు విరుచుకుంది. ప్రక్కనే మంచం మీద అత్తయ్య హాయిగా అదమరిచి నిద్రపోతోంది. నెమ్మదిగా లేచింది. వీధి తలుపు గడియపెట్టి వచ్చి కూర్చోబోయింది. మళ్ళీ కయ్యిమంది ఫ్యాక్టరీ. మళ్ళీ తుళ్ళిపడింది కమల.

ఇలా రోజు కెన్నిసార్లు? దినదిన గండంలా, క్షణం క్షణం భయంగా, బతుకు శాశ్వతంగా యిలానే సాగాలా? "అమ్మో" గుండెల మీద చెయ్యి వేసుకుంది. ఏమిటో చెప్పలేని బాధతో జ్వరం వచ్చినదానిలా ముణగతీసుకు పడుకుంది. వెంటనే బావ మాటలు జ్ఞాపకానికి వస్తూ భయాల్ని, బాధల్ని దూరం తీసుకున్నాయి.

మొన్న రైలు దిగింది కమల. అదిగో అప్పటి నుండి ఫ్యాక్టరీ చేసే రొదకు అసహ్యం- బావ చూసే చూపులకు ఆరాటం. ఫ్యాక్టరీ పెట్టే కూతకు తుళ్ళిపాటు. బావ పిలిచే పిలుపుకు కలవరపాటు. అటుప్రక్క భయం. ఇటు వైపు అభిమానం. వీటి మధ్య కమల ఊగిసలాట.

ఈ నేపథ్యంలో తనలోకి తను చూసుకుంది కమల.

పదో తరగతి పరీక్ష లయిపోయేయి. శ్రమకు ఫలితం తెలిసేవరకూ విశ్రాంతి. రిలీఫ్‌గా ఎక్కడికైనా వెళ్ళాలి. నాన్నగారు ఎప్పుడూ ఎక్కడికీ పంపరు. కాని ఈసారి మేనత్తగారి వూరు వెళ్ళమన్నారు. ఎందుకో కారణం వూహించింది.

మేనత్త కొడుకు మురళిబావ. నాన్నగారికి ముద్దుల మురళి. సుగుణాల రాశి. చదువు తక్కువే. అయితేనేం పెళ్ళాన్ని అందలా లెక్కించలేక పోయినా ఆదరంగా చూసుకో గలడు. కమలకి అత్తగారి పోరు వుండదు. స్వయాన మేనత్త కాబట్టి, కట్నాల కష్టం వుండదు. పెట్టుపోతల కట్టుడు లుండవు. ఆడపడుచుల ఆరళ్ళుండవు.... యివీ అప్పుడప్పుడూ అమ్మా నాన్నల సంభాషణల్లో వినిపించిన ధ్వని.

వాళ్ళ దృష్టిలో పదో తరగతి చదివిన తను చిన్నపిల్ల. ఏవీ తెలియదు. తెలియవచ్చు. తెలియక పోవచ్చు. ఇష్టా యిష్టా లుండవా?

కనీసం బి. ఏ. వరకైనా చదవాలనుంది తనకి. ఈకాలంలో అదో పెద్దచదువా? అదేమైనా ఖర్చుతో కూడినపనా? పక్కింటమ్మాయి రోజా కాలేజీకి వెళ్ళివస్తూంటే, పెళ్ళికావలసిన పిల్లని ఎలా పంపుతున్నారో అంటూ ఆశ్చర్యంగా చూస్తారు అమ్మా నాన్నలు!

పోనీ వాళ్ళ అభిప్రాయాన్ని ఎందుకు కొట్టిపారేయాలి? సరిపెట్టుకుంటుంది. అయిదేళ్ళ చదువు కాబట్టి, చదివాక అంతకన్న ఎక్కువ చదువు కట్నాలతో వరుణ్ణి వెదకాల్సిన రూలు మన సంఘంలో వుందికాబట్టి.....

కాని పెళ్ళి నూరేళ్ళబ్రతుకుకదా. ఎన్ని కోరికలు.... ఎన్నెన్ని కలలు.... మరెన్ని ఊహలు వుంటాయి! పదిగంటలకల్లా వంటా వార్పూచేసేసి, భర్తని ఆఫీసుకుపంపేసి, ఇంటిని తీర్చిదిద్దుకోవాలనీ.... అయిదుగంటల కతను తిరిగివచ్చేవేళకు కళ్ళల్లో వత్తులువేసుకుని వేచివుండాలనీ.... వచ్చేక కబుర్లు చెప్పుకుంటూ కాఫీ త్రాగి... ఆ పైన చెట్టాపట్టాలేసుకుని సినిమాకో, షికారుకో వెళ్ళాలనీ.... రాత్రి కబుర్ల తర్వాత.... అబ్బ! ఎన్ని మధురోహలున్నాయి తనకి!

ఊహల్లో ఊగడం తప్పా? కమ్మని కలలుకనడం నేరమా?

కాని.... ఇదేమిటి?

ఓ వేళాపాళాలేనిజీవితం మురళిది. ఓ వారం రాత్రి పదిగంటలకు వెళ్తాడు. మరో వారం తెల్లారుతూనే వెళ్ళిపోతాడు. నిన్నటికి నిన్న రోజు రోజంతా ఓటీ అంటూ కంటి చూపే కరవైపోయింది.

సరే సర్దుకుందాం....

కట్టుకున్నవాడు నీటుగా, శుభ్రంగా డ్రస్ చేసుకుని తిరిగితే చూడాలని కోరుకోవడం కూడా గొంతెమ్మ కోరికేనా? గ్రీజు మరకల్తో, ఖాకీ దుస్తుల్లో నిత్యం కనిపించే మురళి గుండెల మీదికి చేరాలంటే ఎంత అసహ్యంగా వుంటుంది?

పోనీ... అదీ అలా పక్కకి నెట్టేద్దాం....

వచ్చి మూడురోజులు కాలేదు. నిన్న తను చూసిన దృశ్యమేమిటి? ఓ కార్మికుడి కాలు ప్రమాదవశాత్తూ పచ్చడైపోయింది. ఫ్యాక్టరీ నుండి హాస్పిటలుకు యింటి ముందు నుండి తరలించుకు వెళ్తుంటే చూసింది. ఎక్కడ చూసిందీ? అబ్బ... చూడలేక పోయింది. తలుచుకుంటే యిప్పుడు కూడా గుండె జలదరించిపోతోంది. ఒళ్ళు నీరైపోతోంది. ఆ స్థానంలో మురళి నెలా వూహించుకోవడం?

మీ జి. కె. ఎంత? 4కి జవాబులు

(1) విజితారోహన విజముని (2) చివరలో చూడండి (3) చైనా (4) ఛామో లంగ్మా (5) డిశంబర్ 7 (6) రాజ్‌కమల్ (7) శాలీరైడ్ (8) నేక్‌చంద్ (9) జహీరుద్దీన్ మహమ్మద్ (10) అలెక్సీ. ఎ. లియొనెవ్. ఇతను మార్చి.18 వ తేదీన 1965 సం.లో వోస్కోడ్ నుండి బయటకు వచ్చి రోదసీలో నడిచాడు.

(2) వీరు నలుగురు ప్రపంచ రికార్డు సృష్టించి గిన్నీస్ బుక్ అఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో కెక్కారు. లతా మంగేష్కర్: 1948 నుండి 1987 వరకు సుమారు 30 వేల పాటలకు పైగా పాడింది. మురార్జీ దేశాయి: అత్యంత పెద్ద వయస్సులో ఎన్నికయిన ప్రధాని, 1977 మార్చిలో ఎన్నికయినప్పుడు అతని వయస్సు 81 సంవత్సరాలు. రామ్‌విలాస్ పాశ్వన్: 'అత్యధిక మెజారిటీతో గెలిచిన అభ్యర్థి. ఇతనికి 1977 లో హాజీపూర్ (బీహార్) నుండి జనతా అభ్యర్థిగా 4,24,545 ఓట్ల తేడాతో గెలిచారు. గవాస్కర్: అతని రికార్డులు అందరికీ సుపరిచితమే.

నా కళ్ళతో చూడు



అమ్మో!

మరింక ఆలోచించలేకపోయింది కమల. ఒళ్ళంతా గజగజవణుకు ప్రారంభమైంది. మురళి పేరు తల చాలంటే కళ్ళలో, కలలో చీకట్లు విమ్ముతున్నాయి.

అత్తయ్య "ఊ" అంటూ గట్టిగా మూలిగి అటునుండిటు తిరిగింది. కమల భయంకొద్దిగా తగ్గినట్టనిపించింది. చూరుపట్టుకు వేళ్ళాడుతూన్న కమల చూపులు కిందికి దిగేయి.

"ఏమ్మా... నిద్ర పట్టలేదా?" అంది అత్తయ్య.

"ఊఁ" అంది. "ఉఊఁ" అని మళ్ళీ అంది. "మరే... బావేమో డ్యూటీకెళ్ళేడూ... తలుపు గడియ పెట్టివచ్చేను" అని అంది.

అర్థవంతంగానవ్వింది అత్తయ్య.

మర్నాడు మురళికి ఆఫ్.

ఉదయం టిఫినయ్యింది. మురళి పేపరు చూస్తున్నాడు. మూడు రోజులుగా కమల మనసులో వేసుకుంటున్న బేరీజు ఎటూ తేల్చలేదు. కాని మొగ్గ తేల్చవలసిన వాడు మురళి బావే. అంచేతనే అతని ముందుకొచ్చింది కమల.

"ఏం కమలా... ఈ రోజు మా ఫ్యాక్టరీ చూపిస్తాను. వస్తావా?" అన్నాడు మురళి ఆప్యాయంగా.

అంతవరకూ పడుతూన్న సంఘర్షణ ఆ మాటతో ఉక్రోషంగా మారింది.

"ఆ! అదేం అజంతా గుహలా? తాజ్‌మహలా?" అంది వాడిగా, వేడిగా, వేగంగా.

కమల ముఖంలోకి చూస్తూ నవ్వేడు మురళి. చురచురచూస్తూ వుడుక్కుంది కమల. వెంటనే నవ్వాపేసేడు.

"అంతకన్న ఎక్కువే. ఎంచేతనంటే అవి కళ్ళకి విందులుచేస్తాయేమోగాని జీవితాలకికాదు. కాకపోతే వాటికున్న గ్లామరు మా ఫ్యాక్టరీకి లేదు" అన్నాడు.

"మరేం వెనకేసుకురావాలికదా" అంది వెటకారంగా యిందాకటి మురళి నవ్వు జ్ఞాపకానికివచ్చి.

"వెనకేసుకోవడమేం.... ముందేవేసుకోవాలి. లేకపోతే దేశానికెంత నష్టం.... ఆలోచించు....."

ఏదో మెదడులో వెలిగినట్టనిపించింది కమలకు. తన ఉక్రోషంలో గమనించనేలేదు. అతనిమాటల్లో ఏదో తెలియని అర్థం స్ఫురిస్తోంది. అందుచేత తన ఉడుకుమోతుతనానికి స్వస్తి చెప్పింది.

"అదికాదు బావా.... ఎల్లకాలమూ యిలా ఖాకీబట్టల్తో గ్రీజు మరకల్తోనే వుండిపోదామనా?" అనడిగింది.

మురళికికూడా కమల ఆంతర్యం అప్పుడే స్పష్టపడింది. కళ్ళు ఎప్పార్చుకు చూసేడు. చూస్తూనే "అంటే నీ ఉద్దేశ్యం?" అన్నాడు.

కార్మికుల జీవితాలు ఎంతటి మురికికూపాలో, ఎంత ప్రమాదభరితాలో నాకు తెలియదును కున్నావా? అనారోగ్యాల్తోనూ, దురలవాట్లతోనూ కార్మికులు అవస్థలపాలుకావడం తెలియదను కున్నావా? సమ్మెల్తోనూ, లాకౌట్లతోనూ ఎన్ని యిబ్బందుల్లో కూరుకుపోతుంటారో తెలియదను కున్నావా?" అంటూ ఒక్కక్షణం ఆగింది కమల.

"బావా..... మనిద్దరికీ పెళ్ళిచేయాలని అటూయిటూ అంతా అనుకుంటున్నారు. వ్యక్తిగతంగా నువ్వంటే నాకూ యిష్టమే. కాని బావా ఈ నీ కార్మికుడి జీవితాన్ని నేను యిష్టపడలేక పోతున్నాను. పైగా భయపడుతున్నాను" అంది. అని భారంగా తలదించుకుంది కమల.

ఆశ్చర్యంగా చూసేడు మురళి.


"కమలా" అని మంద్రంగా పిల్చేడు. "ఇంతవరకూ నువ్వు చిన్నపిల్లవేనని అందరితోపాటు నేనూ అనుకున్నాను. నీలో యిన్ని ఆలోచనలుంటాయని గ్రహించలేదు. చాలా సంతోషంగావుందిప్పుడు.

నలభీమపాకం

నలభీమపాకం

మీ పత్రిక పుణ్యమా! అని నేను అర్జంటుగా గరిటె పట్టుకోవాల్సి వచ్చింది. ఎందుకంటే మా ఆవిడ మీ ప్రకటన చూసిన దగ్గర నుండి ఓ మంచి వంట చేసి 'నల భీమ పాకం' పేరు నిలబెట్టాలని పట్టుబట్టింది. దాంతో తప్పేదేముంది. అష్టకష్టాలు పడి ఈ క్రింది వంటకం తయారు చేసాను. రుచి చూసి చెప్పండి!





నేను ఎన్నుకున్న వస్తువులు

టమాటాలు పావు కిలో, మూడు కోడిగ్రుడ్లు, 2 పెద్ద సైజు ఉల్లిపాయలు, 4 పచ్చి మిరపకాయలు, మసాలాకు అవసరమైన లవంగాలు, దాల్చిన చెక్క, గసగసాలు, చిన్న అల్లం ముక్క, కొబ్బరి ముక్క, కొత్తిమీర, తగినంత ఉప్పు, కారం, నూనె.

నేను ఎలా చేసానంటే...

ముందుగా టమాటాలు, ఉల్లిపాయలు, పచ్చి మిరపకాయలు ముక్కలుగా కోసి ప్రక్కన పెట్టాను. తరువాత లవంగాలు, చెక్క, గసగసాలు, అల్లం, కొబ్బరి వగైరా మెత్తగా నూరి మసాల ముద్దను ప్రక్కకు తీసి పెట్టుకున్నాను. ఇక ఇప్పుడు వెడల్పాటి బాణలిలో తగినంత నూనె పోసి పొయ్యి మిద పెట్టి, కోసి సిద్ధంగా వుంచుకున్న ఉల్లిపాయ, టమాటా, పచ్చి మిరపకాయ ముక్కలు వేసి బాగా వేయించాను. తగినంత ఉప్పు, కారం వేసి, అటు ఇటు కలిపి ఓ పెద్ద గ్లాసు మంచినీళ్ళు పోసాను. టమాటా సూప్ ఉడుకుతున్నప్పుడు ఒక్కొక్క కోడి గ్రుడ్డు తీసుకొని చిన్న కన్నం పెట్టి ముందు తెల్ల సొన, అంతా పడేటట్టు అటు తర్వాత పచ్చసొన పడేటట్టు బాణలిలోని టమాట సూప్‌లో మూడు గ్రుడ్లు కొట్టి మూడు ప్రక్కలగా పోసాను. ఆ సూప్‌లో గ్రుడ్ల సొన ఉడికి మూడు గిన్నెల (కప్పు) మాదిరిగా తయారు అయ్యి పులుసు కూడ చిక్కబడి దగ్గరగా అయింది అప్పుడు పొయ్యి మీద నుంచి దించేస్తూ, కొత్తిమీర చల్లాను. భలే మజాగా వుంది మా శ్రీమతి రుచి చూసి అదిరిపోయింది మీ శ్రీవారి చేత కూడ చేయించుకొని రుచి చూడండి. ఇది భోజనంలోకే కాదు చపాతీలో తినటానికి కూడ చాల రుచిగా వుంటుంది.

టి. కమలాకర ప్రసాద్
విశాఖపట్నం

పోతే నీ ఆలోచనా ధోరణికూడా నీ వయసుకీ, నీ అనుభవానికీ తగ్గట్టుగానేవుంది. నీ భ్రమలు తొలగించాల్సిన బాధ్యత నా మీ దుంద. నీ అభిప్రాయాలు తప్పనీ, నీ భయం ఉత్త భ్రమనీ తెలియాలంటే నా కళ్ళతో చూడు" అంటూ దీర్ఘంగా కమలకళ్ళలోకి చూసేడు మురళి.

"ఫ్యాక్టరీలు కళాఖండాలూ, దేవాలయాలూ కాదు. దేశ ప్రగతికి పట్టుకొమ్మలు. రేపటి మనిషి గుండెలో ఆశాజ్యోతులు. ఓ మొక్కవేసి, రోజూ నీళ్ళుపోసి, పెంచి పోషించిన ఆ మొక్కకు పువ్వు పూస్తే, కాయకాస్తే నీలో కలిగే భావావేశాన్ని నువ్వు మాటల్లో వ్యక్తపరచగలవా? రకరకాల వస్తువులను ఉత్పత్తి చేసే కార్మికుడిలోని సంతృప్తి అంతకంటే ఎక్కువే. ఇక ఆటల్లోనూ పోటీల్లోనూ కాలు విరుగుతుంది. చెయ్యి నొప్పిచేస్తుంది. అంతమాత్రాన అవి ప్రమాదకరమైనవని వాటికి స్వస్తి చెప్పేసి నీ ఆనందానికి ఆనకట్టలేస్తావా? ప్రమాదాలు పొంచివున్నప్పటికీ కార్మికుడి జీవితం సంతృప్తి, ఆనందాలనేకాదు జీవికను కల్పిస్తుంది."

అలా ఏంటూ మురళికేసే చూస్తూ వుండి పోయింది కమల.

"క్రమశిక్షణగల సైనికులకు దీటైనదీ, మాపు ఓర్పేదీ మా ఈ ఖాకీ యూనిఫాం. ఇక వ్యసనాలంటావా..... ఆ రోజులు వెళ్ళిపోయేయి. చాలీచాలని జీతాలూ సర్వీసు కండిషన్లు మూలంగా శ్రమనిమరిచేందుకు త్రాగుడుకు బానిసలయ్యేవారు. ఇప్పటి పరిస్థితుల్లోకూడా కార్మికుల్లో నీకు వ్యసనపరులు కనిపిస్తే యితరవర్గాల్లోలాగానే వాళ్ళు బలహీనతలకు లోబడినవాళ్ళన్నమాట. అంతేకాని నువ్వూహించేదుర్భరపరిస్థితులుకావు. ఎంచేతనంటే సమ్మెలూ, లాకౌట్లవరకూ వెళ్తే, తెగేవరకూ లాగితే దేశానికీ తమకీ ఎంతనష్టమో యిటు కార్మికవర్గమూ అటు యాజమాన్యమూ కూడా గుర్తించాయి. ఉత్పత్తి శక్తి తెలిసిన కార్మికవర్గం న్యాయమైన కోర్కెలే డిమాండుచేస్తోంది. మరంచేతనటువంటి కోర్కెలు వెంటనే ఆమోదిస్తోంది యాజమాన్యం. ప్రమాదాలు అశ్రద్ధకి ఫలితాలు..... వాటి నివారణకు ఎన్నోప్రయత్నాలు జరుగుతున్నాయికూడా."

మౌనంగా వుండిపోయింది కమల. కొంచెం బాధపడ్డాడు మురళి. "కమలా..... యింకా ఊహల్లోనే తేలూతూ పైన కనపడే కార్మికుడినే చూస్తున్నావా ఈ మురళిలో..... ఇంకా నీ అభిప్రాయం మారకపోతే నేనేం చెప్పలేను..... నువ్వుకూడా మా ఫ్యాక్టరీలో చేరి మాతో పనిచేస్తేగాని నీ అభిప్రాయాలు తప్పని గుర్తించలేవు" అన్నాడు నిరాశతో చివరగా

చివ్వున తలెత్తింది కమల. ఆ కళ్ళలో అమలమైన తళతళలు.

"మీ ఫ్యాక్టరీలో నాకు తగిన ఉద్యోగం వస్తుందటావా బావా.... నా అభిప్రాయాలు తప్పని తెలుసుకోవడానికి కాదు. కార్మికుల జీవితాలను అసహ్యించుకుంటూ, భయపడుతూ దూరంగా వుండేకంటే నాకు చేతనైన సహాయం చేసేందుకు" అంది.

ఆనందంతో పొంగిపోయేడు మురళి. "నిజంగా అందుకేనా.... లేకపోతే ఈ మురళిబావని యిరవై నాలుగ్గంటలూ నీ కళ్ళచూపుల్లో బంధించేందుకా!" అన్నాడు కొంటెగా.

గట్టిగా ఫ్యాక్టరీ సైరన్ మోగింది. అయితే ఈసారి ఎప్పటిలా అది కయ్యిమన్నట్టు విన్పించి తుళ్ళి పడలేదు కమల. పెళ్ళి ఏర్పాట్లకు సై అన్నట్టుగా విన్పించి సిగ్గు పడింది. ●

వారఫలం

3-2-1989 శుక్రవారం మొదలు 9-2-1989 గురువారం వరకు

★ **మేషం** : నూతన వ్యాపారానుకూలం. అన్ని రంగాలలో దూరభారాల నుండి బంధు మిత్రులు రానున్నారు. శుభదాయకవారం. కల్యాణ వైభవానికి అస్కారం. ధన విషయంలో ఎలాంటి లోపం రానిదినం. స్త్రీలకు : ఉద్యోగవృద్ధి, పెద్దల పరిచయం, లాభదాయకం.

★ **వృషభం** : ఇటీవల లేనిపోని యిబ్బందులు, స్థిరాస్థి నష్టం కావటం గమనించారుగా! అందు మీ తప్పేమున్నది. అది విధి నిర్ణయం. ఇక క్రమంగా అంతా బాగుపడుట గమనింప దగిన సమయం. స్త్రీలకు : ధాన్యలక్ష్మి యింటికి రావటంతో అధిక ఆనందం. 8, 9 తా.లందు శుభ ప్రస్తావనలు.

★ **మిథునం** : ప్రయాణావకాశమున్నది. అయినా చాలా దూరంగా పోవటం ఏమంత మేలుగాదు. రాజకీయంగా యిది అనుకూల షమయం, యత్నిస్తే మేలున్నది. సమయం అను[illegible]ం. గ్రహానుకూలం గలదు, ఇంకేం కావాలి. స్త్రీలకు : సుఖ సంపదలు, వృత్తి పెంపు, మిత్ర సమాగమం.

★ **కర్కాటికం** : నూతన వ్యాపారం చేయాలనే ఉబలాటం అధికమవుతుంది, కాని సమయం యింకా అనుకూలంగా లేదు. వృత్తియందు వికాసం చెప్పదగిన సమయం. సుఖ శాంతు లుంటాయి. స్త్రీ మూలకానందమున్నది. స్త్రీలకు : సభాగౌరవం, పత్రికాగౌరవానికి అస్కారం.

★ **సింహం** : ఇరుగు పొరుగు తగాదాలు రాకుండా చూచుకోండి. దూర ప్రాంతాల నుండి బంధుమిత్రులు యింటికి రానున్నారు. అధిక వ్యయానికి అస్కారం. దొంగతనం జరుగునేమో! జాగ్రత్త! స్త్రీలకు : వస్తు విక్రేతలకు అస్కారం, ఆదాయపెంపు.

★ **కన్య** : నూతన వృత్తి యందు పెంపు చేకూరుతుంది. ప్రతిభ వ్యుత్పత్తులు పెంపునందు తాయి. దూరభారాల నుండి బంధు మిత్రులు రానున్నారు. విద్యా వ్యాసంగాన మేలున్నది. శుభదాయక వారం. చెడిపోయిన ఆస్తి వ్యవహారాలు సర్దుబాటు అవుతాయి. ఆదాయం వృద్ధినందు తుంది. వృత్తియందు పెంపు గల వారంగా గ్రహించాలి. స్త్రీలకు : రాజకీయంగా మేలున్నది. యత్నించి చూడండి. 8, 9 తా.లందు ఏదో మేలు చేకూరుట నిశ్చయం. గ్రహించాలి.

★ **తుల** : రాజకీయాలందు అనుకూలం. ముందుకు సాగండి. కలసికొనవలసిన వారిని చూడండి. మేలు పొందండి. కొందరకు వాహనాను కూలం. స్త్రీలకు : ఉద్యోగవృద్ధి, వృత్తి పెంపు, సభాగౌరవం, ధనలబ్ధి గలవారం.

★ **వృశ్చికం** : నూతనంగా వ్యాపారం చేయాలని పట్టుదల. అవును, చేయాలి, యిటీవల కోలు పోయినదన్నా సరిజేసికోవాలి. ప్రభుత్వ పరంగా మేలున్నది. వృత్తియందు వికాసం చెప్పదగిన సమయం. స్త్రీలకు : వాహన సేకరణకు అనుకూలం, బంధు సమాగమం. ఉద్యోగరీత్యా మేలు.

★ **ధనుస్సు** : శుభదాయక వారం. ధనధాన్య వసతి గల సమయం. కష్టించినందుకు ఫలితం యోగదాయకమే. దూరభారాల నుండి బంధు మిత్రులు రానున్నారు. నూతన వ వ్యక్తుల పరిచయం ఏర్పడుతుంది. గమనించండి. స్త్రీలకు : సభామర్యాద, పత్రికా మూలంగా గౌరవం చేకూరుతుంది. 8, 9 తా.లందు ధనలబ్ధి.

★ **మకరం** : ముందు వెనుకలు ఆలోచించి కార్యరంగానికి దిగాలి. మిత్రులతో, బంధువులతో, మనస్పర్థలు రాకుండా చూచుకోండి. ఇంటగాని, అలా యిలా తిరుగుటలో గాని వస్తువులు పోవచ్చు. జాగ్రత్తగా చూచుకోండి. స్త్రీలకు : శుభ సమయం.. చేసే ఉద్యోగ మందు పెంపు చెప్పవచ్చు. రాజకీయం అనుకూల దాయకమే! యత్నే ఫలీ.

★ **కుంభం** : రాజకీయంగా మీ యత్నాలు ఈ వారాన సానుకూలమవుతాయి. నూతన వ్యాపారం చేపట్ట దలచినారా? మేలే, సభారంగాన ప్రసిద్ధి ఏర్పడనున్నది. అన్ని రంగాల వారికిఅనుకూలం. వృత్తియందు పెంపు చెప్పదగిన సమయం. స్త్రీలకు : వస్తు వాహన సేకరణకు అనుకూలం, సభాగౌరవం, గ్రహించండి.

★ **మీనం** : దూర భారాల నుండిగాని, విదేశాల నుండిగాని పరిచితులు, బంధువులు, మిత్రులు రానున్నారు. ధన ధాన్య వసతికి లోటులేదు. 'గురుడు' సర్వానుకూలుడు. అభివృద్ధి కార్యక్రమం కొనసాగుతుంది. విద్యా వేత్తల పరిచయం, లాభదాయకం. స్త్రీలకు: అనుకూల వార్తా శ్రవణం, వృత్తియందు పెంపు, ఇంట శుభం జరగటం, 'జాయింటు' వ్యాపారముంటే లాభించే వారమే.

-విద్వాన్ కోట సత్యరంగయ్య శాస్త్రి

సాహితీ పజిల్

గెల్చుకోండి రు.200/-

గళ్ల నుడి కట్టు – 3

ఆధారాలు

నిలువు

2. చీకటి
3 మోక్షమంటే ఇది లేకపోవటం
4. మా అరువు రామబంటు
5 ఇవి గిరుల మీద వుంటాయి
7. ఆవు సంస్కృతంలో
9 సంతోషము
10 పెద్దలకు ఇలా చేస్తే వింటారు
13. అరి షడ్వర్గాలలో మొదటిది గళ్ల నుడికట్టు
14 ఇది తప్పితే వేటగాడు కాదు
16 వీటితో తర్పణం చేస్తే అంతా అయిపోయినట్లే
17. ఆలస్యం చేస్తే అమృతం ఇది అవుతుంది
18 క్రింద నుండి పైకి కాంతితో సూర్యుడు


అడ్డం

1 శిశు పాలుడి తల్లి
3 భవుని రాణి
6 ఏ ప్రదర్శనకయినా ఇది కావాలి
8. ఇది స్థిరమే
10. ఇది ఒకతీగ వ్యామోహం
11. రాత్రి భోజనంలో ఈ పదార్థం మంచిది కాదంటారు
12. ఇది పడితే వజ్రాలు రాణిస్తాయి
13 ఇది దైవ స్వరూపం అగదు
15. పని చేసిన తరువాత ఇది అవసరం
17. విరి కొంచెం పెంచ్తంటి ఎక్కువవుతుంది
19 బలరాముడికి కృషీవలుడికి ఇదే సాధనం
20. పంచమ వేదం

ఆధారాలున్నాయి. నుడి కట్టు గళ్ళు నింపండి! కూపన్ కత్తిరించిమీ చిరునామా రాసి పంపండి! ఆల్ కరెక్టు సొల్యూషన్ పంపిన వారికి రు.|200/-లు బహుమతి లభిస్తుంది–ఒకరి కన్నాఎక్కువమంది కరెక్టు ఆన్సర్‌లు పంపితే వారికి బహుమతి మొత్తం పంచడం జరుగుతుంది. తుది నిర్ణయం సంపాదకునిదే!

–సం

గడువు : 11-2-1989



ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక

పంపిన వారి పేరు: ....

పూర్తి చిరునామా : ....


....

....

పిన్‌కోడ్: ....

సాహితీ పజిల్

గళ్ళ నుడికట్టు-1 కి బహుమతులు



ఆల్ కరెక్ట్‌గా రాసిన వారు లేరు!

★ వందలాది మంది అమితోత్సాహంతో పాల్గొన్నారు కనుక ఒక తప్పుతో పంపిన 6 గురికి బహుమతి మొత్తం రు 200 లను సమంగా పంచడం జరిగింది ఒక్కొక్కరికి 33 రూపాయల 33 పైసలు వంతున వస్తుంది– అయితే పైసలను వదిలి పెట్టి 33 రూపాయల చొప్పున యీ దిగువ ఆరుగురికి బహుమతిని పంపే ఏర్పాట్లు చేస్తున్నాము.

★ మెదడుకి మేత, మనసుకి ఆహ్లాదం కలిగించే ఈ సాహితీ గళ్ల నుడికట్టులో మళ్లీ మళ్లీ అంతా పాల్గొనవచ్చును

★ ఒకరు ఎన్ని కూపనులయినా పంపవచ్చు అయితే బహుమతి మాత్రం ఒక్కటి కన్నా మించి ఎవ్వరికి పంపబడ దు. గుడ్‌లక్

–సం

ఒక తప్పుత పంపిన ఆరుగురి పేర్లు

వింజమూరి కృష్ణమూర్తి (హైదరాబాదు). శిష్ట్లా చంద్రశేఖరశాస్త్రి (నాగాయలంక) ఎన్. సీతారామసోమయాజి (జహీరాబాద్), జి రాధ (విశాఖపట్నం) కె. అనంతపద్మనాభాచార్యులు (శ్రీకాకుళం), యల్లా రంగస్వామి,గిద్దలూరు

ఈ విషయంలో సంపాదకునిదే తుది నిర్ణయం ఉత్తర ప్రత్యుత్తరాలక తావులేదు.


సరియైన జవాబులు :

అడ్డం

1 గణపతి
5. దితి
8. స్కంధము
12. నత్తు
15. డులి
4. వేమన
7 సంపద
10 ముల్లె
14. నస

నిలువు

2 పవే
6 కిందముడు
9 ధనము
13 దినకరుడు
3 తిమసు
7 సంధ్యలు
11 మనసు
16 లిపి



బహుమతి పొందిన లేఖ

ఇంకా మారాలి

మన పత్రికలో ఎన్నో మార్పులు వస్తున్నాయి కాని ఇది ఎప్పుడో జరగవలసింది. ఇందులో కొన్ని ఎబ్బెట్టుగా వున్నాయి.

ముఖచిత్రాల్లోగాని, కథలకు, సీరియల్స్‌కు వేసే బొమ్మల విషయంలో గాని, మార్పనేది లేదు. ముఖచిత్రాలు మా సహనాన్ని పరీక్షిస్తున్నాయి. అలాగే కథలకు వేసే బొమ్మల విషయంలో కూడ కొంచెం మార్పు తీసుకురండి. బొమ్మలనేవి అర్థవంతంగా వుంటేనే కదా! కొత్త వారయినా కథలు, సీరియల్స్ చదవడానికి ఇష్టపడేది.

మీరు మామూలుగా వాడే 'మనలో మాట'ను సంపాదకీయంలో కూడ వాడుతుంటే ఆశ్చర్యం వేస్తోంది. అంటే ఆ భావం ఆ వ్యక్తులకు లేక సంస్థలకు 'చురుక్కు'మనవలసిన పని లేదనా మీ ఉద్దేశ్యం?

అలాగే సినిమా... సినిమా శీర్షిక కూడ రొటీన్‌గా వుంది. గత వార పత్రికల్లో సన్నివేశం గురించి వేసేవారు. బహుశా నిర్మాతలు సన్నివేశాన్ని బయటికి లీక్ చేయటం లేదేమో?

ఎస్. శేషారెడ్డి, ఉరవకొండ

ద్రోణుడు – ఏకలవ్యుడు

6-1-89 తేది సంచికలో మహాభారత నిర్మాత రజాగారు ఏకలవ్యుడి విషయంలో ఇచ్చిన సమాధానం సమంజసంగా లేదు. పరీక్షలో చూచి కాపీకొట్టే విద్యార్థికి ఏకలవ్యుడికి సామ్యంలేదు ఏకలవ్యుడు కేవలం తన దీక్ష పట్టుదలచే ద్రోణుడు నిరాకరించినా, అతనినే గురువుగా నమ్ముకుని విలువిద్య నేర్చిన ప్రజ్ఞాశాలి. అది అక్రమంగా ఆర్జించిన విద్య ఏ మాత్రముకాదు. ద్రోణుడు కేవలం అర్జునుడికి ప్రత్యర్థి లేకుండా చేయటానికి పన్నిన తంత్రం ఏకలవ్యుడి బొటన వేలు అడగటం. తనకు బొటన వేలు లేకపోయినా తన విద్య నిరర్థక మవుతుందని తెలిసి కూడా గురు దక్షిణ ఇవ్వటం ఏకలవ్యుడి గురుభక్తికి నిదర్శనం. ఒక విధంగా ద్రోణుడు ఉపాధ్యాయ లోకానికే మచ్చ.

కె. రామారావు, హైద్రాబాద్

పిల్లలకు...

మన వారపత్రికలో తాము తలపెట్టిన మార్పులు మంచివే. అయినా, రాసిలో కన్న వాసిలో మిన్నగా ఉంటేనే సంతోషంగా ఉంటుంది. ప్రస్తుతం వస్తున్న కథలలో ఏవీ కూడా పది కాలాల పాటు గుర్తుండేవిగా లేవని చెప్పడానికి చింతిస్తున్నాను. గళ్ళనుడికట్టుని పూర్తి చేసి చించి పంపాలంటే కథా భాగం కూడా చించవలసి వస్తున్నది. పత్రికలను చదివి పారవేయకుండా దాచుకునే అలవాటు ఉన్న వాళ్ళ కోసమైనా పజిల్స్, క్విజ్‌లు వగైరాలు ఏ చివరి పేజీలోనో, ప్రాముఖ్యత లేనిచోటనో వేస్తే బాగుంటుంది.

అదివరలో, అంటే సుమారు 25–30 సంవత్సరాల క్రిందట పత్రికలో తప్పనిసరిగా ఒక ప్రపంచ ప్రఖ్యాత నవల అనువాదం ప్రచురితమవుతూ ఉండేది. వీలయితే అటువంటి వాటికి స్థానం కల్పించవలసిందిగా కోరుచున్నాను.

సినిమారంగానికి, రాజకీయ రంగానికి, క్రీడా రంగానికి ఇస్తున్నట్టుగానే వైజ్ఞానిక రంగానికి కూడా ఇతోధిక స్థానం కల్పిస్తే బాగుంటుంది. పిల్లలు ఈ కాలంలో ఆంధ్రపత్రిక కోసం పోట్లాడటం లేదు. అది గుర్తించి పిల్లలకు ప్రత్యేకంగా కొన్ని పేజీలు కేటాయించడం అవసరమేమో ఆలోచించండి.

సి. చంద్రశేఖర్, తెనాలి

నీ తండ్రిలాంటివాడిని. నాకు కాంట్రాక్టు ఇప్పించు తల్లీ!



ఉత్తర కవిత

ఆంధ్రసచిత్ర వారపత్రిక
సాహిత్య సమగ్ర పత్రిక
రామాయణ దీపికా ప్రతీక
మాకందిన శుభ పత్రిక
తాజాకాలమ్ములో భూఆగ్రహాలు
వేడివేడి సెక్కులో సెంటులు డీసెంటులు
"హౌసుఫైవ్"లకై "పవిత్రపాపు"ల "అన్వేష"ణలు
ఆహా ఇదే ఇదే మా సాహిత్య సమగ్ర పత్రిక
మొదట దీపికా చూపుల్లో
మధ్యపేజీ "అన్వేష"ణల్లో
చివర "హాస్య నవలిక"ల్లో
ఉన్నాము "సెక్సువాసన"ల్లో
ఊగుతున్నాము ఆంధ్ర సమగ్ర సాహిత్య పత్రి డోలికల్లో.

–శ్రీనివాసరెడ్డి, రెడ్డిపాలెం

భలే సలహా!

"ముఖచిత్రం బాగుంది. సీరియల్ కథలు బాగున్నాయి" అని వ్రాసే పాఠకుల మూస ఉత్తరాలకు ఉద్వాసన చెప్పాలన్న అభిప్రాయం పత్రిక వారికి కలగటం చాలా సంతోషకరమైన విషయమే. అలాగే పత్రిక వారు మూస ముఖ చిత్రాలు వేయటం మానుకుంటే చాలా బాగుంటుంది. ఎప్పుడూ ఆ సినిమా తారల ముఖ చిత్రాలేనా ఇంకేమీ లేనట్టు. పండుగలకు కూడా ఆ పండగకు సంబంధించిన ముఖచిత్రాలు తక్కువగా వేస్తున్నారు. ఈ విషయం వ్రాయాలని ఎన్నోసార్లు అనుకున్నాను. కాని మిమ్మల్ని పొగుడుతూ వ్రాసే ఉత్తరాలకే కాని విమర్శకుల ఉత్తరాలకి విలువ ఇవ్వరని వ్రాయలేదు.

ఎన్నో పవిత్ర దేవాలయాలు, గొప్ప కళాఖండాలు, వైభభక్తులు, దేశభక్తులు, ఎంతో మంది మహా విద్వాంసులు, ఎంతో అందమైన ప్రకృతి దృశ్యాలు ఉన్నాయి కదా! వీటన్నిటిని ముఖ చిత్రాలుగా వేసి వాటి గురించి పాఠకులకు పరిచయం చేయవచ్చును కదా!

కిడాంబి పద్మావతి, ఉల్లంపర్రు

(వింటున్నారా?. పతితలందరూ పద్మావతి గారి మాటలు?! సం.)

Printed and Published for Nageswararao Estates Private Ltd; by S. Nageswararao at the Andhra Patrika Press, Gandhinagar, Vijayawada-3, Chief Editor : S. Radhakrishna, Advisory Editor: Veeraji,
Editor. M Madhavarao Phones Bussiness: 61247, 61248, 75569 and Editorial 75667